# తెలుగు

## బి.ఏ., బి.కాం., బి.యస్.సి., బి.బి.ఎం. - మొదటి సంవత్సరం

## సెమిస్టర్ - 1


**రచయితలు :**

**డా॥ కాకాని సుధాకర్**
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,
అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ,
ఎస్.ఎస్.&ఎన్ కళాశాల,
నరసరావుపేట.

**డా॥ కె. భానునాయక్**
ఎం.ఏ., పిహెచ్.డి.,
తెలుగు అధ్యాపకులు,
ఎస్.ఎస్.&ఎన్ కళాశాల,
నరసరావుపేట.

**శ్రీమతి పి. ఉషారాణి**
ఎం.ఏ.,
తెలుగు శాఖాధ్యక్షులు,
శ్రీ గోరంట్ల వెంకన్న ఓరియంటల్ కళాశాల
తిమ్మసముద్రం

**డా॥ చదలవాడ విజయకుమార్**
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,
తెలుగు శాఖాధ్యక్షులు,
సి.ఆర్. కళాశాల,
చిలకలూరిపేట.

**డా॥ డి. సుజాత**
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,
తెలుగు అధ్యాపకులు, తెలుగు మహిళా కళాశాల,
బాపట్ల

**సంపాదకులు :**

**డా॥ కాకాని సుధాకర్**
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,
అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ,
ఎస్.ఎస్.&ఎన్ కళాశాల,
నరసరావుపేట.

**సమన్వయకర్త :**

**డా॥ ఇరపని మాధవి,** యం.ఏ., యం.ఫిల్., పిహెచ్.డి.
తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగము
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయము

**డైరెక్టర్ :**

**డా॥ బి. నాగరాజు**
దూరవిద్యా కేంద్రం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం
నాగార్జున నగర్ - 522 510.
Ph : 0863 - 2293299, 2293356 (08645) 211023, 2110204 (Study Material)
Cell : 9848285518
e_mail : info.anucde.ac.in
Website : www.anucde.ac.in (or) www.anucde.info

# తెలుగు

## బి.ఏ., బి.కాం., బి.యస్.సి., బి.బి.ఎం. - మొదటి సంవత్సరం
## సెమిస్టర్ - 1

# ప్రాచీన తెలుగు కవిత్వం

## సిలబస్

**యూనిట్ - 1** : రాజనీతి నన్నయ - మహాభారతం - సభాపర్వం - ప్రథమాశ్వాసం (26 - 57 పద్యాలు)

**యూనిట్ - 2** : దక్షయజ్ఞం - నన్నెచోడుడు - కుమార సంభవం - ద్వితీయాశ్వాసం (49 - 86 పద్యాలు)

**యూనిట్ - 3** : ధౌమ్య ధర్మోపదేశము - తిక్కన - మహాభారతం - విరాటపర్వం - ప్రథమాశ్వాసం (116-146 పద్యాలు)

**యూనిట్ - 4** : పలనాటి బెబ్బులి - శ్రీనాథుడు - పలనాటి వీరచరిత్ర - ద్విపద కావ్యం - పుట. 108 - 112
'బాలచంద్రుడు భీమంబగు సంగ్రామం బొనర్చుట - 108, 'వెరగందికుంది (112)
సం. అక్కిరాజు ఉమాకాంతం, ముద్రణ : వి.కె.స్వామి, బెజవాడ 1911

**యూనిట్ - 5** : సీతారావణ సంవాదం - మొల్ల - రామాయణము - సుందరకాండము (40-87 పద్యాలు)

**వ్యాకరణం :**

సంధులు : ఉత్వ, త్రిక, ద్రుత, ప్రకృతిక, నుగాగమ, ద్విరుక్తటకారాదేశ, యణాదేశ, వృద్ధి, శ్చుత్వ, అనునాసిక సంధులు

సమాసాలు : అవ్యయీభావ, తత్పురుష కర్మధారయ, ద్విగు, బహువ్రీహి

**అలంకారాలు :**

అర్థాలంకారాలు : ఉపమ, ఉత్ప్రేక్ష, రూపక, స్వభావోక్తి, అర్థాంతరన్యాస, అతిశయోక్తి

శబ్దాలంకారాలు : అనుప్రాస (వృత్త్యనుప్రాస, ఛేకానుప్రాస, లలానుప్రాస, అంత్యానుప్రాస)

**ఛందస్సు :**

వృత్తాలు : ఉత్పలమాల, చంపకమాల, శార్దూలము, మత్తేభము

జాతులు : కందం, ద్విపద,

ఉపజాతులు : ఆటవెలది, తేటగీతి, సీసం, ముత్యాలసరాలు

**ఆధారగ్రంథాలు :**


1. శ్రీమదాంధ్ర మహాభారతము : సభాపర్వము - తిరుమల తిరుపతి దేవస్థాన ప్రచురణ
2. శ్రీమదాంధ్ర మహాభారతము : విరాటపర్వము - తిరుమల తిరుపతి దేవస్థాన ప్రచురణ
3. కుమార సంభవం - నన్నెచోడుడు
4. పల్నాటి వీరచరిత్ర - శ్రీనాథుడు
5. రామాయణము - మొల్ల

# తెలుగు

## బి.ఏ., బి.కాం., బి.యస్‌సి., బి.బి.ఎం. - మొదటి సంవత్సరం

## సెమిస్టర్ - 1

# ప్రాచీన తెలుగు కవిత్వం

<u>మాదిరి ప్రశ్నాపత్రం</u>

సమయం : 3 గం॥లు                                                                 మార్కులు : 70

**1. ఈ క్రింది వానిలో ఒకదానికి సమగ్రవ్యాఖ్య రాయండి                    1 × 8 = 8 మా.**

అ) వదలక బుద్ధి నంతరరివర్గము నోర్చి జితేంద్రియుడవై
మొదలన దేశకాలబలముల్ మఱి దైవబలంబుఁగల్గి భూ
విదితబలుండవై యహితవీరుల నోర్వఁగ నుత్సహింతె దు
ర్మదమలినాంధ చిత్తులఁబ్రమత్తుల నింద్రియనిర్జితాత్ములన్

ఆ) వీరాలిపము లాడనేల వినుమీ విశ్వప్రకాశంబుగా,
బారావారముఁగట్టి రాఘవుడు కోపస్ఫూర్తి దీపింపగా
ఘోరాజిన్ నినుదాసి లావుకీలిమిన్ గోటీరయుక్తంబుగాఁ
గ్రూరాస్త్రంబుల మస్తముల్ దునిమి భుక్తుల్ పెట్టుభూతాళికిన్.

**2. ఈ క్రింది వానిలో మూడింటికి సందర్భసహిత వ్యాఖ్యలు రాయండి.          3 × 3 = 9**

అ) అనుపవుగా రాజకార్యభారముదాల్పన్
ఆ) విశ్వము నిప్పుడ సంహరించెదన్
ఇ) తెల్లము సేసితిరి బ్రతికితిమి మీ కరుణన్
ఈ) బలుసాకు దినియైన బ్రదుకగగలము
ఉ) కొదమసింహం భంగి కుప్పించి ఎగిరి
ఊ) చూడుము కనురెప్పలెత్తి సుదతీ నన్నున్

**3. ఈ క్రింది వానిలో మూడింటికి వ్యాసరూప సమాధానాలు రాయండి          3 × 10 = 30**

అ. నారదుడు ధర్మరాజుకు చెప్పిన రాజనీతిని వివరించండి.
ఆ. 'దక్షయజ్ఞం' పాఠ్యభాగ కథను రాయండి.
ఇ. ధౌమ్యుడు పాండవులకు సేవాధర్మం తెలిపిన తీరును వివరించండి.
ఈ. పలనాటి యుద్ధంలో బాలచంద్రుడి యుద్ధకౌశలాన్ని వర్ణించండి.
ఉ. సీతారావణ సంవాదాన్ని సంగ్రహంగా తెలపండి.
ఊ. పాఠ్యభాగమాధారంగా నన్నయ కవితాతీరులను వివరించండి.

4. ఈ క్రింది వానిలో నాల్గింటిని విడదీసి, సంధికార్యాన్ని తెల్పండి. 4 × 2 = 8

అ. వృద్ధోపసేవ

ఆ. విద్వజ్జనము

ఇ. అభ్యంతరము

ఈ. ఉసురుసురు

ఉ. ఇబ్బంగి

ఊ. దండముల్ద్రుంచి

ఋ. నాయెడ

ౠ. లతాంగి

5. ఈ క్రింది వానిలో నాల్గింటికి విగ్రహవాక్యం వ్రాసి, సమాసం తెల్పండి. 4 × 2 = 8

అ. జితేంద్రియుడు

ఆ. ధనధాన్యములు

ఇ. జగతీవల్లభుడు

ఈ. సాహసగరిమ

ఉ. కొదమసింహము

ఊ. భటసమూహము

ఋ. తోయజదళాక్షి

ౠ. భీషణాకారము

6. ఈ క్రింది వానిలో ఒక పద్యపాదానికి గణవిభజన చేసి ఛందస్సు గుర్తించి లక్షణాలు వ్రాయండి. 1 × 4 = 4

అ. దనుజవిభుండువోయె నిజధామముఁజేర సతీసమేతుడై

ఆ. హరిమర్థింతుమొ బ్రహ్మఁబట్టుదుమొయింద్రాద్యష్టదిక్పాలురన్

7. ఈ క్రింది వానిలో ఒక అలంకారాన్ని సోదాహరణంగా వ్రాయండి. 1 × 3 = 3

అ. రూపకాలంకారం

ఆ. ఉత్ప్రేక్షాలంకారం

పాఠం - 1

# రాజనీతి - నన్నయభట్టు

## (మహాభారతం - సభా పర్వం - ప్రథమాశ్వాసం - 26 నుండి 57 పద్యాల వరకు)

## కవి పరిచయం - కథా సంగ్రహం

**విషయసూచిక :**

**1.0** కవి పరిచయం
**1.1** ఉద్దేశ్యం
**1.2** పాఠ్యభాగ సందర్భం
**1.3** పాఠ్యభాగ వివరణ / సారాంశం
**1.4** పద్యాలు, అర్థాలు - భావాలు

**కవి పరిచయం :**

| | | |
|---|---|---|
| పాఠ్యభాగం | : | రాజనీతి |
| కవి | : | నన్నయభట్టు |
| పాఠ్యభాగం దేని నుండి గ్రహింపబడింది | : | ఆంధ్రమహాభారతం - సభాపర్వంలోని ప్రథమాశ్వాసం నుండి గ్రహింపబడింది. |
| కవి కాలం | : | 11వ శతాబ్దము |
| నన్నయ ఎవరి ఆస్థాన కవి | : | రాజమహేంద్రవరం రాజధానిగా వేంగీదేశాన్ని పాలించిన రాజరాజనరేంద్రుని ఆస్థానకవి. |
| భారతాంధ్రీకరణకి కారణం | : | రాజరాజనరేంద్రుడు తన వంశమైన చంద్రవంశపు రాజుల కథను వినాలన్న కోరికతో తెలుగులోకి అనువాదం చేయించెను. |
| నన్నయ గారి ఇతర రచనలు | : | ఆంధ్రశబ్ద చింతామణి, ఇంద్రవిజయము, చాముండికా విలాసము, రాఘవాభ్యుదయం. దీనిలో ఒక్క ఆంధ్రశబ్ద చింతామణియే లభ్యము. |
| నన్నయ సహాధ్యాయి | : | నారాయణభట్టు |
| నన్నయ సమకాలికుడు | : | పావులూరి మల్లన |
| నన్నయ కవితా లక్షణాలు | : | (1) ప్రసన్న కథాకలితార్థయుక్తి<br>(2) అక్షర రమ్యత<br>(3) నానారుచిరార్థ సూక్తి నిధిత్వము |
| నన్నయ గారి బిరుదములు | : | (1) ఆదికవి, (2) వాగమ శాసనుడు, (3) శబ్దానుశాసనుడు |

**1.1 ఉద్దేశ్యం :**

నన్నయ భారతంలో సభాపర్వం ప్రధానమైన పర్వం. అందులో మన పాఠ్యభాగం రాజనీతి ప్రత్యేకంగా పేర్కొనదగినది. రాజు ఎలా ఉండాలి. రాజు ఎటువంటి ధర్మాలను పాటించాలి, రాజు ఉద్యోగులతో ఎలా ఉండాలి, ఎటువంటి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలి మొదలైన అంశాలను గమనించగలగటం.

### 1.2 పాఠ్యభాగ సందర్భం :

ఖాండవవనాన్ని అగ్ని దహించేటప్పుడు 'మయుడు' అనే దానవ శిల్పిని, ఆ వనంలో దగ్ధం కాకుండా అర్జునుడు రక్షించాడు. అర్జునుడు తనకు చేసిన ఉపకారానికి ఏదో ఒక మేలు అర్జునునికి చేయాలని ఆలోచించి, వివిధ నిర్మాణకళల్లో నేర్పుకలవాడననీ, మీకు ఇష్టమైన దానిని నిర్మించి ఇస్తాను, ఆజ్ఞాపించండి అని అర్జునునితో అన్నాడు.

అర్జునుడు శ్రీకృష్ణుని వైపు చూచి ఆజ్ఞాపించండి అని కోరాడు. శ్రీకృష్ణుడు ధర్మరాజుకి ఆనందం కలిగించేలా మయుడి శిల్పకళా నైపుణ్యానికి నిదర్శనంగా ఒక మహాసభను నిర్మించమని ఆదేశించాడు. మయుడు 14 నెలలు కష్టపడి అపూర్వమైన సభాభవనాన్ని నిర్మించి, ధర్మరాజుకు ఇచ్చాడు. అదే 'మయసభ'.

ధర్మరాజు తమ్ముళ్ళతో ఒక శుభముహూర్తములో మయసభా ప్రవేశం చేశాడు. ధర్మరాజు కోరినవారికి కోరినంత దానం చేశాడు. అనేక మంది మునులు వచ్చి ధర్మరాజును దర్శించారు. ఇలా ఉండగా ఒకరోజు నారదమహర్షి, ధర్మరాజు వద్దకు వచ్చి ధర్మరాజునకు రాజధర్మములు బోధించాడు. ఆ ధర్మప్రబోధమే మన ప్రస్తుత పాఠ్యాంశము నారదుడు ధర్మరాజు సభలోనికి ప్రవేశించడంతో మన పాఠ్యభాగం ప్రారంభం అవుతుంది.

### 1.3 పాఠ్యభాగ సారాంశం :

**నారదుడు ధర్మరాజును కుశలప్రశ్నలు వేయడం :**

ఓ ధర్మరాజా ! మీ వంశము వారు పాటించిన ధర్మపద్ధతిని నీవు ఆచరిస్తున్నావా ? నీ మనస్సును ధర్మము మీదనే నిలిపి, రాజకార్యాలను స్వబుద్ధితో అర్థరాత్రి దాటిన తర్వాతనే ఆలోచిస్తున్నావా ? ప్రభుత్వ ఉద్యోగాల్లో యోగ్యులను వాళ్ళ శక్తిసామర్థ్యాలను గుర్తించి నియమిస్తున్నావా ? అని నారదుడు ధర్మరాజును ప్రశ్నించాడు. మంత్రులుగా ఎటువంటి వారికి అర్హత కలిగి ఉంటుందో చెప్పాడు. పన్నులు వసూలు చేసే రాజోద్యోగుల అర్హతను నారదుడు ప్రస్తావించాడు.

రాజు చేయవలసిన సంక్షేమ కార్యములు :

రాజోద్యోగులకు సకాలంలో జీతాలు ఇస్తున్నారా ? అని అడిగాడు. సేవకుల దారిద్ర్యదుఃఖాలు, ప్రభువునకు కీడు కల్గిస్తాయన్నాడు. మంచి సేవకులకు, రాజు సత్కారం చేయాలన్నాడు. అంగవైకల్యం కలవారిని పోషించాలన్నాడు. మేలు చేసినవారిని గుర్తించి ప్రశంసించాలన్నాడు. ఆదాయంలో నాల్గవవంతు లేక మూడవవంతు లేక సగభాగమే ఖర్చు చేయాలన్నాడు. గురువులను, వృద్ధశిల్పులను, సాధుజనులనూ పోషించాలన్నాడు.

రాజ ధర్మములు :

రాజు నిత్యం కావలసినవారితో కలసి కొలువుతీరాలి. రాజు శత్రువుల నుండి తన్ను రక్షించుకోవాలి. రాజు కోటలో సర్వ వస్తువులనూ సమృద్ధి నింపి, కోటలను శత్రుదుర్భేద్యాలుగా చేయాలి. రాజు శత్రువులపై దండయాత్రలకు వెళ్ళే ముందు, శత్రువులపై సామదాన భేద దండోపాయాలను ప్రయోగించాలి. రాజు పదునాలుగు రాజదోషాలను విడిచి పెట్టాలి అని నారదుడు ధర్మరాజుకు బోధించాడు.

**ధర్మరాజు వినయము :**

ధర్మరాజు తాను చేతనైనంతవరకూ అన్యాయ మార్గాన్ని వదిలి, మహాత్ముల చరిత్రల్ని ఆదర్శంగా తీసుకొని, నారదుని ధర్మబోధ ప్రకారము ఆచరిస్తానని నారదునకు మాట ఇచ్చాడు.

## 1.4 పద్యాలు - ప్రతిపదార్థ తాత్పర్యములు :

సీ ॥ మీ వంశమున నరదేవోత్తముల దైన
సద్ధర్మ మార్గంబు సలుపుదయ్య
ధర్మవిందుడవై ధర్మార్థకామంబు
లొండొంటి బాధింపకుండ నుచిత
కాల విభక్తముల్గా లీల సేవింతె
ధర్మవునంద చిత్తంబు నిలిపి
యిమ్ములనపరాత్రమ్ముం దెప్పుడుఁ
జింతింతె నిజబుద్ధిఁ జేయఁదగిన

వె ॥ రాజకృత్యములఁ దిరంబుగా నిఖిల ని
యోగవృత్తులందు యోగ్యులయిన
వారిఁ గరము గారవమ్మునఁ బంచితె
నీవు వారిదయిన నేర్పెఱింగి.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| మీ వంశమునన్ | = | మీ కురువంశము నందలి |
| నరదేవ + ఉత్తముల + అది + ఐన | = | రాజులలో శ్రేష్ఠులైన వారి యొక్క |
| సత్ + ధర్మమార్గంబు | = | మంచి ధర్మపద్ధతిని |
| సలుపుదు + అయ్య | = | ఆచరిస్తూ ఉన్నావు కదా ! |
| ధర్మ విదుండవు + ఐ | = | ధర్మము తెలిసినవాడివై |
| ధర్మార్థకామంబులు | = | ధర్మము, అర్థము, కామము అనే పురుషార్థములు |
| ఒండొంటి | = | ఒకదాన్ని మరియొకటి |
| బాధింపక + ఉండన్ | = | బాధించకుండా ఉండేటట్లు |
| ఉచిత కాలవిభక్తుల్ | = | ఆయా కాలాలకు తగినట్లు విభజింపబడినవి |
| కాన్ | = | అయ్యేటట్లు |
| లీలన్ | = | సంతోషముగా |
| సేవింతువు + ఏ | = | సేవిస్తున్నావు కదా ! |
| ధర్మవు + అందు + ఏ | = | ధర్మము నందే |
| చిత్తంబున్ | = | మనస్సును |
| నిలిపి | = | నిలిపి |
| ఇమ్ములన్ | = | ప్రీతిగా |
| అపరరాత్రముల + అందున్ | = | అర్థరాత్రి తరువాత |
| నిజబుద్ధిన్ | = | స్వబుద్ధి చేత |
| చేయన్ + తగిన | = | చేయడానికి తగినట్టి |
| రాజకృత్యములన్ | = | రాజకార్యాలను |

| | | |
|---|---|---|
| చింతెంతె | = | ఆలోచిస్తున్నావు కదా ! |
| తిరంబుగాన్ | = | స్థిరంగా |
| నిఖిల | = | నియోగ |
| వృత్తుల + అందున్ | = | అన్ని ప్రభుత్వ ఉద్యోగాలలో |
| యోగ్యులు + ఐన | = | తగిన |
| వారిన్ | = | వాళ్ళను |
| వారిదైన | = | వారికి సంబంధించిన |
| నేర్పు + ఎఱింగి | = | సామర్థ్యాన్ని తెలిసికొని |
| కరము | = | మిక్కిలి |
| గారవమ్మునన్ | = | గౌరవభావంతో |
| నీవు | = | నీవు |
| పంచితివి + ఎ | = | నియమించినావు కదా ! |

**తాత్పర్యం :**

ఓ ధర్మరాజా ! మీ వంశములో జన్మించిన రాజశ్రేష్ఠులు ఏర్పరచిన ధర్మపద్ధతిని తప్పకుండా ఆచరిస్తున్నావా కదా ! ధర్మాన్ని తెలుసుకొని, ధర్మార్థకామాలు ఒకదానిని మరొకటి బాధించకుండా, కాలోచితాలుగా వాటిని విభజించుకొని సేవిస్తున్నావు కదా ! ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరంగా యోగ్యులైన వారి సామర్థ్యాలను గుర్తించి, గౌరవభావంగా, స్థిరంగా నియమించావు కదా.

**వివరణ :**

ధర్మార్థకామములు ఒకదాన్ని మరొకటి బాధించక పోవడం, ధర్మము, అర్థము, కామము, మోక్షము అనేవి నాలుగు పురుషార్థాలు. పురుషార్థములు అనగా మానవజీవితములో సాధించవలసినవి ధర్మానికి విరుద్ధముగా, అర్థకామాలు సాధిస్తే, అది పాపమునకు కారణం అవుతుంది. ధర్మాన్ని కాదని అనగా ధర్మాన్ని బాధించి, అర్థకామాలు సాధించడం తగదని దీని భావం.

**27వ పద్యం :**

**కం ॥ అనఘుల శాస్త్రవిధిజ్ఞుల**
**ననురక్తులఁ బితృపితామహక్రమమున వ**
**చ్చిన విప్రుల మంత్రులఁగా**
**నొనరించితే కార్యసంప్రయోగము పొంటెన్.**

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| అనఘులన్ | = | పాపాత్ములు కానివాళ్ళను |
| శాస్త్రవిధిజ్ఞులన్ | = | శాస్త్రనియమాలు తెలిసినవారిని |
| అనురక్తులన్ | = | ప్రేమ కలవారిని |
| పితృ పితామహక్రమమునన్ | = | తండ్రి, తాతల నుండి వంశపారంపర్యముగా |

| | | |
|---|---|---|
| వచ్చిన | = | కొలువుచేస్తున్న |
| విప్రులన్ | = | బ్రాహ్మణులను |
| కార్య సంప్రయోగం పొంటెన్ | = | రాజకార్య నిర్వహణ కొఱకు |
| మంత్రులన్ + కాన్ | = | మంత్రులనుగా |
| ఒనరించితివి + ఎ | = | చేశావు గదా ! |

**తాత్పర్యం :**

పుణ్యాత్ములు, శాస్త్రనియమాలు బాగా తెలిసినవాళ్ళు, నీ మీద ప్రేమగలవాళ్ళు, తాతదండ్రులనాటి నుండి వంశపారంపర్యంగా కొలువు చేస్తున్నవాళ్ళు అయిన బ్రాహ్మణోత్తములను రాజకార్యములను నిర్వహించడానికి మంత్రులుగా ఏర్పరచుకొన్నావు కదా !

**28వ పద్యం :**

**కం ॥ రాజునకు విజయమూలము**
**రాజితమంత్రంబు సుస్థిరంబుగ దానిన్**
**రాజాన్వయ ! రక్షింతె ధ**
**రాజనులకుఁ గర్ణగోచరము గాకుండన్ ౹**

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| రాజ + అన్వయ | = | చంద్రవంశానికి చెందిన ఓ ధర్మరాజా ! |
| రాజునకున్ | = | రాజుయొక్క రాజ్య పాలనకునకు |
| విజయమూలం | = | విజయానికి మూలము |
| రాజిత మంత్రంబు | = | చక్కని, రహస్యమైన ఆలోచనమే |
| ధరా జనులకున్ | = | రాజ్యంలోని ప్రజలకు, |
| కర్ణగోచరము కాకుండన్ | = | చెవిని పడకుండా |
| దానిన్ | = | ఆ రహస్యమైన ఆలోచనను |
| సుస్థిరంబుగన్ | = | పదిలంగా |
| రక్షించుదువు + ఎ | = | రక్షిస్తున్నావు కదా ! |

**తాత్పర్యం :**

ఓ చంద్రవంశ ప్రభువైన ధర్మరాజా ! రాజుకు విజయ కారణము, అతడి రహస్యాలోచనము. ఆ రహస్యాలోచనం నీ ప్రజల చెవిని పడకుండా భద్రంగా రక్షించుకుంటున్నావు కదా !

**అలంకారం :**

వృత్యనుప్రాస అనే శబ్దాలంకారము దీనిలో ఉంది.

**29వ పద్యం :**

**కం ॥ ధీరుఁడు ధర్మాధర్మ వి**
**శారదుఁడు బహుశ్రుతుండు సమచిత్తుఁడు వా**

**ణీరమణీశ్రిత వదన స**
**రోరుహుఁడనఁ జనునే నీ పురోహితుఁడధిపా !**

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| అధిపా | = | ఓ ధర్మరాజా ! |
| నీ పురోహితుడు | = | నీ యొక్క పురోహితుడుగానున్న బ్రాహ్మణుడు |
| ధీరుడు | = | విద్వాంసుడును |
| ధర్మ + అధర్మ విశారదుడు | = | ధర్మాధర్మములను గూర్చి బాగా తెలిసినవాడు |
| బహుశ్రతుండు | = | అనేకమైన వేదశాస్త్రములను తెలిసినవాడు |
| సమచిత్తుడు | = | రాగద్వేషాలు లేకుండా సమత్వాన్ని సాధించిన మనస్సు కలవాడు |
| వాణీరమణీ | = | సరస్వతీ దేవి చేత |
| శ్రిత | = | ఆశ్రయించబడిన |
| వదన, సరోరుహుడు | = | ముఖపద్మము గలవాడు |
| అనఁజనునె | = | అని, అనదగినవాడే |

**తాత్పర్యం :**

ఓ ధర్మరాజా ! నీ పురుహితుడు, ధైర్యవంతుడు, ధర్మాధర్మాలు తెలిసినవాడు, వివిధ వేదశాస్త్రాలు బాగా అధ్యయనం చేసినవాడు, సరస్వతీ దేవి కొలువుదీరిన ముఖపద్మము కలవాడు అని అనదగ్గవాడే కదా !

**30వ పద్యం :**

**కం ॥ జనవర ! నీ యజ్ఞములం**
**దనవరతని యుక్తుఁడయిన యాజ్ఞికుఁడు ప్రయో**
**గనిపుణుఁడై యేమఱ కుం**
**డునె నిజకృత్యముల నెప్పుడున్ సమబుద్ధిన్.**

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| జనవర | = | ఓ రాజా ! |
| నీ యజ్ఞముల + అందున్ | = | నీవు చేయించే యజ్ఞములలో |
| నియుక్తుడు + అయిన | = | ఎల్లప్పుడునూ నియమించబడినవాడైన |
| యాజ్ఞికుడు | = | యజ్ఞముల చేయించే బ్రాహ్మణుడు |
| ప్రయోగ నిపుణుడు + ఐ | = | ఆ యజ్ఞమును చేయించుటలో నేర్పుకలవాడై |
| సమబుద్ధిన్ | = | రాగద్వేష రహితమైన సమత్వబుద్ధితో |
| నిజకృత్యములన్ | = | తాను చెయ్యదగిన పనులలో |
| ఏమఱక + ఉండును + ఎ | = | మఱుపు లేకుండా ఉన్నాడు కదా ! |

**తాత్పర్యం :**

ఓ ధర్మరాజా ! నీవు యజ్ఞాలను చేయించడానికి నియమించిన యాజ్ఞికుడు, యజ్ఞము చేయించడములో నిపుణుడై రాగద్వేషములులేని సమబుద్ధితో తన కర్తవ్యాలను విస్మరించకుండా ఉన్నాడు కదా !

**31వ పద్యం :**

కం ॥ నానావిధరణవిజయమ
హానిపుణులవార్య వీర్యులనఁదగు వారిన్
సేనాధ్యక్షులం జేసితే
నీనమ్మినవారి మాననీయుల హితులన్ !

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| నానావిధ, రణ, విజయ | = | పలువిధాలైన యుద్ధాల్లో విజయాన్ని సాధించడంలో |
| మహానిపుణులు | = | గొప్ప నేర్పరులు ఐనవాళ్ళు |
| అవార్య, వీర్యులు | = | ఎదిరించడానికి సాధ్యంకాని పరాక్రమము కలవాళ్ల |
| అనన్ | = | అని అనడానికి |
| తగువారిన్ | = | తగినటువంటివారిని |
| నీ, నమ్మిన వారిన్ | = | నీకు నమ్మకము కలవారిని |
| మాననీయులన్ | = | గౌరవింపదగిన వారిని |
| హితులన్ | = | నీ మేలు కోరేవాళ్ళను సైన్యాధ్యక్షులుగా నీవు నియమించావు కదా ! |

**తాత్పర్యం :**

అనేక విధాలైన యుద్ధాల్లో విజయాన్ని సాధించడంలో నిపుణులైన వాళ్ళను, ఎదిరించుటకు సాధ్యంకాని పరాక్రమవంతులను, గౌరవానికి అర్హులయిన వారిని, నీ మేలు కోరేవారిని సైన్యాధ్యక్షులుగా నీవు నియమించావు గదా !

**32వ పద్యం :**

చం ॥ కడుఁజనువాఁడునై పురుషకారియు దక్షుఁడునైన మంత్రి పెం
పడరంగ రాజపుత్రుల మహాధనవంతులంజేసి వారితో
నొడఁబడి పక్ష మేర్పడఁగ నుండఁడుగా ధనమెట్టివారికిం
గడుకొని చేయకుండునె జగన్నుత గర్వము దుర్విమోహమున్.

**33వ పద్యం :**

కం ॥ క్షితినాథ శాస్త్రదృష్టి
ప్రతిభను దివ్యాంతరిక్ష భౌమాత్పాత
ప్రతికారులగుచు సన్మా
నితులయి వర్తింతురయ్యు నీ దైవజ్ఞుల్.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| క్షితినాథ | = | భూమికి అధిపతి అయినవాడా, |
| నీ దైవజ్ఞుల్ | = | నీ జ్యోతిశ్శాస్త్ర పండితులు |
| శాస్త్రదృష్టి | = | శాస్త్రములు చదవడంవల్ల కలిగిన పాండిత్యం చేతనూ |

| | | |
|---|---|---|
| ప్రతిభను | = | తమ బుద్ధిబలము చేతనూ |
| దివ్య | = | దేవతా సంబంధములు |
| అంతరిక్ష | = | ఆకాశ సంబంధాలు |
| భౌమ + ఉత్పాత | = | భూ సంబంధాలు అయిన అనర్థాలకు |
| ప్రతికారులు + అగుచున్ | = | విరుగుడు క్రియలు చేసేవాళ్ళయి |
| సన్మానితులు + అయి | = | నీ చేత తగిన సన్మానాలు పొంది |
| వర్తింతురు + అయ్య | = | నడుచుకుంటున్నారు కదా ! |

**తాత్పర్యం :**

ఓ ధర్మరాజా ! నీ ఆస్థాన జ్యోతిష్కులు, శాస్త్రపాండిత్యము చేతనూ, స్వీయ ప్రతిభచేతనూ, అంతరిక్ష సంబంధాలు, భూ సంబంధాలు అయిన ఉత్పాతాలను ముందుగా కనిపెట్టి, శాంతిక్రియాదులు నీచేత జరిపించి, సన్మానాలు పొందుతున్నారు గదా !

**విశేషములు :**

ఉత్పాతాలు అంటే అపశకునాలు, హఠాత్తుగా వచ్చే అనర్థాలు. ఈ అనర్థాలు మూడు విధాలు. 1) దివ్యాలు, 2) అంతరిక్షాలు, 3) భౌమాలు.

**34వ పద్యం :**

**కం॥ అనిశము సేవింతురె ని**
**న్ననఘా ! యష్టాంగమైన యాయుర్వేదం**
**బున దక్షులైన వైద్యులు**
**ఘనముగ ననురక్తులై జగద్ధితబుద్ధిన్.**

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| అనఘా | = | పాపము లేనివాడా ! |
| నిన్నున్ | = | నిన్ను |
| అనిశము | = | ఎల్లప్పుడునూ |
| అష్టాంగమైన | = | ఎనిమిది భాగాలతో కూడుకొన్నదైన |
| ఆయుః + వేదంబున్ | = | ఆయుర్వేద వైద్యంలో |
| దక్షులు + ఐన | = | సమర్థులైన |
| వైద్యులు | = | వైద్యులు |
| జగద్ధితబుద్ధిన్ | = | లోకానికి మేలు చేయాలనే తలంపుతో |
| ఘనముగన్ | = | ఎక్కువగా |
| అనురక్తులై | = | ప్రేమకలవారై |
| సేవింతురె | = | సేవిస్తున్నారు కదా ! |

**తాత్పర్యం :**

ఓ పుణ్యాత్మా ! ఆయుర్వేద వైద్యవిధానంలో సమర్థులైన వైద్యులు, లోకానికి మేలుచేసే బుద్ధితో, ప్రజల మీది ప్రేమతో, ఎనిమిది శాఖలుగా విస్తరించిన ఆయుర్వేద వైద్యవిధానంలో సేవలు చేస్తున్నారా ?

**విశేషం :**

ఆయువును వృద్ధిచేసే మార్గాలను చెప్పే వేదం ఆయుర్వేదం. నాలుగైదు ఉపవేదాలలో ఈ ఆయుర్వేదము అన్నది ఒకటి. అశ్వినీ దేవతలు, ధన్వంతరీ మొదలయిన వాళ్ళు ఈ ఆయుర్వేద శాస్త్రమునకు కర్తలు.
ఆయుర్వేదము - అష్టాంగములు :

**1. కాయచికిత్స :**

దేహమునకు సంబంధించిన జ్వరము మొదలగు వానికి వైద్యము

**2. బాలచికిత్స :**

పసిబిడ్డల వ్యాధులకు చికిత్స

**3. గ్రహ చికిత్స :**

బ్రహ్మరాక్షసాది క్షుద్ర దేవతల పీడ తొలగించు చికిత్స

**4. ఊర్ధ్వాంగక చికిత్స :**

మెడపై ఉండే కన్ను, ముక్కు, చెవి, నాలుక, తల మొదలగు వాని చికిత్స

**5. శల్య చికిత్స :**

శరీరములో నాటిన బాణము ములికి మొదలగువానికి చికిత్స.

**6. దంష్ట్రా చికిత్స :**

పాముకోరలు మొదలయిన విషజంతువుల కోరలు నాటినప్పుడు ఆ విషాన్ని తొలగించే చికిత్స.

**7. జరా చికిత్స :**

అకాల వార్ధక్యానికి చికిత్స

**8. వృష చికిత్స :**

రతి క్రీడలో వెలువడే రేతస్సునకు, తృప్తి, అభివృద్ధి విషయమైన చికిత్స.

**35వ పద్యం :**

**కం ॥ సారమతింజేసి మానస**
**శారీరరుజావళులకు సతతంబుఁబ్రతీ**
**కారములు సేయుచుండుదె**
**యారఁగ వృద్ధోపసేవ నౌషదసేవన్.**

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| సారమతిఁజేసి | = | నిపుణమైన బుద్ధితో |
| మానస | = | మనస్సుకు సంబంధించిన |

| | | |
|---|---|---|
| శారీర | = | శరీర సంబంధమైన |
| రుజా + ఆవళులకున్ | = | వ్యాధుల సమూహాలకు |
| సతతంబున్ | = | ఎల్లప్పుడునూ |
| ఆరగన్ | = | ఒప్పుగా |
| వృద్ధోపసేవన్ | = | పెద్దలను సేవించడం చేతనూ |
| ఔషధ సేవన్ | = | మందులు సేవించడం చేతనూ |
| ప్రతీకారములు | = | విరుగుడు క్రియలు |
| చేయుచుండుదె | = | చేస్తున్నావు కదా ! |

**తాత్పర్యం :**

చక్కగా ఆలోచించి, పెద్దల సేవతో మనోవ్యాధులకునూ ఔషదసేవతో శారీరక వ్యాధులకునూ చికిత్స చేసుకుంటున్నావు కదా !

**విశేషం :**

దీనిలో అలంకారములు క్రమాలంకారము. మనోవ్యాధికి మందు లేదంటారు కానీ వృద్ధసేవ, మనోవ్యాధికి మంచిమందు. వృద్ధుల జీవితానుభవమునూ, శాస్త్రవిజ్ఞానమునూ, మనోవ్యాధులకు మేలయిన చికిత్స చేస్తాయి.

**36వ పద్యం :**

**కం ॥ ఉపధాశుద్ధులం బాప**
**వ్యపగతబుద్ధుల, వినీతివర్తుల, సములన్**
**సుపరీక్ష నియోగించితె**
**నిపుణుల నర్థార్జనాది నృపకార్యములన్.**

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| ఉపదా, శుద్ధులన్ | = | ధర్మపరీక్షల చేత పరిశుద్ధులైన వాళ్ళను |
| సుపరీక్షన్ | = | బాగుగా పరీక్షించడం చేత |
| పాప, వ్యాపగత | = | చిత్తవృత్తి గలవారిని |
| బుద్ధులన్ | = | మనోవ్యాపారము కలవారిని |
| వినీతి, వర్తులన్ | = | విశేషంగా నీతిమార్గములో నడుకునే వారిని |
| సములన్ | = | రాగద్వేషములులేనివారై |
| నిపుణులన్ | = | నేర్పరులను |
| అర్థ + అర్జన + ఆది | = | డబ్బును వసూలు చేయడం మొదలగు రాచకార్యములలో |
| నియోగించితె | = | నియమించావు గదా ! |

**తాత్పర్యం :**

పన్నులు వసూలు చేయడం, ధర్మపరీక్షలచే పరిశుద్ధులైన వారిని విశేషంగా నీతిమార్గములో నడుచుకొనే వాళ్లనూ చక్కగా పరీక్షించి నియమించావు గదా !

**37వ పద్యం :**

ఉ ॥ ఉత్తమమధ్యమాధమని యోగ్యతబుద్ధి నెఱింగి వారి న
యుత్తమ మధ్యమాధమని యోగములన్ నియమించితే నరేం
ద్రోత్తమ ! భృత్యకోటికి సమానముగాఁదగు జీవితంబు లా
యుత్తము సేసి యిత్తెదయ నయ్యాయి కాలము దప్పకుండఁగన్. (2వ పాఠంలో చూడుము)

**38వ పద్యం :**

కం ॥ తమతమ కనియెడు తఱి జీ
తము గానక నవయు భటుల దౌర్గత్య విషా
దము లేలిన వాని కవ
శ్యము నెగ్గొనరించు నతఁడు శక్రుండైనన్.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| తమ తమ కనియెడు, తఱిన్ | = | తాము తాము పొందవలసిన సమయములో |
| జీతము + కానక | = | జీతాన్ని పొందక |
| నవయు | = | బక్క చిక్కిన |
| భటుల | = | సేవకుల యొక్క, |
| దౌర్గత్య విషాదములు | = | దారిద్ర్యము వల్ల కలిగే దుఃఖాలు |
| ఏలిన వానికిన్ | = | రాజుకు |
| అతడు | = | అతడు |
| శక్రుండు + ఐనన్ | = | దేవేంద్రుని వంటి గొప్పవాడు అయినా |
| అవశ్యమునన్ | = | తప్పక |
| ఎగ్గు + ఒనరించున్ | = | కీడును కల్గిస్తాయి. |

**తాత్పర్యం :**

తాము పొందవలసిన సమయములో జీతాన్ని పొందక, శుష్కించే, సేవకుల దారిద్ర్యదుఃఖాలు, అతడు దేవేంద్రుడు అయినా సరే తప్పక కీడును కల్గిస్తాయి.

**39వ పద్యం :**

కం ॥ కులపుత్రులైన సద్భృ
త్యులకును సత్కార మర్థితోఁజేయుదె నా
రులు నీ ప్రస్తవమున ని
మ్ములఁ గృతము దలంచి ప్రాణములు విడుతు రనిన్.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| కులపుత్రులైన | = | వంశపారంపర్యంగా వచ్చే |
| సత్ + భృత్యులకును | = | మంచి సేవకులకును |

| | | |
|---|---|---|
| సత్కారము | = | సమ్మానము |
| అర్థితోన్ | = | ప్రీతితో |
| చేయుదె | = | చేస్తున్నావు కదా |
| వారలు | = | ఆ సేవకులు |
| నీ ప్రస్తవమునన్ | = | నీ విషయములో |
| ఇమ్ములన్ | = | ఇంపుగా |
| కృతము | = | నీవు చేసిన ఉపకారము |
| తలంచి | = | తలచుకొని |
| అనిన్ | = | యుద్ధములో |
| ప్రాణములు | = | ప్రాణాలు |
| విడుతురు | = | విడిచిపెడతారు |

**తాత్పర్యం :**

వంశపారంపర్యంగా మంచి సేవకులకు ప్రీతితో సమ్మానం చేస్తున్నావుగదా ! వారు మనసారా, నీ ఉపకారం స్మరించి, నీకై ప్రాణాలు వదులుతారు.

**40వ పద్యం :**

**కం ॥ అనఘా ! నీ ప్రస్తవమున**
**నని నీల్గిన వీరభటుల యనుపోష్యుల నె**
**ల్లను బ్రోతె, భోజనాచ్ఛా**
**దనముల వారలకు నెమ్మి దఱుఁగక యుండన్.**

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| అనఘా | = | పాపములేని పుణ్యాత్ముడైన ఓ ధర్మరాజా ! |
| నీ ప్రస్తవమునన్ | = | నీ విషయంలో |
| అనిన్ | = | యుద్ధములో |
| ఈల్గిన | = | మరణించిన |
| వీరభటులు | = | వీరులయిన యుద్ధ భటుల యొక్క |
| అనుపోష్యులన్ + ఎల్లన్ | = | అనుసరించి పోషించదగిన వారిని అందరినీ |
| భోజనాచ్ఛాదనములన్ | = | తిండి, బట్టలతో |
| వారలకున్ | = | వారికి |
| నెమ్మి | = | సంతోషము |
| తఱుగకయుండున్ | = | తగ్గకుండా |
| ప్రోచుదువు + ఎ | = | పోషిస్తున్నావు కదా ! |

**తాత్పర్యం :**

పుణ్యాత్ముడవైన ఓ ధర్మరాజా ! నీ కోసం యుద్ధములో మరణించిన వీరసైనికుల కుటుంబాలకు కూడుగుడ్డలు లోటు లేకుండా ఇచ్చి, వాళ్ళ సంతోషము తగ్గకుండా, వారిని పోషిస్తున్నావు కదా !

**41వ పద్యం :**

**కం ॥ ధనలుబ్ధుల ముచ్చులఁ గూ**
**ర్పనివారలఁ బగఱవలని వారల ధృతి వా**
**లని వారల, దుర్జనులం**
**బనుపవుగా రాజకార్యభారము దాల్పన్.**

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| ధనలుబ్ధులన్ | = | ధనముపట్ల లోభబుద్ధి కలవాళ్ళను |
| ముచ్చులన్ | = | దొంగలను |
| కూర్పని వారలన్ | = | స్నేహానికి యోగ్యులుకాని వాళ్ళను |
| పగఱవలని వారలన్ | = | శత్రువుల పట్ల పక్షపాతం కలవాళ్ళను |
| ధృతిచాలని వారలన్ | = | ధైర్యము చాలని వాళ్ళను |
| దుర్జనులన్ | = | దుర్మార్గులైన వాళ్ళను |
| రాజకార్యభారము | = | రాజకార్యము యొక్క భారాన్ని |
| తాల్పన్ | = | వహించడానికి |
| పనుపవుగా | = | పంపడం లేదా కదా ! |

**తాత్పర్యం :**

ఓ ధర్మరాజా ! ధనముపట్ల లోభబుద్ధి కలవాళ్ళను, దొంగలను, స్నేహానికి యోగ్యులు కానివాళ్ళను, శత్రువులపట్ల పక్షపాతం కలవాళ్ళను, ధైర్యముచాలని వాళ్ళను, దుర్మార్గులైన వాళ్ళను, రాజకార్యాలు నిర్వహించడానికి నీవు పంపడం లేదు కదా !

**42వ పద్యం :**

**కం ॥ చోరభయ వర్జితముగా**
**ధారుణిఁబాలింతె యధికధనలోభమునం**
**జోరుల రక్షింపరుగా**
**వారలచే ధనముగొని బవద్భృత్యవరుల్.**

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| చోర, భయ, వర్జితముగాన్ | = | దొంగ వల్ల భయము లేకుండా |
| ధారుణిన్ | = | భూమిని |
| పాలింతె | = | పరిపాలిస్తున్నావు కదా ! |
| భవద్, భృత్య వరుల్ | = | నీ యొక్క సేవకులలో ముఖ్యులు |
| అధిక, ధన, లోభమునన్ | = | ధనముపై మితిమీరిన కోరికతో |
| వారలచేన్ | = | ఆ దొంగల నుండి |
| ధనము + కొని | = | డబ్బు తీసుకొని |

| | | |
|---|---|---|
| చోరులన్ | = | ఆ దొంగలను |
| రక్షింపరుగా | = | రక్షించడం లేదు గదా ! |

**తాత్పర్యం :**

ఓ ధర్మరాజా ! దొంగల భయము లేకుండా, నీవు రాజ్యాన్ని పరిపాలిస్తున్నావు కదా ! నీ ప్రభుత్వోద్యోగులలో ముఖ్యలయినవారు, ధనాశాపరులయి, ఆ దొంగల దగ్గర డబ్బు పుచ్చుకొని వాళ్ళకు రక్షణ కల్పించడం లేదు గదా !

**43వ పద్యం :**

**కం ॥ ధరణీనాథ ! భవద్భుజ**
**పరిపాలిత యైనవసుధఁ బరిపూర్ణములై**
**కర మొప్పుచున్న చెఱువులు**
**ధరని కవగ్రహభయంబు దనుకక యుండన్.**

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| ధరణీనాథ | = | భూమికి ప్రభువైన ఓ ధర్మరాజా ! |
| భవద్భుజ పాలితయైన | = | భుజబలముచేత భూమిలో |
| చెఱువులు | = | చెఱువులు |
| కరము | = | మిక్కిలి |
| పరిపూర్ణములై | = | నిండినవై |
| ధరణిన్ | = | భూమికి |
| అవగ్రహ భయము | = | వర్షము లేకపోవడం వలన కలిగే భయము |
| తనుకక యుండన్ | = | కలుగకుండా |
| కరము | = | మిక్కిలి |
| ఒప్పుచున్ + ఉండున్ + ఎ | = | ఒప్పుతున్నాయి కదా ! |

**తాత్పర్యం :**

ఓ ధర్మరాజా ! భుజబలముతో నీవు పరిపాలిస్తున్నప్పుడు ఈ భూమిలో అనావృష్టి వల్ల భయము లేకుండా చెరువులు నిండి, కన్నులపండుగగా ఉన్నాయి.

**44వ పద్యం :**

**కం ॥ హీనులగు కర్షకులకును**
**భూనుత ! ధాన్యంబు బీజములు, వణిజులకున్**
**మానుగ శతైకవృద్ధి న**
**నూనముగా ఋణము లిత్తె యుత్తమబుద్ధిన్.**

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| భూనత | = | లోకము చేత కొనియాడబడేవాడా ! |
| ఉత్తమ బుద్ధిన్ | = | గొప్పబుద్ధితో |

| | | |
|---|---|---|
| హీనులగు | = | పేదలయిన |
| కర్షకులకును | = | వ్యవసాయ దారులకును |
| ధాన్యంబు, బీజములు | = | ధాన్యపు విత్తనాలు |
| వణిజులకున్ | = | వర్తకులకు |
| మానుగన్ | = | ఒప్పుగా |
| శతైక వృద్ధిన్ | = | నూటికి ఒక శాతము వడ్డీ |
| అనూనముగాన్ | = | కొరత లేకుండా |
| ఋణముల్ | = | అప్పులు |
| ఇత్తె | = | ఇస్తున్నావు కదా ! |

**తాత్పర్యం :**

ఓ ధర్మరాజా ! ఉదారబుద్ధితో పేదరైతులకు ధాన్యపు విత్తనములునూ, వర్తకులకు నూటికి ఒక రూపాయి వడ్డీ వంతున అప్పులనూ ఇస్తున్నావు కదా !

**45వ పద్యం :**

కం ॥ పంగుల మూకాంధుల వికల
లాంగులను నబాంధవుల దయంబ్రోతి భయా
ర్తుం గడిఁది శత్రునైనను
సంగరరంగమునఁ గాతె శరణం బనినన్.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| పరంగులన్ | = | కుంటివాళ్ళను |
| మూక + అంధులన్ | = | మూగవాళ్లను, గ్రుడ్డివాళ్ళను |
| అబాంధవులన్ | = | బంధువులు లేనివాళ్ళను |
| దయన్ | = | దయతో |
| ప్రోచుదువు + ఎ | = | పోషిస్తున్నావు కదా ! |
| సంగర రంగమునన్ | = | యుద్ధభూమిలో |
| శరణంబు + అనినన్ | = | శరణు అని కోరితే |
| కడిది శత్రునైనన్ | = | ఎంత పెద్ద శత్రువునయినా |
| భయార్తున్ | = | భయముతో దుఃఖించిన వానిని |
| కాచుదువు + ఎ | = | కాపాడుతున్నావు కదా ! |

**తాత్పర్యం :**

కుంటివాళ్ళను, మూగవాళ్ళను, గ్రుడ్డివాళ్ళను, అంగవిహీనులయిన వాళ్ళను, బంధువులు లేనివాళ్ళను దయతో పోషిస్తున్నావు కదా ! భయముతో దుఃఖిస్తూ నిన్ను శరణువేడిన పెద్ద శత్రువును అయినా యుద్ధభూమిలో కాపాడుతున్నావు కదా !

**46వ పద్యం :**

కం ॥ కృతమెఱిఁగి కర్తనుత్తమ
మతుల సభల సంస్తుతించి మఱవక తగు స
త్కృతి సేయుదె కృత మెఱిఁగెడు
పతియె జగజ్జనుల నెల్లఁబరిపాలించున్.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| కృతము + ఎఱిగి | = | చేసిన మేలును గుర్తించి |
| కర్తన్ | = | ఆ మేలు చేసిన వ్యక్తిని |
| ఉత్తమ మతుల సభలన్ | = | గొప్ప బుద్ధిమంతులు ఉన్న సభలలో |
| సంస్తుతించి | = | ప్రశంసించి |
| మఱవక | = | మఱచిపోకుండ |
| తగు | = | తగిన |
| సత్కృతి + చేయుదె | = | వారికి సమ్మానము, చేస్తున్నావు కదా ! |
| కృతము + ఎఱిగెడు | = | చేసిన మేలును గుర్తించగల |
| పతి + ఎ | = | ప్రభువే |
| జగజ్జనులన్ | = | లోకము నందలి ప్రజలన్ |
| ఎల్లన్ | = | అందరినీ |
| పరిపాలించున్ | = | చక్కగా పరిపాలించగలడు. |

**తాత్పర్యం :**

చేసిన మేలును గుర్తించి, ఆ మేలు చేసిన వ్యక్తిని పదిమంది పెద్దలు ఉన్న సభలలో, ఉచితరీతిగా సత్కరిస్తున్నావు కదా ! చేసిన మేలును గుర్తించగల ప్రభువే ప్రజలను అందరినీ చక్కగా పరిపాలించగలడు.

**విశేషం :**

దీనిలోని అలంకారము "అర్థాంతర న్యాసము".

**47వ పద్యం :**

సీ ॥ ఆయుంబునందు నాలవభాగమొండె మూఁ
డవభాగమొండె నందర్థమొండె
గాని మిక్కిలి సేయఁగాదు వ్యయంబని
యవధరించితి బుద్ధి నవనినాథ !
యాయూధాగారధనాధ్యక్ష్యములయందు
వరవాజి వారణావళుల యందు
బండారముల యందుఁ బరమవిశ్వాసుల
భక్తుల దక్షులఁ బంచితయ్య

ఆ ॥ గురుల వృద్ధశిల్పి వరవణిగ్బాంధవ
జనుల నాశ్రితులను సాధుజనులఁ
గరుణఁ బేదఱికము నొరయకుండఁగఁ బ్రోతె
సకలజనులు నిన్ను సంస్తుతింప.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| అవనినాథ | = | భూమికి ప్రభువైన ఓ ధర్మరాజా ! |
| ఆయంబు + అందున్ | = | ఆదాయములో |
| నాలుగవ భాగమొండెన్ | = | నాల్గవ వంతు కాని |
| మూడవ భాగమొండెన్ | = | మూడవవంతుకాని |
| మిక్కిలి | = | అంతకుమించి |
| అందున్ + అర్థము + ఒండెన్ | = | ఆ ఆదాయములో సగభాగముకాని |
| వ్యయంబు చేయన్ + కాదు | = | చేయడం తగదు |
| అవధరించితివి + ఎ | = | గ్రహించావు కదా |
| ఆయుధాగార | = | ఆయుధ శాలల యొక్క |
| ధన + ఆధ్యక్షముల + అందున్ | = | భాండాగారముల యొక్క పాలనలో |
| పర | = | శ్రేష్ఠములైన |
| వాజి | = | గుఱ్ఱముల యొక్క |
| వారణ | = | ఏనుగుల యొక్క |
| ఆవళులయుందున్ | = | సమూహాల పాలనలో |
| బండారముల యందున్ | = | కోశాగారములలోనూ |
| పరమవిశ్వాసులన్ | = | మిక్కిలిగా నమ్మదగిన వాళ్ళనూ |
| భక్తులన్ | = | నీ యందు భక్తిగలవారిని |
| దక్షులన్ | = | సమర్థులైన వాళ్ళను |
| పంచితివి + అయ్యె | = | నియమించావు కదా ! |
| నిన్నున్ | = | నిన్ను |
| సకలజనులు | = | ప్రజలు అందరునూ |
| సంస్తుతింపన్ | = | ప్రశంసింపగా |
| గురులన్ | = | గురువులను |
| వృద్ధ | = | ముసలివారైన |
| శిల్ప | = | శిల్పులను |
| వర, వణిక్ | = | శ్రేష్ఠులైన వ్యాపారులను |
| బాంధవ జనులన్ | = | బంధువులన్ |
| ఆశ్రితులను | = | నిన్ను ఆశ్రయించిన వారిని |
| సాధుజనులన్ | = | సజ్జనులను |

| | | |
|---|---|---|
| పేదఱికము | = | బీదరికము |
| పొరయక + ఉండంగన్ | = | కలగకుండా |
| కరుణన్ | = | దయతో |
| ప్రోచుదువు + ఎ | = | పోషిస్తున్నావు కదా ! |

**తాత్పర్యం :**

ధర్మరాజా ! వచ్చే ఆదాయములో మూడవ లేదా నాల్గవ లేదా సగభాగాన్ని మాత్రమే ఖర్చు చేయాలి. అంతకుమించి ఎక్కువగా ఖర్చు చేయకూడదని గ్రహించావు గదా ! ఆయుధశాలలు, ధనాగారాలు, అశ్వశాలలు, గజశాలలు, కోశాగారాలు అనే వీటి పాలనలో ఎంతో నమ్మదగిన వాళ్ళను, నీపట్ల భక్తిగలవాళ్ళను, సమర్థులైనవాళ్ళను నియమించావు గదా ! ప్రజలందరూ ప్రశంసించేటట్లు గురువులను, గొప్ప వ్యాపారులను, బంధువులనూ, ఆశ్రితులను, సజ్జనులను దయతో పోషిస్తున్నావు కదా !

**48వ పద్యం :**

**కం ॥ వలయు నమాత్యులుఁ జుట్టం**
**బులు, మూలబలంబు రాజపుత్రులు, విద్వాం**
**సులు, బలసియుండు నిచ్చలుఁ**
**గొలువుండులోక మెల్లఁగొని యాడంగన్.**

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| వలయు | = | కావలసిన |
| అమాత్యులన్ | = | మంత్రులనూ |
| చుట్టంబులన్ | = | బంధువులనూ |
| మూలబలంబులన్ | = | ప్రధాన సైనిక సమూహమునూ |
| రాజపుత్రులున్ | = | రాజకుమారులునూ |
| విద్వాంసులన్ | = | పండితులునూ |
| బలసి + ఉండన్ | = | ఎక్కువగా చేరియుండగా |
| లోకము + ఎల్లన్ | = | లోకమంతా |
| కొనియాడంగన్ | = | కీర్తించగా |
| నిచ్చలున్ | = | ప్రతిదినమునూ |
| కొలువు + ఉండుదువు + ఎ | = | కొలువు తీరి ఉంటున్నావు కదా ! |

**తాత్పర్యం :**

ఇష్టులైన మంత్రులు, బంధువులు, సైన్యాధిపతులు, రాజకుమారులు అధిక సంఖ్యలో ఆసీనులై ఉండగా, ప్రపంచమంతా ప్రశంసించే విధంగా ప్రతి దినమునూ, నీవు కొలువు తీరుతున్నావు గదా !

**49వ పద్యం :**

కం ॥ పరికించుచు బాహ్యాభ్యం
తరజనముల వలన సంతతము నిజరక్షా
పరుఁడ వయి పరమహీశుల
చరితము వీక్షింతె నిపుణచరనేత్రములన్.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| పరికించుచున్ | = | జాగ్రత్తగా గమనిస్తూ |
| బాహ్యా | = | బయట |
| అభ్యంతర | = | లోపలనూ ఉండే |
| జనముల వలనన్ | = | జనుల వల్ల |
| సంతతము | = | ఎల్లప్పుడునూ |
| నిజరక్షాపరుడవు + అయి | = | నిన్ను నీవు రక్షించుకోవడంలో శ్రద్ధగలవాడవై |
| పర, మహీ + ఈశులు | = | శత్రురాజుల యొక్క |
| చరితము | = | ప్రవర్తన |
| నిపుణ | = | నేర్పుగల |
| చర | = | చారులు అనే |
| నేత్రములన్ | = | కళ్ళ ద్వారా |
| వీక్షింతె | = | చూస్తున్నావు గదా ! |

**తాత్పర్యం :**

జాగ్రత్తగా గమనిస్తూ వెలుపల, లోపల ఉండే శత్రువుల నుండి నిన్ను నీవు రక్షించుకుంటూ, శత్రురాజుల ప్రవర్తనను, గూఢచారులు అనే కళ్ళ ద్వారా చూస్తున్నావు కదా !

**విశేషం :**

గూఢచార నేత్రములన్ అన్నచోట పద్యంలో రూపకాలంకారము ఉంది.

**50వ పద్యం :**

కం ॥ వెలయఁగ విద్వజ్జన ము
ఖ్యులతోడ నశేషధర్మకుశలుఁడవయి యి
మ్మల లోక వ్యవహార
మ్ములు దయ బరికింతె నిత్యమును సమబుద్ధిన్.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| నిత్యమును | = | ప్రతిదినమునూ |
| వెలయగన్ | = | ఒప్పుగా |
| విద్వజ్జన | = | పండితులలోని |

| | | |
|---|---|---|
| ముఖ్యులతోడన్ | = | ప్రముఖులతో |
| అశేషధర్మ | = | అన్ని ధర్మాలలోనూ |
| కుశలుడవు + అయి | = | నేర్పరితనము కలవాడవై |
| సమ, బుద్ధిన్ | = | రాగద్వేషములు లేని బుద్ధితో |
| ఇమ్ములన్ | = | శ్రద్ధగా |
| లోకవ్యవహారమ్ములు | = | లోకములోని వ్యవహారములను |
| దయన్ | = | దయతో |
| పరికించుదువు + ఎ | = | పరిశీలిస్తున్నావు కదా ! |

**తాత్పర్యం :**

గొప్ప పండితులతో కలిసి, వారితో చర్చించడం ద్వారా సర్వధర్మాలలో నేర్పు కలవాడివై, రాగద్వేషము లేని సమబుద్ధితో శ్రద్ధగా దయతో, లోకవ్యవహారాలు విచారిస్తున్నావు కదా !

**51వ పద్యం :**

ఆ.వె. ॥వార్తయంద జగము వర్తిల్లుచున్నది
యదియు లేని నాఁడ యఖిల జనులు
నంధకారమరమగ్న లగుదురు గావున
వార్త నిర్వహింప వలయుఁబతికి

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| వార్తయంద | = | వార్తలోనే అనగా సమాచారమందే |
| జగము | = | ప్రపంచము |
| వర్థిల్లుచున్ + ఉన్నది | = | నడుస్తోంది |
| అదియున్ | = | ఆ వార్త అనేది |
| లేనినాడు + అ | = | లేనిరోజున |
| అఖిల జనులున్ | = | ప్రజల అందరునూ |
| అంధకార, మగ్నులు + అగుదురు | = | అజ్ఞానము అనే చీకటిలో మునిగి పోయినవారు అవుతారు |
| కావునన్ | = | కాబట్టి |
| పతికిన్ | = | రాజునకు |
| వార్త | = | వార్తను |
| నిర్వహింపవలయున్ | = | నడవవలసిన అవసరం ఉంది. |

**తాత్పర్యం :**

ప్రపంచము అంతా వార్తమీదనే నడుస్తున్నది. అది లేకపోతే ప్రజలు అందరూ పెద్దచీకటిలో మునిగినట్లే అందువల్ల ప్రభువు వార్తను నడపాలి.

**52వ పద్యం :**

ఆ.వె. ॥ దారసంగ్రహంబు ధరణీశ ! రతిపుత్ర
ఫలము, శీలవృత్తఫలము శ్రుతము
దత్తభుక్తఫలము ధనము వేదములగ్ని
హెూత్రఫలము లనియునొగి నెఱుంగు

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| ధరణీశ | = | భూమికి ప్రభువైన ఓ ధర్మరాజా ! |
| దారసంగ్రహంబు | = | భార్యను పొందడం |
| రతి | = | ఆమెతో సంభోగించడం |
| పుత్రఫలము | = | పుత్రుడు పుట్టడమే |
| శ్రుతము | = | ధర్మాన్ని గూర్చి వినడం |
| శీల, వృత్త, ఫలము | = | శీలమూ, మంచి నడవడి, ఫలముగా కలిగినట్టిది |
| ధనము | = | ధనము |
| దత్త | = | దానమునూ |
| భుక్త | = | అనుభవమునూ |
| అగ్నిహెూత్రములు | = | అగ్నిహెూత్రమును ఫలములుగా కలిగినట్టివి |
| అనియున్ | = | అని |
| ఒగిన్ | = | శీఘ్రముగా |
| ఎఱుఁగు | = | తెలిసికొనుము |

**తాత్పర్యం :**

భార్యను పొందడానికి ఫలము, భోగము, సుఖమూ, పుత్రులూ పుట్టటం అనేవి ధర్మాలు వినడానికి ఫలము, సచ్ఛీలత, సత్ప్రవర్తన సిద్ధించడం అనేవి, సంపాదించుటకు ఫలము, దానము చేయడం అనుభవించడం అనేవి వేదాలకు ఫలము అగ్నిహెూత్రాలు. ఈ సంగతి క్రమముగా తెలుసుకో.

**53వ పద్యం :**

చం ॥ బహుధన ధాన్యసంగ్రహము బాణశరాసన యోధవీరసం
గ్రహము నిరంతరాంతరుదకంబులు ఘాసరసేంధనేఘసం
గ్రహము ననేకయంత్రములుఁగల్గి యసాధ్యము లై ద్విషద్భయా
వహ లగుచుండ నొప్పునే భవత్పరిరక్ష్యములైన దుర్గముల్. (2వ పాఠములో చూడుడు)

**54వ పద్యం :**

చం ॥ వదలక బుద్ధి నంతరివర్గము నోర్చి జితేంద్రియుడవై
మొదలన దేశకాలబలముల్ మఱిదైవబలంబుఁగల్గి భూ
విదితబలుండవై యహితవీరుల నోర్పఁగ నుత్సహింతె దు
ర్మద మలినాథ చిత్తులఁ బ్రమత్తుల నింద్రియనిర్జితాత్ములన్. (2వ పాఠములో చూడుడు)

**55వ పద్యం :**

తే.గీ.	కడిది రిపులపైఁబోవంగఁ గడఁగియున్న
నీకు ముందఱఁజని రిపునృపులయందుఁ
దగిలి సామ్యాద్యుపాయంబు లొగిన సంప్ర
యోగమునఁజేసి వర్తిల్లుచున్నె చెపుమ

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| కడిది | = | గొప్ప |
| రిపులపైన్ + పోవంగన్ | = | శత్రువుల మీద దండెత్తి వెళ్ళడానికి |
| కడిగి + ఉన్న | = | పూనుకొని యున్న |
| నీకున్ | = | నీకు |
| ముందఱన్ + చని | = | ముందుగా వెళ్ళి |
| రిపునృపుల + అందున్ | = | శత్రురాజులలో |
| తగిలి | = | ప్రయత్నించి |
| సామ + ఆది + ఉపాయంబులు | = | సామము, దానము, భేదము, దండము అనే ఉపాయములు |
| ఒగిన | = | వరుసగా |
| సంప్రయోగమునన్ + చేసి | = | చక్కగా ప్రయోగించడం చేత |
| వర్తిల్లుచున్నె | = | ప్రవర్తిల్లుతున్నాయి కదా ! |
| చెపుమ | = | చెప్పు. |

**తాత్పర్యం :**

నీవు దండెత్తి వెళ్ళడానికి ముందే బలవంతులైన శత్రురాజుల మీద, సామదానాది చతుర్విధోపాయాలను చక్కగా ప్రయోగిస్తున్నావు కదా !

**56వ పద్యం :**

వ ॥	మఱియు నాస్తిక్యం, బన్నతంబు ప్రమాదం, బాలస్యం, బనర్థజ్ఞులతోడి
చింతినంబు, క్రోధంబు, దీర్ఘచింత, దీర్ఘసూత్రత, యెఱుకగలవారి నెఱుంగమి
యర్థంబులయం దనర్థక, నిశ్చితకార్యంబులు సేయుమి, మంత్రంబుల రక్షింపమి
శుభంబులఁ ప్రయోగింపమి, విషయంబులందగులుట యనంబరఁగిన పదునాలుగు
రాజదోషంబులఁ బరిహరింతె యని యడిగిన నారదునకు ధర్మరా జిట్లనియె.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| మఱియున్ | = | మఱియును |
| నిస్తిక్యంబు | = | నాస్తికత |
| అనృతంబు | = | అబద్ధము చెప్పడం |
| ప్రమాదంబు | = | ఏమరపాటు |

| | | |
|---|---|---|
| ఆలస్యంబు | = | సోమరితనము |
| అనర్థజ్ఞులతోడి చింతనంబు | = | అజ్ఞానులతో ఆలోచించడం |
| క్రోధంబు | = | కోపము |
| దీర్ఘచింత | = | ఎక్కువకాలము దుఃఖించడం |
| దీర్ఘసూత్రత | = | చేయవలసిన పనులను గురించి దీర్ఘంగా ఆలోచించడం, |
| ఎఱుక గలవారిన్ | = | జ్ఞానము కలవారిని |
| ఎఱుంగమి | = | గుర్తింపకపోవుట |
| అర్థంబుల + అందున్ | = | ప్రయోజనకరమైన విషయాల్లో |
| అనర్థక చింత | = | ప్రయోజన భంగకరమైన ఆలోచన |
| నిశ్చిత కార్యంబులన్ | = | నిర్ణయించిన పనులు |
| చేయమి | = | చేయకపోవడం |
| మంత్రంబులన్ | = | రహస్యాలోచనలను |
| రక్షింపమి | = | కాపాడకుండడం |
| శుభంబులన్ | = | శుభకార్యాలను |
| ప్రయోగింపమి | = | జరిపించకపోవడం |
| విషయంబులన్ | = | ఇంద్రియ సుఖాలలో |
| తగులుట | = | తగుల్కొనడం |
| అనంబరగిన | = | అనేటటువంటి |
| పదునాలుగు | = | పదునాలుగు విధములైన |
| రాజదోషంబులన్ | = | రాజదోషంబులను |
| పరిహరింతె | = | విడిచి పెడుతున్నావు కదా ! |
| అనియడిగిన | = | అని, అడిగిన |
| నారదునకున్ | = | నారదునితో |
| ధర్మరాజు | = | ధర్మరాజు |
| ఇట్లనియె | = | ఇలా చెప్పాడు. |

**తాత్పర్యం :**

నాస్తికత, అసత్యమాడటం, ఏమరపాటు, సోమరితనం, తెలివితక్కువ వాళ్ళతో కార్యాలోచన చెయ్యడం, అతికోపము, అధిక కాలము దుఃఖించడం, చేయవలసిన పనిని గూర్చి అతి దీర్ఘంగా ఆలోచించడం, ప్రయోజనకరమైన విషయాల్లో ప్రయోజనభంగమైన ఆలోచనలు చెయ్యడం, నిర్ణయించిన పనులు చేయకుండడం అనే రాజదోషాలను విడిచిపెట్టావు కదా ! అని అడిగిన నారద మహర్షితో ధర్మరాజు ఇలా చెప్పాడు.

**57వ పద్యం :**

**తే ॥ నాయథాశక్తిఁ జేసి యన్యాయపథముఁ**
**బరిహరించి మహాత్ముల చరితలందు**
**బుద్ధి నిలిపి మీయుపదేశమున శుభంబు**
**లయిన వాని ననుష్ఠితుఁ బ్రియముతోడ.**

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| నా | = | నా యొక్క |
| యథాశక్తిన్ + చేసి | = | చేతనైనంతవఱకునూ |
| అన్యాయపథమున్ | = | అన్యాయమార్గమును |
| పరిహరించి | = | విడిచి |
| మహాత్ముల | = | గొప్పవారి యొక్క |
| చరితలందున్ | = | చరిత్రలో |
| బుద్ధిన్ | = | బుద్ధిని |
| నిలిపి | = | ఉంచి |
| మీ + ఉపదేశమునన్ | = | మీ ధర్మబోధల వల్ల |
| శుభంబులు + అయిన | = | శుభాన్ని కల్గించేవి అయిన |
| వానిన్ | = | ఆపనులలన్ |
| ప్రియము తోడన్ | = | ప్రీతితో |
| అనుష్ఠింతున్ | = | చేస్తాను. |

**తాత్పర్యం :**

నాదర మునీంద్రా ! నాకు చేతనయినంత వరకూ అధర్మ మార్గాన్ని వదలి, మహాత్ముల చరిత్రల్ని ఆదర్శంగా ఉంచుకొని, మీ ధర్మబోధ వల్ల శుభాలైన వాటిని మనఃపూర్వకంగా ఆచరిస్తాను.

**డా॥ కాకాని సుధాకర్**
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,
అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ,
ఎస్.ఎస్.&ఎన్ కళాశాల,
నరసరావుపేట.

పాఠం - 2

# రాజనీతి - నన్నయభట్టు

## (మహాభారతం - సభా పర్వం - ప్రథమాశ్వాసం - 26 నుండి 51 పద్యాల వరకు)

## ప్రతిపదార్థ తాత్పర్యాలు - సందర్భసహిత వ్యాఖ్యలు

**విషయసూచిక :**

**2.0** పరిచయం
**2.1** ఉద్దేశ్యం
**2.2** ప్రతిపదార్థ తాత్పర్యాలు
**2.3** సందర్భసహిత వ్యాఖ్యలు
**2.4** పరీక్షకు రాదగిన ప్రశ్నలు - సమాధానాలు

### 2.0 కవి పరిచయం :

రాజనీతి ఆంధ్రమహాభారతం సభాపర్వంలో నన్నయ తీర్చిదిద్దిన భాగం. అందులోని రాజనీతి, రాజధర్మాలు మొదలయిన విశిష్టాంశాలను నన్నయ బహుదా ప్రశంసనీయంగా చిత్రించాడు.

### 2.1 ఉద్దేశ్యం :

ఇంతకుముందు రాజనీతి పాఠ్యభాగ సందర్భం, పాఠ్యభాగ వివరణ, పద్యాలు - అర్థాలు తెలుసుకున్నారు. ఇప్పుడు ప్రతిపదార్థ తాత్పర్యాలు, సందర్భసహిత వ్యాఖ్యలు, పరీక్షకు రాదగిన ప్రశ్నలు - సమాధానాలు తెలుసుకుంటారు.

### 2.2 కంఠస్థ పద్యములు - ప్రతిపదార్థములు - తాత్పర్యములు :

చం ॥ కడుఁ జనువాఁడు నై పురుషకారియు దక్షుడునైన మంత్రి పెం
పడరఁగ రాజపుత్రుల మహాధనవంతులఁ జేసి వారితో
నొడఁబడి పక్షమేర్పడఁగ నుండఁడుగా ధన మెట్టివారికిం
గడుకొని చేయకుండునె జగన్నుత గర్వము దుర్విమోహమున్.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| జగన్నుత | = | లోకము చేత కీర్తింపబడే ఓ ధర్మరాజా ! |
| కడున్ | = | మిక్కిలి |
| చనువాఁడున్ + ఐ | = | పలుకుబడి గలవాడై |
| పురుషకారియున్ | = | క్రియాశీలియూ |
| దక్షుడున్ + ఐన | = | సమర్థుడునూ అయిన |
| మంత్రి | = | మంత్రి |
| పెంపడరగన్ | = | అతిశయము, మీఱునట్లుగా |
| రాజపుత్రులన్ | = | ఇతర రాజుల కుమారులను |
| మహాధనవంతులన్ + చేసి | = | గొప్ప సంపద కలవారినిగా చేసి |

| | | |
|---|---|---|
| వారితోన్ | = | ఆ రాజపుత్రులతో |
| ఒడబడి | = | చేతులు కలిపి |
| పక్షమేర్పడగన్ | = | వ్యతిరేకవర్గము ఏర్పడేటట్లుగా |
| ఉండడుగా | = | ఉండటం లేదుకదా ! |
| ధనము | = | ధనము |
| ఎట్టి వారికిన్ | = | ఎటువంటి వాళ్ళకు ఐనా |
| కడుకొని | = | పూని |
| గర్వమున్ | = | గర్వాన్ని |
| దుర్విమోహమున్ | = | చెడ్డదైన, మితిమీరిన, కాంక్షనూ |
| చేయక + ఉండునె | = | కలిగించకుండా ఉంటుందా ? (ఉండదు) |

**తాత్పర్యము :**

ఎక్కువ పలుకుబడి కలిగి, క్రియాశీలము, సమర్థుడునూ అయిన మంత్రి తన హద్దునుదాటి ఇతర రాజపుత్రులునూ మహాధనవంతులునుగా చేసి వారితో తాను చేతులు కలిపి. నీకు వ్యతిరేకవర్గంగా ఏర్పడేటట్లు, ఉండటం లేదు కదా ! ధర్మరాజా ! ధనము ఎటువంటి వాళ్లను అయినా దురాశనూ, గర్వాన్ని కలిగిస్తుంది.

**37వ పద్యం :**

ఉ ॥ **ఉత్తమమధ్యమాధమనియోగ్యత బుద్ధి నెఱింగి వారి న**
**య్యుత్తమ మధ్యమాధమ నియోగములన్ నియమించితే నరేం**
**ద్రోత్తమ ! భృత్యకోటికి ననూనముగాఁ దగు జీవితంబు లా**
**యత్తము సేసి యిత్తె దయనయ్యయి కాలము దప్పకుండగన్.**

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| నరేంద్ర ఉత్తమ | = | ఓ రాజశ్రేష్ఠ ధర్మరాజా ! |
| ఉత్తమ, మధ్యమ, అధమ | = | ఉత్తమ, మధ్యమ, అధమ స్థానాలలో |
| నియోగ్యత | = | నియమించదగిన వ్యక్తుల యోగ్యతను |
| బుద్ధిని + ఎఱింగి | = | వారిని బుద్ధితో గ్రహించి |
| వారిన్ | = | ఆ ఉత్తములైన |
| అయ్యుత్తమ మధ్యమ | = | మధ్యమమైన |
| అధమ | = | అధమములైన |
| నియోగములన్ | = | ఉద్యోగాలలో |
| నియమించితివి + ఏ | = | నియమించావు కదా ! |
| భృత్య కోటికిన్ | = | సేవకుల, సమూహానికి |
| అనూనముగాన్ | = | కొరత లేకుండా |
| తగు జీవితంబులు | = | తగిన జీతాలను |
| దయన్ | = | దయతో |

| | | |
|---|---|---|
| ఆ + అయి, కాలము | = | ఆయా సమయము |
| తప్పక + ఉండగన్ | = | దాటి పోకుండా |
| ఆయత్తము + చేసి | = | సిద్ధము చేసి |
| ఇచ్చుదువు + ఎ | = | ఇస్తున్నావు కదా ! |

**తాత్పర్యం :**

ఓ ధర్మరాజా ! వ్యక్తుల యొక్క ఉత్తమ, మధ్యమ, అధమ యోగ్యతలను తెలుసుకొని ఉద్యోగాల్లో నియమించావు కదా ! సేవకులు అందరికీ కొరత లేకుండా తగిన జీతాలు, దయతో సకాలంలో అందజేస్తున్నావు కదా !

**53వ పద్యం :**

**చం ॥ బహుధనధాన్య సంగ్రహము బాణశరాసయోధవీరసం**
**గ్రహము నిరంతరాతదకంబులు ఘాసరసేంధనౌఘసం**
**గ్రహము సనేకయంత్రములుఁ గల్గి యసాధ్యములై ద్విషద్భయా**
**వహులగుచుండ నొప్పునె భవత్పరిక్ష్యములైన దుర్గముల్.**

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| భవత్, పరిరక్ష్యములు + ఐన | = | నీ చేత, రక్షింపబడుతున్నవైన |
| దుర్గముల్ | = | కోటలు |
| బహు | = | ఎక్కువగా |
| ధనధాన్య | = | ధనమునూ, ధాన్యములనూ |
| సంగ్రహము | = | నిల్వచేయడం |
| బాణశరాసన యోధవీర సంగ్రహము | = | బాణ, ధనస్సుల, యుద్ధవీరుల యొక్కయూ |
| నిరంతర + అంతః + ఉదకంబులు | = | ఎప్పుడూ లోపల వుండే నీళ్ళు కలవియునూ |
| ఘాస | = | పశువులకు, మానవులకు వంటివియునూ |
| రస | = | వివిధమైన పానీయములునూ |
| ఇంధన | = | వంట కట్టెల |
| ఓఘ | = | సమూహం యొక్క |
| సంగ్రహమున్ | = | కూడికయూ |
| అనేక యంత్రములన్ | = | అనేకమైన యంత్రములునూ |
| కలిగి | = | కలిగియుండి |
| ద్విషత్ | = | భేదించడానికి శక్యము కానివై, శత్రువులకు |
| భయ | = | భయమునూ |
| ఆవహులు + అగుచున్ | = | కలిగించేవి అయి |
| ఉండన్ + ఒప్పునె | = | ఉండి ఉన్నాయి కదా. |

**తాత్పర్యం :**

ఓ ధర్మరాజా ! నీ రక్షణలో ఉన్న కోటలన్నీ, ఎక్కువగా ధన్యధాన్యాలను, ధనుర్బాణాలను, యుద్ధవీరుల్నీ, ఎల్లప్పుడూ తరగని నీళ్ళనూ, పశువులకు గడ్డినీ, వివిధ పానీయాలను వంట కట్టెలనూ, సమృద్ధిగా కలిగి అనేక యంత్ర సాధనాలతో కూడి, శత్రుభయంకరాలై ఒప్పుతున్నాయి గదా !

**54వ పద్యం :**

చం ॥ వదలక బుద్ధి నంతరరివర్గము నోర్చి జితేంద్రియుడవై
మొదలన దేశకాలబలముల్ మఱి దైవబలంబుఁ గల్గి భూ
విదితబలుండవై యహితవీరుల నోర్వఁగ నుత్సహింతె దు
ర్మదమలినాంధ చిత్తులఁ బ్రమత్తుల నింద్రియనిర్జితాత్ములన్.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| వదలక | = | విడువక |
| బుద్ధిన్ | = | నీ బుద్ధిబలము చేత |
| అంతః+అరి, వర్గమున్ | = | నీలోపల వున్న శత్రు సమూహాన్ని |
| ఓర్చి | = | జయించి |
| జితేంద్రియుండవై | = | జయించిన ఇంద్రియాలు కలవాడవై |
| మొదలన | = | మొదటనే |
| దేశకాలబలముల్ | = | దేశమునూ, కాలమునూ, బలమునూ |
| మఱి | = | అంతేకాకుండా |
| దైవబలంబున్ | = | దైవము యొక్క బలమును |
| కలిగి | = | కలిగియుండి |
| భూ, విదిత, బలుండవు + ఐ | = | ప్రపంచంలో తెలియబడిన బలము కలవాడవై |
| దుర్మద | = | మితిమీరిన గర్వము అనే |
| మలిన + అంధ | = | మాలిన్యము చేత గ్రుడ్డిదైన |
| చిత్తులన్ | = | బుద్ధి కలవాళ్ళనూ |
| ప్రమత్తులన్ | = | బాగా మదించిన వాళ్లనూ |
| ఇంద్రియ | = | ఇంద్రియాల చేత |
| నిర్జిత | = | జయింపబడిన |
| ఆత్ములన్ | = | బుద్ధి కలవాళ్లనూ |
| అహిత, వీరులన్ | = | శత్రువీరులనూ |
| ఓర్వగన్ | = | జయించడానికి |
| ఉత్సహింతె | = | ఉత్సాహపడుతున్నావు కదా ! |

**తాత్పర్యం :**

దేశకాల బలాలను, దైవబలాన్ని ముందుగా పొంది, బుద్ధిబలముతో, అంతశ్శత్రువులయిన కామక్రోధాలను, ఇంద్రియాలను జయించి ప్రపంచ ప్రసిద్ధిగల బలవంతుడవై, మితిమీరిన మదము అనే మాలిన్యముతో గ్రుడ్డిదైన మనస్సు కలవాళ్ళు, మిక్కిలి మత్తెక్కినవాళ్ళు, ఇందియాలకు వశమైన శత్రువులను జయించాలన్న ఉత్సాహముతో ఉన్నావు కదా !

## 2.3 సందర్భసహిత వ్యాఖ్యలు :

### 1. పంచితె నీవు వారిదైన నేర్పెఱింగి

**కవి పరిచయము :**

ఈ వాక్యము నన్నయ మహాకవిచే రచింపబడిన ఆంధ్రమహాభారతము నందలి సభాపర్వములోని ప్రథమాశ్వాసము నుండి గ్రహించిన రాజనీతి అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

ధర్మరాజు సభకు, నారద మహర్షి వచ్చాడు. నారదుడు ధర్మరాజును రాజనీతి విషయాలను కొన్నింటిని గూర్చి ప్రశ్నించాడు. ధర్మరాజు నందే మనస్సును నిలిపి, చేయదలచిన రాజకార్యాలను స్వబుద్ధితో, ఎల్లప్పుడూ అర్థరాత్రి దాటిన తర్వాతనే ఆలోచిస్తున్నావు కదా ! అని నారదుడు ధర్మరాజును ప్రశ్నించిన సందర్భంలోని వాక్యమిది.

**అర్థం :**

నీవు, వారికి సంబంధించిన సామర్థ్యాన్ని తెలుసుకొని నియమించావు కదా !

**వ్యాఖ్య :**

వారి శక్తిసామర్థ్యాలను చక్కగా తెలుసుకొన్న తర్వాతనే రాజు ప్రభుత్వ ఉద్యోగులను స్థిరంగా నియమించాలని నారదుడు ధర్మరాజునకు తెలిపాడు.

### 2. ఏమఱకుండునె నిజకృత్యముల నెప్పుడును సమబుద్ధిన్.

**కవి పరిచయము :**

ఈ వాక్యము నన్నయ మహాకవిచే రచింపబడిన ఆంధ్రమహాభారతము నందలి సభాపర్వములోని ప్రథమాశ్వాసము నుండి గ్రహించిన రాజనీతి అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

ధర్మరాజు సభకు, నారదమహర్షి వచ్చి ధర్మరాజును కొన్ని రాజనీతి విషయాలను గూర్చి ప్రశ్నించాడు. యాజ్ఞికుడు తన కర్తవ్యాలను మరువకుండా ఉన్నాడా ? అని ధర్మరాజును నారదుడు ప్రశ్నించిన సందర్భంలోనిది.

**అర్థం :**

ఎల్లప్పుడూ రాగద్వేషములు లేని సమబుద్ధితో తాను చెయ్యదగిన పనులలో మఱుపు లేకుండా ఉన్నాడు కదా!

**వ్యాఖ్య :**

ధర్మరాజు నియమించిన యాజ్ఞికుడు సమబుద్ధితో తన కర్తవ్యాలను మరువకుండా ఉన్నాడా ? లేడా ? అని నారదుడు ధర్మరాజును ప్రశ్నించాడు.

**3. ధనమెట్టి వారికింగడు కొనిచేయకుండెనె జగన్నుత గర్వము దుర్విమోహమున్.**

**కవి పరిచయము :**

ఈ వాక్యము నన్నయ మహాకవిచే రచింపబడిన ఆంధ్రమహాభారతము నందలి సభాపర్వములోని ప్రథమాశ్వాసము నుండి గ్రహించిన రాజనీతి అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

ధర్మరాజు సభకు నారదుడు వచ్చి ధర్మరాజునకు రాజనీతి విషయాలను కొన్నింటిని గూర్చి ప్రశ్నిస్తూ, ధనము ఎటువంటి వాళ్ళకు అయినా దురాశను, గర్వాన్ని కల్గించకుండా ఉండదు అని, నారదుడు ధర్మరాజునకు చెప్పిన సందర్భంలోనిది.

**అర్థం :**

లోకముచే కీర్తింపబడే ఓ ధర్మరాజా ! ధనము ఎటువంటి వారికైనా పూని, గర్వాన్ని, దురాశను కల్గించకుండా ఉంటుందా ?

**వ్యాఖ్య :**

ధర్మరాజు చేత నియమించబడిన మంత్రి ఎవరైనా ఇతర రాజపుత్రులతో కలిసి ధర్మరాజుకు వ్యతిరేకంగా ఉండడం లేదు కదా ! అని నారదుడు ధర్మరాజుకు గుర్తు చేశాడు.

**4. అవశ్యము నేగ్గొనరించు నతడు శక్రుండైనన్.**

**కవి పరిచయము :**

ఈ వాక్యము నన్నయ మహాకవిచే రచింపబడిన ఆంధ్రమహాభారతము నందలి సభాపర్వములోని ప్రథమాశ్వాసము నుండి గ్రహించిన రాజనీతి అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

ధర్మరాజు సభకు నారదుడు వచ్చి ధర్మరాజును కొన్ని రాజనీతి విషయాలను గూర్చి ప్రశ్నించాడు. ధర్మరాజు తన సేవకులకు కొరత లేకుండా తగిన జీతాలను సకాలంలో ఇస్తున్నాడా ? అని ప్రశ్నించాడు. తాము పొందవలసిన సమయములో జీతాన్ని పొందక ఉండిన సేవకుల దారిద్ర్య దుఃఖాలు అతడు దేవేంద్రుడు అయినా సరే అతనికి తప్పక నేడు కల్గిస్తాయి అని నారదుడు ధర్మరాజును హెచ్చరించిన సందర్భంలోనిది.

**అర్థం :**

అతడు దేవేంద్రుడు అయినా సరే తప్పక కీడును కల్గిస్తాయి.

**వ్యాఖ్య :**

ప్రభువు నుండి సకాలంలో జీతాన్ని పొందకుండా బాధపడే సేవకుల దారిద్ర్య సుఖదుఃఖాలు ఆ సేవకుల ప్రభువునకు తప్పక కీడును కల్గిస్తాయి. నారదుడు ధర్మరాజును హెచ్చరించాడు.

5. కృతము దలంచి ప్రాణములు విడుతురనిన్

**కవి పరిచయం :**

ఈ వాక్యము నన్నయ మహాకవిచే రచింపబడిన ఆంధ్రమహాభారతము నందలి సభాపర్వములోని ప్రథమాశ్వాసము నుండి గ్రహించిన రాజనీతి అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

నారదుడు ధర్మరాజు సభకు వచ్చి ధర్మరాజును కొన్ని విషయాలను గూర్చి ప్రశ్నిస్తూ మంచి సేవకులను సన్మానిస్తే నీ కోసం యుద్ధరంగంలో ప్రాణాలు ఇస్తారు అని నారదుడు ధర్మరాజుతో చెప్పిన సందర్భంలోనిది.

**అర్థం :**

చేసిన ఉపకారాన్ని తలచుకొని యుద్ధంలో ప్రాణాలు ఇస్తారు.

**వ్యాఖ్య :**

సేవకులు, రాజుకు చేసిన ఉపకారాన్ని తలచుకొని రాజు వారిని సన్మానిస్తే ఆ రాజుకోసం యుద్ధంలో తమ ప్రాణాలను కూడా ఇస్తారని నారదుడు చెప్పాడు.

6. అనుపవుగా రాజకార్య భారముదాల్పన్

**కవి పరిచయం :**

ఈ వాక్యము నన్నయ మహాకవిచే రచింపబడిన ఆంధ్రమహాభారతము నందలి సభాపర్వములోని ప్రథమాశ్వాసము నుండి గ్రహించిన రాజనీతి అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

దొంగలను, స్నేహానికి యోగ్యులుకాని వారినీ, శత్రువుల విషయమై పక్షపాతము కలవారినీ, ధైర్యము కలవారినీ దుర్మార్గులను, రాజ్యకార్యాలు నిర్వహించడానికి నీవు పంపడం లేదు కదా ! అని ధర్మరాజును నారదుడు ప్రశ్నించిన సందర్భంలోనిది.

**అర్థం :**

రాజకార్యాలు నిర్వహించడానికి నీవు పంపడం లేదు కదా !

**వ్యాఖ్య :**

ధనము పట్ల లోభము కలవారు, దొంగలు, స్నేహం చేయడానికి యోగ్యత లేనివారు, ధైర్యంలేనివారు, శత్రువుల పట్ల పక్షపాతం కలవారు, దుర్మార్గులు, రాజకార్యాలు నిర్వర్తించడానికి తరగని నారదుడు ధర్మరాజునకు గుర్తుచేశాడు.

7. ఋణములిత్తె యుత్తమ బుద్ధిన్

**కవి పరిచయం :**

ఈ వాక్యము నన్నయ మహాకవిచే రచింపబడిన ఆంధ్రమహాభారతము నందలి సభాపర్వములోని ప్రథమాశ్వాసము నుండి గ్రహించిన రాజనీతి అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

నారదుడు ధర్మరాజు సభకు వచ్చి, రాజ్యపాలన విషయంలో ధర్మరాజునకు వర్తకులకు నూటికి ఒక రూపాయి వంతులు వడ్డీకి ఋణములు ఇవ్వాలని చెప్పాడు. ఆవిధంగా వర్తకులకు ఋణాలు ఇస్తున్నావా ? లేదా ? అని ధర్మరాజును నారదుడు ప్రశ్నించిన సందర్భంలోని వాక్యమిది.

**అర్థం :**

కొరత లేకుండా గొప్పబుద్ధితో ఋణాలు వర్తకులకు ఇస్తున్నావా ?

**వ్యాఖ్య :**

సంక్షేమ రాజ్యంలో ప్రజలకు రాజు సాయం చేయాలి. వర్తకులకు పెట్టుబడి కోసం, రాజు తక్కువవడ్డీకి వారికి ఋణాలు ఇవ్వాలి. ధర్మరాజు అలా వర్తకులకు ఋణాలు ఇస్తున్నాడా ? లేదా అని నారదుడు ధర్మరాజును ప్రశ్నించాడు.

**8. శత్రునైనను సంగర రంగమునఁగాతె శరణంబనినన్.**

**కవి పరిచయం :**

ఈ వాక్యము నన్నయ మహాకవిచే రచింపబడిన ఆంధ్రమహాభారతము నందలి సభాపర్వములోని ప్రథమాశ్వాసము నుండి గ్రహించిన రాజనీతి అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

శరణువేడిన ఎంత పెద్ద శత్రువునయినా, నీవు యుద్ధభూమిలో కాపాడుతున్నావా ? అని ధర్మరాజును నారదుడు ప్రశ్నించిన సందర్భంలోనిది.

**అర్థం :**

రక్షించు అని కోరితే, యుద్ధరంగంలో నీవు రక్షిస్తున్నావా ?

**వ్యాఖ్య :**

ఎదుటివ్యక్తి తనతో యుద్ధం చేయలేక, తన్ను రక్షించమని కోరితే అతడు ఎంతటి పెద్ద శత్రువయినా, అతడిని రక్షించాలి. అలాగే శత్రువు శరణు కోరితే, నీవు రక్షిస్తున్నావా ? అని ధర్మరాజును నారదుడు ప్రశ్నించాడు.

**9. కొలువుండుదె లోకమెల్లఁగొని యాడంగన్.**

**కవి పరిచయం :**

ఈ వాక్యము నన్నయ మహాకవిచే రచింపబడిన ఆంధ్రమహాభారతము నందలి సభాపర్వములోని ప్రథమాశ్వాసము నుండి గ్రహించిన రాజనీతి అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

ఇష్టులైన మంత్రులు, బంధువులు, సైన్యాధిపతులు, రాకుమారులు, పండితులు, ఎక్కువమంది సభలో కూర్చుండగా రాజు ప్రతినిత్యమూ, కొలువు తీరాలని నారదుడు ధర్మరాజుకు చెప్పిన సందర్భంలోనిది.

**అర్థం :**

ప్రపంచము అంతా ప్రశంసించే విధంగా కొలువుతీరి ఉంటున్నావు కదా !

వ్యాఖ్య :

రాజు ప్రతినిత్యమూ కొలువు తీరాలి ఆ కొలువు కూటంలో మంత్రులూ, బంధువులు, సేనానాయకులు మొదలయిన వారు ఎక్కువగా కూర్చొని ఉండాలి. అలా రాజు పరిశీలిస్తే, సభ తీరిస్తే, లోకమంతా ఆ రాజును పొగుడుతుందని నారదుడు ధర్మరాజుకు చెప్పాడు.

**10. వార్తయందు జగము వర్తిల్లుచున్నది**

**కవి పరిచయం :**

ఈ వాక్యము నన్నయ మహాకవిచే రచింపబడిన ఆంధ్రమహాభారతము నందలి సభాపర్వములోని ప్రథమాశ్వాసము నుండి గ్రహించిన రాజనీతి అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

నారదుడు ధర్మరాజు సభకు వచ్చి వార్త యొక్క ప్రాముఖ్యాన్ని గూర్చి ధర్మరాజుకు చెప్పాడు. ప్రపంచమంతా వార్త నడుస్తోందని అది లేకపోతే ప్రజలు అందరూ పెద్దచీకటిలో మునిగినట్లే అనీ, అందువల్ల ప్రభువులు వార్తను నడపాలి అని నారదుడు ధర్మరాజుతో చెప్పిన సందర్భంలోనిది.

**అర్థం :**

ప్రపంచము అంతా వార్త మీదనే నడుస్తోంది.

**వ్యాఖ్య :**

ప్రభువులు వార్తలు సేకరించి, దేశంలో అందరికీ అవి తెలిసేటట్లు వాటిని ప్రసారం చెయ్యాలని, నారదుడు ధర్మరాజునకు వార్త యొక్క ప్రాముఖ్యాన్ని వివరించి చెప్పాడు.

**2.4 సంగ్రహ సమాధాన ప్రశ్నలు :**

**1) ఉద్యోగుల పట్ల రాజు వ్యవహరించవలసిన తీరును తెలపండి.**

- రాజు ప్రభుత్వ ఉద్యోగాలలో యోగ్యులయిన వారిని, శక్తిసామర్థ్యాలను గుర్తించి గౌరవంగా, స్థిరంగా నియమించాలి.
- పుణ్యాత్ములు, శాస్త్ర నియమాలు తెలిసినవారు రాజుపై ప్రేమగలవారు అయిన బ్రాహ్మణోత్తములను మంత్రులుగా నియమించాలి.
- యజ్ఞాలు చేయించుటలో నిపుణుడైన యాజ్ఞికుణ్ణి రాజు నియమించుకోవాలి.
- పన్నులు వసూలు చేయడం వంటి రాజకార్యాలలో, పరిశుద్ధులైన వారిని, నీతిమార్గంలో నడుచుకోలేనివారిని రాజు నియమించాలి.
- సేవకులు అందరికీ కొరత లేకుండా రాజు సకాలంలో జీతాలు ఇవ్వాలి.
- వంశపారంపర్యంగా వచ్చే మంచి సేవకులను ప్రీతితో రాజు సన్మానాలు చేయాలి.
- ధనము పట్ల, దురాశ గలవారినీ, దొంగలనూ, ధైర్యము లేనివారిని, దుర్మార్గులను, రాజకార్యాలు నిర్వహించడానికి రాజు పంపరాదు.

**2. సైనికుల పట్ల రాజు వ్యవహారం :**

1. అనేక విధాలయిన యుద్ధాలలో విజయాన్ని సాధించడంలో నేర్పుగలవారినీ, పరాక్రమం కలవారినీ, విశ్వాసపాత్రులను, గౌరవానికి అర్హులయిన వారిని రాజు సైన్యాధ్యక్షులుగా నియమించాలి.
2. రాజుకోసం యుద్ధంలో మరణించిన వీరసైనికుల కుటుంబాలకు, వారికి తిండికీ, బట్టకు లోటు లేకుండా ఇచ్చి, రాజు వారిని పోషించాలి.
3. డబ్బు పట్ల లోపబుద్ధి కలవారిని, శత్రువుల పట్ల పక్షపాతం కలవారినీ, ధైర్యము చాలనివారినీ, దుర్మార్గులనూ రాజకార్యాలు నిర్వహించడానికి రాజులు పంపరాదు.
4. వంశపారంపర్యంగా కొలువు చేస్తున్న సేవకులకు సన్మానం చేయాలి. అలాచేస్తే రాజు చేసిన ఉపకారాన్ని స్మరించి ఆ రాజు కోసం వారు తమ ప్రాణాలు ఇస్తారు.

**శత్రువుల పట్ల రాజు వ్యవహారం :**

1. భయముతో ఏడుస్తూ శరణు కోరిన శత్రువులను యుద్ధభూమిలో కాపాడాలి.
2. రాజు జాగ్రత్తగా గమనిస్తూ వెలుపల, లోపల ఉండే శత్రువుల నుండి తన్ను తాను రక్షించుకుంటూ శత్రురాజుల ప్రవర్తనను, గూఢాచారుల కళ్ళ ద్వారా తెలుసుకోవాలి.
3. రాజు అంతశ్శత్రువులయిన కామక్రోదాదులను జయించి, మహాబలవంతుడై శత్రువులను జయించాలని ఉత్సాహం కలిగివుండాలి.
4. రాజు తాను శత్రువుల మీద దండెత్తి వెళ్ళడానికి ముందే బలవంతులయిన శత్రురాజులపై సామాది చతుర్విధోపాయాలనూ ప్రయోగించాలి.
5. రాజుకు, విజయకారణము రహస్యాలోచనము, ఆ రహస్యాలోచనము రాజు ప్రజలకు తెలియకుండా కాపాడుకోవాలి.
6. తనకు మేలు చేసిన వ్యక్తిని రాజులు పదిమంది ఉన్న సభలలో ఉచితరీతిగా సత్కరించాలి.

**3. రాజులు చేయకూడని దోషాలు తెలపండి.**

1) నాస్తికత
2) అసత్యము పలకడం
3) ఏమరపాటు
4) సోమరితనం
5) ఆలస్యముగా పనిచేయడం
6) జ్ఞానులను గుర్తించకపోవడం
7) అతికోపము
8) శుభకార్యాలు చేయకపోవడం
9) చేయవలసిన పనిని గూర్చి అతిదీర్ఘంగా ఆలోచించడం
10) ఇంద్రియ సుఖాల్లో లగ్నమవ్వడం అనే రాజదోషాలను రాజు చేయకూడదు.

**వ్యాసరూప ప్రశ్నలు :**

**1) నారదుడు ధర్మరాజుకు చెప్పిన రాజనీతిని సంగ్రహంగా తెలపండి.**

రాజు తన పాలనను సజావుగా సాగాలంటే ఈ క్రింది విషయాలపై దృష్టి సారించాలి.

- రాజు ధర్మమునందే తన మనస్సును నిలిపి, చేయవలసిన రాజ్యకార్యాలను స్వబుద్ధితో అర్థరాత్రి దాటిన తర్వాతనే ఆలోచించాలి.
- ప్రభుత్వోద్యోగాలల్లో యోగ్యులను, శక్తిసామర్థ్యాలను గుర్తించి నియమించాలి. పుణ్యాత్ముల్ని, శాస్త్రవిధి తెలిసినవారిని, రాజుపై ప్రేమకలవారిని తనకు మంత్రులుగా, వంశపారంపర్య బ్రాహ్మణులను ఏర్పరచుకోవాలి.
- ప్రజల చెవినపడకుండా రహస్యాలోచనను రక్షించుకోవాలి.
- వ్యక్తుల యోగ్యతను గుర్తించి, ఉత్తమ, మధ్యమ, అధమ ఉద్యోగాలలో ఆ వ్యక్తులను నియమించాలి.
- సేవకులకు తగిన జీతాలను సకాలంలో ఇవ్వాలి. మంచి సేవకులకు తగిన సత్కారం చేయాలి. రాజకార్యభారం వహించేందుకు యోగ్యులను పంపాలి. రాజు ప్రతిదినము మంత్రులతో, సైన్యాధిపతులతో, రాజకుమారులతో, పండితులలో కొలువు తీరాలి.
- అనేకయుద్ధాలలో విజయాలు సాధించిన నిపుణులను, మంచి పరాక్రమం కలవారిని, నమ్మకస్తులను, సేనాధ్యక్షులుగా నియమించుకోవాలి.
- రాజు తనకు వచ్చే ఆదాయంలో నాల్గవవంతుగాని, మూడవవంతుగాని సగభాగం మించి ఖర్చు పెట్టరాదు.
- రాజు వార్తను నిర్వహించాలి.
- సేవకులకు తగిన జీతాలు సకాలంలో ఇవ్వాలి. మంచి సేవకులకు తగిన సత్కారం చేయాలి.
- రాజు, తన రక్షణలోని కోటలలో ధనధాన్యాలను, ధనుర్బాణాలను, యుద్ధవీరుల్ని, నీటిని, వంటకట్టెలను సమృద్ధిగా సమకూర్చుకోవాలి.
- రాజు శత్రువులపై దండెత్తడానికి ముందే, శత్రురాజుల ముందే శత్రురాజుల మీద సామదానభేద దండోపాయాల్ని ప్రయోగించాలి.
- రాజు పదునాలుగు రాజదోషాలను విడిచిపెట్టాలి.

**2. ఉద్యోగుల నియామకంలో రాజులు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి.**

ఉద్యోగుల నియామకంలో రాజులు తీసుకోవలసిన జాగ్రత్తలను గూర్చి నారదుడు ధర్మరాజుకు ఇలా చెప్పాడు.

ప్రభుత్వోద్యోగాలలో యోగ్యులయిన వారిని, వారి శక్తిసామర్థ్యాలను గుర్తించి, రాజు గౌరవభావంతో స్థిరంగా నియమించాలి.

**మంత్రులు - అర్హతలు :**

పుణ్యాత్ములు, శాస్త్రజ్ఞులూ, రాజుపై ప్రేమగలవారూ, వంశపారంపర్యంగా కొలువు చేస్తున్నవారు అయిన ఉత్తమ బ్రాహ్మణులను రాజులు మంత్రులుగా నియమించుకోవాలి.

**పురోహితులు - అర్హతలు :**

ధైర్యవంతుడూ, ధర్మాధర్మాలు తెలిసినవాడూ, వివిధ వేదశాస్త్రాలు బాగా చదువుకొన్నవాడూ, సర్వస్వతీ స్వరూపుడు అయిన వ్యక్తిని పురోహితునిగా రాజులు నియమించాలి.

**యాజ్ఞికులు :**

యాజ్ఞికుడు, యజ్ఞాన్ని చేయించడంలో నిపుణుడయివుండాలి.

**సేనాధ్యక్షులు :**

అనేకవిధాలైన యుద్ధాలలో విజయాన్ని సాధించడంలో నిపుణులు, ఎదిరించ సాధ్యంకాని పరాక్రమం కలవారు, రాజునకు విశ్వాసపాత్రులయిన వారు, రాజుగారి మేలుకోరేవారూ అయిన వారిని రాజులు సేనాధ్యక్షులుగా నియమించాలి.

**ఆయుర్వేద వైద్యులు :**

ఆయుర్వేద వైద్యంలో సమర్థులయిన వైద్యులను నియమించుకోవాలి.

**ఉద్యోగులు :**

పన్నులు వసూలు చేసేటటువంటి ఉద్యోగులుగా ధర్మపరీక్షచే పరిశుద్ధులయిన వారు, పాపములేని బుద్ధికలవారూ నీతిమార్గంలో నడిచేవారూ అయిన యోగ్యులను, రాజు చక్కగా పరీక్షించి నియమించాలి.

ధనముపట్ల లోభబుద్ధి కలవారినీ, దొంగలనూ, స్నేహానికి యోగ్యులు కానివారినీ, శత్రువులపై పక్షపాతం కలవారినీ, ధైర్యంచాలని వారినీ, దుర్మార్గులనూ, రాజకార్యాలు చేయడానికి రాజు పంపరాదు.

ఆయుధశాలలు, ధనాగారాలు, అశ్వశాలలు, గజశాలలు, కోశాగారాలు అనే వాటి పాలనలో ఎంతో నమ్మదగిన వారినీ, సమర్థులయిన వారినీ, ఉద్యోగులుగా రాజు నియమించాలి.

ఈవిధముగా రాజు సమర్థులయిన ఉద్యోగులను నియమించడంలో జాగ్రత్తలు తీసుకోవాలి.

**3. ప్రజాపాలనలో రాజు పాటించవలసిన ధర్మాలేవి ?**

**రాజులు - ప్రజాపాలన :**

- రాజులు తమ సేవకులకు, సకాలంలో జీతాలు ఇవ్వాలి.
- రాజులు వంశపారంపర్యంగా వచ్చే మంచి సేవకులకు, ప్రీతితో సమ్మానములు చేయాలి.
- రాజుకోసం యుద్ధంలో మరణించిన వీరసైనికుల కుటుంబాలకు లోటులేకుండా ఆ కుటుంబాలను పోషించాలి.
- ధనముపట్ల లోభ బుద్ధికలవారినీ, దొంగలనూ, ధైర్యము చాలని వారినీ, దుర్మార్గులనూ, రాజ్యకార్యనిర్వహణకు, రాజులు పంపరాదు.
- రాజు, రాజ్యాన్ని దొంగల భయము లేకుండా పాటించాలి.
- రాజు ప్రజలకు అనావృష్టివల్ల భయము లేకుండా, చెరువులు త్రవ్వించి వాటిని నిండుగా నీటితో నింపాలి.
- రాజు ఉదారబుద్ధితో పేదరైతులకు ధాన్యపు విత్తనాలను, వర్తకులకు నూటిక ఒక రూపాయి వంతున అప్పులనూ ఇవ్వాలి.

- రాజులు కుంటివారినీ, మూగవారినీ, గ్రుడ్డివారినీ, అంగవిహీనులయిన వారినీ, బంధువులు లేనివారినీ దయతో పోషించాలి.
- రాజులు తమకు మేలు చేసిన వారి మేలును గుర్తించి, ఆ మేలు చేసిన వ్యక్తిని పదిమంది పెద్దలు వున్న సభలలో ఉచితరీతిగా సత్కరించాలి.
- రాజు తమకు వచ్చిన ఆదాయంలో నాల్గవ వంతుగానీ, మూడవవంతుగానీ సగాన్ని మాత్రమే ఖర్చు చేయాలి.
- ప్రజలు ప్రశంసలు పొందే విధంగా రాజులు తమ గురువులనూ, వృద్ధ శిల్పులనూ, గొప్ప వ్యాపారులనూ, బంధువులనూ, ఆశ్రితులనూ, సజ్జనులనూ, వారికి పేదరికం రాకుండా దయతో పోషించాలి.
- రాజులు నిత్యమూ తన మంత్రులు, బంధువులూ, సైన్యాధిపతులు, రాజకుమారులు సభలో వారితో కొలువు తీరాలి.
- రాజు జాగ్రత్తగా గమనిస్తూ తనకు వెలుపల, లోపల వుండి శత్రువుల నుండి తాను రక్షించుకోవాలి.
- రాజులు తమ కోటలలో ఆహారపదార్థాలను సమృద్ధిగా నిల్వచేసుకోవాలి.

పై విధంగా రాజుల ప్రజాపాలనలో ధర్మాలను పాటించాలి.

**వ్యాకరణాంశాలు :**

**క్రింది సంధిగత రూపాలను విడదీసి వ్యాకరణకార్యాలు తెలపండి.**

1. దేవోత్తములు = దేవ + ఉత్తములు - గుణసంధి

   సూత్రం : అకారమునకు ఇ, ఉ, ఋ లు పరమగునప్పుడు క్రమముగా ఏ, ఓ, అర్‌లుగా మారుతాయి.

2. ధర్మార్థములు = ధర్మ + అర్థములు - సవర్ణదీర్ఘసంధి

   సూత్రం : అ, ఇ, ఉ, ఋ లకు అవే అచ్చులు పరమైతే సవర్ణదీర్ఘంబులు ఏకాదేశంబగు.

3. రాజాన్వయము = రాజు + అన్వయము - సవర్ణదీర్ఘ సంధి

   సూత్రం : అ, ఇ, ఉ, ఋ లకు అవే అచ్చులు పరమైతే సవర్ణదీర్ఘంబులు ఏకాదేశంబగు.

4. జగన్నుతుడు = జగత్ + నుతుడు - అనునాసిక సంధి

   సూత్రము = కచటతప వర్ణాక్షరాలకు న, మ లు పరమైతే ఆయా అనునాసికములుగా మారుతాయి.

5. వృద్ధోపసేవ = వృద్ధ + ఉపసేవ - గుణసంధి

6. జితేంద్రియుడు = జిత్ + ఇంద్రియుడు - గుణసంధి

7.. నరేంద్రోత్తముడు = నర + ఇంద్ర + ఉత్తముడు - గుణసంధి

   సూత్రము = అకారమునకు ఇ, ఉ, ఋ లు పరమైతే, క్రమముగా ఏ, ఓ, ఆర్‌లు ఆదేశముగా వస్తాయి.

8. అయ్యాయికాలము = ఆ + అయి + కాలము - యగాగమసంధి

   సూత్రం = సంధిలేనిచోట స్వరంబు కంటే పరంబయిన స్వరంబునకు యడాగమంబగు.

9. పెంపడరు = పెంపు + అడరు - ఉత్వసంధి

10. వికలాంగులు = వికల + అంగులు - సవర్ణదీర్ఘసంధి

11. మహీశులు = మహీ + ఈశులు - సవర్ణదీర్ఘసంధి

12. ఆయుధాగారం = ఆయుధ + అగారం - సవర్ణదీర్ఘసంధి

సూత్రం ః అ, ఇ, ఉ, ఋ లకు అవే అచ్చులు పరమైతే సవర్ణదీర్ఘంబులు ఏకాదేశంబగు.

13. అభ్యంతరము = అభి + అంతరము - యణాదేశసంధి

సూత్రం = ఇ, ఉ, ఋ లకు అసవర్ణాచ్చుల పరంబగుచో యవరలు ఆదేశమగును.

14. విద్వజ్జనము = విద్వత్ + జనము - శ్చుత్వసంధి

15. శతైక వృద్ధి = శత + ఏకవృద్ధి - శ్చుత్వసంధి

సూత్రము = అకారమునకు ఏ ఐ లు పరమైతే ఐకారముగా ఓ, ఔలు పరమైతే ఔ కారముగాను ఏకాదేశంబగును.

16. అగుదురుగావున = అగుదురు + కావునా - గసడదవాదేశ సంధి

సూత్రము = ప్రథమము మీద పరుషములకు గసడదవలు బహుళంబు గానగు.

విగ్రహవాక్యములను వ్రాసి, ఏ సమాసములో గుర్తించండి.

| సమాసపదము | విగ్రహవాక్యము | సమాసనామము |
|---|---|---|
| అష్టాంగము | అష్ట సంఖ్య గల అంగములు | బహువ్రీహి సమాసము |
| జితేంద్రియుడు | జయింపబడిన ఇంద్రియాలుకలవాడు | బహువ్రీహి సమాసము |
| నిర్జితాత్ములు | నిర్జిలమైన ఆత్మగలవారు | బహువ్రీహి సమాసము |
| దివ్యాంతరిక్షము | దివ్యమైన అంతరిక్షం | విశేషణ పూర్వపద కర్మధారయం |
| మూడవభాగము | మూడవదైన భాగం | విశేషణ పూర్వపద కర్మధారయం |
| సాధుజనులు | సాధువులైన జనులు | విశేషణ పూర్వపద కర్మధారయం |
| అసాధ్యము | సాధ్యము కానిది | నఞ్ తత్పురుష |
| ధనధాన్యములు | ధనమును, ధాన్యమును | ద్వంద్వ సమాసం |
| భూనుతుడు | భూమిచే నుతుడు | తృతీయా తత్పురుష |
| చోరభయము | చోరుల వలన భయము | పంచమీ తత్పురుష |
| ధనలుబ్ధులు | ధనము నందు లుబ్ధులు | సప్తమీ తత్పురుష |
| జగన్నుతుడు | జగత్తు చేత నుతుడు | తృతీయా తత్పురుష |
| ధర్మార్థకామములు | ధర్మమును, అర్థమును, కామమును | బహుపద ద్వంద్వ సమాసము |
| అపరరాత్రి | అపరము, రాత్రి | ప్రథమా తత్పురుష |
| సేవాధ్యక్షులు | సేవకు అధ్యక్షులు | షష్ఠి తత్పురుష |
| రాజపుత్రులు | రాజు యొక్క పుత్రులు | షష్ఠి తత్పురుష |

**క్రింది పద్యములలోని అలంకారాలను గుర్తించి, లక్ష్య, లక్షణ సమన్వయం చేయండి.**

కం ॥ రాజునకు విజయమూలము
రాజిత మంత్రంబు సుస్థిరంబుగ దానిన్
రాజాన్వయ, రక్షింతె ధ
రాజనులకుఁ గర్ణగోచరము గాకుండన్.

ఈ పద్యంలో వృత్త్యానుప్రాస అనే శబ్దాలంకారము ఉంది.

**లక్షణము :**

ఒకటిగానీ అంతకంటే ఎక్కువగాని హల్లులు అనేకసార్లు ఆవృత్తి అగుట వృత్త్యానుప్రాసము.

**సమన్వయము :**

పై పద్యములో ర, జ, అనే హల్లులు తిరిగి తిరిగి పెక్కుసార్లు వచ్చాయి. కావున ఇది వృత్త్యానుప్రాసము.

**కం ॥ కృత మెఱింగి కర్త నుత్తమ
మతుల సభల సుంస్తుతించి మఱవక తగు స
త్కృతి సేయుదె కృత మెఱిగెడు
పతియె జగజ్జనుల నెల్లఁ బరిపాలించున్.**

ఈ పద్యంలో అర్థాంతరన్యాసము అనే అలంకారము ఉంది.

**లక్షణము :**

సామాన్యమును విశేషముచేతగానీ, విశేషమును సామాన్యము చేతగానీ సమర్థించి చెప్పడం అర్థాంతరన్యాసం.

**విశేషవాక్యం :**

చేసిన మేలు గుర్తించి పెద్దల సభలో సత్కరించాలి అనేది విశేషవాక్యం.

**సామాన్య వాక్యం :**

చేసిన మేలును గుర్తించగల ప్రభువు లోకప్రజలను పాలించగలడు అన్నది సామాన్యవాక్యం.

ఇక్కడ సామాన్యముచే విశేషము సత్కరించబడినది. కావున ఇది అర్థాంతరన్యాసాలంకారమగును.

క్రింది పద్యపాదములను గురు, లఘు నిర్దేశ పూర్వకముగా గణవిభజన చేసి, యతి గుర్తించి ఏ పద్యపాదమో తెలపండి.

1. బండారములయందు బరమ విశ్వాసుల
భక్తుల దక్షుల బంచితయ్యె

| త | సల | నగ | భ |
|---|---|---|---|
| UUI | IIUI | IIIU | UII |
| బండార | ములయందు | బరమవి | శ్వాసుల |

| | | | |
|---|---|---|---|
| భ | భ | గల | గల |
| UII | UII | UI | UI |
| భక్తుల | దక్షుల | బంచి | తయ్యి |
| భగము (ఇం) | భగణము (ఇం) | గలము (సూ) | గలము (సూ) |

(1) ఈ పద్యపాదములో వరుసగా ఆఱు ఇంద్రగణములు, రెండు సూర్యగణాలు ఉన్నాయి. కావున ఇది సీసపద్యపాదము.

(2) యతి గుర్తింపు : సీస పద్యములో పాదము రెండు పాదములుగా విభజింపబడి రెండు యతులు ఉంటాయి. రెండు పాదాలలోనూ, మొదటి గణములోని మొదటి అక్షరానికీ ఆ పాదాలలోని మూడవ గణాద్యక్షరానికీ యతులు ఉంటాయి.

ఇక్కడ మొదటి పాదములో మొదటి గణాద్యక్షరమైన 'బం'కు, మూడవ గణంలోని మొదటి గణాద్యక్షరమైన 'బ'కు యతి రెండవ పాదములో మొదటి గణాద్యక్షరమైన 'భ'కు, మూడవ గణములోని మొదటి అక్షరమైన 'బం'కు యతి.

**డా॥ కాకాని సుధాకర్**
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,
అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ,
ఎస్.ఎస్.&ఎన్ కళాశాల,
నరసరావుపేట.

పాఠం - 3

# దక్షయజ్ఞం - నన్నెచోడుడు

## (కుమార సంభవం - ద్వితీయాశ్వాసం - 49 నుండి 86 పద్యాలు)

## కవి పరిచయం - కథా సారాంశం

**విషయసూచిక :**

**3.0** కవి పరిచయం

**3.1** పాఠ్యభాగ సందర్భం

**3.2** పాఠ్యభాగ సారాంశం

**3.3** ప్రతిపదార్థములు

**3.0 కవి పరిచయం :**

| | | |
|---|---|---|
| పాఠ్యభాగం | : | దక్షయజ్ఞం |
| కవి | : | నన్నెచోడుడు |
| పాఠ్యభాగం దేని నుండి గ్రహించబడినది | : | కుమార సంభవములోని ద్వితీయాశ్వాసము నుండి గ్రహింపబడింది. |
| కవి కాలము | : | క్రీ.శ. 12వ శతాబ్దానికి చెందినవాడని విమర్శకులు భావిస్తారు. |

నన్నెచోడుని తండ్రి పాకనాటి ప్రభువైన చోడబల్లి, తల్లి శ్రీదేవి.

మానవల్లి రామకృష్ణ కవిగారు మొదటగా ఈ కావ్యాన్ని వెలుగులోకి తెచ్చి నన్నెచోడుడు నన్నయ కంటే ప్రాచీనుడని ప్రతిపాదించారు. నన్నెచోడుడు తన "కుమార సంభవము"ను తన గురువైన జంగమ మల్లిఖార్జున యోగికి అంకితం చేశాడు. కావ్యమును అంకితమీయడం నన్నెచోడునితోనే ప్రారంభం అయ్యింది.

ఆంధ్రసాహిత్య చరిత్రలో నన్నయ తిక్కనల మధ్య కాలాన్ని "శివకవి యుగం"గా భావిస్తారు. ఈ యుగానికి చెందిన ప్రముఖకవి నన్నెచోడుడు.

నన్నెచోడుని కవిత్వంలో అలంకారాల కూర్పు, చిత్రకవిత్వము కనిపిస్తాయి. రసపోషణలో ఇతడు నేర్పరి. దేశీయమైన ఆచార వ్యవహారాలను ఇతడు "కుమార సంభవము"లో వర్ణించారు.

సంస్కృతంలో కాళిదాసు కుమార సంభవాన్ని రచించి మహాకవి అయినట్లే తెలుగులో కుమార సంభవాన్ని రచించి నన్నెచోడుడు "కవిరాజు శిఖామణి" అనిపించుకున్నాడు.

నన్నెచోడుడు మొదటగా మార్గదేశి కవితలను గూర్చి ప్రస్తావించాడు. ఈతడు "మార్గ కవిత"ను కుమార్గమన్నాడు. ఈతడు మొదటగా "జానుతెనుగు" "వస్తు కవిత" అనే పదాలు పేర్కొన్నాడు. ప్రలంధాలలో అష్టాదశ వర్ణనలకు నన్నెచోడుడే మూలపురుషుడు.

ఈ కావ్యంలో శివుడు నాయకుడు. పార్వతి నాయిక. శృంగార రసము ప్రధాన రసము. వీర రసమునూ, మిగిలిన రసములనూ ఆయా స్థలాల్లో చక్కగా వర్ణింపబడ్డాయి.

వస్తు కవిత్వము అంటే "ప్రబధ కవిత్వమే" అని వేదం వెంకటరాయశాస్త్రిగారు అన్నారు. "జాను తెనుగు" అంటే "అందమైన తెనుగు", "ఇంపు అయిన తెనుగు" అని అర్థం.

## 3.1 పాఠ్యభాగ సందర్భం :

బ్రహ్మ, ప్రపంచాన్ని సృష్టించమని దక్షప్రజాపతిని తలంచాడు. దక్షుడు "మహామాయ" అయిన ఆధారశక్తిని ఆవాహనము చేశాడు. ఆ శక్తి యొక్క వరముతో దక్షునికి ఆమె కూతురుగా "సతీదేవి" అనే పేరుతో పుట్టింది. సతీదేవి ఈశ్వరునకు భార్య అయింది. దక్షునికి శివానుగ్రహముతో యాభైమంది పుత్రికలు జన్మించారు. వారిలో పదమూడు మందిని కశ్యపునికి, పదిమందిని యమునికి మిగిలిన ఇరవై ఏడు మందిని చంద్రునకు భార్యలుగా దక్షుడు ఇచ్చాడు.

శివునకు సతీదేవి దంపతులకు "గణపతి" జన్మించాడు. దక్షుడు ఒకసారి తన కుమార్తెలనూ, అల్లుళ్ళనూ చూడాలని వారి ఇళ్ళకు వెళ్ళాడు. కశ్యపుడు, యముడు, చంద్రుడు దక్షునికి స్వాగతము పలికి దక్షుని చక్కగా గౌరవించాడు. దక్షుడు తన మొదటి అల్లుడైన శివుడిని, కూతురు సతీదేవిని చూడాలని కైలాసానికి వెళ్ళాడు. ఆ సమయంలో శివుడు తన కుమారుడైన గణపతిని ఎత్తుకొని, సంతోషముతో నవ్వుతూ సతీదేవిని కూడా నవ్విస్తున్నాడు.

దక్షుడు ఈశ్వరునికి నమస్కారం చేయలేదు. తాను మామగారనే గర్వంతో నిలబడ్డాడు. ఈశ్వరుడు దక్షుని గర్వాన్ని తిరస్కరించి, తన ముఖాన్ని ప్రక్కకు తిప్పుకున్నాడు. శివుడు దక్షుని పలకరించి గౌరవించలేదు. అల్లుడైన శివుడు తనకు మర్యాదలు చేయలేదని దక్షుడు మనస్సులో బాధపడ్డాడు. దక్షుడు శివుని అవమానించాలని ఒక గొప్ప యజ్ఞాన్ని ప్రారంభించాడు. దేవతలను అందరినీ ఆ యజ్ఞానికి పిలిచి, శివుని మాత్రం పిలువలేదు. తన ఐశ్వర్యాన్ని చూపించి, తన కూతురు సతీదేవిని ఎగతాళి చేయాలని, సతీదేవిని యజ్ఞానికి రమ్మని కొందరు స్త్రీల ద్వారా దక్షుడు ఆమెకు కబురుపెట్టాడు. సతీదేవి శివుని అనుమతి, అంగీకారాన్ని తీసుకొని దక్షుని యజ్ఞానికి వెళ్ళింది. సతీదేవికి బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుడు మొదలయిన దేవతలు అందరూ నమస్కరించారు.

బ్రహ్మాది దేవతలతోపాటు తన భర్త శివుని కూడా పిలిస్తే పరమేశ్వరుడైన శివుడు కూడా గొప్ప యజ్ఞానికి వచ్చేవాడు కదా అని సతీదేవి తన తండ్రియైన దక్షునితో అనగానే దక్షుడు శివుడు పరమేశ్వరుడు అని సతీదేవి అన్న మాటను సహించలేకపోయాడు. ఈశ్వరుడు పుట్టెలను, సర్పములను, చర్మాన్ని, ఎముకలను ధరించి, విభూతి పూసుకుంటాడు కాబట్టి అతడు యజ్ఞమునకు రావడానికి అర్హుడు కాడని, దక్షుడు సతీదేవి ఎదుట శివుని నిందించాడు.

అప్పుడు సతీదేవి శివుడు ముల్లోకములకు అధిపతి అని చెప్పింది. శివుడు యజ్ఞఫలదాత అని, శివుడు రాకపోతే దక్షుడు చేసిన యజ్ఞానికి ఫలమును ఎవరు ఇస్తారని తండ్రిని సతీదేవి అడిగింది. అప్పుడు బ్రహ్మాది దేవతలు అందరూ శివుని దయవల్లనే తాము సృష్టినీ, పరిపాలనను చేస్తున్నామని చెప్పి, శివుడే యజ్ఞఫలదాత అని నిర్ణయించారు.

శివుడు "వేదకర్త, సకల కర్మ ఫలదాత కాదు" అని దక్షుడు గర్వముతో మాట్లాడాడు. పూర్వము ఎప్పుడు మునులు, తోళ్ళు, ఎముకలు ధరించి యజ్ఞములకు రాలేదు అన్నాడు. సతీదేవి భర్తపై ప్రేమతో, భర్తపక్షాన మాట్లాడుతుంది అన్నాడు. నీచులయిన వారిని పూజనీయులు అని అనకూడదు అన్నాడు.

తండ్రి చేసిన శివధూషణకు సతీదేవి కోపించింది తన తండ్రియైన దక్షుని నిందించింది. అయినా దక్షుడు "శివుడు వేద బాహ్యుఁడు" అని, అనేక విధాలుగా శివుడిని దూషించాడు. ఈశ్వరుని మీద భయంతో, మిగిలిన దేవతలు కూడా సతీదేవి మాటను సమర్థిస్తున్నారు అన్నాడు.

సతీదేవిలో కోపాగ్ని ప్రజ్వలించింది. సతీదేవి శరీరము ఆ కోపాగ్ని జ్వాలలలో భస్మం అయ్యింది. సతీదేవికి దక్షునికి మధ్య జరిగిన వాగ్వివాదము, సతీదేవి దహన వృత్తాంతాన్ని నారదుడు శివునకు చెప్పాడు. అప్పుడు శివుడు కోపంతో విజృంభించాడు.

### 3.2 పాఠ్యభాగ సారాంశం :

సతీదేవి యోగాగ్నిలో దగ్ధమయ్యిందని నారదుడు శివునికి చెప్పాడు. దానితో సర్వలోకాలను నాశనం చేయడానికి, ప్రళయకాలంలోని ఏకాదశరుద్రులు ఆవేశాన్ని పొందినట్లుగా, కోపంతో శివుడు భయంకరమైన ఆకారాన్ని ధరించాడు. అస్త్రాల నుండి పుట్టిన నిప్పురవ్వలతో కూడిన అగ్ని, సర్పాల నోటి నుండి వచ్చే విషాగ్ని, శివుని కోపాగ్ని, శివుని ఫాలాగ్నితో కలసి అప్పుడు బ్రహ్మాండము అంతా వ్యాపించింది.

అప్పుడు శివుని వాహనమైన నంది అనే ఎద్దు వెంటనే అక్కడకు వచ్చింది. ఆ ఎద్దు పాదాల గిట్టల త్రొక్కిడికి భూమి అణగిపోయింది. ఆదిశేషుడు పిండి పిండి అయ్యాడు. సముద్రాలు పొంగి ప్రవహించాయి. కురుపర్వతాలు, ముక్కలు ముక్కలు అయ్యాయి. ఆ ఎద్దు స్వర్గాన్ని, బ్రహ్మాండాన్ని తన కొమ్ములతో పొడిచింది. అప్పుడు పుష్పదంతుడు మొదలైన ప్రమథ గణనాయకులు ఒకరినొకరు అతిశయించి, ఇలా విజృంభించారు.

"విష్ణుమూర్తిని మనము మర్దించుదామా ? బ్రహ్మను బంధిద్దామా ! ఇంద్రాదులను చంపుదామా ? దేవతలను సంహరిద్దామా ? లోకనాశనం చేయడానికి దండెత్తి పోదామా ? ఈశ్వరుడు ఎవరిమీద కోపించాడో చూడండి" అంటూ ప్రథమగణము భయంకరమైన ఆకారాలతో కలత చెందారు. ఈశ్వరుడు, దక్షునిపై కోపపడ్డాడని వారు తెలిసికొన్నారు. వారు శివుని ముందుకు వచ్చి "మహాబ్రహ్మ ప్రళయాన్ని చేయడానికి, సర్వనాశనాన్ని చేసే మహాప్రళయాన్ని ప్రారంభించడానికీ బ్రహ్మాండాన్ని ముక్కలు చేయడానికీ మేమే సరిపోతాము" అంటూ ప్రమథులు ప్రగల్భాలు పలికారు.

గణనాయకులు ఒక్కొక్కడూ ఒక్కొక్క విధంగా ఇలా అన్నారు. "బ్రహ్మాండాన్ని తూట్లుపడేలా, నేను ఛేదిస్తాను. నేను, లోకాలను సముద్రములో కలుపుతాను. మహాసముద్రాలను బ్రహ్మాండము వరకు నేను చల్లుతాను. విశ్వాన్ని, నేను ఇప్పుడే భయంకరంగా సంహరిస్తాను . నేను లోకములను కోపంతో మ్రింగుతాను. విష్ణువు మొదలయిన దేవతల గర్వాన్ని పోగొట్టి, వారిని నేను బంధించి తెస్తాను. నేనుండగా, నీవు కోపపడడం నీకు తగదు. ఎలుక మీద కోపంతో ఇల్లును కాల్చినట్లుగా దక్షుడి మీద కోపంతో, లోకాన్ని నశింపజేయాలని తలపెట్టటం నీకు తగదు. నన్ను పంపించు. దక్షుడిని బంధించి తెస్తాను" అంటూ ప్రమథ నాయకులు విజృంభించారు.

ఇలా అనేక రకాలుగా మాట్లాడుతున్న గణాధిపతులను అందర్నీ కాదని "గణపతి" ఈశ్వరునికి ఎదురుగా నిలబడి ప్రళయమేఘంలా మహాధ్వనితో ఈక్రింది విధంగా చెప్పాడు.

"ఓ ఈశ్వరా ! చిన్న పిట్ట మీద కోపంతో పాశుపతాస్త్రాన్ని సంధించడం ఎందుకు? మీవంటి గొప్పవారు కోపించవలసిన పనిలేదు. నన్ను పంపు. దక్షుడిని బంధించి తెస్తాను. ఇది నా తల్లికి జరిగిన అవమానము కాబట్టి దక్షుని బంధించి తెచ్చే పని నాకే అనుగ్రహించు" అని గణపతి శివుని వేడుకొన్నాడు.

ఈశ్వరుడు గణపతి సాహసాన్ని గుర్తించి "దక్షయజ్ఞాన్ని ధ్వంసం చేసి, దక్షుడిని బంధించి తీసుకురా" అని గణపతిని నియమించాడు.

అప్పుడు లావుగా, ఎత్తుగా ఉన్న శరీరాలు కలిగి, నాలుగు భుజాలు, నొసటిపై కన్నులు, శూలములు, పుర్రెలు, ధనుస్సులు, ఖడ్గాలు ధరించి భయంకరాకారాలతో ప్రమథనాయకులు అస్థిపంజరాలతో గణపతి దగ్గరకు వచ్చారు. దేవ

గణాలకు అధీశ్వరి అయిన మహాకాళి, శాకిన్యాది దేవతలతో కలసి అక్కడకు వచ్చింది. మహాకాళి నల్లగా ఉంది. గణపతి ఈ ప్రమథ గణాలతో కలసి దక్షుడిపై దండెత్తాడు.

ప్రమథులు యజ్ఞరక్షకులను తరిమివేశారు. యజ్ఞాన్ని చూసే వారిని నలుమూలలకు తరిమివేశారు. యజ్ఞశాలలోని వేదికలను త్రవ్వి, గుండాలను పడద్రోశారు. ఋత్విక్కులను, హోమగుండం గోతులలో పాతిపెట్టారు. యజ్ఞసహాయకులను, బలంగా చితకకొట్టారు. యజ్ఞ పర్యవేక్షకుడి మెడను నులిమి, యూప స్తంభానికి కట్టారు. పరిచారకులను బంధించి, హింసించారు. అగ్నినాలుకను రెండు చీలికలుగా చేశారు. పరిజనాన్ని నేలపై పడవేశారు. ఈవిధంగా దక్షయజ్ఞాన్ని వారు నాశనం చేసి గట్టిగా అరచారు.

అప్పుడు బ్రహ్మణులూ, దేవతలూ, ప్రమథనాయకుల విజృంభణను చూస్తూ ఉండగా, వారిలో కొందరికి పై ప్రాణాలు పైననే పోయాయి. వారిలో కొందరు భయపడి నశించారు. కొందరు భయంతో మొఱ్ఱపెట్టారు. కొందరు సేనా ముఖము నుండి తప్పుకొని, తొందరగా పారిపోయారు.

బ్రహ్మ తన హంసవాహనాన్ని ఎక్కడానికి వెళ్ళి, భయంతో నేలపైపడ్డాడు. అప్పుడు హంస, బ్రహ్మను తన నోట్లో పెట్టుకొని పరుగుపెట్టింది. విష్ణువు తన వాహనమైన గరుత్మంతుని ఎక్కి, దాని నడుమును, మెడను కాలితో, చేతితో పట్టుకుని పారిపోయాడు. ఇంద్రుడు ఐరావతాన్ని ఎక్కి పారిపోయాడు. యముడు తన వాహనమైన దున్నపోతును సరిగా ఎక్కలేక, దానిపై ఉప్పు బస్తాలా అడ్డంగాపడి పారిపోయాడు. వరుణుడి నోట్లో తడి ఆరిపోయింది. భయంతో అతడు పారిపోయాడు కుబేరుడు తన నరవాహనాన్ని ఎక్కడం మరచి, తన వాహనమైన నరుణ్ణి తానే తన భుజాన పెట్టుకుని పారిపోయాడు.

అప్పుడు ప్రజాపతులు దక్షుడిని లేకుండా దాచి, తాము బ్రహ్మాండ ఖండానికి వెళ్ళిపోయారు.

అప్పుడు ప్రమథులు అన్ని దిక్కులలోను, దక్షుడి కోసం వెతికారు. కాని వారికి దక్షుడు ఉన్నచోటు కనబడలేదు. దానితోవారు అన్నిలోకాల ప్రభువులపై దండెత్తారు. వారు లోకాలన్నింటి మీద ఒక్కసారిగా పెద్దగా అరుస్తూ దేవ, రాక్షస, నాగ గణాలను ఆక్రమించారు. వారి వీపుల చర్మాలను ఊడదీశారు. వారి మెడలో గుదిబండ కట్టి మోయించారు. వారి తలల ముందుభాగాల్ని కట్టి, కొట్టారు. వారి పెడచేతులు కట్టి వారి చర్మాలు ఊడదీశారు.

ప్రమథులు ఇంద్రుని చేతిని విరుగగొట్టారు. అతడిని క్రింద పడవేశారు. యజ్ఞపురుషుడి తలపుట్టైను ఊడగొట్టారు. భగుడి కన్నును పీకివేశారు. పూషుని ముందు పండ్లు రాలగొట్టారు. వారు కోపంతో బ్రహ్మను, విష్ణువును ఒక దగ్గరకు చేర్చి వారిని బంధించారు. దేవతలను, దిక్పాలురను, ఇంద్రాదులను అవమానపరచారు. ఈవిధంగా ప్రమథులు “దక్షుడు ఎక్కడ ఉన్నాడో చూపించండి” అని వారిని చుట్టుముట్టి దండించారు.

అప్పుడు దేవతలు మునీశ్వరులు శివద్రోహం చేసిన దక్షుడి కోసం ప్రమథగణంతో విరోధం పెట్టుకోవడం ఎందుకని, దక్షుడు ఉన్న చోటును వారిలో కొందరు వారికి కనుసన్న చేసి చూపించారు. కొందరు మాట్లాడకుండా ఉండిపోయారు. కొందరు కనబడకుండా పోయారు.

దక్షుడు భయంతో కనిపించిన వారందరికీ నమస్కరిస్తూ దాగుకొని యజ్ఞశాలలో బెదురుచూపులు చూస్తున్నాడు. వారు దక్షుడిని పట్టుకొన్నారు.

ఇదిలో వీడే దక్షుడు. వీడు చంపదగ్గవాడు. ఆలస్యంవద్దు. శివుని దూషించిన వీడి నాలుకను కోసి, ఉప్పు అద్దండి. సీసాన్ని కరిగించి, వీడి శరీరానికి పూయండి. ఇనుమును కాచి వీడి నోట్లో పోయండి. వీడి కళ్ళు పీకివేయండి అంటూ ప్రమథులు దక్షుడిని దండించి, గణపతికి అప్పగించారు.

గణపతి ఆజ్ఞపై ప్రమథులు దక్షుడిని పడగొట్టి, కాళ్ళూచేతులు కట్టి, కట్టి కావడిలో దక్షుడిని పెట్టి శివుడి వద్దకు తీసుకువచ్చారు.

**3.3 ప్రతిపదార్థములు :**

చం ॥ ఖురపదఘట్టనన్ ధరణిగ్రుంగ ఫణీంద్రుడు నుగ్గునుగ్గ గాఁ
బరువడి నుర్వులం దెరలిపాఱఁ బయోనిధులుం గులాద్రులున్
బొరిఁబొరిఁ ద్రుంగ శృంగహతిఁ బొందదివంబు నజాండమున్ మహే
శ్వరువృషభంబు నా క్షణము వచ్చెఁ ద్రిలోకభయంకరాకృతిన్.

**కవి పరిచయం :**

పై పద్యము నన్నెచోడుని "కుమార సంభవము" ద్వితీయాశ్వాసము నుండి గ్రహించబడిన "దక్షయజ్ఞం" అనే పద్యభాగము లోనిది. నన్నెచోడుడు క్రీ.శ. 12వ శతాబ్దానికి చెందినవాడని విమర్శకులు భావిస్తున్నారు.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| ఖుర | = | గిట్టల తోడి |
| పద | = | కాళ్ళ యొక్క |
| ఘట్టనన్ | = | రాపిడిచే |
| ధరణి | = | భూమి |
| క్రుంగన్ | = | అణగిపోగా |
| ఫణీంద్రుడన్ (ఫణి + ఇంద్రుడన్) | = | సర్వరాజయిన ఆదిశేషుడునూ |
| నుగ్గునుగ్గగాన్ | = | పిండి పిండి కాగా |
| పయో నిధులున్ | = | సముద్రములనూ |
| పరువడిన్ | = | వేగముగా |
| నుర్వులన్ | = | నురుగులతో |
| తెరలి | = | పొంగి |
| పాఱన్ | = | ప్రవహించగా |
| కులాద్రులన్ (కుల + అద్రులన్) | = | కుల పర్వతములనూ |
| పొరిఁబొరిన్ | = | మిక్కిలి |
| త్రుంగన్ | = | స్వర్గమునూ |
| అజాండమున్ | = | బ్రహ్మాండమునూ |
| శృంగహతిన్ | = | కొమ్ముల దెబ్బను (నందీశ్వరుని కొమ్ముల దెబ్బను) |
| పొందన్ | = | పొందగా |
| మహేశ్వరు, వృషభంబు | = | శివుని ఎద్దు అయిన నంది |
| త్రిలోక | = | మూడు లోకములకునూ (స్వర్గ, మర్త్య, పాతాళ లోకములు మూడింటికీ) |
| భయంకర | = | భయమును కలిగించే |
| ఆకృతిన్ | = | రూపముతో |
| ఆ క్షణము (ఆ క్షణము + ఆ) | = | ఆ నిమిషము నందే (అప్పుడే) |
| వచ్చెన్ | = | వచ్చింది (అక్కడకు వచ్చింది. |

**తాత్పర్యం :**

మూడు లోకములకు భయాన్ని కల్గించే రూపముతో, ఈశ్వరుని వాహనమైన ఎద్దు నందీశ్వరుడు అక్కడకు వచ్చాడు. ఆ ఎద్దు గిట్టలతో కూడిన దాని పాదములతో త్రొక్కడంతో, భూమి అణగిపోయింది. ఆ భూమిని తన శిరస్సుపై మోసే ఆదిశేషుడు పిండిపిండి అయ్యాడు. సముద్రములు వేగంగా నురుగులతో పొంగి ప్రవహించాయి. భూమండలాన్ని మోసే కులపర్వతాలు చిన్నచిన్న ముక్కలు అయ్యాయి. స్వర్గమునకునూ, బ్రహ్మాండమునకునూ, ఆ ఎద్దు కొమ్ముల దెబ్బలు తగిలాయి.

**విశేషం :**

కులపర్వతములు ఇవి ఏడు. (1) మహేంద్రము, (2) మలయము, (3) సహ్యాము, (4) శుక్తిమంతము, (5) గంధమాదనము, (6) వింధ్యము, (7) పారియాత్రము అనేవి.

**మ ॥ హరి మర్ధింతుమొ ? బ్రహ్మఁబట్టుదులమొ ? యింద్రాద్యష్టదిక్పాలురన్**
**బరిమారన్ వధియింతుమో ? త్రిదశులన్ భంజింతుమో ? లోకసం**
**హరణం బిప్పుడ చేయ నెత్తుదుమొ ? విశ్వాధీశ్వరుం డీశుఁడె**
**వ్వరిపై నల్గెనొ ? చూడుఁ డంచుఁ బ్రమథవ్రాతంబు రౌద్రాకృతిన్.**

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| హరిన్ | = | విష్ణుమూర్తిని |
| మర్ధింతుమొ | = | చిదుక గొట్టుదుమో (చితక గొడదామా ?) |
| బ్రహ్మన్ | = | బ్రహ్మగారిని |
| పట్టుదుమొ (పట్టుదము + ఒ) | = | బంధిద్దామా ? |
| ఇంద్ర + ఆది | = | ఇంద్రుడు మొదలయిన |
| అష్ట, దిక్పాలురన్ | = | ఎనమండుగురు దిక్పాలకులనూ |
| పరిమారన్ | = | చచ్చేటట్లు |
| వధియింతమో | = | చంపుదుమో (చంపుదామా?) |
| త్రిదశులన్ | = | దేవతలను |
| భజింతుమో | = | సంహరింతుమో ! |
| ఇప్పుడ (ఇప్పుడు + అ) | = | ఇప్పుడే |
| లోకసంహరణంబు | = | లోక సంహారము |
| చేయన్ | = | చేయడానికి |
| ఎత్తుదుమొ | = | దండెత్తి పోవుదమో ! (దండెత్తి పోదామా !) |
| విశ్వ + అధి + ఈశ్వరుండు | = | విశ్వేశ్వరుడయిన శివుడు |
| ఎవ్వరిపైన్ | = | ఎవరి మీద |
| అల్గెనొ (అలిగెను + ఓ) | = | కోపించాడో |
| చూడుడు | = | చూడండి |
| అంచున్ | = | అంటూ |
| ప్రమథవ్రాతంబు | = | ప్రమథుల సమూహము |
| రౌద్రాకృతిన్ (రౌద్ర + ఆకృతిన్) | = | భయంకరమైన రూపముతో |

**తాత్పర్యం :**

విష్ణువును మర్దింతుమో, బ్రహ్మను బంధింతుమో, ఇంద్రుడు మొదలయిన ఎనమండుగురు దిక్పాలకులను చంపుదుమో, దేవతలను సంహరింతుమో ఇప్పుడే లోకనాశనాన్ని చేయడానికి దండెత్తి పోవుదుమో విశ్వేశ్వరుడైన శివుడు ఎవరి మీద కోపించాడో చూడండి అంటూ ప్రమథగణము భయంకరమైన ఆకారాలతో కలత చెందారు.

**విశేషం :**

"అష్టదిక్పాలకులు" వీరు ఎనిమిదిమంది. (1) ఇంద్రుడు, (2) అగ్ని, (3) యముడు, (4) వరుణుడు, (5) వాయువు, (6) నిరృతి, (7) కుబేరుడు, (8) ఈశానుడు అనేవారు.

చం ॥ జలజభవాండమంతయును జర్జరితం బగుచుండ వ్రచ్చిమున్
గులగిరు లుర్విమీఁద వడిఁ గూలఁగఁ ద్రోచి జగంబు లబ్ధులన్
గలిపి మహాబ్ధులన్నియును గంజభవాండముమేర కక్కడన్
వెలువడఁ జల్లి రౌద్రగతి విశ్వము నిప్పుడ సంహరించెదన్.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| జలజభవాండము (జలజభవ + అండము) | = | బ్రహ్మాండము |
| అంతయును | = | అంతటినీ |
| జర్జరితంబు + అగుచున్ + ఉండన్ | = | ముక్కలు చేయబడినది అయ్యేటట్లుగా |
| వ్రచ్చి | = | ఛేదించి |
| మున్ | = | ముందుగా |
| కులగిరులు | = | కులపర్వతములు, ఏడింటినీ |
| ఉర్విమీదన్ | = | భూమిపై |
| వడిన్ | = | వేగముగా |
| కూలగఁద్రోచి (కూలగన్ + త్రోచి) | = | కూలిపోయేటట్లు త్రోసి |
| జగంబులు | = | లోకములు |
| అబ్ధులన్ | = | సముద్రములందు |
| కలిపి | = | కలిపివేసి |
| మహాబ్ధులు (మహా + అబ్ధులు) | = | మహాసముద్రములు |
| అన్నియును | = | అన్నింటినీ |
| కంజభవాండము (కంజభవ + అండము) | = | బ్రహ్మాండము |
| మేరకున్ | = | వరకునూ |
| అక్కడన్ | = | అక్కడ నుండి |
| వెలువడన్ | = | వెలువడేటట్లు |
| చల్లి | = | చల్లి |
| రౌద్రగతిన్ | = | భయంకరమగు విధమున |
| ఇప్పుడ (ఇప్పుడు + అ) | = | ఇప్పుడే |
| సంహరించెదన్ | = | నశింపజేస్తాను (సంహరిస్తాను) |

**తాత్పర్యం :**

బ్రహ్మాండమంతయూ తూట్లు పడేటట్లు ఛేదిస్తాను. కులపర్వతాలు, భూమిపైపడి కూలిపోయేటట్లు త్రోస్తాను. లోకములు, సముద్రములలో కలిపివేస్తాను. మహాసముద్రము అన్నీ, బ్రహ్మాండము వరకునూ అక్కడ నుండి బయటకు వచ్చేటట్లు చల్లి, ప్రపంచాన్ని ఇప్పుడే సంహరిస్తాను.

ఉ ॥ స్థూలసమున్నతాంగులు చతుర్భుజ ఫాలతలాక్షశూల కా
పాలకఠోరకార్ముకకృపాణధరుల్ ప్రమథాధినాథు లా
భీల పరాక్రముల్ నిఖిలభీకరమూర్తులు వచ్చి రోలిఁ గం
కాలసమేతులై భువనకంపముగా గణనాథు పాలికిన్.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| స్థూల | = | లావయిన |
| సమున్నత | = | మిక్కిలి ఎత్తయిన |
| అంగులు | = | శరీరములు గలవారునూ |
| చతుర్భుజ (చతుః + భుజ) | = | నాలుగు భుజములూ |
| ఫాలతల + అక్ష | = | నొసటిపై కన్నులూ |
| శూల | = | శూలములు |
| కాపాల | = | కపాలములు (పుఱ్ఱెలు) |
| కఠోర | = | కఠినములైన |
| కార్ముక | = | ధనుస్సులనూ |
| కృపాణ | = | ఖడ్గములనూ |
| ధరుల్ | = | ధరించినవారునూ |
| ఆభీల, పరాక్రముల్ | = | భయంకరమైన, పరాక్రమము గలవారునూ |
| నిఖిల | = | అందరకునూ |
| భీకర | = | భయాన్ని పుట్టించే |
| మూర్తులు | = | ఆకారములు గలవారునూ |
| అగు | = | అయిన |
| ప్రమథా ధినాథులు (ప్రమథ + అధినాథులు) | = | ప్రమథ నాయకులు |
| కలకాల సమేతులై | = | అస్థిపంజరముతో కూడినవారయి |
| గణనాథు పాలికిన్ | = | గణపతి వద్దకు |
| ఓలిన్ | = | క్రమముగా |
| భువన కంపముగాన్ (భవన కంపమ+కాన్) | = | లోకములు అన్నీ చలించే విధంగా |
| వచ్చిరి | = | వచ్చారు. |

**తాత్పర్యం :**

లావయినట్టియు, మిక్కిలి ఎత్తయినట్టియు శరీరములు కలవారునూ, నాలుగు భుజములు, నొసటిపై కన్నులు, శూలములు, పుఱ్ఱెలు, కఠినములైన ధనుస్సులు, ఖడ్గములు ధరించినవారునూ, భయంకర పరాక్రమము గలవారునూ,

అందరకునూ భయాన్ని కల్గించే రూపము కలవారునూ అయిన ప్రమథనాయకులు, అస్థిపంజరాలతో కూడినవారై లోకములు అదిరేటట్లు గణపతి దగ్గరకు వరుసగా వచ్చారు.

ఉ ॥ ఆయవనీసురాసురచయం బురుసత్త్వుల నుగ్రులన్ మహా
కాయులఁ దద్గణాధిపులఁ గాంచుచు మీఁదికి మీఁద జీవముల్
వోయిరి, కొంద ఱోడి చెడిపోయిరిది; కొందఱు చుట్టుముట్టినన్
గూయిడఁజొచ్చి; రుక్కడఁగి కొందఱలందురి భీతిచిత్తులై.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| ఆ | = | ఆ |
| అవనీసుర | = | బ్రహ్మణుల యొక్కయు |
| అమరచయంబు | = | దేవతల యొక్కయు సమూహము |
| ఉరుసత్త్వులన్ | = | గొప్ప బలము గలవారును |
| ఉగ్రులన్ | = | భయంకరులును |
| మహాకాయులన్ | = | గొప్ప శరీరముగలవారును అయిన |
| తద్గణాధిపులన్ (తత్+గణ+అధిపులన్) | = | ఆ గణనాయకులను |
| కాంచునన్ | = | చూస్తూ |
| కొందఱు | = | కొంతమంది |
| మీదికిన్, మీదన్, జీవముల్ | = | పై ప్రాణాలు పైననే |
| పోయిరి | = | పోగొట్టుకొన్నారు |
| చుట్టుముట్టినన్ | = | ప్రమథులు చుట్టుముట్టగా |
| కొందఱు | = | కొంతమంది |
| ఓడి చెడిపోయిరి | = | నశించారు |
| కొందఱు | = | కొంతమంది |
| భీతచిత్తులు + ఐ | = | భయపడిన మనస్సులు కలవారయి |
| అలందురి | = | కలత చెంది |
| ఉక్కడగి (ఉక్కు + అడగి) | = | బలము నశించి |
| కూయిడఁ జొచ్చిరి (కూయిడన్+చొచ్చిరి) | = | భయంతో అఱవడం ప్రారంభించారు. |

**తాత్పర్యం :**

ఆ బ్రాహ్మణులయు, దేవతలయు సమూహము, గొప్పబలము గలవారునూ, భయంకరులను, పెద్ద శరీరములు గలవారును అయిన ఆ ప్రమథ నాయకులను చూస్తూ, కొందరు పై ప్రాణములను పైననే పోగొట్టుకొన్నవారయ్యారు. ప్రమథులు చుట్టుముట్టగా కొందరు ఓడి నశించారు. కొందరు భయపడిన మనస్సులు కలవారై కలతచెంది, బలము నశించి, భయముతో అఱవడం ప్రారంభించారు. (మొఱ పెట్టడం ప్రారంభించారు).

చం ॥ మునిమనుజాసురాహిసుర ముఖ్యుల వీఁపులతోళు లెత్తఁగా
మును గుదిగట్టి మోదియును ముందల కట్టులు గట్టి కొట్టియున్
జనఁ బెడకేలు గట్టియును జర్మపటంబులు డిగ్గ నొల్చియున్
జెనసి మసంగి కారసము సేసిరి తత్ ప్రమథాదినాయకుల్.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| తత్ | = | ఆ |
| ప్రమథ + అధినాయకుల్ | = | ప్రమథ నాయకులు |
| ముని | = | మునులు |
| మనుజ | = | మనుష్యులు |
| అసుర | = | రాక్షసులు |
| అహి | = | నాగులు |
| సుర | = | దేవతలు అనే వారిలో |
| ముఖ్యుల | = | శ్రేష్ఠులయిన వారి యొక్క |
| వీపుల, తోళులు | = | వీపులపై ఉన్న చర్మములు |
| ఎత్తగాన్ | = | ఊడిపోయేటట్లు |
| మును | = | ముందుగా |
| గుదిగట్టి (గుది + కట్టి) | = | గుదిబండను వ్రేలాడకట్టి |
| మోపియున్ | = | వారిచేత దాన్ని మోసేటట్లు చేసియును |
| ముందలకట్టులు (ముందు + తలకట్టులు) | = | వారి తలల యందు భాగములను |
| కట్టి, కొట్టియున్ | = | కట్టి కొట్టియునూ |
| చనన్ | = | ఒప్పునట్లుగా |
| పెడకేలు | = | వారి పెడతెక్కలు |
| కట్టియును | = | కట్టియూ |
| చర్మపటంబులు | = | వస్త్రముల వంటి తోళ్ళు |
| డిగ్గ నొల్చియున్ (డిగ్గన్ + ఒల్చియున్) | = | ఊడేటట్లు ఒలిచియును |
| చెనసి | = | తాకి |
| మసంగి | = | చెలరేగి |
| కారసము + చేసిరి | = | విరసము చేశారు. |

**తాత్పర్యం :**

ఆ ప్రమథ నాయకులు, మునులను, మనుష్యులను, రాక్షసులను, నాగులను, దేవతా శ్రేష్ఠులను, వారి వీపుల చర్మములు ఊడదీసియు, వారి మెడలో గుదిబండను కట్టియు, దానిని వారిచేత మోయించియు, వారి తలల ముందు భాగములను కట్టికొట్టియు, పెడచేతులు కట్టియు, వారి చర్మములు ఒలిచియు, విజృంభించి విరసము చేశారు.

చం ॥ ఖలుఁడని వజ్రిచేయి విఱుగంగ వడిన్ బడిమోఁది; రెత్తి దో
ర్బలమునఁ దాఁకి యజ్ఞుతలపందల యెత్తిరి; తద్గణాధిపుల్
గలుషముతోడ ముట్టి భగుకన్నొకఁ బచ్చనవుచ్చి రుగ్రులై;
బలువిడిఁ జుట్టి పూషు మునిపండులు దుల్గఁగవ్రేసి రీసునన్.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| తత్ | = | ఆ |
| గణాధిపుల్ (గణ + అధిపుల్) | = | ప్రమథ గణములకు నాయకులు |

| | | |
|---|---|---|
| ఎత్తి | = | దండెత్తి |
| దోర్బలమునన్ (దోః +బలమునన్) | = | (తమ) భుజబలముతో |
| తాఁకి | = | మీదపడి |
| ఖలుడని (ఖలుడి + అని) | = | దుష్టుడు అని |
| వజ్రి చేయి | = | ఇంద్రుని యొక్క చేయి |
| విఱుగంగన్ | = | విరిగిపోయేటట్లు |
| వడిన్ | = | వేగముగా |
| పడమోదిరి (పడన్ + మోదిరి) | = | పడేటట్లు బాదారు |
| యజ్ఞు | = | యజ్ఞపురుషుని యొక్క |
| తల, పందల | = | తల, పుఱ్ఱె |
| ఎత్తిరి | = | ఊడగొట్టారు |
| కలుషముతోడన్ | = | కోపముతో |
| ముట్టి | = | తాకి |
| భగు | = | "భగుడు" అనే ఆదిత్యుని యొక్క |
| కన్ను + ఒకడు | = | కన్నునొక దానిని |
| ఉగ్రులై (ఉగ్రులు + ఐ) | = | భయంకరులై |
| అచ్చన పుచ్చిరి (అచ్చన + పుచ్చిరి) | = | ఊడదీసి, విసిరివేసిరి |
| ఈసునన్ | = | కోపముతో |
| బలువిడిన్ | = | పరాక్రమముతో |
| చుట్టి | = | చుట్టుముట్టి |
| పూషు | = | పూషుడు అనే ఆదిత్యుని యొక్క |
| మునిపండులు | = | ముందరిపండ్లు |
| డుల్లగన్ | = | రాలేటట్లు |
| వ్రేసిరి | = | కొట్టారు |

**తాత్పర్యం :**

ఆ ప్రమథ నాయకులు దండెత్తి, భుజబలముతో తాకి, దుర్మార్గుడని ఇంద్రుని చేయి విరిగేటట్లు, వేగముగా పడబాదారు. యజ్ఞపురుషుని తల పుఱ్ఱెను ఊడగొట్టిరి. భయంకరులై కోపముతో మీదపడి, భగుని ఒక కన్నును ఊడదీసి విసిరివేసిరి. కోపముతో బలంగా చుట్టుముట్టి పూషుడు అనే ఆదిత్యుని ముందరిపండ్లు రాలగొట్టారు.

ఉ ॥ **వీఁడె ఖలుండు దక్షుఁడునువీఁడిఁడిపాఱుఁడు; వీడు సర్వవ**
**ధ్యుం; డెడసేయకుండు; శివదూషకు నాలుకఁగోసి యుప్పు నిం**
**పుండు; ద్రపుద్రవం బొడలఁబూయుడు; లోహముగాఁచినోరఁబో**
**యుండు; దురాత్ముచర్మపటమొల్వుఁడు, గన్నులు మీఁటుఁడుక్కఱన్.**

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| వీఁడె | = | వీడే (ఇదిగో ఇతడే) |
| ఖలుండు | = | దుర్మార్గుడు |

| | | |
|---|---|---|
| దక్షుఁడను (దక్షుడు + అను) | = | దక్షుడు అనే పేరుగల |
| వీఁడిడి | = | అవివేకియైన |
| పాఱుడు | = | బ్రాహ్మణుడు |
| వీడు | = | ఇతడు |
| సర్వవధ్యుండు | = | అందరకునూ చంపదగినవాడూ |
| ఎడసేయకుండు (ఎడ + చేయకుండు) | = | అలస్యము చేయవద్దు |
| శివధూషకు | = | శివుడిని నిందించిన వీని యొక్క |
| నాలుకఁ గోసి (నాలుకన్ + కోసి) | = | నాలుకను కోసి |
| ఉప్పు | = | ఉప్పును |
| నింపుడు | = | కూరండి (కోసిన నాలుకకు ఉప్పును పట్టించండి) |
| త్రపు, ద్రవంబు | = | సీసపు ద్రవమును |
| ఒడలన్ | = | (వీడి) శరీరమందు |
| పూయుడు | = | పూతగా పూయండి |
| లోహమున్ | = | ఇనుమును |
| కాచి | = | కాచి |
| నోరన్ | = | (ఈ దక్షుని) నోటియందు |
| పోయుండు | = | పోయండి |
| దురాత్ము | = | దుర్మార్గుడైన ఈ దక్షునియొక్క |
| చర్మపటము | = | వస్త్రము నుండి తోలును |
| ఒల్పుడు | = | ఒలవండి (ఊడదీయండి) |
| ఉక్కఱన్ (ఉక్కు + అఱన్) | = | వీని బలము నశించేటట్లు |
| కన్నులు, మీటుడు | = | వీడి కన్నులు పీకి వేయండి. |

**తాత్పర్యం :**

ఈతడే దుష్టుడు. ఈతడు దక్షుడు అనే అవివేకియైన బ్రాహ్మణుడు వీడు అందరకునూ వధింపదగిన వాడు. ఆలస్యము చేయకండి. శివుని దూషించే వీడి నాలుకను కోసి, ఉప్పును కూరండి. సీసమును కరిగించి, ఆ ద్రవమును ఈతడి శరీరానికి పూయండి. ఇనుమును కాచి ఈతడి నోటియందు పోయండి. ఈ దుర్గార్గుని చర్మాన్ని ఒలవండి. వీడి బలము నశించేటట్లు ఈతడి కన్నులును పీకివేయండి.

**శ్రీమతి పి. ఉషారాణి**
ఎం.ఏ.,
తెలుగు శాఖాధ్యక్షులు,
శ్రీ గోరంట్ల వెంకన్న ఓరియంటల్ కళాశాల
తిమ్మసముద్రం

పాఠం - 4

# దక్షయజ్ఞం - నన్నెచోడుడు

## (కుమార సంభవం - ద్వితీయాశ్వాసం - 49 నుండి 86 వరకు పద్యాలు)

## సందర్భసహిత వ్యాఖ్యలు, ప్రశ్నలు - సమాధానాలు

**విషయసూచిక :**

**4.1** సందర్భసహిత వ్యాఖ్యలు

**4.2** ప్రశ్నలు - సమాధానాలు

### 1. ఆ క్షణము వచ్చెఁద్రిలోక భయంకరాకృతిన్

**కవి పరిచయం :**

ఈ వాక్యము నన్నెచోడుని "కుమార సంభవము" ద్వితీయాశ్వాసము నుండి గ్రహింపబడిన "దక్షయజ్ఞం" అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

ఈశ్వరుడు తన భార్య సతీదేవి దక్షయజ్ఞశాలలో దగ్ధమయ్యిందని నారదుని వల్ల తెలిసికొన్నాడు. కోపంతో శివుని నొసటి నేత్రము నుండి పుట్టిన అగ్ని బ్రహ్మాండము దాకా వ్యాపించింది. అప్పుడు మహేశ్వరుడి వాహనమైన "నంది" అనే ఎద్దు, మూడులోకాలకు భయాన్ని పుట్టించే ఆకారముతో అక్కడకు వచ్చిందని కవి చెప్పుచున్న సందర్భంలోనిది పై వాక్యము.

**అర్థం :**

ఆ నిమిషములోనే మూడులోకాలకు భయాన్ని కలిగించే రూపంతో వచ్చింది.

**వ్యాఖ్య :**

ఈశ్వరుడి వాహనమైన ఎద్దు తన కాలి గిట్టలతో భూమిని అణగత్రొక్కుతూ, ఆదిశేషుడు పిండిపిండి అయ్యేలా సముద్రాలు నురుగులతో పొంది ప్రవహించేలా, కులపర్వతాలు ముక్కలయ్యేలా స్వర్గాన్నీ, బ్రహ్మాండాన్నీ తన కొమ్ములతో కొడుతూ, అక్కడకు వచ్చింది.

### 2. విశ్వము నిప్పుడ సంహరించెదన్

**కవి పరిచయం :**

ఈ వాక్యము నన్నెచోడుని "కుమార సంభవము" ద్వితీయాశ్వాసము నుండి గ్రహింపబడిన "దక్షయజ్ఞం" అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

ప్రమథులు ఏవేవో మాట్లాడుతుండగా వారిని కాదని ఆ ప్రమథులలో ప్రధానులు కొందరు ఒక్కొక్కరూ ఒక్కొక్క విధంగా పరమేశ్వరునితో చెప్పిన సందర్భంలోని వాక్యమిది.

**అర్థం :**

ప్రపంచమును ఇప్పుడే నశింపచేస్తాను.

**వ్యాఖ్య :**

సతీదేవి దహనమయ్యిందని తెలిసి ఈశ్వరుడు కోపించాడు. అప్పుడు ప్రమథులు, తామే బ్రహ్మాండాన్ని ఖండించగలమని శివునితో చెప్పారు. వారిని ప్రక్కకు తప్పుకోండని ఆ ప్రమథులలో ప్రధానులు కొందరు తాము కులపర్వతాన్ని త్రోస్తామని, లోకాల్ని సముద్రాలలో కలుపుతామని, ప్రపంచాన్ని భయంకరంగా సంహరిస్తామని పరమశివునితో చెప్పారు.

**3. ఏఁగలుగ నీకుఁజనునే యలుగన్ :**

**కవి పరిచయం :**

ఈ వాక్యము నన్నెచోడుని "కుమార సంభవము" ద్వితీయాశ్వాసము నుండి గ్రహింపబడిన "దక్షయజ్ఞం" అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

భార్యయైన సతీదేవికి జరిగిన అవమానాన్ని గురించి తెలిసిన శివుడు కోపపడ్డాడు. అది చూసి ప్రమథులు విజృంభించారు. అప్పుడు ఆ ప్రమథులను తప్పుకోండని, ప్రమథగణ నాయకులు శివునికి ఎదురుగా నిలిచి, తమ సాహసాన్ని గూర్చి చెప్పారు. అందులో ఒక ప్రమథ నాయకుడు శివునితో తాను ఉండగా, శివుడు కోపపడవలసిన అవసరము లేదని శివునితో చెప్పుచున్న సందర్భంలోని వాక్యమిది.

**అర్థం :**

నేను ఉండగా నీవు కోపపడడం తగదు.

**వ్యాఖ్య :**

ప్రమథ నాయకులలో ఒక నాయకుడు తాను విష్ణువు మొదలయిన దేవతల గర్వాన్ని అణచి, వారిని బంధించి తెస్తానని లోకాల్ని అన్నింటినీ కోపంతో మ్రింగుతానని చెప్పాడు. తాను ఉండగా శివుడు దక్షునిపై కోపపడవలసిన పనిలేదని అతడు శివునకు చెప్పాడు.

**4. పట్టి తెచ్చెద వడి నన్నుఁ బనుపు దేవ !**

**కవి పరిచయం :**

ఈ వాక్యము నన్నెచోడుని "కుమార సంభవము" ద్వితీయాశ్వాసము నుండి గ్రహింపబడిన "దక్షయజ్ఞం" అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

భార్యయైన సతీదేవికి జరిగిన అవమానాన్ని గురించి తెలుసుకొని శివుడు దక్షునిపై ఆగ్రహించాడు. అది చూసిన ప్రమథులు విజృంభించారు. అలా విజృంభించి బ్రహ్మాండాన్ని తామే ముక్కలు చేస్తామంటున్న ఆ ప్రమథులను కాదని, ఆ ప్రమథులకు నాయకులైన వారిలో ఒకడు శివునివైపు తిరిగి తనను పంపిస్తే దక్షుడిని బంధించి తెస్తామని శివుడితో చెప్పిన సందర్భంలోనిది.

**అర్థం :**

ఓ దేవా ! ఆ దక్షుడిని బంధించి తెస్తాను. వేగంగా నన్ను పంపించుము.

**వ్యాఖ్య :**

ఎలుక మీద కోపంతో ఎలుక ఉన్న ఇంటిని తగులపెట్టినట్లు, ఎలుక వలే అల్పుడైన దక్షుని సంహరించడానికి శివుడు లోకాల్ని అంతటినీ నశింపజేయడం తగదనీ, తనను పంపిస్తే తాను వెళ్ళి దక్షుడిని తెస్తానని ఒక ప్రమథ నాయకుడు శివునితో చెప్పాడు.

**5. నన్నుఁ బన్పు దక్షుఁ బట్టి తెచ్చెదన్.**

**కవి పరిచయం :**

ఈ వాక్యము నన్నెచోడుని "కుమార సంభవము" ద్వితీయాశ్వాసము నుండి గ్రహింపబడిన "దక్షయజ్ఞం" అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

దక్షుని మీద శివుడు కోపించవలసిన అవసరం లేదని, తనను పంపిస్తే తాను వెళ్ళి దక్షుడిని బంధించి తీసుకు వస్తానని, గణపతి తన తండ్రియైన శివునితో చెప్పిన సందర్భంలోనిది.

**అర్థం :**

నన్ను పంపించు, దక్షుడిని బంధించి తెస్తాను.

**వ్యాఖ్య :**

చిన్నపిట్టపై కోపంతో పాశుపతాస్త్రాన్ని ధనుస్సులో సంధించడం వ్యర్థము. అలాగే క్రిందనే ఉండే ముండ్ల వంకాయను కోయడానికి ఎత్తైన రాయిని తీసుకోవడం అనవసరము. ఎలుకను వేటాడటానికి ఉడుప కుక్క అనవసరం. అలాగే దక్షుడి వంటి అల్పుడిని శిక్షించడానికి శివుని అంతటి వీరుడు అవసరంలేదని, తనను పంపిస్తే తాను వెళ్ళి దక్షుడిని బంధించి తెస్తానని గణపతి శివునితో చెప్పాడు.

**6. దక్షాధ్వరం బ(శ్రమమునఁ బెఱచి యార్చె**

**కవి పరిచయం :**

ఈ వాక్యము నన్నెచోడుని "కుమార సంభవము" ద్వితీయాశ్వాసము నుండి గ్రహింపబడిన "దక్షయజ్ఞం" అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

గణపతి తన చేతితో ప్రమథగణాలకు సంజ్ఞ చేశాడు. అప్పుడు ప్రమథులు యజ్ఞరక్షకులను తరిమివేశారు. యజ్ఞ వేదికలను త్రవ్వి, అగ్నిగుండాలను పడద్రోశారు. ఋత్విక్కులను గోతులలో పాతిపెట్టారు. చితక్కొట్టారు. యజ్ఞపరిరక్షకుని మెడను నులిమి, అతడిని యూపస్తంభానికి కట్టారు. అగ్ని నాలుకను చీల్చి, పరిజనాన్ని నేలపై పడవేసి దక్షయజ్ఞాన్ని చెఱచి, గట్టిగా ప్రమథులు అరచారని కవి చెప్పిన సందర్భంలోనిది.

**అర్థం :**

దక్షయజ్ఞాన్ని సులభంగా పాడుచేసి గట్టిగా కేకవేశారు.

**వ్యాఖ్య :**

ప్రమథులు, దక్షయజ్ఞాన్ని ధ్వంసం చేసిన తీరును కవి వర్ణించాడు.

**7. కలుము లెడరైన నేమియు నిలువవు**

**కవి పరిచయం :**

ఈ వాక్యము నన్నెచోడుని "కుమార సంభవము" ద్వితీయాశ్వాసము నుండి గ్రహింపబడిన "దక్షయజ్ఞం" అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

దక్షయజ్ఞమును ప్రమథనాయకులు ధ్వంసం చేస్తున్న తాకిడిని సహింపలేక, దేవతాశ్రేష్ఠులు అక్కడినుండి తప్పించుకొని పారిపోయారు. బ్రహ్మ, విష్ణుమూర్తి, ఇంద్రుడు, యముడు ఎలాగో తప్పించుకున్నారు. అప్పుడు వరుణుడు సముద్రాలకు అధిపతి అయినా భయముతో, ప్రవాహముతో సెలయేరువలె, నోటిలో తడి కూడా లేకుండా భయపడి పారిపోయాడనీ సంపదలు పోయినట్లయితే ఏమీ నిలబడవు అనేమాటకు అది తగినట్లుగా ఉందని కవి వ్యాఖ్యానించిన సందర్భములోనిది.

**అర్థం :**

సంపదలు దూరమైతే ఏమీ నిలబడవు.

**వ్యాఖ్య :**

వరుణుడు సముద్రాలకు అధిపతి. సముద్రాలలో ఎన్నో నీళ్ళు ఉంటాయి. అటువంటి వరుణుడు నోటిలో తడి కూడా లేకుండా పారిపోవడాన్ని కవి సంపదలు పోతే ఏమీ నిలవవు అన్న మాటతో పోల్చి సమర్థించాడు.

**8. నాలుకఁ గోసి యుప్పునింపుడు**

**కవి పరిచయం :**

ఈ వాక్యము నన్నెచోడుని "కుమార సంభవము" ద్వితీయాశ్వాసము నుండి గ్రహింపబడిన "దక్షయజ్ఞం" అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

గణాధిపతులు దక్షయజ్ఞాన్ని ధ్వంసం చేశారు. అష్టదిక్పాలకులు అక్కడి నుండి పారిపోయారు. ప్రమథనాయకులు దక్షునికై వెతికారు. కొందరు మునులు, దేవతలు, కనుసంజ్ఞ చేసి ప్రమథులకు దక్షుడు దాగిన ప్రదేశాన్ని చూపించారు. ప్రమథులు దక్షుని పట్టుకొని "శివుని దూషంచే వీడి నాలుకను కోసి దానిలో ఉప్పును నింపండి" అని దక్షుని చంపి అతని చర్మాన్ని ఒలవండీ అని వారు ఒకరితో ఒకరు చెప్పిన సందర్భంలోనిది.

**అర్థం :**

నాలుకను కోసి ఉప్పును పట్టించండి.

**వ్యాఖ్య :**

ప్రమథులు దక్షుడిపై కోపంతో దక్షుని నాలుకను కోయడానికీ, ఇనుమును కాచి అతడి నోట్లో పోయడానికి, దక్షుని కళ్ళు పీకడానికి సిద్ధపడ్డారు.

**9. దురాత్మ చర్మపటమొల్వుఁడు**

**కవి పరిచయం :**

ఈ వాక్యము నన్నెచోడుని "కుమార సంభవము" ద్వితీయాశ్వాసము నుండి గ్రహింపబడిన "దక్షయజ్ఞం" అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

ప్రమథ నాయకులకు మునులు, దేవతలు దాగుకొన్న దక్షుడిని చూపించారు. అప్పుడు ప్రమథులు, దక్షునిపై కోపంతో దక్షుని నాలుకను కోసి ఉప్పు నింపండనీ, సీసాన్ని కరిగించి ఆ ద్రవాన్ని అతని శరీరానికి పూయండనీ, దక్షుని చర్మాన్ని ఊడదీయండనీ ప్రమథులు ఒకరితో ఒకరు చెప్పిన సందర్భంలోనిది.

**అర్థం :**

దుర్మార్గుడైన దక్షుని వస్త్రము వంటి తోలును ఊడదీయండి.

**వ్యాఖ్య :**

ప్రమథులు, దక్షుడిపై కోపంతో అతడిని అనేక రకాలుగా శిక్షింపడానికి సిద్ధమయ్యారు.

**10. ఈశుండెవ్వరిపై నల్గెనొ చూడుడు**

**కవి పరిచయం :**

ఈ వాక్యము నన్నెచోడుని "కుమార సంభవము" ద్వితీయాశ్వాసము నుండి గ్రహింపబడిన "దక్షయజ్ఞం" అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

ఈశ్వరుడి ఫాలనేత్రాగ్ని, బ్రహ్మాండము దాకా వ్యాపించింది. అప్పుడు పుష్పదంతుడు, భృంగిరిటుడు మొదలైన ప్రథమ గణము విజృంభించి, విశ్వేశ్వరుడైన శివుడు ఎవరి మీద కోపించాడో చూడండని, వారిలో వారు అనుకున్న సందర్భంలోని వాక్యమిది.

**అర్థం :**

ఈశ్వరుడు ఎవరి మీద కోపించాడో చూడండి.

వ్యాఖ్య :

ఈశ్వరునకు కోపము వచ్చిందని తెలిసిన ఆ ప్రమథగణము ఈశ్వరుడు ఎవరి మీద కోపించాడో తెలియక విష్ణుమూర్తిని మర్దించాలా ? బ్రహ్మను బంధించాలా ? ఇంద్రాది దిక్పాలకులను వధించాలా ? దేవతలను సంహరించాలా?

లోకాల్ని నాశనం చేయడానికి దండెత్తాలా ? అంటూ ఈశ్వరునికి ఎవరి మీద కోపం వచ్చిందో తెలిసికోండని ఒకరితో ఒకరు చెప్పుకున్నారు.

### 11. ఉప్పుఁ బెటికవోలె వెఱచి పఱచె జముఁడు

**కవి పరిచయం :**

ఈ వాక్యము నన్నెచోడుని "కుమార సంభవము" ద్వితీయాశ్వాసము నుండి గ్రహింపబడిన "దక్షయజ్ఞం" అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

ప్రమథగణము దిక్పాలకులను తరిమి అరిచారు. దానితో యముడు భయపడి, తన వాహనమైన ఆ దున్నపోతు నడుమును పట్టుకొని, దానిని ఎక్కడం మరచిపోయి ఆ దున్నపోతుపై ఉప్పు సంచివలె అడ్డముగా పడి భయంతో పారిపోయాడని కవి చెప్పిన సందర్భంలోనిది.

**అర్థం :**

యముడు దున్నపోతుపై ఉప్పుసంచి వలె అడ్డుముగాపడి, భయంతో పారిపోయాడని కవి చెప్పాడు.

**వ్యాఖ్య :**

దున్నపోతు మీద అడ్డంగా పడిన యముడు దున్నపోతుపై ఉన్న ఉప్పు బస్తావలె ఉన్నాడు.

### 12. ఎలుక తోడి కోపమున నిల్లేర్చునట్లు

**కవి పరిచయం :**

ఈ వాక్యము నన్నెచోడుని "కుమార సంభవము" ద్వితీయాశ్వాసము నుండి గ్రహింపబడిన "దక్షయజ్ఞం" అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

దక్షునిపై కోపంతో లోకమంతటినీ సంహరించాలని శివుడు విజృంభించడం తగదని, అది ఎలుకను పట్టుకోవడం కోసం ఆ ఎలుక ఉన్న ఇంటిని తగులపెట్టటం వంటిదని, ప్రమథులలో ఒక ప్రధానుడు పరమశివునితో చెప్పిన సందర్భంలోనిది.

**అర్థం :**

ఎలుక మీది కోపముతో ఇంటిని కాల్చినట్లు అని అర్థము.

**వ్యాఖ్య :**

దక్షుడు ఎలుక వంటి అల్పుడని, అతడిని పట్టి బంధించడానికి లోకాన్ని అంతటినీ సంహరించాలని శివుడు తలపెట్టడం, ఎలుక కోసం ఇంటిని కాల్చడం వంటిదని ప్రమథులలో ఒక ముఖ్యుడు శివునితో చెప్పాడు.

### 13. బలిమిఁ బిట్ట కలిగి పాశుపతము దొడుగనేటికి ?

**కవి పరిచయం :**

ఈ వాక్యము నన్నెచోడుని "కుమార సంభవము" ద్వితీయాశ్వాసము నుండి గ్రహింపబడిన "దక్షయజ్ఞం" అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

దక్షుడు శివుని అవమానించాడు. దానితో సతీదేవి అగ్నిలో దగ్ధమయ్యింది. అది విన్న శివుడు కోపంతో విజృంభించాడు. అప్పుడు చిన్నపిట్టపై కోపంతో, పాశుపతాస్త్రాన్ని సంధించడం ఎందుకని గణపతి శివునితో అన్న సందర్భంలోనిది.

**అర్థం :**

చిన్నపిట్టపై కోపించి బలముతో పాశుపతాస్త్రాన్ని ధనుస్సు నందు సంధించడం ఎందుకు ?

**వ్యాఖ్య :**

దక్షుడు చిన్నపిట్ట వంటి అల్పుడు. అతడిని సంహరించడానికి ఈశ్వరుడు స్వయంగా విజృంభించవలసిన అవసరంలేదు. దక్షుని వంటి అల్పునిపై శివుడు పరాక్రమించడం, చిన్నపిట్ట మీద పాశుపతాస్త్రమును సంధించడం వలే వ్యర్థమని గణపతి చెప్పాడు.

## 4.2 లఘు ప్రశ్నలు - సమాధానాలు

### 1. కోపంతో ఉన్న ఈశ్వరునికి గణాధిపతులకు జరిగిన సంభాషణ గురించి వ్రాయండి.

ఈశ్వరుడు దక్షుని తిరస్కరించాడని తెలిసి గణాధిపతులు పరమేశ్వరుని ముందుకు వచ్చి ఇలా చెప్పారు.

"ఓ దేవా ! మేమే బ్రహ్మప్రళయాన్ని చేయడానికీ, మహా ప్రళయాన్ని ప్రారంభించడానికి సరిపోతాము" అని చెప్పారు.

**గణాధిపతులు ఈశ్వరునితో పలికిన ప్రతాపవచనాలు :**

"నేను బ్రహ్మాండాన్ని తూట్లుపడేలా ఛేదిస్తాను. నేను కుల పర్వతాన్ని కూలద్రోస్తాను. లోకాలను నేను సముద్రములో కలుపుతాను. మహాసముద్రాల్ని నేను బ్రహ్మాండము వరకూ చల్లి విశ్వాన్ని అంతటినీ సంహరిస్తాను. నేను లోకాల్ని కోపంతో మ్రింగుతాను. నేను విష్ణువు మొదలయిన దేవతల గర్వాన్ని పోగొట్టి, వారిని బంధించి తెస్తాను. నేను ఉండగా, నీవు కోపించడం తగదు. "దేవా ! ఎలుక మీద కోపంతో ఇల్లును కాల్చినట్లు, దక్షుడిపై కోపంతో లోకాన్ని అంతటినీ, ఇప్పుడు నీవు సంహరించడం నీకు తగదు" నన్ను పంపించు. నేను దక్షుడిని బంధించి తెస్తాను. వేగంగా నన్ను పంపించు" అంటూ గణాధిపతులు వేరువేరుగా శివునితో చెప్పారు.

**శివునితో గణపతి పలికిన పలుకులు :**

అప్పుడు గణనాయకుడైన గణపతి పరమేశ్వరునికి ఎదురుగా నిలబడి వేరువేరుగా మాట్లాడుతున్న గణనాయకులను మాట్లాడవద్దని, ప్రళయకాల మేఘధ్వనితో ఉరుముతూ, శివునితో ఇలా అన్నాడు.

"ఓ ఈశ్వరా ! చిన్నపిట్ట మీద కోపించి పాశుపతాస్త్రాన్ని ధనుస్సులో సంధించడం ఎందుకు ? క్రిందుగా ఉన్న వంకాయను కోయడానికి పొడవు కర్రను తీసుకోవడం ఎందుకు ? నీ కోపానికి ఇక్కడ స్థానము లేదు. నన్ను పంపించు" దక్షుని బంధించి, తీసుకొని వస్తాను. ఇది అంతా నా తల్లి సతీదేవికి జరిగిన అవమానము. కాబట్టి దక్షుని బంధించి తెచ్చే పనిని నాకే అనుగ్రహించండి" అని గణపతి, శివునితో చెప్పాడు.

### 2. ప్రమథగణము దక్షుని యజ్ఞాన్ని ధ్వంసం చేయగా, అక్కడివారు పడిన పాట్లు ఏమిటి తెల్పండి ?

ప్రమథనాయకులు యజ్ఞరక్షకులను తాకి వారిని తరిమారు. యజ్ఞాన్ని చూసే వారిని మూలలకు పోయేటట్లు వారిని తరిమారు. యజ్ఞవేదికలను త్రవ్వి యజ్ఞగుండాలను పడద్రోశారు. ఋత్విక్కులను హోమం కోసం త్రవ్విన గోతి

యందు పాతిపెట్టారు. యజ్ఞసహాయకులగు ఋత్విక్కులను బలంగా చితక్కొట్టారు. యజ్ఞపరిరక్షకుని మెడను నులిమి అతడిని యూపస్తంభానికి కట్టారు. పరిచారకులను బంధించి హింసించారు. అగ్ని నాలుకను రెండు చీలికలుగా కోసి పరిజనాన్ని నేలమీద పడవేశారు.

ప్రమథనాయకులను చూసి దేవతలు, బ్రహ్మణులు భయపడ్డారు. వారిలో కొందరి పై ప్రాణాలు పైననే పోయాయి. కొందరు భయపడి నశించారు. కొందరు తప్పించుకుని పారిపోయారు. బ్రహ్మ తన వాహనమైన హంసను ఎక్కబోయి, భయంతో నేలపైపడ్డాడు. అప్పుడు హంస, బ్రహ్మను తన నోటితో కఱచిపట్టుకొని, పారిపోయింది. విష్ణుమూర్తి గరుత్మంతుని మెడనూ, నడుమునూ, తన కాలితోనూ, చేతితోనూ గట్టిగా పట్టుకొని, చెమటలు కారుతుండగా పారిపోయాడు. వరుణుడు నోరు ఎండిపోయి, భయంతో పరుగుపెట్టాడు. కుబేరుడు తన వాహనాన్ని ఎక్కడం మరచిపోయి, తన వాహనమైన నరుడిని, తానే భుజాన పెట్టుకుని పారిపోయాడు.

**3. దక్షుని కోసం వెదుకుచూ ప్రమథనాయకులు చేసిన పనులేవి ?**

దక్షయజ్ఞాన్ని ప్రమథులు ధ్వంసం చేస్తున్న సమయములో ప్రజాపతులు దక్షుడిని ప్రమథుల ఎదుట లేకుండాచేసి, వారు బ్రహ్మాండ భాగానికి వెళ్ళారు.

ప్రమథ నాయకులు దక్షుడి కోసం అన్ని దిక్కులలోనూ వెదికారు. దక్షుడు కనబడలేదు. దానితో ప్రమథులు అన్ని లోకాల ప్రభువులపై దండెత్తి, దేవతల, రాక్షసుల, నాగుల గుంపులను ఆక్రమించారు. ఆ ప్రమథులు మునులను, మనుష్యులను, రాక్షసులను, నాగులును, దేవతలను వారి వీపుల చర్మాలను ఊడదీసి, వారి మెడలో గుదిబండను కట్టి, దానిని వారిచేత మోయించారు. వారి తలల ముందు భాగాలు కట్టికొట్టారు. వారి పెడచేతులు కట్టి వారి చర్మాలు ఒలిపించి విజృంభించి విరసము చేశారు.

ఆ ప్రమథ నాయకులు దండెత్తి, భుజబలముతో తాకి, దుర్గార్ముడని ఇంద్రుని చేయి విరిగేటట్లు వేగంగా పడబాదారు. యజ్ఞపురుషుని తలపుర్రెను ఊడగొట్టారు. భయంకరులై కోపంతో భగుని మీదపడి అతడి ఒక కన్నును ఊడదీసి విసిరి వేశారు. వారు కోపంతో బలంగా చుట్టుముట్టి పూషుడు అనే ఆదిత్యుని ముందరి పండ్లు రాలగొట్టారు.

ప్రమథులు కోపావేశముతో బ్రహ్మను విష్ణువుతో చేర్చి బంధించారు. దేవతలను, దిక్పాలురను, ఇంద్రాదులను వెంటనే అవమానపరచారు. పాపాత్ముడు వధించుటకు అర్హుడు. నిందింపదగిన బ్రాహ్మణుడూ అయిన దక్షుడు ఎక్కడ ఉన్నాడో చూపించండి అంటూ ప్రమథులు దేవతలను చుట్టుముట్టి దండించారు.

**4. గణాధిపతులు శివుని కోపాన్ని చూచి ఎలా విజృంభించి మాట్లాడారు ?**

శివుడి నేత్రాగ్ని జ్వాలలు బ్రహ్మాండము వరకూ వ్యాపించాయి. అప్పుడు శివుని వాహనమైన నంది మూడు లోకాలకూ భయాన్ని కలిగించే ఆకారముతో అక్కడకు వచ్చింది. ఆ తరువాత పుష్పదంతుడు, భృంగిరిటుడు, ఘంటాకర్ణుడు, మహాకర్ణుడు, విభోగుడు, వీరుడు, శంకరుడు, వీరభద్రుడు, రుద్రుడు అనే గణనాయకులు ఒకరినొకరు అతిశయించేటట్లు విజృంభించారు.

ప్రమథులు "విష్ణుమూర్తిని మర్దింతుమో, బ్రహ్మను బంధింతుమో, ఇంద్రుడు మొదలయిన దిక్పాలకులను జంపుదమో, దేవతలను సంహరింతుమో, లోకనాశనమును చేయడానికి దండెత్తి పోవుదమో, విశ్వేశ్వరుడైన ఈశ్వరుడు ఎవరి మీద కోపించాడో చూడండి'' అంటూ భయంకరమైన ఆకారాలతో సంక్షోభించారు.

ఈశ్వరుడు దక్షుని తిరస్కరించడానికి తెలిసిన ఆ ప్రమథులు కోపంతో ఈశ్వరుని ముందుకు వచ్చి, మహాబ్రహ్మ ప్రళయాన్ని చేయడానికి, సర్వనాశనాన్ని చేసే మహా ప్రళయాన్ని ప్రారంభించడానికి, బ్రహ్మాండాన్ని ముక్కలు చేయడానికి

తామే సరిపోతాము అనే శివునికి చెప్తూ వారు విజృంభించారు. ప్రమథగణ నాయకులు ఒక్కొక్కరూ ఒక్కొక్క విధంగా ఇలా శివునికి చెప్పారు.

"నేను బ్రహ్మాండమునంతటినీ తూట్లు పడేటట్లు ఛేదిస్తాను. నేను కులపర్వతాలు భూమి మీదపడి, కూలిపోయేటట్లు త్రోస్తాను. నేను లోకాలన్నింటినీ సముద్రములందు కలిపివేస్తాను. నేను మహాసముద్రాలన్నింటినీ, బ్రహ్మాండము వరకూ, అక్కడి నుండి వెలువడేటట్లు చల్లి, విశ్వాన్ని ఇప్పుడే భయంకరంగా సంహరిస్తాను.

నేను లోకాలను కోపముతో మ్రింగుతూ, అధిక బలముతో విష్ణువు మొదలయిన దేవతల గర్వాన్ని పోగొట్టి, వారిని బంధించి తెస్తాను. ఓ శంకరా ! నేను ఉండగా, నీవు కోపించడం తగదు. దక్షుని మీద కోపంతో లోకాన్ని అంతటినీ ఇప్పుడే నశింపచేయాలని భావించడం, నీకు తగదు. దేవా ! నన్ను పంపించు. వేగంగా నేనువాడిని బంధించి తెస్తాను" అని ప్రమథగణ నాయకులు, శివునితో అన్నారు.

**5. దక్షయజ్ఞమును నాశనము / ధ్వంసము చేయడానికి వెళుతున్న గణపతి వద్దకు ఎవరెవరు ఎలా వచ్చారు? వారు ఏవిధముగా దక్షయజ్ఞాన్ని ధ్వంసం చేశారు ?**

శివుని అనుజ్ఞను తీసుకొని గణనాయకుడైన గణపతి, దక్షాధ్వర ధ్వంసానికి బయలుదేరాడు.

అప్పుడు లావుగాను, మిక్కిలి ఎత్తు అయిన శరీరము కలవారు, నాలుగు భుజములు, నొసటి కన్నులు, శూలములు పుట్టెలు, కఠినములైన ధనుస్సులు, ఖడ్గములు, ధరించినవారునూ, భయంకర పరాక్రమము కలవారునూ, అందరికీ భయాన్ని కలిగించే రూపములు కలవారునూ అయిన ప్రమథ నాయకులు అస్థిపంజరములను ధరించి గణపతి దగ్గరకు వచ్చారు.

ఆ సమయములో దేవగణములకు అధీశ్వరియైన మహాకాళి, శాకినులు, డాకినులు, కూశ్మాండులు, యోగినులు అనే అందరినీ వెంటబెట్టుకొని, చక్రవాళ పర్వతములోగల చీకటి అంతా ఒక ఆకారాన్ని ధరించిందా అన్నట్లు మహాకాళి నల్లని భయంకరమైన ఆకారముతో ఆకాశాన్ని ఆక్రమించి అక్కడకు వచ్చింది.

ఈవిధంగా గణాలు అందరితో కలసి, గణపతి వేగంగా దక్షప్రజాపతిపై దండెత్తి యజ్ఞవాటికను చూచి, తన గణాలకు చేతితో సంజ్ఞ చేశాడు.

ప్రమథులు యజ్ఞరక్షకులపైపడి, వారు తొందరగా అక్కడి నుండి పారిపోయేటట్లు వారిని తరిమారు. వారు యజ్ఞవేదికను ఆక్రమించి, యజ్ఞవేదికలను త్రవ్వి, గుండములను పడద్రోశారు. ఋత్విక్కులను హోమాగ్ని కోసం త్రవ్విన గోతులలో పాతిపెట్టారు. యజ్ఞసహాయకులైన ఋత్విక్కులను, బలముగా చితక్కొట్టారు. యజ్ఞకార్యాన్ని పర్యవేక్షించి వాడి మెడను నులిమి, యూపస్తంభానికి కట్టారు. పరిచారకులను బంధించి హింసించారు. అగ్నినాలుకను రెండు చీలికలుగా కోసి, పరిజనాన్ని నేలమీద పడవేసి, దక్షయజ్ఞాన్ని సునాయాసంగా ధ్వంసముచేసి, పెద్దగా అరచారు.

ఆ ప్రమథగణాన్ని చూడగానే అక్కడ ఉన్న దేవతలలో, బ్రాహ్మణులలో కొందరు పై ప్రాణములు పైననే పోగొట్టుకున్నారు. కొంతమంది ఓడి నశించారు. కొంతమంది భయంతో కలతపడ్డారు.

**6. ప్రమథ నాయకుల తాకిడిని సహింపలేక దేవతలు ఎలా తప్పించుకు పారిపోయారు ?**

బ్రహ్మ తన వాహనమైన హంసను ఎక్కడానికి వెళ్ళి, భయంతో వణకి, నేలపై పడ్డాడు. అలాపడిన బ్రహ్మను హంస నోటితో కఱచి పట్టుకొని, వేగంగా పరుగెత్తింది.

విష్ణుమూర్తి తన వాహనమైన గరుత్మంతుని నడుమునూ, మెడనూ కాలుతోనూ, చేతితోనూ గట్టిగా పట్టుకొని శరీరమంతా చెమట నీరు క్రమ్మగా, భయంతో పారిపోయాడు.

ప్రమథగణములు అరుస్తుండగా సహస్రాక్షుడైన ఇంద్రుడు తన వాహనమైన ఐరావతము మీదికి ప్రాకి పారిపోయాడు.

వెనుకనుండి ప్రమథులు అరుస్తూ ఉంటే యముడు భయపడి తన వాహనమైన దున్నపోతును తాను ఎక్కడం మరచిపోయి, ఆ దున్నపోతుపై ఉప్పు గోనెవలె అడ్డముగాపడి పరుగెత్తాడు.

వరుణుడు తాను సముద్రములకు అధిపతియైనా, భయముతో నోటిలో తడి కూడా లేకుండా, భయపడి పారిపోయాడు.

కుబేరుడు, నరవాహనుడు, వెనుక నుండి పిశాచములు కేకలు వేస్తుండగా, ఆ కుబేరుడు భయపడి తాను ఎక్కవలసిన మనుష్యుడిని ఎక్కడం మరచి, ఆ మనుష్యుడు తన భుజంపై ఎక్కించుకొని పారిపోయాడు.

**7. దక్షుడు కనబడకపోవడంతో, ప్రమథులు లోకాధీశ్వరులపై ఎలా దండెత్తారు ?**

ప్రజాపతులు, దక్ష ప్రజాపతిని, గణనాయకులకు కనబడకుండా తప్పించి, బ్రహ్మాండ భాగమునకు వెళ్ళారు. అప్పుడు ప్రమథులు అన్ని దిక్కులలోనూ వెదికారు. కాని దక్షుడు కనబడలేదు. దానితో ఆ ప్రమథగణము, సమస్త లోకాల ప్రభువులపై దండెత్తారు.

ఆ ప్రమథులు వలపరచినట్లు లోకాలన్నీ తిరిగి పెద్ద ధ్వని అయ్యేటట్లు దేవతలను, రాక్షసులను, నాగులను ఆక్రమించారు. ఆ ప్రమథులు మునులను, మనుష్యులను, రాక్షసులను, దేవతలను పట్టుకొని, వారి వీపులపై చర్మాలను ఊడదీశారు. గుదిబండ కట్టి వారిచే మోయించారు. వారి తల ముందు భాగాన్ని కట్టి, కొట్టి, వారి పెడచేతులను కట్టి, వారి చర్మాలను ఒలిచారు.

ఆ ప్రమథులు దండెత్తి వెళ్ళి దుర్మార్గుడని ఇంద్రుని చేతిని విరిచి, పడబాదారు. యజ్ఞపురుషుడి తలపుట్టెను ఊడగొట్టారు. కోపముతో భగుని యొక్క కన్నును ఊడదీశారు. పూషుని ముందరి పండ్లను రాలగొట్టారు.

కోపముతో బ్రహ్మను విష్ణువుతో చేర్చి, బంధించారు. దేవతలనూ, దిక్పాలురనూ, ఇంద్రాదులనూ అవమానించి, పాపాత్ముడైన నింద్య బ్రాహ్మణుడైన దక్షుడు ఎక్కడ ఉన్నాడో చూపించండని, దేవతలను చుట్టుముట్టి వారు దండించారు.

**8. యజ్ఞశాలలో దక్షుని చూసి ప్రమథ నాయకులు ఏమి చేశారు ?**

దక్షుని కోసం వెదుకుతున్న ప్రమథులకు దేవతలు, మునులు దక్షుడు ఉన్న చోటును సంజ్ఞతో చూపించారు. అప్పుడు దక్షుడు భయముతో కంగారుపడ్డాడు. తనను చూసిన వారందరికీ నమస్కరిస్తూ దాగుకొన్న దక్షుడిని చూసి గణాధినాయకులు తెలిసికొని పట్టుకొన్నారు.

"ఈతడు దుర్మార్గుడు. ఇతడు దక్షుడు అనే అవివేక బ్రాహ్మణుడు. వీడు అందరినీ వధింపదగినవాడు. ఆలస్యము చేయకండి. శివుడిని దూషించే వీడి నాలుకను కోసి ఉప్పు కూరండి. సీసమును కరగించి, ఆ ద్రవాన్ని ఇతని శరీరానికి పూయండి. ఇనుమును కాచి వీడి నోట్లో పోయండి. ఈ దుర్మార్గుని చర్మాన్ని ఊడదీయండి. వీడి బలము అంతా నశించేటట్లు, వీడి కన్నులకు పెరికివేయండి" అంటూ అనేక రకాలుగా ప్రమథులు మాట్లాడారు. నరకలోకానికి తగిన శిక్షలతో, దక్షుని శిక్షించారు. తరువాత దక్షుడిని తమ ప్రభువైన గణపతికి అర్పించారు.

ఆ తరువాత గణపతి ఆజ్ఞాపించగా, వారు దక్షుని పడగొట్టి, కాళ్ళూ చేతులూ కట్టి, పెద్ద దుడ్డు కఱ్ఱతో చేసిన కావడిలో పెట్టి, తీసుకొనివచ్చి శివునకు చూపించారు.

## వ్యాసరూప ప్రశ్నలు - సమాధానములు

**1. "దక్షయజ్ఞం" పాఠ్యభాగ కథను వ్రాయండి.**

శివుని భార్య సతీదేవి, యోగాగ్నిలో దగ్ధమయ్యిందని నారదుడు శివునకు చెప్పాడు. దానితో శివుని కోపాగ్ని శివుని ఫాలాగ్నితో కలిసి, బ్రహ్మాండము అంతా వ్యాపించింది. అప్పుడు శివుని వాహనమైన నందీశ్వరుడు అనే ఎద్దు అక్కడకు వచ్చింది. దాని పాదాల త్రొక్కిడికి, భూమి అణగిపోయింది. అప్పుడు ప్రమథ గణనాయకులు విజృంభించారు.

ప్రమథులు, ఈశ్వరుడు దక్షునిపై కోపించాడని తెలిసికొన్నారు. వారు శివుని ముందుకు వచ్చి బ్రహ్మ ప్రళయాన్ని చేయడానికీ, మహాప్రళయాన్ని ప్రారంభించడానికీ, తామే సరిపోతామని చెప్పారు. తామే బ్రహ్మాండాన్ని ఛేదిస్తామని, లోకాల్ని సముద్రంలో కలుపుతామనీ, విశ్వాన్ని సంహరిస్తామనీ దేవతల గర్వాన్ని పోగొట్టి వారిని బంధిస్తామనీ చెప్పారు. ఈశ్వరుడు దక్షుడి మీద కోపంతో లోకాన్ని నశింపజేయడం తగదని, తమను పంపిస్తే తామే దక్షుని బంధించి తెస్తామనీ వారు చెప్పారు

అప్పుడు గణాధిపతి అయిన గణపతి మిగిలిన ప్రమథులను మాట్లాడవద్దని చెప్పి, అది తన తల్లికి జరిగిన అవమానము కాబట్టి దక్షుని బంధించి తెచ్చే పనిని తనకే అప్పగించమని శివుని కోరాడు. శివుడు దక్షయజ్ఞాన్ని ధ్వంసం చేసి దక్షుని బంధించి తీసికొని రమ్మని, గణపతికి చెప్పాడు.

అప్పుడు ఆయుధాలు ధరించి ప్రమథనాయకులు గణపతి దగ్గరకు వచ్చారు. మహాకాళి, శాకిన్యాది దేవతలతో వచ్చింది. గణపతి వీరందరితో కలసి దక్షుడిపై దండెత్తాడు.

ప్రమథులు యజ్ఞరక్షకులను తరిమివేశారు. వేదికలను త్రవ్వి గుండాలను పడద్రోశారు. ఋత్విక్కులను పాతిపెట్టారు. యజ్ఞపర్యవేక్షకుడి మెడ నులిమి, యూపస్థంభానికి కట్టారు. అగ్ని నాలుకను చీల్చారు. దక్షయజ్ఞాన్ని నాశనం చేసి ప్రమథులు గట్టిగా అరచారు.

ప్రమథుల విజృంభణను చూసి, బ్రాహ్మణులు దేవతలు భయపడి పారిపోయారు. కొందరు భయంతో మొఱపెట్టారు. కొందరి పైప్రాణములు పైకి పోయాయి. కొందరు సేనాముఖము నుండి పారిపోయారు.

బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుడు, యముడు, వరుణుడు, కుబేరుడు అతికష్టంమీద ఆ యజ్ఞశాల నుండి ఎలాగో తప్పించుకొని పారిపోయారు. అప్పుడు ప్రజాపతులు దక్షుడిని అక్కడ లేకుండా దాచి, తాము బ్రహ్మాండ ఖండానికి వెళ్ళారు.

ప్రమథులు అన్ని దిక్కుల్లోనూ దక్షుని కోసం వెతికారు. వారికి దక్షుడు కనబడలేదు. వారు దానితో అన్ని లోకాల ప్రభువులపై దండెత్తారు. ప్రమథులు, దేవరాక్షస నాగగణాలను ఆక్రమించి, వారి వీపుల చర్మాలు ఊడదీశారు. వారి మెడలకు గుదిబండలు కట్టి వారిచే మోయించారు. వారి తలలను కట్టి, వారి పెడచేతులు కట్టి వారి చర్మాలు ఊడదీశారు. ప్రమథులు, ఇంద్రుని చేతిని విరుగగొట్టి, అతణ్ణి పడగొట్టారు. యజ్ఞపురుషుడికి తలపుర్రెను ఊడగొట్టారు. భగుడి కన్నును పీకి, పూషుని ముందు పండ్లు రాలగొట్టారు. బ్రహ్మవిష్ణువులను బంధించారు. దక్షుడు ఎక్కడ ఉన్నాడో చూపమనీ, దేవతలను వారు దండించారు.

కొందరు మునులు, దేవతలు, దక్షుడు దాగిన ప్రదేశాన్ని కనుసన్నం చేసి ప్రమథులకు చూపించారు. ప్రమథులు, బెదురుచూపులు చూస్తున్న దక్షుడిని పట్టుకొన్నారు.

ప్రమథులు దక్షుని పట్టుకొని వీడే దక్షుడు. శివుడిని దూషించిన వీడి నాలుకను కోసి ఉప్పు అద్దండి. సీసాన్ని కరగించి వీడి శరీరానికి పూయండి. వీడి కళ్ళు పీడి వేయండి అంటూ దక్షుడిని దండించి గణపతికి అప్పగించారు.

గణపతి ఆజ్ఞపై ప్రమథులు దక్షుని కాళ్ళూ, చేతులూ కట్టి కావడిలో దక్షుడిని పెట్టి, శివుని వద్దకు తీసుకువచ్చారు.

**2. గణాధీశ్వరుడైన గణపతి దక్షయజ్ఞాన్ని ఎలా ధ్వంసం చేయించాడో వివరించండి ?**

శివుని కోపాన్ని చూసి ప్రమథగణము విజృంభించి తామే దక్షుని బంధించి తీసుకువస్తామని, ప్రగల్భాలు పలికారు. వారినందరినీ కాదని, గణాధీశ్వరుడైన గణపతి, ఈశ్వరునితో ఇలా చెప్పాడు.

ఓ దేవా ! చిన్నపిట్టపై కోపంతో, పాశుపతాస్త్రాన్ని వింటిపై సంధించడం ఎందుకు ? క్రిందనే ఉండే కాయల్ని కోయడానికి ఎత్తుగా ఉన్న రాయి ఎందుకు ? ఎలుకను వేటాడటానికి "ఉడుప కుక్క" ఎందుకు ? నీవు కోప్పడవలసిన అవసరం లేదు. నన్ను పంపు. దక్షుని బంధించి తీసుకువస్తాను. ఇది నా తల్లికి జరిగిన అవమానము. కాబట్టి, ఆ పని నాకు అప్పగించండి" అని గణపతి శివుని కోరాడు.

శివుడు గణపతి సాహసాన్ని తెలుసుకొని, దక్షయజ్ఞాన్ని ధ్వంసం చేసి, దక్షుడిని బంధించి తెమ్మని గణపతిని నియమించాడు. గణపతి, మహాప్రసాదమని చెప్పి బయలుదేరాడు.

అప్పుడు ఎత్తైన లావు అయిన శరీరాలు కలిగినవారు, నాలుగు భుజాలు, నొసలిపై కన్నులు, శూలములు, పుర్రెలు, ధనుస్సులు, ఖడ్గములు ధరించిన ప్రమథనాయకులు, అస్థిపంజరాలతో గణపతి దగ్గరకు వచ్చారు. మహాకాళి, శాకినులను, డాకినులను, కూశ్మాండులను, యోగినులను వెంటపెట్టుకొని అక్కడకు వచ్చింది. వారందరితో కలసి గణపతి దక్షునిపై దండెత్తివెళ్ళి, యజ్ఞశాలను చూసి తన ప్రమథగణములకు చేతితో సంజ్ఞ చేశాడు.

ప్రమథులు, యజ్ఞరక్షకులపైపడి, వారిని తరిమారు. చూసే వాళ్ళను మూలలకు తరిమారు. యజ్ఞవేదికలను త్రవ్వి, గండములను పడగొట్టారు. ఋత్విక్కులను, హోమాగ్ని గుండాలలో పాతిపెట్టారు. యజ్ఞసహాయకులను చితకకొట్టారు. యజ్ఞపర్యవేక్షకుడి మెడ నులిమి, యూపస్తంభానికి కట్టారు. అగ్ని నాలుకను రెండుగా చీల్చారు. వారు పరిజనాన్ని నేలమీద పడవేసి, యజ్ఞాన్ని ధ్వంసం చేసి గట్టిగా అరిచారు.

ప్రమథ నాయకులను చూసి దేవతలు, బ్రాహ్మణులు భయపడ్డారు. కొందరి పై ప్రాణాలు పైకి పోయాయి. కొందరు భయపడి నశించారు. కొందరు మొర్రో అని ఏడ్చారు. కొంతమంది తప్పించుకొని పోయారు.

బ్రహ్మ, తన వాహనమైన హంస ఎక్కబోయి భయంతో నేలపై పడ్డాడు. అప్పుడు హంస బ్రహ్మను నోటితో కరచిపట్టుకొని పారిపోయింది. విష్ణుమూర్తి గరుత్మంతుని మెడనూ, నడుమునూ, కాలితో, చేతితో గట్టిగా పట్టుకొని చెమటలు కారుతుండగా పారిపోయాడు. దేవేంద్రుడు ఐరావతము మీదికి ప్రాకి పారిపోయాడు. యముడు తన దున్నపోతుపై ఉప్పు బస్తాలా అడ్డంగాపడి, భయంతో పారిపోయాడు. వరుణుడు నోరు ఎండిపోయి భయంతో పరుగుపెట్టాడు. కుబేరుడు తన నర వాహనాన్ని ఎక్కడం మరచిపోయి, తన వాహనము అయిన నరుడుని, తానే భుజాన పెట్టుకొని పారిపోయాడు. వరుణుడు, నోరు ఎండిపోయి భయంతో పరుగుపెట్టాడు. కుబేరుడు తన నర వాహనాన్ని ఎక్కడం మరచిపోయి, తన వాహనము అయిన నరుడిని తానే భుజాన పెట్టుకొని పారిపోయాడు.

ప్రజాపతులు దక్షుడిని అక్కడ నుండి పంపించి, తాము బ్రహ్మాండానికి వెళ్ళారు. గణనాయకులు ఎలాగో దక్షుడిని వెదకి పట్టుకొని, గణపతికి అప్పగించారు. గణపతి ఆజ్ఞపై వారు దక్షుడి కాళ్ళూ, చేతులు కట్టి, కట్టెకావడిపై తెచ్చి, దక్షుడిని ఈశ్వరుని ముందుపెట్టారు.

**3. ప్రమథులు దక్షయజ్ఞాన్ని ధ్వంసం చేసి దక్షుని బంధించి తెచ్చిన విధానము తెల్పండి.**

శివుని అనుజ్ఞను తీసుకొని, గణనాయకుడైన గణపతి దక్షయజ్ఞానికి బయలుదేరాడు.

లావుగా, ఎత్తుగా శరీరాలు కలవారు, నాలుగు భుజములు, నొసలిపై కన్నులు, శూలములు, పుర్రెలు, ఖడ్గములు ధరించినవారు, భయంకర పరాక్రమము కల్గిన ప్రమథనాయకులు, అస్థిపంజరాలతో గణపతి దగ్గరకు వచ్చారు. దేవగణాధీశ్వరియైన మహాకాళి, నల్లని రూపంతో, సమస్తమైన శాకిని, డాకిని, కూశ్మాండ, యోగినీ గణంతో వచ్చింది.

ఆ ప్రమథగణమును వెంటబెట్టుకొని, గణపతి దక్షయజ్ఞానికి వెళ్ళి కోపంతో తన చేతితో, ప్రమథగణములకు సంజ్ఞ చేశాడు.

ప్రమథులు, యజ్ఞరక్షకులపై పడి, వారిని తరిమివేశారు. చూసే వారికి మూలలకు తరిమారు. యజ్ఞశాల యొక్క వేదికలను త్రవ్వి, గుండములను పడద్రోశారు. ఋత్విక్కులను, హోమాగ్నికై త్రవ్విన గోతిలో పాతిపెట్టారు. యజ్ఞ సహాయకులైన ఋత్విక్కులను, యూపస్తంభాలకు కట్టారు. పరిచారకులను బంధించారు. అగ్ని నాలుకను రెండుగా చీల్చారు. పరిజనాన్ని, నేలమీద పడవేసి దక్షయజ్ఞాన్ని వెంటనే ఆక్రమించి, సునాయాసంగా ధ్వంసం చేసి అరచారు.

ఆ ప్రమథనాయకులను చూసి, భయపడి కొందరు బ్రాహ్మణులు, దేవతలు, తమ పై ప్రాణాలను పైననే పోగొట్టుకున్నారు. కొందరు ప్రమథులు చుట్టుముట్టగా ఓడి నశించారు. కొందరు మొఱ్ఱోయని ఏడ్చారు. కొందరు అక్కడినుండి తప్పించుకొని పారిపోయారు దిక్పాలకుల, బ్రహ్మ, విష్ణువులు భయంతో పారిపోయారు.

ప్రమథులకు ఎంత వెదికినా, దక్షుడు ఉన్నచోటు కనబడలేదు. దానితో ప్రమథులు, లోకాదీశ్వరులపై పడి, దేవరాక్షస నాగులను ఆక్రమించారు. ప్రమథులు, మునులను, మనుష్యులను, నాగరాక్షసులను, దేవతలను పట్టుకొని, వారి వీపుల చర్మాలు ఊడదీశారు. భగుడి కన్నుని పీకివేశారు. యజ్ఞపురుషుడి తల పుఱ్ఱెను ఊడగొట్టారు. పూషుడి, ముందరి పండ్లను రాలగొట్టారు. బ్రహ్మను, విష్ణువును కలిపి కట్టారు. దేవతలనూ, దిక్పాలకులనూ అవమానించారు. పాపాత్ముడైన దక్షుడు ఎక్కడ ఉన్నాడో చూపించండి అని వారు అక్కడి వారందరినీ దండించారు.

దానితో మునులు, దేవతలు దక్షుడు దాగిన ప్రదేశాన్ని ప్రమథులకు చూపించారు. వారు యజ్ఞశాలలో దాగిన దక్షుడిని పట్టుకొని, అనేకవిధాలుగా దక్షుడిని నిందించి, దండించి, గణపతికి అప్పగించారు.

గణపతి ఆజ్ఞపై ప్రమథులు దక్షుని కాళ్ళూ చేతులూ కట్టి కట్టెకావడిలో అతడిని తెచ్చి, శివునికి చూపించారు.

**4. దక్షయజ్ఞం ఆధారంగా నన్నెచోడుని కవితా వైభవాన్ని తెల్పండి.**

నన్నెచోడుడు "కుమార సంభవము" అనే తొలి తెలుగు ప్రబంధాన్ని రచించాడు. నన్నెచోడుడు, నన్నయ వంటి ప్రాచీనుడని, కాదని వాదనలు ఉన్నాయి. నన్నెచోడుడు వర్ణనా ప్రియుడు. ఈ కవి అలంకార రచనాప్రియుడు. అర్థాలంకారాలను, శబ్దాలంకారాలను కూడా ఎక్కువగా ప్రయోగించాడు. ఈ కవి కావ్యము సర్వరసములకు ఆలవాలము. నన్నెచోడుడు తన కావ్యాన్ని ప్రబంధము అని పిలిచాడు.

నన్నెచోడుడు తన కవిత్వము "వస్తు కవిత్వము" అని పేర్కొన్నాడు. వస్తుకవిత్వము అంటే శృంగారాది నవరసాలతో ప్రసిద్ధ వర్ణనలతో దేశి కవితారీతులతో, ఉపమాద్యలంకారాలతో, పండితులు ఆదరించే కవిత్వము అని చెప్పాలి. దేశి కవిత్వమే సరియైన కవితా మార్గమని నన్నెచోడ కవి చెప్పాడు. ఈతడు "జానుతెనుగు" రచనయన్న ఇష్టము కలవాడు. జానుతెనుగు అంటే భావసారళ్యత, సరసత, ప్రసన్నత కల కవిత్వము. నన్నెచోడుని కుమార సంభవము స్వతంత్రమైన తొలి ప్రబంధము.

"దక్షయజ్ఞం" పాఠంలో అలంకార ప్రియత్వము, వర్ణన నైపుణ్యము కనబడతాయి. నన్నెచోడుడు అలంకార రచనాప్రియుడు. "దక్షయజ్ఞం" పాఠములో ఉన్న పద్యాలలో ఉపమాలంకారాల, ఉత్ప్రేక్షలు, స్వభావోక్తి, దృష్టాంత మరియు శబ్దాలంకారములు ఉన్నాయి.

**1. ఉపమాలంకారాలు :**

గీ ॥ ఎలుకతోడి కోపమున ని ల్లేర్చునట్లు
దక్షుపై నల్గి జగమెల్ల నీ క్షణంబు
సంహరింపంగఁ దలఁచుట సన్నె? వానిఁ
బట్టి తెచ్చెద వడి నన్నుఁబనుపు దేవ !

2. గణాధీశ్వరుండు పరమేశ్వరున కభిముఖుండై ప్రళయకాల
నీలఘనా ఘనంబునుం బోలె మహాధ్వని గర్జిల్లుచు.

దీనిలో ఉత్ప్రేక్షాలంకారము ఉంది.

3. కం॥ లోకాలోకములోఁ గల
చీఁకటి యెల్ల నొకపాడవు సేకొనియొని నా
నాకాశ మడరి వచ్చె మ
హాకాళి మహాభయంకరాకారముతోన్

దీనిలో ఉత్ప్రేక్షాలంకారము ఉంది.

4. ఆ.వె॥ వాహనంబు నెక్క వచ్చి భయంబున
వడఁకి నేలఁబడ్డ వనజగర్భుఁ
గమిచికొని మరాళకము వాతెఁజెందమ్మిఁ
గఱచికొని రయమునఁ బఱచినట్లు

ఇది కూడా ఒక అందమైన ఉపమాలంకారము. క్రింది పద్యమును గమనించండి.

5. ఆ.వె. ॥ వేఁటకాఱు ముట్టి వెనుకొనఁగా శ్వేత
నగము చఱికిఁదారు నమిలివోలె
నభ్రగజము మీఁదికా సహస్రాక్షుడు
ప్రాఁకి పాఱెఁ బ్రమథరాజి యార్వ.

6. ఆ.వె. ॥ గరుడి నడుము మెడయుఁ గాలను గేలను
నిఱికికొనుచుఁ జక్రి వెఱచి పఱచె
ఘర్మజలము లొడలఁ గ్రమ్మంగ వర్షేంద్ర
చాప జలద భాతిఁ జడలఁ బొదల

నన్నెచోడుని వర్ణనా ప్రియత్వము ఈ క్రింది పద్యాలలో కనిపిస్తుంది. ఈశ్వరుని వాహనమైన వృషభమును

చం ॥ ఖురపద ఘట్టనన్ ధరణి గ్రుంగ ఫణీంద్రుడు నుగ్గునుగ్గు గాఁ
బరువడి నుర్వులం దెరలి పాఱఁ బయోనిధులుం గులాద్రులున్
బొరిఁబొరిఁ దుంగ శృంగహతిఁ బొంద దివంబు న జాండముల్ మహే
శ్వరు వృషభంబు నా క్షణము వచ్చెఁ ద్రిలోకభయంకరాకృతిన్.

అనే పద్యంలో అద్భుతంగా సహజ సుందరంగా నన్నెచోడుడు వర్ణించాడు.

ఈశ్వరుని భయంకరాకారామును "మహాస్రగ్ధర" వృత్తములో "వివిధాస్త్రానీక జాతావిరల బహుల సద్విస్ఫు లింగాగ్నియున్" అంటూ, శివుని ఉగ్రరూపాన్ని కవి నన్నెచోడుడు పాఠకుల కన్నులకు కట్టించాడు.

నన్నెచోడుడు తాను చెప్పినట్లు ప్రబంధ కవితకు తన వర్ణనలతో ఇతడు ఆద్యుడయ్యాడు. దేశి కవితకు, వస్తు కవితకు, జాను తెనుగుకు, ఇతడు ప్రాణం పోశాడు. నన్నెచోడుడు తెలుగు వారికి ఉన్న మహాకవులలో "కవిరాజ శిఖామణి" అనిపించుకున్నాడు.

**శ్రీమతి పి. ఉషారాణి**
ఎం.ఏ.,
తెలుగు శాఖాధ్యక్షులు,
శ్రీ గోరంట్ల వెంకన్న ఓరియంటల్ కళాశాల
తిమ్మసముద్రం

పాఠం - 5

# ధౌమ్య ధర్మోపదేశం - తిక్కన

## (మహాభారతం - విరాటపర్వం - ప్రథమాశ్వాసం - 116 నుండి 146 వరకు పద్యాలు)

## పాఠ్యభాగ సారాంశం

**విషయసూచిక :**

**5.1 కవి పరిచయం**

**5.2 పాఠ్యభాగ సందర్భం**

**5.3 పాఠ్యభాగ సారాంశం**

**5.4 ప్రతిపదార్థమునకు రాదగిన పద్యాలు**

**5.1 కవి పరిచయం :**

నన్నయ, తిక్కన, ఎఱ్ఱనలను తెలుగు సాహిత్యంలో కవిత్రయంగా చెప్పుకుంటాము. తిక్కన కవిత్రయంలో ద్వితీయుడైనా కవిత్వంలో మాత్రం అద్వితీయుడైన కవి. క్రీ.శ. 13వ శతాబ్దమునకు చెందినవాడు. నెల్లూరును పరిపాలించిన మనుమసిద్ధి ఆస్థానంలో ఆస్థానకవిగా, మంత్రిగా ప్రసిద్ధికెక్కాడు. యజ్ఞంచేసి "సోమయాజి" అయ్యాడు. మనుమసిద్ధి తాత భాస్కరుడు గుంటూరు విభుడు. తిక్కన తండ్రి కొమ్మన్న, తల్లి అన్నమ.

సంస్కృతంలో వేదవ్యాసుడు "జయ" అనే పేరుతో రచించిన మహాభారతాన్ని నన్నయ, తిక్కన, ఎఱ్ఱనలు తెలుగులోకి అనువదించారు. మహాభారతంలో 18 పర్వాలు ఉన్నాయి. అందులో విరాటపర్వం నుండి స్వర్గారోహణ పర్వం వరకు 15 పర్వాలను తిక్కన అనువాదం చేశాడు.

తిక్కన భారతానువాదంతోపాటు నిర్వచనోత్తర రామాయణం రచించి మనుమ సిద్ధికి అంకితం చేశాడు. విజయసేనం, కవిసార్వభౌమ ఛందస్సు, కృష్ణశతకం కూడా వీరి లేఖిని నుండి వెలువడినట్లు పేర్కొనబడుతున్నాయి. కవిబ్రహ్మ, ఉభయకవి మిత్రుడు అనేవి వీరి బిరుదులు. తిక్కన తన భారతాన్ని హరిహరనాథునికి అంకితం చేశాడు.

తిక్కన రచనలో తెలుగుదనం మూర్తీభవిస్తుంది. వీరి రసాభ్యుచిత బంధాన్ని శ్రీనాథుడు అనుకరించాడు. సందర్భోచిత పదప్రయోగం, వర్ణనా చాతుర్యం, పాత్రపోషణ నైపుణ్యం, తెలుగు నుడికారసొంపు అల్పాక్షరాలతో అనల్పార్థస్ఫూర్తి తిక్కన సొంతం. తిక్కనది నాటకీయ శైలి. ప్రస్తుత పాఠ్యభాగం ఆంధ్రమహాభారతంలోని విరాటపర్వంలోని ప్రథమాశ్వాసం నుండి గ్రహించబడింది.

**5.2 పాఠ్యభాగ సందర్భం :**

ధర్మరాజు పాచికలాటలో ఓడిపోయాడు. దుర్యోధనునితో చేసుకున్న ఒడంబడిక ప్రకారం 12 సంవత్సరాలు అరణ్యవాసం పాండవులు ముగించారు. ఒక సంవత్సరం అజ్ఞాతవాసం చేయడానికి విరాట నగరం అనువైన ప్రదేశంగా ఎంచుకున్నారు. ధర్మరాజు కంకుడు అనే పేరుతో సన్యాసి వేషంలో, భీముడు వలలుడు అనే వంటవాడిగా, అర్జునుడు బృహన్నల పేరుతో అంతఃపుర కాంతలకు నాట్యం నేర్పుటకు, నకులుడు అశ్వశిక్షకుడిగా ధామగ్రంధి పేరుతో సహదేవుడు తంత్రీపాలుడు అనే పేరుతో గోరక్షకుడిగా ద్రౌపది మాలిని అనే పేరుతో సైరంధ్రీపుర స్త్రీ వేషంలో విరాట మహారాజు కొలువులో చేరడానికి నిశ్చయించుకున్నారు.

ధర్మరాజు అరణ్యవాసంలో తమతోపాటు ఎన్నో కష్టాలు అనుభవించిన బ్రాహ్మణోత్తములను చూసి బ్రాహ్మణోత్తములారా ! దుర్యోధనుడు చేసిన దుష్టతంత్రాలు మీకు తెలుసుకదా ! మాతో పాటు మీరంతా అరణ్యాలలో

చాలా కష్టాలు అనుభవించారు. 12 సంవత్సరాల కాలం ఏదో ఒకవిధంగా గడచిపోయింది. ఇది పదమూడవ సంవత్సరము. మేము అజ్ఞాతవాసం పూర్తిచేయాలి. దుర్యోధనుడు, దుశ్శాసనుడు, కర్ణుడు, శకుని మొదలయినవారు మా అజ్ఞాతం చెడగొట్టటానికి ప్రయత్నిస్తారు. ఏదైనా చిన్న ఆచూకీ దొరికితే మాకు కష్టాలు తప్పవు. కావున ఎటువంటి ఆటంకాలు కలుగకుండా సాగేటట్లు ఆశీర్వదించండని కోరి, వారిని పంపివేశాడు. ఆ సమయంలో బ్రాహ్మణోత్తముడైన ధైమ్యుడిని అగ్నిహోత్రుడివలే గౌరవిస్తూ ప్రదక్షిణ నమస్కారాలు చేసి అతని సెలవు తీసుకొని వెళ్ళే సందర్భంలో ధౌమ్యుడు వారికి రాజుకొలువులో ఏవిధంగా మెలగాలో చెప్పాడు. దీనినే దౌమ్యనీతిగా చెప్పటం పరిపాటి.

### 5.3 పాఠ్యభాగ సారాంశం :

పాండవులు కురువంశీయులు. వారికి పరిపాలించడమే తెలుసు. సేవకులుగా మెలగడం వారికి తెలియదు. దౌమ్యుడు పాండవుల మేలుకోరే పురోహితుడు. కావున విరాటరాజు కొలువులో సేవకులుగా ఏవిధంగా మెలగాలో వారికి ఈవిధంగా వివరించాడు.

### ధౌమ్యుడు పాండవులకు సేవాధర్మంబు తెలుపుట :

లోకంలో తెలిసినవారు ఎందరో వుండవచ్చు. కానీ శ్రేయోభిలాషులయినవారు అటువంటి విజ్ఞులకు కూడా బుద్ధులు చెప్పకుండా ఉండలేరు. అందుచేత అదునెరిగి తగిన బుద్ధులు చెప్పవలసిందే. మీరు కురు వంశంలో పుట్టినవారు, గౌరవంగా పెరిగారు. మీవంటివారు ఒక సామాన్య మానవమాత్రుడిని సేవిస్తూ మానావమానాలు సహిస్తూ, అణగిమణిగి సవినయంగా ఉండడం వీలుకాని పని. వివిధాస్త్రాలు మంటలు వంటివి. వాటిని ధరించే పాండవులు అగ్నులవంటివారు. అటువంటి పాండవులు కాలవిరోధాన్ని మరచిపోకూడదు. అందరికీ తెలిసేటట్లు పరాక్రమాలు ప్రదర్శిస్తే ఉనికి బయటపడుతుంది. అజ్ఞాతవాసానికి భంగం కలుగుతుంది. కార్యం చెడుతుంది. మీకు ఎటువంటి ప్రమాదం కలుగకూడదు అని నా ఆశ. అందువల్ల నాకు తెలిసిన విధంగా ఉపదేశం చేస్తాను. రాజులను సేవిస్తూ బ్రతికేవారు కడు జాగ్రత్త వహించాలి. అందువల్ల రాజు సేవలో ఇబ్బందులు పడకుండా సాధారణ నీతిని చెబుతాను శ్రద్ధగా వినండి అని ఈ విధంగా చెప్పాడు.

సేవకుడు తగిన పద్ధతిలో సభలోకి అడుగుపెట్టాలి. తన స్థాయికి తగిన ఆసనంలో కూర్చోవాలి. తన రూపం, వేషం వికృతంగా ఉండకుండా చూచుకోవాలి. సమయం తెలుసుకొని మసలుకొంటూ రాజుని సేవించాలి. ఆవిధంగా చేయగల వ్యక్తి రాజు గౌరవాన్ని పొందడానికి అర్హుడౌతాడు. నేను రాజు కొలువులో ఉన్నాను. రాజు దగ్గరే చనువుగా తిరుగుతున్నాను. నాకేమిటి ? అని నిర్భయంగా అమర్యాదగా నడుచుకుంటే మొదటకే మోసం వస్తుంది.

రాజుగారి నివాసంకన్నా అందమైన నివాసంలో సేవకులు ఉండకూడదు. రాజుగారు వేసుకునే వస్త్రముల వంటి వస్త్రాలు సేవకుడు ధరించకూడదు. రాజులాగా విహరించకూడదు. రాజు మాట్లాడే పద్ధతిలో మాట్లాడకూడదు. అది సేవకునికి తగదు. రాజు తమ ఆజ్ఞను మీరినవారు పుత్రుడైనా, సోదరుడైనా, మిత్రుడైనా, స్నేహితుడైనా శత్రువుగానే భావిస్తాడు. కోపం పెంచుకొని వారి అంతుచూస్తాడు. ఏదైనా సరే సాధించుకోగలిగిన సమర్థుడి పనికి అడ్డు వెళ్ళకూడదు. తగుదునమ్మా అని ఆ పని మీద వేసుకొని చేయడానికి ప్రదర్శిస్తే అసలుకే ముప్పువస్తుంది.

రాజుతో సన్నిహితంగా ఉండవచ్చు. కాని రాజు దగ్గరుండేవారికి కష్టం కల్గించే పనులలో జోక్యం చేసుకోకూడదు. అటువంటి పనులవల్ల సేవకుడి తేజస్సు బయటపడుతుంది. వాటివల్ల పేరు ప్రతిష్ఠలు రావచ్చు. కాని ఆ తరువాత తప్పక హాని కలుగుతుంది. అందుచేత తెలివిగలవారు అటువంటి పనులకు పూనుకోరు. రాజు దగ్గర మౌనంగా ఉండకూడదు. అట్లా అని పదిమందితో విచ్చలవిడిగా మాట్లాడటం పనికిరాదు. తనకు దగ్గరివారైన కొలువుకాండ్రలో కలసి రాజుతో

మాట్లాడటం మంచిది. రాజు దగ్గర ఉన్నప్పుడే వ్యతిరేకత తోచే విధంగా ఇతరులకు సమాధానం చెప్పకూడదు. అవసరం ఏర్పడితేనే తనంతట తానే ముందుకు వచ్చి రాజాజ్ఞను అంగీకరించాలి.

రాజు కొలువు తీరి ఉన్నప్పుడు రాజుగారికి మరీ ఎదురుగా ఉండకూడదు. అలా అని వెనుకవైపూ ఉండకూడదు. ఏదో ఒక ప్రక్క నిలబడాలి. ఏమంటాడో ఎటు చూస్తున్నాడో, ఎవరిని చూస్తే ఎటువంటి ఆలోచనలు కలుగుతాయో ననే భావన మనసులో ఉంచుకొని రాజు ముఖం మీదే దృష్టిపెట్టాలి. ఆవిధంగా సభలో మెలగాలి. అంతఃపురంలోని మాటలు ఎప్పటికీ బయటపెట్టకూడదు. రాజుకు సంబంధించిన మాటలు ఎక్కడైనా వింటే ముందు ఆలోచించాలి. ఆ తరువాత రాజు వినదగినవైతే చెప్పాలి. భటుడికి అంతఃపురంలో సంబంధం మంచిదికాదు హానికారి. అక్కడ తిరిగే గూనివారు, పొట్టివారు, పరిచారికలు మొదలైన వారితో స్నేహం అంతకంటే కీడు కలిగిస్తుంది. రాజు అనుమతిస్తేనే గద్దె ఎక్కాలి. ఏనుగులు, గుర్రాల వంటి వాహనాలు ఎక్కాలి. అంతేగాని ఎంతగా రాజగౌరవం పొందినవారైనాసరే తమంతట తాము శ్రేష్ఠమైన ఆసనాలు పెద్దపెద్ద వాహనాలు ఎక్కకూడదు.

రాజు గౌరవించాడని ఉబ్బిపోకూడదు. అవమానించాడని క్రుంగకూడదు. ఆ రెండింటినీ లెక్కించక మునుపటివలే ప్రవర్తించేవారికి మేలు జరుగుతుంది. ఆపదలు తొలగుతాయి. రాజు ఎవరినైనా సంరక్షించాలి అనుకోవచ్చు లేదా శిక్షించాలని అనుకోవచ్చు. ఆ విషయాలు తనకు తెలిసినా అవి అమలుకాకముందే సేవకుడు తనంతట తాను బయటపెట్టకూడదు. ఆవిధంగా బైటపెట్టేవాడు మూర్ఖుడు. ఎండకూ వానకూ సహించాలి. తన ఇల్లని పొరుగు చోటని భావించరాదు. ఆకలి వేస్తుంది, అలసిపోతాను. నిద్రకు సమయం మించి పోతుంది, దాహం వేస్తుంది, ఒక్కడినే ఎలా చెయ్యను అనే ఆలోచనలకు అవకాశం ఎప్పుడూ ఇవ్వకూడదు. అనుకోకుండా రాజు పని చెబితే శ్రద్ధాభక్తితో చెయ్యాలి. రాజుకు తాను ఎంత ఆప్తుడయినా కావచ్చు. రాజుగారి ధనాన్ని పాము ఎముకల్లా భావించాలి. వాటిని పరికించాలి. వాటిని సంగ్రహించే గుణం మానితేనే మానమూ, ప్రాణమూ నిలుస్తాయి.

రాజు కొలువు తీరినప్పుడు సేవకుడు ఆవులించకూడదు. తుమ్మటం మంచిదికాదు. నవ్వటం అసలే పనికిరాదు. ఉమ్మివేయటం తప్పు. ఇవి ప్రక్కవాళ్ళు సహించలేనివి కాబట్టి వాటిని గోప్యంగా చేయాలి. శత్రువుల దూతలుగాని రాజు ఆగ్రహానికి గురై నిరాకరించబడిన వారుగాని, పాపాత్ములుగాని తమకు దగ్గరగా ఉండటం మంచిదికాదు. దీనివల్ల చివరికి కీడు, నింద వస్తాయి. రాజు దగ్గర మెలిగే ఏనుగుతోనైనా చివరకు దోమతోనైన వైరం కలిగే ప్రవర్తన మంచిదికాదు. భటుడు తానెంత పూజనీయుడైనా రాజు కొలువుకి సంబంధించిన జనులతో స్నేహం కలిగి ఉండటం మేలు. సంపదలు భోగాలు కోసమే కదా అని విచ్చలవిడిగా భోగించరాదు. రాజుకు కోపం కలుగకుండా నమ్రతతో వేడుకలు జరుపుకోవాలి అని పురుహితుడైన ధౌమ్యుడు సేవాధర్మం చెప్పాడు. అవి విని పాండవులు సంతోషించి ఈవిధంగా అన్నారు.

మాకు తల్లైనా, తండ్రైనా, దైవమైనా, మిత్రసమూహమైనా అన్నీ మీరే. మేము కొలువు చేసేటప్పుడు పాటించవలసిన పద్ధతులు, నడవడికలు ఎంతో మేలు కలిగే విధంగా స్పష్టంగా చెప్పారు. నిజంగా నీ దయవల్ల మేము బ్రతికిపోయాము అన్నారు. అప్పుడు ధౌమ్యుడు ఈ ఒక్క సంవత్సరం ఏవిధంగానైనా మీరు అణగిమణిగి ఉండాలి. కష్టాలకు ఓర్చుకోవాలి. ఆపద నుండి గట్టెక్కి బయటపడాలి అని ధౌమ్యుడు చెప్పగానే అట్లాగే చేస్తామని పాండవులు అన్నారు. భక్తితో ధౌమ్యునికి నమస్కరించారు. అధికమైన వాత్సల్యంతో ధౌమ్యుడు పాండవులను దీవించాడు.

ధౌమ్యుడి ఆశీర్వాదాలతో పాండవులు ప్రీతి చెందారు. ప్రయాణోన్ముఖులయ్యారు. అప్పుడు ధౌమ్యుడు పాండవులకు సుఖసంతోషాలు కలిగించే పుణ్యాకర్మలకు పూనుకున్నాడు. నియమంతో అగ్నిని ప్రజ్వలింపజేశారు. కామ్యపూజ నిర్వర్తించాడు. (కోరికతో అగ్నికార్యం) ప్రయాణంలో శుభం కలిగేందుకు తగిన మంత్రాలు జపించాడు.

## 5.4 ప్రతిపదార్థమునకు రాదగిన పద్యాలు :

**123వ పద్యం :**

"రాజగృహంబు కంటె నభిరామముగా నిలుగట్టఁగుడ, దే
యోజ నృపాలుఁడాకృతికి నొప్పగు వేషము లాచరించు, నే
యోజ విహారముల్ సలుప నుల్లమునం గడువేడ్క సేయుఁనే
యోజ విదగ్ధుఁడై పలుకు; నొడ్డులకుందగదట్లుసేయఁగన్.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| రాజగృహముకంటే | = | రాజుగారి ఇంటికన్నా |
| అభిరామముగాన్ | = | అందముగా |
| ఇలు | = | ఇల్లు |
| కట్టన్ + కూడదు | = | కట్టకూడదు |
| నృపాలుడు | = | రాజు |
| ఏ + ఓజన్ | = | ఏరకంగా |
| ఆకృతికిన్ | = | ఆకారానికి |
| ఒప్పు + అగు | = | తగిన |
| వేషములన్ | = | వేషధారణలు |
| ఆచరించుచున్ | = | ఆచరిస్తాడో |
| ఏ + ఓజన్ | = | ఏవిధంగా |
| విహారముల్ | = | విహారాలను |
| చలువన్ | = | చేయడానికి |
| ఉల్లమునన్ | = | మనసులో |
| కడువేడ్కచేయున్ | = | బాగా ఇష్టపడుతాడో |
| ఏ + ఓజన్ | = | ఏవిధంగా |
| విదగ్ధుడు + ఐ | = | నేర్పరియై |
| పలుకున్ | = | మాట్లాడతాడో |
| ఒడ్డులకున్ | = | ఇతరులకు |
| అట్లు చేయగన్ | = | ఆవిధంగా చేయటం |
| తగదు | = | తగదు. |

**తాత్పర్యం :**

సేవకుడు రాజుగారి ఇంటికన్నా అందంగా ఇల్లు కట్టుకోకూడదు. రాజుగారి వేషధారణలో తాను దుస్తులు ధరించకూడదు. రాజు చేసే విహారం వలే తానూ విహరించకూడదు. రాజు మాట్లాడే పద్ధతిలో మాట్లాడటం తగదు.

**129వ పద్యం :**

"ధరణిపుచుక్కఁగట్టెదురు దక్కి పిఱుందును గానియట్లుగా
నిరుగెలనం దగంగొలిచి యేమనునో యెటూ సూచునొక్కొ ! యె
వ్వరి దెసనెప్పుడే తలఁపు వచ్చునొ యీతనికంచుఁజూడ్కిసు
స్థిరముగఁదన్ముఖంబునన చేర్చుచునుండుట నీత కొల్వునన్"

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| ధరణిపు | = | రాజుయొక్క |
| కడు + ఎదురుదక్కి | = | సమక్షంలో, ఎట్టఎదుట ఉండడాన్ని వదలిపెట్టి |
| పిఱుందును | = | వెనుకవైపును |
| కాని + అట్లుగాన్ | = | కానివిధంగా |
| ఇరు + కెలనన్ | = | రెండుపక్కలా |
| తగన్ | = | తగునట్లు |
| కొలిచి | = | సేవించి |
| ఏమి అనునో | = | ఏమి అంటాడో |
| ఎటుచూచున్ + ఒక్కో | = | ఎటువైపు చూస్తాడో |
| ఈతనికిన్ | = | రాజుకు |
| ఎవ్వరిదెసన్ | = | ఎవరిపట్ల |
| ఎప్పుడు | = | ఏ సమయంలో |
| ఏ తలఁపు | = | ఎటువంటి అభిప్రాయం |
| వచ్చునో | = | కలుగుతుందో |
| అంచున్ | = | అనుకొనుచూ |
| చూడ్కి | = | చూపు |
| సుస్థిరముగన్ | = | నిశ్చలంగా |
| తత్ + ముఖంబున | = | ఆ రాజుగారి ముఖం మీదనే |
| చేర్చుచున్ | = | ఉంచుచూ |
| కొల్వునన్ | = | సభలో |
| ఉండుట | = | ఉండటం |
| నీతి | = | న్యాయం |

**తాత్పర్యం :**

సేవకుడు రాజుగారి కొలువులో రాజుకు మరీ ఎట్టఎదురుగా ఉండకూడదు. అలాగని వెనుకవైపు ఉండరాదు. ఏదో ఒక ప్రక్కన నిలబడి సేవించాలి. ఏమంటాడో, ఎటు చూస్తాడో, ఎవరిని చూస్తే ఎటువంటి ఆలోచన కలుగుతుందో మొదలైన భావాలను మనసులో ఉంచుకొని రాజు ముఖంమీదే దృష్టిసారించి సభలో మెలగాలి.

**135వ పద్యం :**

"ఎండకు వానకోర్చి, తనయిల్లు ప్రవాసపుఁజోటు నాక యా
కొండు నలంగుదున్ నిదురకుం దఱి దప్పెడు, డప్పిపుట్టె, నొ
క్కండన యెట్లొకో యనకకార్యము ముట్టినచోట నేలినా
తండొక చాయ చూపినను దత్పరతం బని సేయు టొప్పగున్"

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| ఎండుకన్ | = | ఎండకూ |
| వానకున్ | = | వానకూ |
| ఓర్చి | = | ఓర్చుకొని |
| తన ఇల్లు | = | ఇది తన ఇల్లు |
| ప్రవాసము + చోటునాక | = | ఇది పరాయిచోటు అని తలచక |
| ఆకొండున్ | = | ఆకలిగొందును |
| అలంగుదున్ | = | అలసిపోతాను |
| నిదురకున్ | = | నిద్రపోవడానికి |
| తరి తప్పెడున్ | = | సమయం మించిపోతుంది |
| డప్పి + పుట్టెన్ | = | దాహం వేస్తుంది |
| ఒక్కండున + ఎట్లు + ఒకో | = | ఒక్కడినే కదా ఎట్లాగో |
| అనక | = | అని తలచక |
| కార్యము | = | పని |
| ముట్టినచోటు | = | కలిగినచోటు |
| ఏలిన + అతఁడు | = | రాజు |
| ఒకచాయ | = | ఒకరీతి |
| చూపినను | = | చూపిస్తే |
| తత్పరతన్ | = | నిష్ఠతో (ఏకాగ్రతతో) |
| పనిచేయుట | = | పనిచేయడం |
| ఒప్పు + అగున్ | = | ఉచితమౌతుంది |

**తాత్పర్యం :**

సేవకుడు ఎండకూ, వానకూ సహించాలి. తన ఇల్లనీ, పొరుగు చోటనీ అనుకోరాదు. ఆకలి వేస్తుంది. అలసిపోతాను. నిద్ర సమయం మించుతుంది, దాహం వేస్తుంది. ఒక్కడినే ఎట్లా అనే ఆలోచనలకు అవకాశం ఎప్పుడూ ఇవ్వకూడదు. అనుకోకుండా రాజుగారు ఏదైనా పని చెప్పినచో శ్రద్ధతో, భక్తితో చెయ్యాలి.

**డా॥ డి. సుజాత**
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,
తెలుగు అధ్యాపకులు, తెలుగు మహిళా కళాశాల,
బాపట్ల

పాఠం - 6

# ధౌమ్య ధర్మోపదేశం - తిక్కన

## (మహాభారతం - విరాటపర్వం - ప్రథమాశ్వాసం - 116 నుండి 146 వరకు పద్యాలు)

## సందర్భసహిత వ్యాఖ్యలు

**విషయసూచిక :**


6.1 సందర్భసహిత వ్యాఖ్యలు

6.2 ప్రశ్న - జవాబు


**6.1 సందర్భసహిత వ్యాఖ్యలు :**

**1. "కాలవిరోధంబు మఱచి కార్యముఁదప్పున్"**

**కవి పరిచయం :**

ఈ వాక్యం తిక్కనచే రచించబడిన ఆంధ్రమహాభారతంలోని విరాటపర్వం ప్రథమాశ్వాసం నుండి గ్రహించబడింది. ధౌమ్యధర్మోపదేశము అనే పాఠములోనిది.

**సందర్భం :**

పాండవులు అజ్ఞాతవాసానికి సిద్ధమౌతుండగా ధౌముడు సేవకుడు రాజుకొలువులో ఏవిధంగా మెలగాలో చెప్పే సందర్భంలోనిది.

**అర్థం :**

ప్రతికూల రూపమైన కాలాన్ని మరచిపోతే అజ్ఞాతవాసం భంగమౌతుంది కార్యం చెడుతుందని భావం.

**వ్యాఖ్య :**

రాజవంశంలో పుట్టి గౌరవంగా పెరిగిన పాండవులు వేరొక రాజు కొలువుకి (విరాటరాజు) పోతున్నారు వారి దగ్గరున్న అస్త్రాలు మంటలు వంటివి. పాండవులు అగ్నివంటివారు. కాలవిరోధాన్ని మరచిపోయి బాహాటంగా ప్రదర్శిస్తే అజ్ఞాతం చెడిపోతుంది. కాబట్టి జాగ్రత్తగా వుండాలి.

**2. "జగతీ వల్లభున కతఁడు సమ్మాన్యుఁడగున్"**

**కవి పరిచయం :**

ఈ వాక్యం తిక్కనచే రచించబడిన ఆంధ్రమహాభారతంలోని విరాటపర్వం ప్రథమాశ్వాసం నుండి గ్రహించబడింది. ధౌమ్యధర్మోపదేశము అనే పాఠములోనిది.

**సందర్భం :**

ధౌమ్యుడు పాండవులకు రాజసభలో సేవకుడు మెలగవలసిన తీరును చెప్పే సందర్భంలో ఈ మాటలు చెప్పబడినవి.

**అర్థం :**

సమయం తెలిసికొని జాగ్రత్తగా మెలగే సేవకుడు రాజుగారి గౌరవానికి పాత్రుడౌతాడని భావం.

**వ్యాఖ్య :**

రాజులనే సేవించేవారు కడు జాగ్రత్త వహించాలి. తన స్థానానికి తగిన ఆసనంలో కూర్చోవాలి. వికృత రూపం లేకుండా సమయం తెలుసుకొని రాజును సేవిస్తే రాజుగారి గౌరవాన్ని పొందవచ్చు.

**3. "పురుషార్థంబునకు హాని పుట్టకయున్నే ?"**

**కవి పరిచయం :**

ఈ వాక్యం తిక్కనచే రచించబడిన ఆంధ్రమహాభారతంలోని విరాటపర్వం ప్రథమాశ్వాసం నుండి గ్రహించబడింది. ధౌమ్యధర్మోపదేశము అనే పాఠములోనిది.

**సందర్భం :**

ధౌమ్యుడు పాండవులకు రాజు కొలువులో మెలగవలసిన తీరును వివరించే సందర్భంలో ఈ మాటలు చెప్పబడినవి.

**అర్థం :**

రాజు దగ్గర చనువు వుంది నాకేమిటి ? అని నిర్భయంగా అమర్యాదగా నడుచుకుంటే మొదటికే మోసం వస్తుందని భావం.

**వ్యాఖ్య :**

సేవకుడు నేను రాజుకొలువులో ఉన్నాను. రాజుతో చనువుగా తిరుగుతున్నాను. నాకేమిటి ? అని అనుకొంటూ నిర్భయంగా మర్యాదను అతిక్రమిస్తే అజ్ఞాతవాసానికే ప్రమాదం వస్తుంది. పాండవుల ఉనికి తెలుస్తుంది.

**4. "పాత్రము సేయుదురు నిజశుభస్థితి పొంటెన్"**

**కవి పరిచయం :**

ఈ వాక్యం తిక్కనచే రచించబడిన ఆంధ్రమహాభారతంలోని విరాటపర్వం ప్రథమాశ్వాసం నుండి గ్రహించబడింది. ధౌమ్యధర్మోపదేశము అనే పాఠములోనిది.

**సందర్భం :**

ధౌమ్యుడు పాండవులకు రాజుగారి కొలువులో సేవకుడు మెలగవలసిన తీరును వివరించే సందర్భంలోనిది.

**అర్థం :**

రాజు తన ఆజ్ఞను మీరినవారు తన సొంతవారైనా శత్రువులుగానే భావిస్తారని భావం.

**వ్యాఖ్య :**

రాజు సహజంగా అందరికంటే అధికంగా ఉండాలని అనుకుంటాడు. తమ ఆజ్ఞను మీరిన వారిని కొడుకులని, మనుమలని, సోదరులని, స్నేహితులని తలచరు . తమ మేలు కొరకు, భద్రత కొఱకు వారిని శత్రువులుగానే భావిస్తారు. కోపం పెంచుకొని వారి అంతుచూస్తారు.

**5. "తన్ముఖంబునన చేర్చుచు నుండుట నీతి కొల్వునన్"**

**కవి పరిచయం :**

ఈ వాక్యం తిక్కనచే రచించబడిన ఆంధ్రమహాభారతంలోని విరాటపర్వం ప్రథమాశ్వాసం నుండి గ్రహించబడింది. ధౌమ్యధర్మోపదేశము అనే పాఠములోనిది.

**సందర్భం :**

ధౌమ్యుడు పాండవులకు సేవకుడు రాజుగారి సభలో మెలగవలసిన తీరును వివరించే సందర్భంలో ఈ మాటలు చెప్పబడినవి.

**అర్థం :**

రాజు సభలో ఉన్నప్పుడు సేవకుడు రాజు ముఖంమీదే దృష్టి వుంచి అప్రమత్తంగా మెలగాలని భావం.

**వ్యాఖ్య :**

సేవకుడు రాజు కొలువు తీరి ఉన్నప్పుడు ఆయనకు ఎదురుగా ఉండకూడదు. అలాగని వెనుకవైపూ ఉండకూడదు. ఏదో ఒక ప్రక్క నిలబడి ఉండాలి. రాజు ఏమి చెబుతాడో, ఎటు చూస్తాడో, ఎవరిమీద ఎటువంటి ఆలోచన కలుగుతుందోనని జాగ్రత్తగా అతని ముఖంమీదే దృష్టిపెట్టి చూస్తూ ఉండాలి.

**6. "తానెంత పూజ్యుఁడైన జనుల పొందులెస్స"**

**కవి పరిచయం :**

ఈ వాక్యం తిక్కనచే రచించబడిన ఆంధ్రమహాభారతంలోని విరాటపర్వం ప్రథమాశ్వాసం నుండి గ్రహించబడింది. ధౌమ్యధర్మోపదేశము అనే పాఠములోనిది.

**సందర్భం :**

ధౌమ్యుడు పాండవులకు రాజు కొలువులో ఉన్న ఉద్యోగులతో వైరం ఉండకూడదు అని చెప్పే సందర్భంలో ఈ మాటలు చెప్పబడినవి.

**అర్థం :**

రాజు కొలువులో ఉన్న జనులతో స్నేహం కలిగి ఉండటం సేవకుడికి మంచిది అని అర్థం.

**వ్యాఖ్య :**

రాజు దగ్గర మెలిగే ఏనుగుతోను చివరికి దోమతోనైనా వైరం పెట్టుకోకూడదు. అందరితో స్నేహంగా మెలగడం సేవకునికి ఎంతైనా అవసరం. అది మేలు.

**7. "తెల్లము సేసితిరి బ్రతికితిమి మీ కరుణన్"**

**కవి పరిచయం :**

ఈ వాక్యం తిక్కనచే రచించబడిన ఆంధ్రమహాభారతంలోని విరాటపర్వం ప్రథమాశ్వాసం నుండి గ్రహించబడింది. ధౌమ్యధర్మోపదేశము అనే పాఠములోనిది.

**సందర్భం :**

ధౌమ్యుని ఉపదేశం విని పాండవులు మీ దయవల్ల మేము బ్రతికిపోయాము" అని చెప్పే సందర్భంలో ఈ

మాటలు చెప్పబడినవి.

**అర్థం :**

మేము రాజు కొలువులో పాటించవలసిన పద్ధతులు చెప్పి మాకు మేలు చేశారు అని భావం.

**వ్యాఖ్య :**

పాండవులకు ధౌమ్యుడు తల్లి, తండ్రి, దైవం, స్నేహితుడితో సమానం. కాబట్టి వారికి రాజు గారి కొలువులో నడువవలసిన పద్ధతులను తెలియజేశాడని పాండవులు ధౌమ్యునికి కృతజ్ఞతలు తెలియజేశారు.

**6.2 ప్రశ్న - జవాబు :**

**1. ధౌమ్యుడు పాండవులకు సేవాధర్మం తెలిపిన తీరును వివరింపుము.**

పాండవులు 12 సంవత్సరాలు అరణ్యవాసం ముగించుకొని ఒక సంవత్సరం అజ్ఞాతవాసం గడపటానికి మత్స్యనగరం (విరాట నగరం) అనువైన ప్రాంతంగా, విరాటమహారాజు తమకు అనుకూలుడైన రాజుగా ఎంచుకొని మారుపేర్లు, వేషాలతో విరాటురాజు కొలువుకి వెళ్ళడానికి నిశ్చయించుకున్నారు. ఆ సమయంలో వారికి అప్పుడు తల్లి, తండ్రి, గురువు, దైవంతో సమానుడైన ధౌమ్యుని ఆశీర్వాదాలు తీసుకొని వెళ్ళడానికి సిద్ధపడుచున్న సమయంలో పాండవుల మేలుకోరి ధౌమ్యుడు వారికి రాజాస్థానంలో సేవకులుగా మెలగవలసిన తీరును ఈ విధంగా వివరించాడు.

సేవకుడు తగిన పద్ధతిలో రాజుగారి సభలోకి అడుగుపెట్టాలి. తన స్థానానికి తగిన ఆసనంలో కూర్చోవాలి. తన రూపం వేషం వికృతంగా ఉండకుండా చూసుకోవాలి. సమయానుకూలంగా మసలుకొంటూ రాజుని సేవించాలి. ఆవిధంగా చేయగలిగితే రాజు గౌరవిస్తాడు. నేను రాజు కొలువులో ఉన్నాను. రాజు దగ్గర చనువు వుంది. నాకేమిటి ? అని నిర్భయంగా, అమర్యాదగా ప్రవర్తిస్తే మొదటికే మోసం వస్తుంది.

సేవకుడు రాజగృహంకన్నా అందంగా తన ఇల్లు నిర్మించుకోకూడదు. రాజు వేషధారణతో వస్త్రాలు ధరించకూడదు. రాజు విహరించినట్లు మాట్లాడినట్లు సేవకుడు మాట్లాడకూడదు. అంటే రాజు పద్ధతుల్ని సేవకుడు అనుసరించకూడదు. రాజాజ్ఞని మీరకూడదు. అలా మీరిన వారిని రాజు తన సొంత వారినైనా ఉపేక్షించడు. కొడుకైనా, తమ్ముడైనా, స్నేహితుడైనా రాజాజ్ఞ అతిక్రమిస్తే రాజువారి అంతుచూస్తాడు. వారిని ఎప్పటికీ శత్రువులుగానే తలుస్తాడు.

ఏదైనా సరే సాధించుకోగలిగితే వారి పనికి అడ్డువెళ్ళకూడదు. తగుదునమ్మా అంటూ ఆ పనిని మీద వేసుకొని చేయడానికి ప్రయత్నిస్తే మొదటికే మోసం వస్తుంది. రాజుతో స్నేహంగా ఉండటంలో తప్పులేదు. కాని రాజు దగ్గరుండే వారికి కష్టం కలిగించకూడదు. ఆవిధంగా చేస్తే పేరుప్రతిష్ఠ రావచ్చు కాని తరువాత తప్పక హాని కలుగుతుంది. రాజుదగ్గర మౌనంగా ఉండకూడదు. అలాగని పదిమందితో ఆర్భాటంగానూ మాట్లాడకూడదు. అనువైన వారితో కలసి రాజుతో మాట్లాడటం మంచిది. రాజుకి వ్యతిరేకత తోచేటట్లు సమాధానం చెప్పకూడదు. అవసరాన్నిబట్టి రాజాజ్ఞను నిర్వర్తించాలి.

కొలువులో రాజుగారికి మరీ ఎదురుగా నిలుచోకూడదు. అలాగని వెనుకవైపు కూడా ఉండకూడదు. భక్తిశ్రద్ధలతో ఏదో ఒక ప్రక్కన నిలబడాలి. రాజు ఏమంటాడో, ఎటు చూస్తున్నాడో ఎవరిని చూస్తే ఏ ఆలోచనలు కలుగుతాయోనని అప్రమత్తతతో రాజుముఖం మీదే దృష్టి పెట్టాలి. అంతఃపురంలోని మాటలు ఎవ్వరికీ బయటపెట్టకూడదు. రాజుగారి గూర్చి ఎక్కడ ఏమి విన్నా ఆలోచించి వినదగినదైతేనే రాజుతో చెప్పాలి. భటుడికి అంతఃపురంలోని వారితో సంబంధం మంచిది కాదు. అక్కడ తిరిగే గూనివారు, పొట్టివారు, పరిచారికలు మొదలైన వారితో స్నేహంగా ఉంటే కీడు తప్పదు.

రాజు అనుగ్రహిస్తేనే ఆసనంపై కూర్చోవాలి. వారి అనుమతి లేకుండా ఏనుగులు, గుర్రాల వంటి వాహనాలు కోరుకోకూడదు. ఎంత గౌరవం ఉన్న వారికైనా రాజు అనుమతి లేనిదే వాటి జోలికి వెళ్ళటం మంచిదికాదు. రాజు గౌరవించాడని ఉబ్బిపోవడం, అవమానించాడని కృంగిపోవటం ఉండకూడదు. ఆ రెండింటినీ లెక్క చేయకుండా మునుపటివలే జాగ్రత్తగా ప్రవర్తించేవారికి మంచి జరుగుతుంది. ఆపదలు తొలగిపోతాయి. రాజు ఎవరినైనా రక్షించాలి అనుకోవచ్చు లేదా శిక్షించాలి అనుకోవచ్చు. ఆ విషయాలు తనికి తెలిసినా అవి అమలుకాకముందే సేవకుడు తనంతతానుగా బయటపెట్టకూడదు. అలాచేస్తే మూర్ఖులౌతారు.

సేవకుడు ఎండకూ వానకూ సహించాలి. తన ఇల్లనీ పొరుగుచోటనీ అనుకోకూడదు. ఆకలి వేస్తుంది, అలసిపోతాను, నిద్రకు సమయం మించిపోతుంది. దాహం వేస్తుంది. నేను ఒక్కడినే ఎలా చేయగలను అనే ఆలోచన ఎప్పటికీ రాకూడదు. అనుకోకుండా రాజు ఏదైనా పని చెబితే భక్తిశ్రద్ధలతో చేయాలి. రాజు తనకు ఎంత ఆప్తుడైనా రాజధనాన్ని పాముముళ్ళుగా భావించాలి. రాజధనంజోలికి పోకుంటేనే మానమూ, ప్రాణమూ నిలువవు. రాజు కొలువులో తీరినప్పుడు సేవకుడు ఆవులించకూడదు. తుమ్మటం మంచిదికాదు. నవ్వటం అసలే పనికిరాదు. ఉమ్మివేయటం తప్పు. వీటిని బహిరంగంగా చేయరాదు. రాజాగ్రహానికి గురైనవారు, రాజశత్రువులు, పాపాత్ములకు దూరంగా ఉండాలి. వారితో మంచిగా ఉంటే చివరకు కీడూ నిందా వస్తాయి. భోగాల కొరకే కదా సంపదలు ఉంది అని ధనాన్ని విచ్చలవిడిగా ఖర్చు చేయరాదు. రాజుకి కోపం కలిగించే ఏపనీ సేవకుడు చేయకుండా వినమ్రతతో వేడుకలు జరుపుకోవాలి అని పురోహితుడైన ధౌమ్యుడు పాండవులకు సేవాధర్మాలు వివరించాడు.

**డా॥ డి. సుజాత**
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,
తెలుగు అధ్యాపకులు, తెలుగు మహిళా కళాశాల,
బాపట్ల

పాఠం - 7

# పలనాటి బెబ్బులి - శ్రీనాథుడు

## (పలనాటి వీరచరిత్ర - ద్విపద కావ్యం - పుట 108 నుండి 112 వరకు)

## బాలచంద్రుడు భీమంబగు సంగ్రామం బొనర్చుట ... (108) వెఱగంది కుంది)

## ద్విపద పంక్తులకు అర్థ తాత్పర్యములు

**విషయసూచిక :**

7.0 ఉద్దేశ్యం
7.1 కవి పరిచయం
7.2 ద్విపద పంక్తులకు అర్థ తాత్పర్యములు

**7.0 ఉద్దేశ్యం :**

శ్రీనాథుని "పలనాటి బెబ్బులి" మంజరీ ద్విపద కావ్యం. పలనాటి వీరచరిత్రను తెలియజేయటం, బాలచంద్రుని నలగామ రాజులను పరిచయం చేయటం.

**7.1 కవి పరిచయం :**

| | | |
|---|---|---|
| పాఠ్యభాగం | : | పలనాటి బెబ్బులి |
| పాఠ్యభాగం దేని నుండి గ్రహించబడింది | : | ఈ ద్విపద పద్యపంక్తులు శ్రీనాథ మహాకవిచే రచించబడిన "పలనాటి వీరచరిత్ర" అనే మంజరీ ద్విపద కావ్యము నుండి గ్రహించబడినవి. |
| పాఠ్యభాగ రచయిత | : | శ్రీనాథుడు |
| శ్రీనాథుని కాలము | : | శ్రీనాథుడు 15వ శతాబ్దానికి చెందిన కవి. క్రీ.శ. 1385 - 1475 |
| శ్రీనాథుని తల్లిదండ్రులు | : | శ్రీనాథుని తల్లి - భీమాంబిక, తండ్రి పేరు - మారయ. తాత - కమలనాభామాత్యుడు. |
| శ్రీనాథుని ప్రసిద్ధి | : | శ్రీనాథుడు |

(1) తెలుగులో పురాణ ప్రబంధ యుగాలకు వారధిగా నిలిచిన మహాకవి. పండిత కవి. బ్రాహ్మీదత్త వరప్రసాదుడు.
(2) తెలుగులో కవిత్రయము, వారి తర్వాత మహాప్రసిద్ధి గాంచిన కవి సార్వభౌముడు శ్రీనాథుడు ఇతడు.
(3) శ్రీనాథుడు "ఆబాల్యకవి" ఆగర్భ పండితుడు.
(4) చిన్నారి పొన్నారి చిఱుత కూకటినాడే, శ్రీనాథుడు మరుత్తరాట్చరిత్రమును రచించాడు.

శ్రీనాథుడుని ప్రసిద్ధి : శ్రీనాథుడు అనేక చాటు పద్యములను చెప్పాడు

**శ్రీనాథుని ప్రసిద్ధ కావ్యాలు :**

(1) మరుత్తరాట్చరిత్ర
(2) గాధాసప్తశతి

(3) శృంగార నైషధము
(4) భీమేశ్వర పురాణము
(5) కాశీ ఖండము
(6) హరవిలాసము
(7) శివరాత్రి మహాత్మ్యము
(8) పలనాటి వీరచరిత్ర మొదలైనవి శ్రీనాథుని కావ్యరచనలు.

**పలనాటి వీరచరిత్ర ద్విపద కావ్యం శ్రీనాథుని రచనేనా ?**

తెలుగులో మొట్టమొదటి "వీరాగాధా కావ్యమైన ఈ పలనాటి వీరచరిత్రలో బాలచంద్ర యుద్ధము"ను అక్కిరాజు ఉమాకాంతముగారు ప్రచురించారు. ఈ గ్రంథాన్ని సంపూర్ణంగా 'విశాలాంధ్ర ప్రచురణాలయము' వారు ముద్రించారు. ఐతే శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రి గారు ఈ గ్రంథంలో కృత్యాద్యంతములతోనే, శ్రీనాథునికి సంబంధము ఉందన్నారు. చిలుకూరి వీరభద్రరావుగారు, చాగంటి శేషయ్యగారు, శిష్టా రామకృష్ణశాస్త్రిగారు ఈ కావ్యము శ్రీనాథునిది కాదని చెప్పారు కాని పలువురు విమర్శకులు పల్నాటి వీరచరిత్రము శ్రీనాథకృతమే అని అంగీకరించారు.

| | | |
|---|---|---|
| శ్రీనాథుని బిరుదులు | : | కవి సార్వభౌముడు |
| శ్రీనాథుని గుణగణాలు | : | శ్రీనాథుడు, సకల విద్యాసనాథుడు, బ్రహ్మాదత్త వరప్రసాదుడు, ఈశ్వరార్చన కళాశీలుడు. |
| శ్రీనాథుడు ఎవరి ఆస్థానకవి | : | శ్రీనాథుడు కొండవీటి రెడ్డిరాజయిన పెదకోమటి వేమారెడ్డి ఆస్థానకవి. ఇతడు కొండవీటి రెడ్డిరాజుల ఆస్థానంలో విద్యాధికారి. తరువాత, రాజమహేంద్ర రెడ్డిరాజుల ఆస్థానంలో కూడా ఈయన ఉన్నాడు. |
| శ్రీనాథునికి కనకాభిషేకం | : | ప్రౌఢదేవరాయలచే శ్రీనాథుడు కనకాభిషేకాన్ని పొందాడు. ఉద్దండుడైన గౌడ డిండిమభట్టును వాదంలో ఓడించి అతని కంచు ఢక్కను ఈయన పగులగొట్టించాడు. |

**పలనాటి వీరచరిత్రము**

**ఎవరికి అంకితమిచ్చాడు :** మాచర్ల చెన్నకేశవ స్వామికి ఈ గ్రంథమును అంకితము చేయబడింది

**శ్రీనాథుని అవసాన దశ :** శ్రీనాథుని చివరిదశలో ఇతడిని ఆదరించే రాజులు లేకపోయారు. కృష్ణాతీరంలోని "బొడ్డుపల్లె"ను ఈయన గుత్తుకు తీసుకొని, సేద్యం చేశాడు. కృష్ణా వరదలలో పంటలు పోయాయి. శిస్తు చెల్లించలేక ఓఢ్రి రాజులచే ఈయన అనేక బాధలు అనుభవించాడు. తెలుగు సాహిత్య చరిత్రలో ఏకవి జీవితంలోనూ కనిపించని కష్టసుఖాలు శ్రీనాథుని జీవితంలో కనిపించాయి.

**7.1.2 పాఠ్యభాగ సందర్భం :**

"వీరగామని" పుత్రుడైన "అనుగురాజు" చందవోలు రాజును ఓడించాడు. చందవోలురాజు, అనుగురాజుతో సంధి చేసుకొని, తన కుమార్తె మైలమాదేవిని అనుగురాజుకు యిచ్చి పెళ్ళి చేశాడు. తీర్థయాత్రలు చేస్తున్న అనుగురాజుకు, గయ పట్టణ రాజైన భీమరాజు, భూరమాదేవి అనే తన కుమార్తెనిచ్చి అంతకుముందే పెళ్ళి చేశాడు. అప్పటికే అనుగు రాజుకు, వీరవిద్యాదేవి అనే భార్య ఉంది. చందవోలు రాజు మైలమాదేవికి పసుపు కుంకుమల క్రింద "పల్నాటి సీమ"ను

అరణంగా ఇచ్చాడు. చెన్నకేశవుని దయతో, అనుగురాజుకు, వీరవిద్యాదేవి వల్ల (1)పెదమలి దేవుడు, (2) పినమలి దేవుడ, (3) బాలమలిదేవుడు అనే ముగ్గురు కుమారులు పుట్టారు. భూరమాదేవికి శివుని కృపతో (1) కామరాజు, (2) నరసింగరాజు, (3) జట్టిరాజు, (4) పెరుమాళ్ళరాజు అనే నల్గురు కుమారులు జన్మించారు. మూడవ భార్య అయిన మైలమాదేవికి నలగాముడు అనే కుమారుడు పుట్టాడు.

అనుగురాజుకు బ్రహ్మనాయుడు అనే మంత్రి ఉన్నాడు. బ్రహ్మనాయుడు విష్ణుభక్తుడు. మహా పరాక్రమవంతుడు. ఒకసారి అనుగురాజు వేటకు వెళ్ళినప్పుడు, నాగమ్మ అనే శివభక్తురాలు, అనుగురాజుకు సత్కారంచేసి, ఆయన మెప్పును పొందింది. తనకు ఏడు గడియలసేపు పలనాటి సీమకు మంత్రిత్వం కావాలని, అనుగురాజును కోరింది. అనుగురాజు అంగీకరించి, పత్రం వ్రాసి, ఆమెకిచ్చాడు.

అనుగురాజుకు, రాచకురుపు వేసింది. తన కుమారులను మంత్రి దొడ్డనాయుడికి అప్పగించాడు. నలగామరాజుకు పట్టము కట్టమనీ దొడ్డనాయుడి కుమారుడు బ్రహ్మనాయుడిని మంత్రినీ చేయమనీ చెప్పి అనుగురాజు మరణించాడు.

నలగామరాజును బ్రహ్మనాయుడు పల్నాటి సీమకు ప్రభువును చేశాడు. అప్పటికే నాగమ్మ, పలనాడు రాజ్యానికి చేరింది. బ్రహ్మనాయుడికీ, నాగమ్మకూ పొసగలేదు. నలగామ రాజు బ్రహ్మన్నను కాదని, నాగమ్మకు మంత్రి పదవిని ఇచ్చాడు. నాగమ్మ బ్రహ్మనాయుడిపై నలగామునికి ద్వేషాన్ని పెంచింది. నాగమ్మ, నలగామరాజుకు వద్ద మంచి పలుకుబడి సంపాదించింది. నాగమ్మ మాట విని, నలగామరాజు తన సవతి సోదరులైన (1) పెదమలిదేవుడు, (2) పినమలిదేవుడు, (3) బాలమలిదేవులను కారాగారంలో బంధించాడు.

బ్రహ్మనాయుడు "కన్నమనీడు" సహాయంతో మలిదేవాదులను ముగ్గురినీ విడిపించాడు. కన్నమనీడు నలగామరాజు వద్దకు వెళ్ళి మలిదేవాదులను బంధించడం బ్రహ్మనాయుడు చతురరంగ బలాలనూ, నలగామరాజుకు ఇచ్చి, తాను కొందరు వీరులను మాత్రమే తీసుకొని మలిదేవాదులతో గురజాల విడిచి మాచర్ల అనే పట్టణాన్ని కట్టించాడు. ఈవిధంగా మలిదేవాదులను మాచెర్ల రాజ్యానికి బ్రహ్మనాయుడ్ని ప్రభువుల్ని చేశాడు.

నాగమ్మకు కన్ను కుట్టింది. కోడిపందాలు పేరుతో బ్రహ్మనాయుడిని గురజాలకు పిలిపించింది. బ్రహ్మనాయుడిని కోడిపందాలకు సిద్ధం కమ్మంది. బ్రహ్మన్న ఓడితే మాచెర్లను విడిచి ఏడు సంవత్సరాలు అరణ్యవాసం చేయాలని షరతు పెట్టింది. ఏడు సంవత్సరాల తర్వాత ఎవరి రాజ్యం వారు పాలించుకోవచ్చునన్నది.

కోడి పోరు జరిగింది. నాగమ్మ కుట్ర చేసి బ్రహ్మనాయుని కోడిపుంజును చంపించింది. మాట ప్రకారము బ్రహ్మనాయుడు తన మాచెర్ల రాజ్యాన్ని విడిచి మలిదేవాదులతో ఏడు సంవత్సరాలు అరణ్యవాసం చేసి వచ్చాడు. తమ రాజ్యాన్ని తిరిగి ఇమ్మని నలగామరాజు వద్దకు, నలగాముని అల్లుడైన అలరాజును రాయబారిగా బ్రహ్మనాయుడు పంపాడు. నాగమ్మ అలరాజును చంపింది.

దానితో బ్రహ్మనాయుడికి కోపం వచ్చింది. యుద్ధానికి రమ్మని, నలగామరాజుకు కబురు పెట్టారు. కార్యమపూడిలో యుద్ధం జరిగింది. బాలచంద్రుడు, బ్రహ్మనాయుడి కుమారుడు బాలచంద్రుడు బొంగరాల ఆట ఆడుతుండగా, ఒక కోమటి పడుచు అన్నమ్మకు అది తగిలింది. "నీ పెద్దలు యుద్ధానికి వెళితే, నీవు బొంగరాలతో స్త్రీలను కొడుతున్నావు" అని బాలచంద్రుని ఆమె నిందించింది. దానితో పౌరుషంగా, బాలచంద్రుడు సోదరులతో కలసి యుద్ధానికి వెళ్ళాడు. అక్కడి నుండి మన పాఠం మొదలవుతుంది.

**పాఠ్యభాగ సారాంశం :**

**బాలచంద్రుని యుద్ధము :**

బాలచంద్రుడు, శత్రువుల మణికట్లను తలలను, మోచేతులను, ముక్కులను, నుదురులను, ప్రక్కఎముకలను, దౌడలను, బాహువులను, కనుగ్రుడ్లను, చెవులను ఖండించాడు. గుండెలను చీల్చి, మోకాళ్ళను, పిక్కలను, చీలమండలంను నరికాడు. పిల్ల సింహమువలె ఏనుగుల పైకి ఉరికి, వాటి కుంభస్థలములను, తొండములను, తోకలను ఖండించి మావటివాండ్రను చంపి, దొరలను పడగొట్టి, వాటి దంతాలనూ, చెవులనూ, పిల్లదంతాలనూ కాళ్ళనూ, కంఠాలనూ నరికాడు. సాహసంతో గుఱ్ఱములను కత్తులతో, ఈటెలతో పొడిచి, రౌతులను చంపి వారు ప్రయోగించిన వేటకుక్కలను తుక్కుచేసి, శృంగధనస్సులను ముక్కలుచేసి బాణములను, అమ్ములను, కత్తులను, డాలులను ఖండించి, మెడలు నరికి, శరీరాలు చీల్చి, రొమ్ములను, ఈటెలతో గ్రుచ్చి, కొంకులు, డెక్కలు చెక్కి యుద్ధం చేశాడు.

**నలగామరాజు సైన్యం కలత :**

నలగాముని సైన్యము పైవిధముగా భగ్నమయ్యింది. వారి కంఠాలు తెగాయి. వాహనాల నుండి వీరులు ఉరికారు. తన్నుకొని చచ్చారు. తలలు తెగాయి. వారు కళ్ళు తెరుస్తూ, గంతులు వేస్తూ, ప్రాణాలు వదిలారు. పళ్ళు కొరుకుతూ కూలబడ్డారు. చేతులు తెగినా, వారు కత్తులు వదలలేదు. ప్రేగులు బయటకు వచ్చినా, వాటిని పట్టుకొని నేను నేను అంటూ, ముందుకు వచ్చారు. ముసలియోధులు చచ్చారు. బాలచంద్రుని చూసి భయపడి పారిపోయారు కొందరు బ్రతిమిలాడారు. ఇలాంటి యుద్ధం మాకు తెలియదు అనీ, అన్నం కోసం వచ్చామనీ, ఏడుస్తూ ప్రాణాలు వదిలారు. మేము పాలేర్లము, ఆడువారు తిట్టారని యుద్ధానికి వచ్చాము. పారిపోనిస్తే బ్రతుకుతాము అనీ తాము బోయీలమనీ, నాగమ్మ మాటలు నమ్మి యుద్ధానికి వచ్చామనీ, ప్రాణాలు దక్కితే బలుసాకు తిని బ్రతుకుతాము అని చెప్పారు. పౌరుషం విడిచిన వారు తోటివీరులను విడిచి పారిపోయారు. చచ్చినట్లు పడియున్నారు. ఏనుగుల ప్రక్కన దాగినవారు, పెళ్ళాలను తలచుకొని ఏడ్చినవారు, గడ్డిన దూరినవారు, జట్టువిప్పినవారు, చతికిల పడినవారు చచ్చినా కత్తులు విడవని సైనికులూ ఈవిధంగా యుద్ధరంగం భయంకరంగా ఉంది.

**బాలచంద్రుడు శత్రువులను చంపడం :**

బాలచంద్రుడు పరిఘన గుండ్రంగా త్రిప్పుతూ, బాణాలు తనపైకి రాకుండా చేసుకున్నాడు. శత్రువుల ధనస్సులనూ, వింటి నారులను, పారిపోయేవారిని ఖండించారు. బాలచంద్రుడు సోదరులతో కలిసి, గొడ్డళ్ళతో నరికి, డాలులను, బల్లెములను ఖండించి, గండ్రగొడ్డలతో శత్రువులను కణుపులుగా కొట్టాడు. వారి తలలను గదలతో కొట్టాడు. పొట్టలు చీల్చాడు. కత్తులతో కండలుకోసి, యముని వద్దకు పంపాడు. దానితో సైన్యము పారిపోవటానికి సిద్ధమయ్యింది.

**నరసింహభూపతి తన సైనికులకు ధైర్యం చెప్పడం :**

ఓడి పారిపోవడం, వీరధర్మం కాదు. పిల్లలను చూసి, పరుగుపెట్టడం దేనికి ? మిమ్ములను రక్షించిన వారిని విడిచిపెట్టడం, మంచిదికాదు. మీలోని రక్తం, రాజు పెట్టిన అన్నంతో పెరిగినదే నమ్మిన రాజును నట్టేటిలో ముంచివెళ్ళడం నీతికాదు. శరీరాలు అశాశ్వతాలు. ధనములు కల్ల, కీర్తి ఒక్కటే శాశ్వతము. అధైర్యంతో, వీరధర్మం మాని, నశించే మలభాండమైన శరీరం కోసం కీర్తిని పోగొట్టుకొని, పారిపోయే వెఱ్ఱివారు ఉండరు. వీరులకు యుద్ధరంగాలే విహార వనములు. చచ్చినా, బ్రతికినా అక్కడే వారి సౌఖ్యము. మీరు పారిపోతే, భుక్తి, ముక్తి రెండూపోతాయి. నన్ను విడవడం న్యాయం కాదు. మృత్యువు మన శరీరాలను ఆవహించింది. మనం పెళ్ళికి రాలేదు, యుద్ధానికి వచ్చాము. వచ్చిన పని గంగలో కలిపి, పారిపోవడం నీచము. మీరు వెళ్ళవద్దు, వెళితే రాజుపై ఒట్టు అని నరసింగు తన సైనికులతో అన్నాడు.

**నలగామరాజు సైన్యము బాలచంద్రునితో పోరు :**

నరసింగు మాటలకు కోపం తెచ్చుకొని మంటపై మిడతలవలే నలగాముని సైనికులు, బాలచంద్రునిపై పడ్డారు. బాలచంద్రుడు సముద్రంలో మందరంలా, కాలాగ్ని లోకాల్ని కాల్చినట్లు దావాగ్ని అడవులపై పడ్డట్లు, శత్రుసైన్యంపైకి ఉరికి వారి అస్త్రశస్త్రాలను నరికి హుంకరిస్తూ భట్టులను పట్టుకొని బల్లెములతో చీల్చి పడగొట్టాడు. వారి శరీరాలను చీల్చి, నేలపై పడవేశాడు. వారి కటి ప్రదేశాలను ఖండించి నేలపై పడవేశాడు. వారి తలలను, కత్తులతో నరికాడు. బల్లెముతో గ్రుచ్చి వారిని కూల్చాడు. రక్తం నేలపై నిండుగా ప్రవహించింది. ఎదురు లేకుండా యుద్ధం ఈవిధంగా సాగింది. నరసింగరాజు యుద్ధాన్ని చూసి, వణికిపోయాడు. ఆయన బాలచంద్రుని పరాక్రమానికి ఆశ్చర్యపడి ముక్కున వ్రేలు వేసుకున్నాడు.

## 7.1 ద్విపద పంక్తులు అర్థతాత్పర్యములు :

**బాలచంద్రుడు భీమంబగు సంగ్రామం బొనర్చుట .... :**

మణికట్ల దనుమాడి మస్తకవితతి
ధరమీద నొరగంగ దట్టించి నరకి
మోచేతు లెడచేసి ముక్కులు చెక్కి
ఫాలంబులం జింపి ప్రక్కల గోసి
దౌడలూడగ నూకి దండయుల్ ద్రుంచి
కనుగ్రుడ్లు పగులంగ కర్ణముల్ వ్రాల
బలువైన రొమ్ములు పరియలుగాగ
తొడలెల్ల తునుకలై తూగాడుచుండ.

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| మణికట్లన్ | = | ముంజేతులను |
| తనుమాడి | = | నఱకి |
| మస్తక, వితతిన్ | = | శిరస్సుల యొక్క సమూహమును |
| ధరమీదన్ | = | భూమిపై |
| ఒరగంగన్ | = | ప్రయత్నించి, నఱకి |
| మోజేతులు | = | మోచేతులు |
| ఎడచేసి | = | తొలగించి |
| ముక్కులు, చెక్కి | = | ముక్కులను ఖండించి |
| ఫాలంబులన్ | = | నుదురులను |
| చింపి | = | చించి |
| ప్రక్కల గోసి | = | ప్రక్కనున్న ఎముకలను కోసి |
| దౌడలన్ | = | చెంపలను |
| ఊడనూకి | = | రాలేటట్లు, పడద్రోసి |
| దండముల్ | = | బాహువులు |
| త్రుంచి | = | ఖండించి |

| | | |
|---|---|---|
| కనుగ్రుడ్లు, పగులంగన్ | = | కంటిగ్రుడ్లు, పగులునట్లుగా |
| కర్ణముల్ | = | చెవులు |
| వ్రాలన్ | = | పడిపోయేటట్లుగా |
| బలువైన | = | బలమైన |
| రొమ్ములు | = | వక్షఃస్థలములు |
| పరియలు గాగన్ | = | తునకలుకాగా |
| తొడలెల్లన్ | = | తొడభాగములు, అన్నీ |
| తునకలై | = | ముక్కలై |
| తూగాడు చుండన్ | = | కంపించు చుండగా |

**తాత్పర్యం :**

ముంజేతులను నఱికి, తలలను నేలపై పడేటట్లు నరకి, మోచేతులు తొలగించి, ముక్కులను ఖండించి, నొసళ్ళను చింపి, ప్రక్క ఎముకలను కోసి, చెంపలను రాలగొట్టి, బాహువులు ఖండించి, కంటిగ్రుడ్లు పగిలేలా, చెవులు నేలపై పడిపోయేలా, బలమైన వక్షఃస్థలాన్ని ముక్కలు చేసి, తొడలు ముక్కలై ఊగుతుండగా

**జానువు లూడంగ జంఘలు విరుగ**
**చీలలు పట్టేది చీకాకునొంద**
**ఈరీతిగొంతసే పీప్సిత మడర**
**అనుజులతోగూడ నని చేసి పిదప**
**దంతావళంబుల దట్టంబుచూచి**
**బాలుడు కోపంబు ప్రకటంబుగాగ**
**కొదమసింహము భంగి కుప్పించి యెగిరి**
**బలిమియై కుంభముల్ పగులగ మోది**
**తొండముల్ తోకలు తునకలు సేసి**
**మావంతులనుగొట్టి మరణమొందించి**

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| జానువులూడంగన్ | = | మోకాళ్ళు ఊడిపోయేటట్లు |
| జంఘలు, విరుగన్ | = | కాలిపిక్కలు విరిగేటట్లుగా |
| చీలలు | = | చీలమండలు |
| పట్టేది | = | పట్టు, చెడి |
| చీకాకు నొందన్ | = | బాధను పొందేటట్లు |
| ఈ రీతిన్ | = | ఈ విధంగా |
| కొంతసేపు | = | కొంత సమయము |
| ఈప్సితమడరన్ | = | కోరిక పుట్టగా |
| అనుజులతో గూడన్ | = | సోదరులతోపాటు |
| అని చేసి | = | యుద్ధము చేసి |

| | | |
|---|---|---|
| పిదపన్ | = | తరువాత |
| దంతావళంబులు | = | ఏనుగుల |
| దట్టంబు చూచి | = | సాంద్రతను చూసి |
| బాలుడు | = | బాలచంద్రుడు |
| కోపంబు, ప్రకటంబుగాగన్ | = | కోపము, వెల్లడియగునట్లుగా |
| కొదమ, సింహము, భంగిన్ | = | బాల్యంలో ఉన్న సింహము వలె |
| కుప్పించి, యెగిరి | = | దుమికి, ఎగిరి |
| బలిమియైన్ | = | బలముతో |
| కుంభమున్ | = | కుంభస్థలమును |
| పగులగన్ | = | పగిలేటట్లు |
| మోది | = | కొట్టి |
| తొండములన్ | = | తొండములను |
| తోకల్ | = | తోకలనూ |
| తునకలు చేసి | = | ముక్కలుగా చేసి |
| మావంతులను, కొట్టి | = | మావటేంద్రను |
| మరణ మొందించి | = | చచ్చేటట్లు చేసి |

**తాత్పర్యము :**

మోకాళ్ళు ఊడిపోయే విధంగా, పిక్కలు విరిగేటట్లు, చీలమండలు పట్టు తప్పి బాధను పొందేటట్లుగా, ఈ విధంగా కొంతసేపు కోరిక హెచ్చుగా, సోదరులతో కూడా బాలచంద్రుడు యుద్ధము చేసిన తరువాత, ఏనుగుల అధిక్యాన్ని చూసి బాలచంద్రుడు తన కోపము వెల్లడి అయ్యేవిధంగా, సింహపు పిల్లవలె దుమికి, ఏనుగుల పైకి ఉరికాడు. బలముతో ఏనుగుల కుంభ స్థలములను పగులగొట్టాడు. వాటి తొండాలనూ, తోకలనూ ముక్కలు చేసి, మావటివాండ్రను చంపి,

**పైనున్న దొరలను పడిపోవ పొడిచి**
**దంతముల్ ముక్కలై ధర వ్రాల జిదిమి**
**చెవులను కత్తితో చీలికల్ చేసి**
**పిల్లదంతంబుల బెకలిచి వైచి**
**ఘనపదంబుల దున్మి కంఠముల్ నరికి**
**కొంతసే పిమ్మాడ్కి గురుశౌర్య మలర**
**సమరంబు గావించి జవనాశ్వవితతి**
**చక్కాడ పైబడి సాహసగరియ**
**ఖడ్గకుంతంబులు కరములబట్టి**
**పైనున్న రాహుత్తపటలిని చంపి**

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| పైనున్న దొరలను | = | ఏనుగుపై నున్న రాజులను |
| పడిపోవన్, పొడిచి | = | క్రిందకు పడిపోయే విధంగా వారిని పొడిచి |

| | | |
|---|---|---|
| దంతముల్, ముక్కలై | = | ఏనుగుల దంతములు, ముక్కలుగానై |
| ధర, వ్రాలన్ | = | భూమిపై రాలిపోయే విధంగా |
| చిదిమి | = | ఖండించి |
| చెవులను | = | ఏనుగుల చెవులను |
| కత్తితోన్ | = | తన కత్తితో |
| చీలికల్, చేసి | = | ముక్కలుగా చేసి |
| పిల్లదంతంబులన్ | = | చిన్న దంతాలను |
| పెకలించి, వైచి | = | పెల్లగించి దూరంగా పారవేసి |
| ఘన, పదంబులన్ | = | గొప్పవైన అడుగులను |
| తున్మి | = | ఖండించి |
| కంఠముల్ నరికి | = | ఏనుగుల కంఠములను, నరికి |
| కొంతసేపు | = | కొద్దికాలము |
| ఇమ్మాడ్కిన్ | = | ఈ విధముగా |
| గురు శౌర్యమలరన్ | = | గొప్ప, పరాక్రమము, శోభించే విధంగా |
| సమరంబు + కావించి | = | యుద్ధము చేసి |
| జవానాశ్వవితతిన్ | = | వేగము గల, గుఱ్ఱముల, సమూహాలను |
| చక్కాడన్ | = | నరకడానికి |
| పైబడి | = | ఈ గుఱ్ఱములపైనపడి |
| సాహస, గరియన్ | = | సాహసము యొక్క శ్రేష్ఠత్వముతో |
| ఖడ్గ కుంతంబులు | = | కత్తులు, ఈటెలు |
| కరములబట్టి | = | చేతులతో పట్టికొని |
| పైనున్న | = | ఆ గుఱ్ఱములపైన ఉన్న |
| రాహుత్తపటలని | = | రౌతుల యొక్క, సమూహములను |
| చంపి | = | చంపి |

**తాత్పర్యం :**

ఏనుగుల మీద ఉన్న రాజులు క్రిందపడిపోయేటట్లు, వారిని పొడిచి, ఏనుగుల దంతములు ముక్కలై నేలపై రాలిపడే విధంగా వాటిని పొడిచి, ఏనుగుల చెవులను కత్తితో ముక్కలుచేసి, చిన్న దంతాలను పెల్లగించి దూరంగా విసరివైచి గొప్ప పాదాలను ఖండించి, కంఠాలు నరికి, కొంతసేపు ఈవిధంగా గొప్ప శౌర్యం శోభించేటట్లు, బాలచంద్రుడు యుద్ధము చేసి, వేగంగా పరుగుపెట్టే గుఱ్ఱాలను నరకడానికి వాటిమీద పడి, గొప్ప సాహసంతో, కత్తి, బల్లెము తన చేతులతో పట్టుకొని గుఱ్ఱాలపైనున్న రౌతులను చంపి.

**తొడిగినజోడంగి తుక్కగజేసి**
**సింగిణివిండ్లను చిదుక లొనర్చి**
**బాణతూణీరముల్ భగ్నముచేసి**
**ఖడ్గఖేటకములు ఖండించి మించి**

మెడలు రెండుగజేసి మేనులు చించి
యెదురురొమ్ముల లెస్స యీటెల గ్రుచ్చి
కొంకులు తెగగొట్టి ఖురములు చెక్కి
చాలసే పీగతి సమరం బొనర్చె
బలమెల్ల నీలాగు భంగంబు నొంది
కంఠముల్ దెగిపడ గ్రక్కున నురికి

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| తొడిగిన | = | ప్రయోగించిన |
| జోడంగిన్ | = | వేటకుక్కన్ |
| తుక్కుగజేసి | = | పనికిమాలినదిగాజేసి |
| సింగిణి, విండ్లను | = | శృంగ ధనస్సులను |
| చిదుకలొనర్చి | = | ఎండిన పుల్లలుగా చేసి |
| బాణ తూణీరముల్ | = | బాణాలు, అమ్ముల పొదులు |
| భగ్నము చేసి | = | ముక్కలు చేసి |
| ఖడ్గ, ఖేటకములు | = | కత్తి డాలులను |
| ఖండించి | = | ముక్కలు చేసి |
| మించి | = | అతిశయించి |
| మెడలు, రెండుగ జేసి | = | గుఱ్ఱల మెడలను, రెండు భాగాలుగా చేసి |
| మేనులు, చించి | = | శరీరాలను ముక్కలుగా చేసి |
| ఎదురు, రొమ్ములను | = | ఎదిరించేవారి వక్షస్సులందు |
| లెస్స | = | బాగుగా |
| ఈటెలన్ | = | ఈటెలను |
| గ్రూచ్చి | = | నాటి |
| కొంకులు, తెగకొట్టి | = | జంకుటలు మాని |
| ఖురములు | = | కాలిగిట్టలు |
| చెక్కి | = | నశింపజేసి |
| చాలాసేపు | = | ఎక్కువకాలము |
| ఈగతిన్ | = | ఈవిధంగా |
| సమరం బొనర్చెన్ | = | యుద్ధము చేశాడు |
| బలమెల్లన్ | = | తన సైన్యము అంతా |
| ఈలాగు | = | ఈవిధంగా |
| భంగంబునొంది | = | ఓడిపోయి |
| కంఠముల్ | = | సైనికుల కంఠాలు |
| తెగిపడన్ | = | ఛిన్నముకాగా |

| | | |
|---|---|---|
| గ్రక్కునన్ | = | శీఘ్రముగా |
| ఉరికి | = | తమ వాహనాలపై నుండి శత్రుసైన్యము క్రిందికి ఉరికారు |

**తాత్పర్యం :**

శత్రువులు ప్రయోగించిన వేటకుక్కలను పనికిమాలినివిగా చేసి, వారి శృంగ ధనస్సులను చిన్నముక్కలుగా చేసి, బాణాలనూ, అమ్ముల పొదులనూ ముక్కలుచేసి, కత్తులనూ, డాలులనూ ముక్కలుచేసి, గుఱ్ఱాల మెడలను రెండు ముక్కలు చేసి, శరీరాలను చిదుకగొట్టి, తనను ఎదిరించేవారి రొమ్ములపై బాగా ఈటెలను గ్రుచ్చి, కొంకులు తెగగొట్టి, గిట్టలు నశింపజేసి, చాలాసేపు ఈవిధంగా బాలచంద్రుడు యుద్ధము చేశాడు. సైన్యమంతా ఈవిధంగా ఓడిపోయి తమ కంఠములు తెగి నేలపైపడగా, వెంటనే వారు క్రిందికి ఉరికారు. అప్పుడు నలగామరాజు సైన్యము ఈక్రింది రీతిగా కలతను పొందింది.

**నలగామరాజు సైన్యము కలత నొందుట :**

**పడితన్నికొని చచ్చు బలసమూహంబు**
**మస్తకంబులు పోయి మహిమీద మడిసి**
**కన్నులు తెరచుచు గంతులువైచి**
**ప్రాణముల్విడిచెడు వారును మరియు**
**పాదముల్ విరుగగ బవరంబుచేయ**
**పండ్లుగీటుచు నేలపై గూలువారు**
**కరములు తునిసిన గత్తులు వదలి**
**బాలుని గనిచచ్చు భయదోగ్రభటులు**
**ప్రేవులు వెడలిన పెడచేత నెత్తి**
**కడిమిచే బల్లెంబు గట్టిగాబట్టి**
**అహమహమికతోడ అరుదెంచ గడగి**
**సంచలింపని దీర్ఘసాహసఘనులు**
**మూల్గుచు చచ్చెడు ముదియోధవరులు**
**బాలుని కనుగొని భయమంది బెగడి**
**పారిపోయెడు పందభటసమూహంబు**

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| పడి | = | క్రిందపడి |
| తన్నికొని | = | కాళ్ళూ చేతులూ కొట్టుకొని |
| చచ్చు | = | చస్తున్న |
| బలసమూహంబు | = | సైన్యముల సమూహమునూ |
| మస్తకంబులు | = | తలలు |
| పోయి | = | తెగిపడి |
| మహిమీదన్ | = | నేలపై |
| మడిసి | = | చచ్చి |

| | | |
|---|---|---|
| కన్నులు తెరచుచున్ | = | కళ్ళు తెరుస్తూ |
| గంతులు వైచి | = | మిడిసిపడి |
| ప్రాణముల్విడి చెడువారును | = | ప్రాణాలు వదలివేస్తున్న వారునూ |
| మఱియున్ | = | ఇంకా |
| పాదముల్, విరుగగన్ | = | తమ కాళ్ళు విరిగిపోయినా |
| ఒవరంబు చేయన్ | = | యుద్ధం చేయడానికి |
| పండ్లు గీటుచున్ | = | దంతములు కొఱుకుతూ |
| నేలపైన్ + కూలువారు | = | భూమిపై పడిపోయేవారునూ |
| కరములు, తునిసినన్ | = | చేతులు తెగిపోగా |
| కత్తులు, వదలి | = | చేతిలోని కత్తులు క్రింద పడవేసి |
| బాలునిన్ | = | బాలచంద్రుని |
| కనివచ్చు | = | చూసి, వెనుకకు వస్తున్న |
| భయధ | = | భయాన్ని కల్గించే |
| ఉగ్రభటులు | = | భయంకరులైన సైనికులు |
| ప్రేవులు, వెడలినన్ | = | తమ శరీరంలోని ప్రేగులు, బయటకు రాగా |
| పెడచేతన్ | = | తమ ఎడమచేతిలో |
| ఎత్తి | = | గ్రహించి |
| కడిమిచేన్ | = | పట్టుదలతో |
| బల్లెంబున్ | = | బల్లెమును |
| గట్టిగాబట్టి | = | గట్టిగా పట్టుకొని |
| అహమహమికతోడన్ | = | నేను నేను అని ఒకరితో ఒకరు రోషముతో మాట్లాడుతూ |
| అరుదెంచన్ | = | ముందుకు రావటానికి |
| కడగి | = | ప్రయత్నించి |
| సంచలింపని | = | ఏమాత్రమూ, చలింపని |
| దీర్ఘ, సాహస ఘనులు | = | పెద్ద సాహసములు గల, గొప్పవారు |
| మూల్గుచున్ | = | మూల్గుతూ కూడిన ధ్వని చేస్తూ |
| చచ్చెడు | = | చస్తున్న |
| ముది, యోధ, వరులు | = | ముసలివారైన, శ్రేష్ఠులైన యోధులునూ |
| బాలునిన్ | = | బాలచంద్రుని |
| కనుగొని | = | చూచి |
| భయమంది | = | భయపడి |
| బెగడి | = | కంపించి |
| పారిపోయెడి | = | పారిపోతున్న |
| పంద, భట సమూహంబు | = | పిరికివారైన భటుల యొక్క సమూహమునూ |

**తాత్పర్యం :**

క్రిందపడి కాళ్ళూ చేతులూ కొట్టుకుంటూ చస్తున్న సైనికుల సమూహమునూ, తలలపోయి నేలపైపడి చచ్చి కళ్ళుతెరుస్తూ గంతలు వేసి ప్రాణాలు విడుస్తున్న వారునూ, ఇంకా కాళ్ళూ విరిగినా, యుద్ధం చేయడానికి దంతములు, నేలపై కూలిపడే వారునూ, చేతులు తెగిపోగా కత్తులు విడిచిపెట్టి, బాలచంద్రుని చూసి వస్తున్న భయాన్ని కల్గించే భయంకరమైన సైనికులునూ తమ కడుపులో ప్రేగులో బయటకు రాగా, ఎడమచేతితో వాటిని ఎత్తి పట్టుకొని, సాహసంతో బల్లెమును గట్టిగా పట్టుకొని "నేను నేను" అని ఒకరితో ఒకరు అనుకుంటూ, ముందుకు రావడానికి సాహసించి, ఏ మాత్రమూ కలతను పొందని పెద్ద గొప్ప సాహసం గలవారు మూల్గుతూ చస్తున్న ముసలివారైన గొప్ప యోధులూ, బాలచంద్రుని చూసి, భయపడి కంపించి, పారిపోతూ ఉన్న పిరికితనమూ గల భటులనూ

**పారిపోవగలేక బ్రతుకుపై నాశ**
**బ్రతిమాలుచుండెడు బలనిచయంబు**
**లిటువంటి జగడంబు లెన్నడెరుంగ**
**మేలాగుపోదు మన్చేడ్చెడువారు**
**ఆలుబిడ్డలబాసి అన్నంబు కొరకు**
**వచ్చితిమీనేల వ్రాసెను మృత్యు**
**వనిదుఃఖమొందుచు నసురసురంచు**
**వేగమె ప్రాణముల్ విడిచెడువారు**
**బహుదినంబుల్ మేముపాలేరు చేసి**
**మునికొల్ల లెల్లను మంజూర్లదోపి**
**పణతులు దిట్టిన పడకలేక వచ్చి**
**చచ్చుచునుంటిమీ సమరరంగమున**

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| పారిపోవగలేక | = | పారిపోయే శక్తి చాలక |
| బ్రతుకుపైనాశన్ | = | జీవించాలనే ఆశతో |
| బ్రతిమాలుచుండెడు | = | బ్రతిమాలుతున్న |
| బల, నిచయంబులు | = | ఇలాంటి కయ్యాలు |
| ఎన్నడు + ఎరుంగము | = | ఎపుడు మాకు తెలియదు |
| ఏలాగు పోదుము | = | ఇక్కడ నుండి ఎలావెడతాము ? |
| అన్చేడ్చుడువారు | = | అంటూ ఏడ్చేవారునూ |
| ఆలుబిడ్డలు బాసి | = | భార్యనూ, పిల్లలను విడిచి |
| అన్నంబు కొఱకున్ | = | అన్నం కోసం |
| వచ్చితిమి | = | వచ్చాము |
| ఈనేలన్ | = | ఇచ్చట |
| వ్రాసెను, మృత్యువు | = | మరణము మాకు రాసి పెట్టి వుంది |
| అని, దుఃఖము + ఒందుచున్ | = | అని దుఃఖాన్ని పొందుతూ |

| | | |
|---|---|---|
| అనురుసురంచున్ | = | శ్రమను పొందుచూ |
| వేగమె, ప్రాణముల్ | = | వేగంగా, తమ ప్రాణాలను |
| విడిచెడువారున్ | = | విడిచిపెట్టేవారునూ |
| బహు, దినంబులు | = | చాలా రోజులు |
| మేము | = | మేము |
| పాలేరు జేసి | = | ధనవంతుల ఇండ్లలో వారి పనులు చేసే, పశువులను పెంచే పనివారముగా చేసి |
| మునికోల్ల లెల్లను | = | పశువులను కొట్టే కొరడా కఱ్ఱలను అన్నింటినీ |
| మంజూర్ల దోపి | = | ఇంటిముందు భాగములోని, చూర్లలోకి త్రోసి |
| పడతులు తిట్టిన | = | ఆడవారు తిట్టగా |
| పడలేక | = | ఆ తిట్టను భరించలేక |
| వచ్చి | = | యుద్ధరంగానికి వచ్చి |
| ఈ సమర రంగమునన్ | = | ఈ యుద్ధరంగములో |
| చచ్చుచునుంటిమి | = | చస్తున్నాము |

**తాత్పర్యం :**

యుద్ధరంగము నుండి పారిపోలేక, బ్రతకాలనే ఆశతో తమను రక్షించండని, ఎదుటి సైన్యాన్ని బ్రతిమాలుతున్న సైన్యములునూ, ఇటువంటి యుద్ధాలు ఎపుడూ మేము ఎరుగము ఎలా వెడతాము ? అంటూ, ఏడ్చేవారునూ, "భార్యాబిడ్డలను విడిచి అన్నము కోసం యుద్ధానికి వచ్చాము. ఈ స్థలముపై మాకు మృత్యువు రాసిపెట్టి వుంది" అని దుఃఖిస్తూ, శ్రమపడుతూ, వేగంగా తమ ప్రాణాలను విడిచిపెట్టే వారునూ, "చాలారోజులు మేము పాలేర్లుగా పనిచేసి, మా కొరడా కఱ్ఱలను, ఇంటి మంజూర్లలో దోపి, ఆడువారు తిడితే భరించలేక యుద్ధానికి వచ్చి యుద్ధరంగంలో చస్తున్నాము.

**పారిపోనిచ్చిన బ్రతుకుదుమయ్య**
**అనిమ్రొక్కుచుండెడు అతిదీనభటులు**
**బోయవారము మేము పూర్వంబునందు**
**బుజములకాయలు పూనికన్గానుడి**
**పగవారు మమ్ముగని పారిపోవుదురు**
**మీకేమి భయమని మెలతనాగమ్మ**
**బాగుగా నమ్మించి పంప వచ్చితిమి**
**జీవముల్ దక్కిన చిన్నల గలిసి**
**బలుసాకు దినియైన బ్రతకగలము**
**మీరు పిల్చినవేళ మీ మరుదెంతు**
**మని యంజలియొనర్చి యవమానమొంది**
**మగసిరివిడిచిన మానహీనులును**
**వీలుచిక్కిన రణవీరులం వదలి**
**పోయెడునట్టి దుర్బుద్ధియుక్తులను**

చచ్చిన విధమున సమరోర్వియందు
పలుకక యూరక వ్రాలెడువారు

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| పారిపోనిన్ + ఇచ్చిన | = | పారిపోవనిస్తే |
| బ్రదుకుదుమయ్య | = | జీవించి ఉండెదము |
| అని | = | అట్లని |
| మ్రొక్కుచుండెడు | = | నమస్కారములు చేస్తున్న |
| అతిదీనభటులు | = | మిక్కిలి, భయపడి ఏడుస్తున్న భటులునూ |
| పూర్వంబునందు | = | యుద్ధానికి రావడానికి ముందు |
| బోయవారము, మేము | = | మేము, పల్లకీలను మోసే బోయీలము |
| బుజముల కాయలు | = | మా భుజాలపై కాసిన కాయలను |
| పూని, కన్గొనుడి | = | పట్టుకొని, చూడండి |
| పగవారు | = | శత్రువులు |
| మముగని | = | మమ్మల్ని యుద్ధరంగంలో చూసి |
| పారిపోవుదురు | = | యుద్ధరంగం నుండి పారిపోతారు |
| మీకేమి | = | మీకు ఎందుకు ? |
| భయమని | = | భయము అని |
| మెలత, నాగమ్మ | = | ఆడుది అయిన ఆ నాగమ్మ మంత్రిణి |
| బాగునన్ | = | బాగా |
| నమ్మించి | = | మమ్మల్ని నమ్మించి |
| పంపవచ్చితిమి | = | యుద్ధానికి పంపగావచ్చాము |
| జీవముల్, దక్కిన | = | మా ప్రాణాలు, నిలిస్తే |
| చిన్నలగలిసి | = | మా పిల్లలతో కలసి |
| బలుసాకు దినియైన | = | బలుసాకు తినియైనా |
| బ్రతుకగలము | = | ఏదో రకంగా జీవింపగలము |
| మీరు పిల్చినవేళన్ | = | మీరు పిలిచినపుడు |
| మేము | = | మేము |
| అరుదెంతుము | = | తిరిగివస్తాము |
| అని | = | అని |
| అంజలి యొనర్చి | = | రెండు చేతులూ దగ్గరకు చేర్చి నమస్కరించి |
| అవమానమొంది | = | అవమానాన్ని పొంది |
| మగసిరి, విడిచిన | = | పౌరషమును విడిచిపెట్టిన |
| మానహీనులను | = | ఆత్మాభిమానము లేనివారునూ |
| వీలుచిక్కినన్ | = | పారిపోవడానికి వారికి వీలు కుదిరితే |

| | | |
|---|---|---|
| రణవీరులన్ | = | యుద్ధము చేస్తున్న తమతోటి వీరులను |
| వదలిపోయెడునట్టి | = | విడిచివెళ్ళేటటువంటి |
| దుర్బుద్ధి, యుక్తులును | = | చెడుబుద్ధితో కూడినవారునూ |
| చచ్చిన విధమునన్ | = | చచ్చిన వారివలె |
| సమరోర్వియందున్ | = | యుద్ధభూమి యందు |
| పలుకక | = | మాట్లాడకుండా |
| ఊరక | = | ఊరకనే |
| వ్రాలెడువారు | = | నేలపై పడుకున్నవారునూ |

**తాత్పర్యం :**

అయ్యా ! మమ్మల్ని పారిపోనిస్తే మేము బ్రతుకుతాము అని నమస్కరిస్తున్న మిక్కిలి దీనులయిన భటులునూ, మేము పూర్వము, బోయవారము. మా భుజాలపై కాయలు కాశాయి. కావాలంటే పట్టి చూడండి. శత్రువులు మమ్మల్ని చూడగానే పారిపోతారు. మీకు భయము ఎందుకు ? అని మమ్మల్ని బాగా నమ్మించి, యుద్ధానికి పంపితే మేము వచ్చాము. మా ప్రాణాలు మాకు దక్కితే, మా పిల్లలతో కలసి బలుసాకు తినియైనా ఎలాగో బ్రతకుతాము. మీరు పిలవగానే మేము తిరిగి వస్తాము" అని చేతులు జోడించి నమస్కరించి అవమానాన్ని పొంది, పౌరుషాన్ని విడిచిన, ఆత్మాభిమానము లేనివారునూ వీలుచిక్కితే యుద్ధము చేస్తున్న తోడి వీరులను విడిచిపోయేటటువంటి చెడు బుద్ధికలవారునూ, చచ్చిన వారివలె యుద్ధ భూమియందు తాము మాట్లాడకుండా, ఊరకనే నేలపై పడియున్న వారునూ అయ్యారు.

చనలేక భయమున చచ్చినవారి
మీద ద్రోసుకయుండి మెదలనివారు
చచ్చినగజముల చాటున దాగి
పందతనంబున పడియుండువారు
పెండ్లాల దలచక బిట్టేడ్చువారు
వల్మీకముల మీద వసియించువారు
గడ్డిలో జొరబడి కదలనివారు
వ్రేళ్ళు చీకెడువాడు వెన్నిచువారు
వెంద్రుకల్ విప్పక విదిలించువారు
నీవారమని పల్కి నిల్చుండువారు
ఆయుధాల్ పడవైచి యలికెడువారు
పడలేక చతికిలబడి యుండువారు
బవరంబులో గూలి ప్రాణజాలంబు
విడిచియు ఖడ్గముల్ విడువనివారు
భయదమై యుబ్బంగి పరికింపరాక
సమరరంగము భయజనకమైయుండె

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| చనలేక | = | యుద్ధరంగం నుండి వెళ్ళలేక |
| భయమునన్ | = | భయముతో |
| చచ్చినవారిమీదన్ | = | చచ్చినవారి శవాలపై |
| ౘ్రోసుకయుండి | = | గెంటుకొని, అక్కడ తాము పడియుండి |
| మెదలనివారు | = | కదలనివారునూ |
| చచ్చిన గజముల | = | చచ్చిపోయిన ఏనుగుల |
| చాటునన్ | = | చాటుగా |
| డాగి | = | దాగికొని |
| పందతనంబునన్ | = | పిరికితనముతో |
| పడియుండువారు | = | పడియున్నట్టి వారునూ |
| పెండ్లాలన్ | = | భార్యలను |
| తలచుక | = | తలంచుకొని |
| బిట్టేడ్చువారున్ | = | బిగ్గరగా ఏడ్చేవారునూ |
| వల్మీకములమీదన్ | = | పుట్టలపై |
| వసియించువారున్ | = | నివసించేవారునూ |
| గడ్డిలో చొరబడి | = | గడ్డిలో ప్రవేశించి |
| కదలని వారున్ | = | కదలకుండా పడి ఉన్నవారునూ |
| ౚ్రేళ్ళు చీకెడు వారున్ | = | తమౚ్రేళ్ళు చప్పరించేవారు |
| వెంౘ్రుకల్ | = | తలవెంౘ్రుకలు |
| విప్పుక | = | విప్పుకొని |
| విదిలించువారున్ | = | దులుపుకొనేవారునూ |
| నీవారమని | = | మేము, నీకు కావలసినవారము అని |
| పల్కి | = | మాట్లాడి |
| నిల్చుండువారున్ | = | యుద్ధరంగంలో తామున్నచోటుననే నిలబడి యుండేవారునూ |
| ఆయుధాల్, పడవైచి | = | తాము యుద్ధం చేసే ఆయుధాలను క్రిందపడవేసి |
| అలికెడువారున్ | = | భయపడేవారున్ |
| పడలేక | = | క్రింద పడలేక |
| చతికిలబడియుండువారున్ | = | కూలబడి యుండేవారునూ |
| బవరంబులో గూలి | = | యుద్ధంలో క్రిందపడి |
| ప్రాణాజాలంబు | = | తమ ప్రాణ సమూహమును |
| విడిచియున్ | = | విడిచిపెట్టియనూ |
| ఖడ్గముల్ | = | కత్తులు |
| విడువనివారున్ | = | విడిచిపెట్టని వారునూ |

| | | |
|---|---|---|
| భయదమై | = | భయాన్ని కల్గించేదయి |
| ఇబ్భంగిన్ | = | ఈ విధంగా |
| పరికింపకార | = | చూడశక్యముకాకుండా |
| సమర రంగము | = | యుద్ధరంగము |
| భయజనకమై | = | భయాన్ని పుట్టించేదయి |
| ఉండెన్ | = | ఉన్నది. |

**తాత్పర్యము :**

యుద్ధరంగము నుండి వెళ్ళలేక భయముతో చచ్చినవారిని గెంటుకొని, తాము అక్కడ పడియుండి కదలకుండా ఉన్నవారూ, చచ్చిన ఏనుగుల మాటున దాగుకొని, పిరికితనంతో పడియున్నవారునూ, భార్యలను తలచుకొని గట్టిగా ఏడ్చేవారునూ, పుట్టలపై ఉండేవారునూ, గడ్డిలో దూరి కదలకుండా పడియున్న వారునూ, వేళ్ళు చప్పరించేవారునూ, వెనుకడుగు వేసేవారునూ తలవెంట్రుకలు విప్పి, వాటిని జాడించువారునూ, మేము నీకు సంబంధించిన వారము అని చెప్పి, యుద్ధరంగంలో నిలబడిన వారునూ, ఆయుధాలు క్రిందపడవేసి, భయపడేవారునూ, నేలపై పడలేక చతికిలబడి ఉండేవారునూ, యుద్ధంలో కూలబడి తమ ప్రాణాలు పోయినా, చేతిలోని కత్తులను విడిచిపెట్టనివారునూ, భయాన్ని పుట్టించేదయి, ఈవిధంగా చూడటానికి శక్యముకానివిధంగా యుద్ధరంగం ఉన్నది.

**బాలచంద్రుడు శాత్రవబలంబుల జక్కాడుట :**

కొందరు విలుకాండ్రు గుంపులగూడి
బహుబాణములు మీద బరపెడు వేళ
తమ్ములనందర తగనిల్వజేసి
పరిఘమొక్కటి చేతపట్టుక తూరి
తనువున బాణముల్ దాకకుండంగ
భ్రమణ నైపుణ్యంబు బల్విడిజూపి
పరతెంచువి శిఖముల్ పాయగొట్టుచును
ఖడ్గమాడించుచు గర్జలానర్చి
అట్టహాసంబున నావిలుకాండ్ర
పైకేగి ధనువుల భంగంబుచేసి
శింజిను లెల్లను జిదురుపల్చేసి
తూణముల్ శరములు తుమురుగాగొట్టి
చుట్టు పేరెమువారి శూరతమెరయ
వండతరిగినట్లు వడి మేనులెల్ల
ఖండించి యముజేర గ్రక్కుననంపె

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| కొందఱు, విలుకాండ్రు | = | కొంతమంది, ధనుర్ధారులు |
| గుంపులు గూడి | = | గుంపుగా ఒకచోట చేరి |

| | | |
|---|---|---|
| బహు, బాణములు | = | పెక్కు, బాణములు |
| మీద బరపెడువేళన్ | = | తనమీద ప్రయోగించే సమయములో |
| తమ్ముల నందరన్ | = | తన సోదరులందరినీ |
| తగన్ | = | తగునట్లుగా |
| నిల్వజేసి | = | యుద్ధంలో నిలచేటట్లుచేసి |
| పరిఘ యొక్కటి | = | ఇనుపగుదియను ఒకదానిని |
| చేతపట్టక | = | చేతిలో పట్టుకొని |
| తూరి | = | ప్రవేశించి |
| తనువునన్ | = | శరీరమందు |
| బాణముల్ | = | శత్రువుల బాణాలు |
| తాకకుండంగన్ భ్రమణ నైపుణ్యంబు | = | తగులకుండా ఉండేటట్లు తిరుగుటలో నేర్పును |
| బల్విడి జూపి | = | వేగముగా చూపించి |
| పరతెంచు, విశిఖముల్ | = | పరుగున వచ్చే బాణాలను |
| పాయగొట్టుచున్ | = | తొలగజేయుచూ |
| ఖడ్గమాడించుచున్ | = | కత్తిని జళిపిస్తూ |
| గర్జలొనర్చి | = | గర్జించి |
| అట్టహాసంబునన్ | = | ధ్వనితో కూడిన పెద్ద నవ్వుతో |
| ఆ, విలుకాండ్రపైకిన్ | = | ఆ ధనుర్ధారులపైకి |
| ఏగి | = | వెళ్ళి |
| ధనువులు | = | ధనుస్సులను |
| భంగంబు చేసి | = | ముక్కలు చేసి |
| శింజినులెల్లను | = | వింటి నారులను అన్నింటినీ |
| చిదురుపల్ చేసి | = | చిన్న తునకలుగా చేసి |
| తూణముల్ శరములు | = | అమ్ముల పొదులను, బాణములను |
| తుమురుగా కొట్టి | = | చిన్న రేణువులుగా విరుగగొట్టి |
| చుట్టు | = | తన చుట్టూ వున్న |
| పేరెమువారిన్ | = | పరిగెత్తువారిని |
| శూరత, మెఱయన్ | = | తన పరాక్రమము, ప్రకటితమయ్యే విధంగా |
| వండన్ | = | వంట వండటానికి |
| తరిగినట్లు | = | తరిగిన విధంగా |
| వడిన్ | = | వేగంగా |
| మేనులెల్లను | = | వారి శరీరములు అన్నింటినీ |
| ఖండించి | = | ముక్కలుగా చేసి |
| యముజేరన్ | = | యముడిని చేరటానికి |
| గ్రక్కునన్ | = | శీఘ్రముగా |
| పంపెన్ | = | పంపించాడు |

**తాత్పర్యం :**

కొంతమంది విలుకాండ్రు గుంపులుగా చేరి అనేక బాణములు, బాలచంద్రుని మీద ప్రయోగించే సమయములో తమ్ముళ్ళను అందరినీ తగిన విధంగా యుద్ధరంగంలో నిలబెట్టి, ఒక ఇనుపగుదియను తాను తీసుకొని, చేతితో దానిని పట్టుకొని, తన శరీరమునందు బాణములు దూరి, తగులకుండా, తిరుగుటలో నేర్పును వేగంగా చూపించి తన మీదికి వేగముగా వచ్చే బాణములు దూరంగా పోయే విధంగా చేస్తూ, కత్తిని జళిపిస్తూ, గర్జించి పెద్దగా నవ్వుతూ ఆ విలుకాండ్ర పైకి వెళ్ళి, వారి ధనస్సులను విరుగగొట్టి, వారి వింటి నారులను చిన్న తునకలుగా చేసి, చుట్టునూ పరుగెత్తే వారిని పరాక్రమములు ప్రకాశించే విధంగా వండడానికి తరిగిన విధంగా, వేగంగా వారి శరీరాలను నరికి, యముడిని వారు చేరుకునే విధంగా, శీఘ్రముగా వారిని పంపించాడు.

చొక్కచువ్వలవారు శూరతహెచ్చ
వంచుక పైకుర్కి వచ్చుటసూచి
బాలుడు వెసనార్చి పకపక నవ్వి
తమ్ములుతోడురాదంటయై తొడరి
కుప్పించి పైబడి గొడ్డండ్లతోడ
చెరకులనరికిన చెలువుఘటిల్ల
అలుగుల నీటెల నన్నింటి దునిమి
శూలంబులం బొడ్చి సురియల గ్రుమ్మి
గండ్రగొడ్డండ్లతో గనెలుగా గొట్టి
బాకుల రొమ్ములు పరియలుచేసి
గదలచే శిరముల గడునుగ్గొనర్చి

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| చొక్క చువ్వలవారు | = | అందమైన సన్నని చెట్టుకొమ్మలవంటి వీరులు |
| శూరత, హెచ్చన్ | = | పరాక్రమము, అధికము కాగా |
| వంచుక | = | తలవంచుకొని |
| పైకుర్కి | = | తన మీదికి దుమికి |
| వచ్చుట సూచి | = | రావడము చూచి |
| బాలుడు | = | బాలచంద్రుడు |
| వెసనార్చి | = | శీఘ్రముగా అఱచి |
| పకపక నవ్వి | = | పకపకమంటూ నవ్వి |
| తమ్ముల తోడరావ్ | = | తన సోదరులు తోడుగా, తన వెంటరాగా |
| దంటయై | = | సమర్థుడై |
| తొడరి | = | వారిని ఎదిరించి |
| కుప్పించి | = | ఎగిరి దుమికి |
| పైబడి | = | వారిపైన పడి |

| | | |
|---|---|---|
| గొడ్డండ్లతోడన్ | = | గొడ్డళ్ళతో |
| చెరకులు, నరికిన | = | చెఱకు గడలను నరికిన |
| చెలువు | = | రీతి |
| ఘటిల్లన్ | = | కలుగునట్లుగా |
| అలుగులన్ | = | వారి ఖడ్గములనూ |
| ఈటెలను | = | ఈటెలనూ |
| అన్నింటిన్ | = | అన్నింటినీ |
| తునిమి | = | నరికి |
| శూలంబులన్ | = | శూలములతో |
| పొడ్చి | = | పొడిచి |
| సురియల గ్రుమ్మి | = | చురకత్తులతో పొడిచి |
| గండ్ర గొడ్డండ్లతోన్ | = | గండ్రగొడ్డళ్ళతో |
| గనెలుగా గొట్టి | = | కణుపులుగా కొట్టి |
| బాకులన్ | = | బాకులతో |
| రొమ్ములు | = | వారి వక్షఃస్థలములను |
| పరియలు చేసి | = | తునియలుగా చేసి |
| గదలచేన్ | = | గదలతో |
| శిరములన్ | = | వారి తలలను |
| కడునుగ్గొనర్చి | = | మిక్కిలిగా, పొడి అయ్యేలాచేసి |

**తాత్పర్యం :**

చొక్క చువ్వలు ధరించినవారు, అధికమైన పరాక్రమముతో తలవంచుకొని తన పైకి దుమికి రావటం చూసి, బాలచంద్రుడు శీఘ్రముగా గట్టిగా కేకపెట్టి, పకపక నవ్వి, సోదరులు తనకు తోడుగా రాగా, తాను సమర్థుడై వారిని ఎదిరించి, దుమికి వారి పైనపడి గొడ్డళ్ళతో చెఱకుగడలు నరికిన రీతిగా వారి ఖడ్గములనూ, ఈటెలనూ అన్నింటినీ ఖండించి, శూలములతో చిన్నకత్తులతో వారిని పొడిచి, గండ్రగొడ్డళ్ళతో కణుపులుగా కొట్టి, బాకులతో వారి రొమ్ములను ముక్కలు చేసి, గదలతో వారి తలలు పిండి చేశారు.

**బాధించి పొట్టల పటిమచేజించి**
**కత్తుల మేనుల కండల డుల్చి**
**పంపించె జముజూడ బలములనెల్ల**
**సంగ్రామ మీరితి జరిగినవేళ**
**పారిరి మిగిలిన బంటులుగూడి**
**ఆవేళ నరసింగు డధికకోపమున**

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| బాదించి | = | శత్రువులను ఈవిధంగా బాధపెట్టి |
| పొట్టలన్ | = | వారి పొట్టలన్ |

| | | |
|---|---|---|
| పటిమ చేజించి | = | సామర్థ్యముతో చినిగేటట్లు చేసి |
| కత్తులన్ | = | కత్తులతో |
| మేనుల, కండలు | = | వారి శరీరము యొక్క, మాంస ఖండములను |
| డుల్చి | = | క్రిందకు రాల్చి |
| బలములనెల్లన్ | = | శత్రు సైన్యాలను అన్నింటినీ |
| జూడన్ | = | యముడిని చూడడానికి |
| పంపించెను | = | పంపించాడు |
| సంగ్రామము | = | యుద్ధము |
| ఈరీతిన్ | = | ఈ విధంగా |
| జరిగిన వేళన్ | = | జరిగిన సమయములో |
| మిగిలిన బాటలు | = | చావగా మిగిలిన భటులు |
| కూడి | = | కలిసి |
| పారిరి | = | పరుగుపెట్టారు |
| ఆవేళన్ | = | ఆ సమయములో నలగామరాజు సవతి తమ్ముడైన 'నరసింహ'రాజు |
| అధిక కోపమునన్ | = | ఎక్కువ కోపంతో |

**తాత్పర్యం :**

శత్రుసైన్యాన్ని బాధించి, వారి పొట్టలను సామర్థ్యముతో బ్రద్దలుచేసి, కత్తులతో వారి శరీరాల మాంసపు కండలను క్రిందకు రాల్చి, సైన్యాలను అన్నింటినీ యముడిని చూడడానికి పంపాడు. ఈవిధంగా యుద్ధము జరిగిన సమయములో, మిగిలిన నలగామరాజు సైన్యములోని భటులు అందరూ కలసి పారిపోయారు. అప్పుడు నలగామరాజు సవతి తమ్ముడు 'నరసింగుడు' అనేవాడు అధికమైన కోపముతో పారిపోయే సైనికులతో ఇలా చెప్పాడు.

పారిపోవుచున్న సైన్యమునకు, నరసింహ భూపతి ధైర్యవాక్యములు చెప్పుట :

**పారెడువారికి బలుకంగసాగె**
**విరిగిపోవుట యిట్ల వీరధర్మము**
**బాలుర కనుగొని పరువిడనేల**
**మిమ్ము గాచినవారి మేలె త్యజింప**
**బలిమి మీనరముల బారురక్తంబు**
**రాజాన్నవర్థిత రక్తంబుగాదె**
**ధూర్తులై నృపునకు ద్రోహం బొనర్చి**
**నమ్మినరాజును నట్టేటముంచి**
**పోవటయే నీతి పుణ్యాత్ములార**

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| పారెడు వారికిన్ | = | పారిపోయేవారికి |
| పలుకంగ సాగె | = | మాట్లాడటం ప్రారంభించాడు |
| ఇట్లు | = | ఈ విధంగా |

| | | |
|---|---|---|
| విఱిగిపోవుట | = | ఓడిపోవుట |
| వీరధర్మంబై | = | వీరులకు ధర్మమేనా ? |
| బాలురన్ | = | పిల్లలను |
| కనుగొని | = | చూసి |
| పరువిడనేల | = | పరుగుపెట్టటం ఎందుకు ? |
| మిమ్ము గాచిన వారిన్ | = | మిమ్మల్ని రక్షించినవారిని |
| త్యజింపన్ | = | విడిచిపెట్టుట |
| మేలె | = | మంచిదేనా ? |
| బలిమిన్ | = | బలముతో |
| మీ, నరములన్ | = | మీ నరాలతో |
| పారు, రక్తంబు | = | ప్రవహించే రక్తము |
| రాజాన్నవర్ధిత | = | రాజు గారి యొక్క అన్నముచే వృద్ధిపొందిన |
| రక్తంబుగాదె | = | రక్తమే కదా ! |
| ధూర్తులై | = | మోసగాండ్రు అయి |
| నృపునకున్ ద్రోహంబొనర్చి | = | మోసము చేసి |
| నిమ్మిన రాజును | = | మిమ్మల్ని నమ్మిన నలగామ రాజును |
| నట్టేటన్ | = | ఏఱు మధ్యలో |
| ముంచి | = | ముంచి |
| పుణ్యాత్ములార | = | ఓ పుణ్యవంతులార |
| పోవుటయే | = | పారిపోవడమే |
| నీతి | = | నీతియా ? |

**తాత్పర్యం :**

పరుగెత్తుకుపోయే సైనికులతో నరసింహరాజు ఇలా చెప్పాడు. ఓ పుణ్యాత్ములారా ! ఓడిపోవడం, వీరుల ధర్మమా ? పిల్లలను చూసి పరుగుపెట్టటం ఎందుకు ? మిమ్మల్ని రక్షిస్తున్న వారిని విడిచిపెట్టడం మంచిదేనా ? హెచ్చుగా మీ నరాలలో ప్రవహించే రక్తము, రాజుగారు మీకు పెట్టిన అన్నముచే వృద్ధిపొందిన రక్తమే కాదా ? మోసగాండ్రై రాజుకు, ద్రోహము చేసి మిమ్మల్ని నమ్ముకొన్న రాజును ఏఱు మధ్యలో ముంచి పోవడమే నీతియా ?

**తనువు లస్థిరములు ధనములు కల్ల**
**కీర్తి యొక్కటి భువి ఖిలముగాకుండు**
**ధైర్యహీనత వీరధర్మంబు మాని**
**భంగురంబై మలభాండమైనట్టి**
**దేహంబుకొరకు సత్కీర్తి పోనాడి**
**విరిగిపోయెడునట్టి వెఱ్ఱులు గలరె**
**వీరసింహములకు వినుతిని గాంచు**
**సమరరంగంబులే సంచారవనులు**
**చచ్చిన బ్రతికిన సౌఖ్య మచ్చుటనె**

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| తనువుల స్థిరములు | = | శరీరములు |
| నిలుకడలేనివి | = | స్థిరముగా ఉండనవి |
| ధనములు | = | ఐశ్వర్యములు |
| కల్ల | = | అబద్ధము |
| కీర్తి యొక్కటి | = | ఒక్క కీర్తి మాత్రమే |
| భువిన్ | = | లోకములో |
| ఖిలము | = | చెడినది |
| కాకుండున్ | = | కాకుండా ఉంటుంది |
| ధైర్యహీనతన్ | = | ధైర్యము లేకపోవడంతో |
| వీర ధర్మంబు మాని | = | వీరుల ధర్మమైన యుద్ధాన్ని విడిచిపెట్టి |
| భంగురంబై | = | నశించేదయి |
| మలభాండమైనట్టి | = | మలమునకు పాత్ర అయినట్టి |
| దేహంబు కొఱకున్ | = | శరీరము కోసం |
| సత్కీర్తి | = | మంచి కీర్తిని |
| పోనాడి | = | పోగొట్టుకొని |
| విరిగిపోయెడు నట్టి | = | ఓడి పారిపోయేటటువంటి |
| వెఱ్ఱులు గలరె | = | వెర్రివారు ఉంటారా ? |
| వీర సింహములకు | = | సింహముల వంటి వీరులకు |
| వినుతిని గాంచు | = | ప్రఖ్యాతిని వహించు |
| సమర రంగంబులే | = | యుద్ధరంగములే |
| సంచారవనులు | = | విహరించే ఉద్యానవనములు |
| చచ్చినన్ | = | చచ్చినా |
| బ్రతికినన్ | = | బ్రతికినా |
| సౌఖ్యము | = | సౌఖ్యము |
| అచ్చటనె | = | ఆ యుద్ధరంగము నందే |

**తాత్పర్యం :**

దేహములు అశాశ్వతములు. ఐశ్వర్యాలు అసత్యములు. కీర్తి యొక్కటియే లోకంలో చెడిపోకుండా నిలిచి ఉంటుంది. ధైర్యములేక వీరుల ధర్మమైన యుద్ధాన్ని విడిచి, నశించే మలమునకు పాత్రమైన శరీరము కోసం మంచి కీర్తిని పోగొట్టుకొని ఓడి పారిపోయేటటువంటి వెర్రివాళ్ళు ఉంటారా ? సింహముల వంటి వీరులకు, ప్రసిద్ధిని పొందిన యుద్ధరంగములే విహారము చేసే ఉద్యానవనములు. చచ్చినా బ్రతికినా అక్కడే వారికి సౌఖ్యము కలుగుతుంది.

**బుద్ధులుచెడి పాఱిపోవుదు రేని**
**భుక్తిముక్తులు రెండు పోవును దొలగి**

నను బాసిపోవుట న్యాయంబుగాదు
తప్పునా మరణంబు తలచెడి పార
మృత్యుదేవతా వచ్చి మేనులనిచ్చె
బంటుపంతంబులే పారిపోవుటలు
పంకింప పెండ్లికి మార్చుటలేదు
సమరకార్యమునకై చనుదెంచినాము
వచ్చినకార్యంబు వరదలో గలిపి
బంధులుమిత్రులు పగవారు నవ్వ
పోవుట నీచత పుట్టి దన్నంబు
పోవద్దు రాజాన పోయితిరేని
అని యిట్లు పల్కిన ఆబలం బెల్ల
పారిపోవక రోషభరితమై నిల్చె
బాలచంద్రుం డంత భ్రాతలగూడి

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| బుద్ధులు + చెడి | = | మీ తెలివి, జ్ఞానము, నశించి |
| పాఱిపోవుదురేనిన్ | = | మీరు పారిపోయినట్లయితే |
| భుక్తిముక్తులు | = | తిండి, మోక్షములు |
| రెండు | = | రెండునూ |
| తొలగిపోవును | = | చెడిపోతాయి |
| నను బాసిపోవుట | = | నన్ను విడిచివెళ్ళడం |
| న్యాయంబుగాదు | = | మీకు ధర్మముగాదు |
| పారన్ | = | పారిపోగా |
| తలచెడి | = | మీరు వస్తుందని అనుకునే |
| మరణంబు | = | చావు |
| తప్పునా | = | తప్పి పోతుందా ? |
| మృత్యుదేవత | = | మరణదేవత |
| వచ్చి | = | వచ్చి |
| మేనులన్ | = | మన శరీరములందు |
| నిల్చెన్ | = | నిలబడింది |
| పారిపోవటలు | = | పారిపోవడము అనేది |
| బంటు పంతంబులు + ఏ | = | భటుల యొక్క పద్ధతులేనా ? |
| పరికింపన్ | = | ఆలోచింపగా |
| పెండ్లికి వచ్చుటలేదు | = | పెండ్లికి మనము రాలేదు |
| సమర కార్యమునకై | = | యుద్ధ కార్యానికై |

| | | |
|---|---|---|
| చనుదెంచినాము | = | వచ్చాము |
| వచ్చిన కార్యంబున్ | = | వచ్చిన పనిని |
| వరదలో గలిపి | = | నీటి ప్రవాహంలో కలిపి |
| బంధులు, మిత్రులు, పగవారున్ | = | బంధువులు, స్నేహితులు, శత్రువులునూ |
| నవ్వన్ | = | నవ్వేటట్లు |
| పోవుట | = | యుద్ధం నుండి పారిపోవుట |
| నీచత | = | నీచత్వము |
| అన్నంబు | = | అన్నము |
| పుట్టదు | = | పుట్టదు |
| పోవద్దు | = | యుద్ధాన్ని విడిచి మీరు వెళ్ళవద్దు |
| పోయితిరేనిన్ | = | వెళ్ళినట్లయితే |
| రాజాన | = | రాజుగారి మీద ఒట్టు |
| అనియిట్లు | = | అని ఈ విధంగా |
| పల్కినన్ | = | మాట్లాడగా |
| ఆ బలంబెల్లన్ | = | ఆ సైన్యము అంతా |
| పారిపోవక | = | పారిపోవడం మాని |
| రోషభరితమై | = | కోపముతో నిండినదై |
| నిల్చెన్ | = | నిలబడింది |
| బాలచందుండు | = | బ్రహ్మనాయుని కుమారుడైన బాలచంద్రుడు |
| అంతన్ | = | అప్పుడు |
| భ్రాతలగూడి | = | తన సోదరులతో కలిసి |

**తాత్పర్యం :**

"మీ తెలివి నశించి, పారిపోయినట్లయితే మీకు భుక్తి, ముక్తి అనే రెండూ పోతాయి. నన్ను విడిచి వెళ్ళడం, మీకు న్యాయము కాదు. ఆలోచిస్తే మీరు పారిపోతే మరణము తప్పుతుందా ? మృత్యుదేవతలు వచ్చి శరీరాలపై నిలబడింది. పారిపోవటం భటుల ధర్మమా ? ఆలోచిస్తే మనము పెళ్ళికి రాలేదు. యుద్ధానికి వచ్చాము. వచ్చిన పనిని విడిచి బంధువులు, స్నేహితులు, శత్రువులూ నవ్వే విధంగా పారిపోవడం, నీచత్వము. పారిపోతే అన్నము దొరకదు. మీరు పారిపోతే రాజు మీద ఒట్టు. మీరు పోవద్దు" అని నరసింగు మాట్లాడగా, ఆ నలగాముని సైన్యము అంతా పారిపోవడం మాని, కోపంతో నిలబడింది. అప్పుడు బాలచంద్రుడు తన సోదరులతో కలసి

**నలగామరాజు సైన్యంబు బాలచంద్రునిపై గవయుట :**

**అట్టహాసము చేసె అరిసెనలపుడు**
**జడిసిగుండెలు వ్రీల చలనంబునొంది**
**ధైర్యంబు వహియించి దర్పముల్ మీర**
**కదలు చక్రంబులు గంద్రగొడ్డండ్లు**
**పెద్దవిసురియలు భిండివాలములు**

**బల్లెముల్ కుంతముల్ పరశూలచయము**
**కొనికరంబుల తీవ్రకోపులై వచ్చి**
**మిడుతలు మంటపై మిడిచిపడ్డట్లు**
**బాలుని దాకిరి భయదూరు లగుచు**

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| అరిసేనలు | = | శత్రుసైన్యాలు |
| అప్పుడు | = | అప్పుడు |
| అట్టహాసము, చేసెన్ | = | మిక్కిలి పెద్ద నవ్వునవ్వాయి |
| జడిచి | = | భయపడి |
| గుండెలు వ్రీలన్ | = | తమ గుండెలు పగులగా |
| చలనంబునొంది | = | చలించి |
| ధైర్యంబు వహియించి | = | ధైర్యాన్ని పూని |
| దర్పములు, మీఱన్ | = | గర్వములు, అతిశయించగా |
| కదలు, చక్రంబులు | = | కదలునట్టి చక్రములూ |
| గండ్ర గొడ్డండ్లు | = | గండ్ర గొడ్డలులూ |
| పెద్దవి, సురియలు | = | పెద్దవైన, చురకత్తులూ |
| బిండివాలము | = | వడిసెల వంటి ఆయుధాలు |
| బల్లెముల్ | = | బల్లెములూ |
| కుంతముల్ | = | ఈటెలూ |
| పరుశూల, భయము | = | పరశువుల, సమూహమునూ |
| కరంబులన్ | = | చేతులలోనికి |
| కొని | = | తీసుకొని |
| తీవ్ర కోపులై | = | తీవ్రమైన కోపము కలవారై |
| వచ్చి | = | బాలచంద్రుని సైన్యము మీదికి నరసింగు సైనికులు వచ్చి |
| మిడుతలు | = | మిడుతలు అనే పురుగులు |
| మంటపై | = | మంట మీదకు |
| మిడిసిపడ్డట్లు | = | మీదికి ఎగిరేటట్లు |
| భయదూరులగుచున్ | = | భయము నుండి దూరమైన వారయి |
| బాలునిన్ | = | బాలచంద్రునిపై |
| తాకిరి | = | పోరాడారు |

**తాత్పర్యం :**

భయంతో గుండెలు పగిలేలా, శత్రువులు సేనలు అట్టహాసము చేశాయి. వారు కదలి, ధైర్యాన్ని వహించి గర్వములు అతిశయింపగా కదలే చక్రములూ, గండ్రగొడ్డళ్ళూ, పెద్దపెద్ద చురకత్తులూ ఖిండివాలములూ, బల్లెములు, ఈటెలు, పరశ్వధములూ తమ చేతులతో పట్టుకొని, తీవ్రమైన కోపం కలవారై వచ్చి మిడుతలు మంటపై పడినట్లుగా మిడిసిపడుతూ బాలచంద్రుని పైకి భయం విడిచినవారై నలగాముని సైనికులు వచ్చిపడ్డారు.

**విక్రమాటోపత వెలిసి బాలుండు**
**జలధిలోమందర శైలంబు తిరిగి**
**కలక నొందించిన కైవడి మీరి**
**కాలాగ్ని లోకముల్ కాలిచినట్లు**
**దవవహ్ని విడినంబు దొర్కొన్నభంగి**
**మనుజు లోమారి మరిగిన రీతి**
**శత్రుసైన్యంబుపై చయ్యన గదిపి**
**వారు ప్రయోగించు వరశస్త్రవితతి**
**బహువిధంబుల ద్రుంచె భంగముగాక**
**ఒకబంటు నొకకాలు నాయ్యనబట్టి**
**యొకబంటు తాడవట్టి హుంకరించుచును**
**ఇద్దర ముగ్గుర నేకకాలమున**
**కుంతంబులం జిమ్మి కూలజేయుచును**

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| బాలుంబు | = | బాలచంద్రుడు |
| విక్రమాటోపతన్ | = | పరాక్రమము యొక్క అతిశయము చేత |
| వెలిసి | = | బయలుపడి |
| జలధిలోన్ | = | సముద్రములో |
| మందర శైలంబు | = | మందర పర్వతము |
| తిరిగి | = | తిరిగి |
| కలకనొందించిన | = | వ్యాకుల పరచిన |
| కైవడిన్ | = | వలె |
| మీరి | = | అతిశయించి |
| కాలాగ్ని | = | ప్రళయకాలము నందలి అగ్ని |
| లోకముల్ కాలిచినట్లు | = | లోకాలను, మండించిన విధంగా |
| దవ, వహ్ని | = | దావాగ్ని |
| విపినంబున్ | = | అరణ్యమును |
| తొర్కొన్న భంగిన్ | = | క్రమ్ముకొన్న విధంగా |

| | | |
|---|---|---|
| మనుజులలోన్ | = | మానవులలో |
| మారి, మరిగిన రీతిన్ | = | మృత్యుదేవత ఆశ్రయించినట్లుగా |
| శత్రు సైన్యంబుపై | = | శత్రువుల సైన్యముపై |
| చయ్యన గదిసి | = | శీఘ్రముగా తాకి |
| వారు, ప్రయోగించు | = | వారు ప్రయోగించే |
| వర, శస్త్ర వితతిన్ | = | శ్రేష్ఠమైన, ఆయుధముల సమూహమును |
| బహువిధంబులన్ | = | అనేకవిధాలుగా |
| భంగముగానన్ | = | ముక్కలు అయ్యేలాగున |
| త్రుంచెన్ | = | ఖండించాడు |
| ఒక బంటునొక కాలు | = | ఒక భటుని యొక్క ఒక కాలును |
| ఒయ్యన బట్టి | = | విలాసముగా పట్టుకొని |
| ఒక బంటు | = | ఒక భటుని యొక్క |
| తొడవట్టి | = | తొడ పట్టుకొని |
| హుంకరించుచును | = | హుంకారము చేస్తూ |
| ఇద్దరన్ | = | ఇద్దరినీ |
| ముగ్గురన్ | = | ముగ్గురనూ |
| ఏకకాలమునన్ | = | ఒకే కాలంలో |
| కుంతంబులం జిమ్మి | = | ఈటెలను, విసరి |
| కూలజేయుచును | = | కూలిపోయే విధంగా చేస్తూ |

**తాత్పర్యం :**

బాలచంద్రుడు పరాక్రమాతిశయముతో విజృంభించి సముద్రములో మందపర్వతము తిరిగి కలతను పొందించిన విధంగా ప్రళయకాలాగ్ని లోకాలను మండించినట్లుగా, దావాగ్ని అడవులలో క్రమ్మిన విధంగా, మనుష్యులలో మృత్యువు మరిగినట్లుగా, శత్రుసైన్యాలపై శీఘ్రంగా తాకి, వారు ప్రయోగించే శ్రేష్ఠమైన ఆయుధాలను అనేకవిధాలుగా ముక్కలు అయ్యేటట్లు ఖండించాడు. ఒక భటుని ఒక కాలును విలాసంగా పట్టుకొని, మరొక భటుని యొక్క తొడను పట్టుకొని, హుంకరిస్తూ ఇద్దరినీ, ముగ్గురినీ ఒకేసారి ఈటెలను విసరి వారిని కూలిపోయేటట్లుగా చేశాడు.

**బాణంబులం గ్రుచ్చి పట్టియెత్తుచును**
**కత్తులతో తలల్ గట్టిగా నరకి**
**వ్రయ్యలై తనువులు వసుధపై బడగ**
**కటిదేశములయందు కత్తులు వేయ**
**తునకలై భూస్థలి దొరగుచునుండె**
**కుంతంబులెడ గ్రుమ్మి కూల్చెడువేళ**
**నెత్తురు భూమిపై నిండుగ పారె**

ఎదురులేక సమర మీగతిచెల్ల
కనుగొని నరసింగు కంపంబు గదుర
తలయూచి శ్రీహరి దలచి నెమ్మదిని
వ్రేలిడి ముక్కుపై వెరగంది కుంది

**అర్థాలు :**

| | | |
|---|---|---|
| బాణంబులన్ | = | బాణములను |
| గ్రుచ్చి | = | శరీరములో గ్రుచ్చి |
| పట్టి | = | ఆ బాణాలను పట్టుకొని |
| ఎత్తుచును | = | ఆ బాణాలను గ్రుచ్చుకొన్న వారిని పైకి ఎత్తుతూ |
| కత్తులతోన్ | = | కత్తులతో |
| తలల్ | = | వారి తలలను |
| గట్టిగా, నరికి | = | గాఢంగా నరికి |
| తనువులు | = | వారి శరీరాలు |
| వ్రయ్యలై | = | చీలికలై |
| వసుధ పైబడగన్ | = | నేలపై పడగా |
| కటిదేశములయందున్ | = | సైనికుల మొల ప్రదేశములలో |
| కత్తులు వేయన్ | = | కత్తులతో నరకగా |
| తునకలై | = | ముక్కలై |
| భూస్థలిదొరగచునుండెను | | |
| భూస్థలిన్ | = | భూమిపై |
| తొరగుచున్ | = | విడివడుతూ |
| ఉండెన్ | = | ఉన్నాయి |
| కుంతంబులు | = | ఈటెలు |
| ఎడన్ | = | హృదయము నందు |
| క్రుమ్మి | = | పొడిచి |
| కూల్చెడువేళన్ | = | పడగొట్టే సమయములో |
| నెత్తురు | = | రక్తము |
| భూమిపై | = | నేలపై |
| నిండుగన్ | = | నిండుగా |
| పారెన్ | = | ప్రవహించింది |
| ఎదురులేక | = | బాలచంద్రుని ఎదిరించేవారు లేక |
| సమరము | = | యుద్ధము |
| ఈగతిన్ | = | ఈవిధంగా |

| | | |
|---|---|---|
| చెల్లన్ | = | అడ్డంలేకుండా సాగగా |
| నరసింగు | = | నరసింహారాజు |
| కనుగొని | = | చూచి |
| కంపంబు + కదురన్ | = | వణుకు, కలుగగా |
| తలయూచి | = | తన తలలను ఆడించి |
| నెమ్మదిని | = | తన మనస్సులో |
| శ్రీహరిన్ | = | శ్రీ మహావిష్ణువును |
| తలచి | = | స్మరించి |
| ముక్కుపైన్ | = | తన ముక్కుపై |
| వ్రేలాడి | = | వ్రేలు పెట్టుకొని |
| వెరగంది | = | నిశ్చేష్టతను పొంది |
| కుందెన్ | = | దుఃఖించాడు |

**తాత్పర్యం :**

బాణాలతో గ్రుచ్చి పట్టుకొని, పైకి ఎత్తుతూ కత్తులతో తలలు గట్టిగా నరికి చీలికలై శరీరాలు నేలపైపడగా, మొల ప్రదేశములయందు కత్తులతో కొట్టగా, ముక్కలై నేలపై జారిపడుతున్నాయి. ఈటెలను గుండెల్లో గ్రుచ్చి, కూలగొట్టే సమయంలో రక్తము నేలపై నిండుగా ప్రవహించింది. బాలచంద్రుడిని ఎదిరించేవారు లేకుండా ఈవిధంగా యుద్ధము అడ్డు లేకుండా సాగింది. బాలచంద్రుని యుద్ధాన్ని నరసింగు చూసి, వణుకు పుట్టగా, తలను ఆడించి శ్రీహరిని మనస్సులో తలచుకొని, ముక్కుపై వేలు వేసుకొని ఆశ్చర్యపడి దుఃఖాన్ని పొందాడు.

**డా॥ కె. భానునాయక్**
ఎం.ఏ., పిహెచ్.డి.,
తెలుగు అధ్యాపకులు,
ఎస్.ఎస్.&ఎన్ కళాశాల,
నరసరావుపేట.

పాఠం - 8

# పలనాటి బెబ్బులి - శ్రీనాథుడు

## (పలనాటి వీరచరిత్ర - ద్విపద కావ్యం - పుట 108 నుండి 112 వరకు)

## బాలచంద్రుడు భీమంబగు సంగ్రామం బొనర్చుట ... (108) వెఱగంది కుంది)

## సందర్భసహిత వ్యాఖ్యలు

**విషయసూచిక :**

**8.0 పరిచయం**
**8.1 ఉద్దేశ్యం**
**8.2 సందర్భసహిత వ్యాఖ్యలు**
**8.3 పరీక్షకు రాదగిన ప్రశ్నలు - సమాధానాలు**

**8.0 పరిచయం :**

శ్రీనాథుని మహాకవిచే రచింపబడిన "పలనాటి వీరచరిత్ర" ద్విపద కావ్యం

**8.1 ఉద్దేశ్యం :**

ఇంతకుముందు "పలనాటి బెబ్బులి" పాఠ్యభాగ సందర్భం, పాఠ్యభాగ వివరణ తెలుసుకున్నారు. ఇప్పుడు సందర్భసహిత వ్యాఖ్యలు, పరీక్షకు రాదగిన ప్రశ్నలు - సమాధానాలు, వ్యాకరణ అంశాలు తెలుసుకుంటారు.

### సందర్భసహిత వ్యాఖ్యలు :

### 1. చాలసేపీగతి సమరం బొనర్చె

**కవి పరిచయం :**

ఈ వాక్యము శ్రీనాథ మహాకవి రచించిన పలనాటి వీరచరిత్ర అనే ద్విపద కావ్యము నుండి గ్రహింపబడిన "పలనాటి బెబ్బులి" అనే పద్యభాగములోనిది.

**సందర్భము :**

బాలచంద్రుడు తన సోదరులతో కలిసి నలగామరాజు సైనికులపైపడి, వారి అవయవాల్ని నరకి, వక్షఃస్థలాల్ని ముక్కలు చేశాడు. తరువాత సింహపుపిల్లవలె ఏనుగుపైకి దుమికి వాటి తొండాల్ని ముక్కలు చేసి మావటివాండ్రను చంపాడు. తరువాత గుఱ్ఱాలపై పడి రౌతులను చంపాడు. వేటకుక్కలను తరిమి వారి ధనుస్సులను బాణాలను ముక్కలు చేశాడు. గుఱ్ఱాల మెడలు ఖండించాడు. తనను ఎదిరించేవారి రొమ్ములపై ఈటెలతో గ్రుచ్చాడు. ఈవిధంగా బాలచంద్రుడు చాలాసేపు శత్రువులపై యుద్ధం చేశాడని, కవి వర్ణించి చెప్పిన సందర్భములోనిది.

**అర్థము :**

ఈవిధంగా చాలాసేపు యుద్ధం జరిగింది.

**వ్యాఖ్య :**

బాలచంద్రుని చేసిన యుద్ధపురీతిని కవి శ్రీనాథుడు ఇలా వర్ణించాడు.

**2. పారిపోనిచ్చిన బ్రదుకుదుమయ్య**

**కవి పరిచయం :**

ఈ వాక్యము శ్రీనాథ మహాకవి రచించిన పలనాటి వీరచరిత్ర అనే ద్విపద కావ్యము నుండి గ్రహింపబడిన "పలనాటి బెబ్బులి" అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

బాలచంద్రుడు భయంకరంగా నలగామరాజు సైన్యముపై యుద్ధము చేసి, శత్రువుల గజతురగపదాతి సైన్యాలను ఖండించి చెల్లాచెదురు చేశాడు. అప్పుడు నలగామరాజు సైన్యాలు కలత చెందాయి. అప్పుడు ఆ సైనికులలో కొందరు తమను స్త్రీలు తిట్టారని, ఆ తిట్లు పడలేక యుద్ధానికి నలగామరాజు వెంట తాము వచ్చామనీ, ఇప్పుడు యుద్ధంలో చస్తున్నామనీ తమను పారిపోనిస్తే బ్రతుకుతామనీ, ఏడ్చారని కవి చెప్పిన సందర్భంలోనిది.

**అర్థం :**

పారిపోనిస్తే జీవిస్తాము.

**వ్యాఖ్య :**

బాలచంద్రుని చేతిలో యుద్ధరంగంలో దెబ్బతిన్న శత్రుసైనికులు, ఏడ్చిన తీరును కవి వర్ణించాడు.

**3. బుజముల కాయలు పూని కన్గొగుడి**

**కవి పరిచయం :**

ఈ వాక్యము శ్రీనాథ మహాకవి రచించిన పలనాటి వీరచరిత్ర అనే ద్విపద కావ్యము నుండి గ్రహింపబడిన "పలనాటి బెబ్బులి" అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

బాలచంద్రుని భయంకర యుద్ధాన్ని చూసి నలగామరాజు సైన్యము కంగారుపడింది. తమను పారిపోనిస్తే తాము బ్రతుకుతామనీ వారు వేడుకొన్నారు. నిజానికి తాము సైనికులముకామనీ, పల్లకీలు మోసే బోయీలానీ, కావాలంటే తమ భుజాలపై కాసిన కాయలు చూడండనీ, నలగామరాజు సైనికులు మొరపెట్టారని కవి చెప్పిన సందర్భంలోనిది.

**అర్థం :**

మా భుజాలపై ఉన్న కాయలనుబట్టి చూడండి.

**వ్యాఖ్య :**

తాము బోయీలానీ, సైనికులముకామనీ, తమ మాటపై నమ్మకం లేకపోతే తమ భుజాలపై కాసిన కాయలను చూడండనీ, తమను పారిపోనియ్యండనీ, సైనికులుగా వచ్చిన కొందరు బోయీలు వేడుకొన్నారని కవి చెప్పాడు.

**4. బాగుగా నమ్మించి పంప వచ్చితిమి**

**కవి పరిచయం :**

ఈ వాక్యము శ్రీనాథ మహాకవి రచించిన పలనాటి వీరచరిత్ర అనే ద్విపద కావ్యము నుండి గ్రహింపబడిన "పలనాటి బెబ్బులి" అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

బాలచంద్రుడితో యుద్ధం చేయలేక, నలగామరాజు సైన్యం కలత పడింది. ఆ సైనికులతో కొందరు తమను నాగమ్మ నమ్మించి యుద్ధానికి తమను పంపిందనీ నలగామరాజు సైన్యాన్ని చూడగానే బాలచంద్రుని పక్షపు సైనికులు పారిపోతారనీ తమకు ఏమీ భయములేదని నాగమ్మ తమను నమ్మించి, యుద్ధానికి పంపిందనీ నాగమ్మ మాటలు నమ్మి తాము యుద్ధానికి వచ్చామనీ ఏడ్చిన సందర్భంలోనిది.

**అర్థం :**

బాగా నమ్మకం కలుగజేసి పంపిస్తే వచ్చాము.

**వ్యాఖ్య :**

నలగామరాజు సైనికులు బాలచంద్రుని చేతిలో యుద్ధంలో దెబ్బలుతిని, ఈవిధంగా ఏడ్చారు.

**5. బలుసాకు దినియైన బ్రదుకగగలము.**

**కవి పరిచయం :**

ఈ వాక్యము శ్రీనాథ మహాకవి రచించిన పలనాటి వీరచరిత్ర అనే ద్విపద కావ్యము నుండి గ్రహింపబడిన "పలనాటి బెబ్బులి" అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

బాలచంద్రుడితో యుద్ధం చేయలేక నలగామరాజు సైన్యము కలతపడింది. ఆ సైనికులలో కొందరు తమను నాగమ్మ నమ్మించి యుద్ధానికి పంపిందనీ, నలగామరాజు సైన్యాన్ని చూడగానే శత్రుసైనికులు పారిపోతారనీ, తమకు భయము ఏమీ లేదనీ తమకు నాగమ్మ చెప్పి, యుద్ధాన్ని తమను పంపిందనీ ఇప్పుడు తమ ప్రాణాలు దక్కితే తమ పిల్లలను తాము కలుసుకొని ఏ బలుసాకో తిని, బ్రతుకుతామనీ తమను పారిపోనిమ్మనీ, వారు ప్రార్థించారని కవి చెప్పిన సందర్భంలోనిది.

**అర్థం :**

బలుసాకు తినియైనా జీవిస్తాము.

**వ్యాఖ్య :**

తమకు నలగామరాజు కొలువుల్లో సైనికులుగా ఉద్యోగం వద్దనీ, తమను యుద్ధం నుండి పారిపోనిస్తే ఏదో ఒకటి తిని తమ పిల్లలతో కలసిమెలసి జీవిస్తామని నలగామరాజు సైనికులలో కొందరు ఏడ్చారు.

**6. ఖండించి యముజేర గ్రక్కున నంపె**

**కవి పరిచయం :**

ఈ వాక్యము శ్రీనాథ మహాకవి రచించిన పలనాటి వీరచరిత్ర అనే ద్విపద కావ్యము నుండి గ్రహింపబడిన "పలనాటి బెబ్బులి" అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

బాలచంద్రుడు తమ్ముళ్ళందర్నీ తగిన స్థలాల్లో యుద్ధరంగంలో నిలబెట్టాడు. తాను పరిఘము తీసుకొని తనపై బాణాలు పడకుండా దాన్ని నేర్పుగా తిప్పాడు. కత్తి తీసుకొని శత్రువుల ధనస్సులనూ, వాటి నారలనూ, ముక్కలు ముక్కలుగా చేశాడు. ఈవిధంగా శత్రువుల బాణాలను, అమ్ములపొదులనూ పిండిపిండిగా చేసి, పారిపోయే శత్రువుల శరీరాలను వండడానికి పదార్థాలు తగిన విధంగా ఖండించి యముని వద్దకు వారిని బాలచంద్రుడు పంపాడని కవి వర్ణించి చెప్పిన సందర్భంలోనిది.

**అర్థం :**

వేగంగా శరీరములన్నింటినీ ముక్కలు చేసి యముని వద్దకు శీఘ్రముగా పంపాడు.

**వ్యాఖ్య :**

బాలచంద్రుడు తన యుద్ధనైపుణ్యంతో శత్రువుల శరీరాలను వండడానికి పదార్థాలను తరిగి ముక్కలు చేసినట్లు ముక్కలుగా చేశాడని కవి వర్ణించాడు.

**7. విరిగిపోవుట యట్లు వీర ధర్మంబె**

**కవి పరిచయం :**

ఈ వాక్యము శ్రీనాథ మహాకవి రచించిన పలనాటి వీరచరిత్ర అనే ద్విపద కావ్యము నుండి గ్రహింపబడిన "పలనాటి బెబ్బులి" అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

బాలచంద్రుడు చేసే యుద్ధతీవ్రతను తట్టుకోలేక, ఆ యుద్ధంలో బాలచంద్రుని చేతిలో చావగా మిగిలిన నలగామరాజు సైనికులలో కొందరు యుద్ధరంగాన్ని విడిచి పారిపోవడానికి సిద్ధపడ్డారు. అప్పుడు ఆ సైనికులకు ధైర్యాన్ని చెప్పుతూ, నలగామరాజు తమ్ముడు నరసింహరాజు ఓడిపోయి పారిపోవుట వీరులకు ధర్మమేనా ? అని పారిపోవుతున్న సైనికులను ప్రశ్నించిన సందర్భంలోనిది.

**అర్థం :**

యుద్ధరంగంలో ఇలా ఓడిపోయి పారిపోవుట వీరులయిన వారికి ధర్మమా ?

**వ్యాఖ్య :**

యుద్ధరంగంలో సైనికులు పోరాడి శత్రువులను జయించాలి లేదా వీరమరణం పొందాలి. అంతేకానీ పారిపోవడం వీరధర్మం కాదని, నరసింహభూపతి చెప్పాడు.

**8. కీర్తి యొక్కటి భువి ఖిలము గాకుండు**

**కవి పరిచయం :**

ఈ వాక్యము శ్రీనాథ మహాకవి రచించిన పలనాటి వీరచరిత్ర అనే ద్విపద కావ్యము నుండి గ్రహింపబడిన "పలనాటి బెబ్బులి" అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

బాలచంద్రుడు మహాభయంకరంగా నలగామరాజు సైన్యంపై యుద్ధంచేసి, గజ, అశ్వ, పదాతి సైన్యాలను చిందరవందర చేశాడు. దానితో నలగామరాజు సైనికులు భయంతో పారిపోవడానికి సిద్ధపడ్డారు. పారిపోతున్న తన సైన్యానికి ధైర్యము చెప్పుతూ, నమ్ముకున్న రాజును విడిచి పారిపోవడం నీతికాదనీ శరీరములు స్థిరమైనవికావనీ, ఐశ్వర్యాలు అబద్ధమనీ, లోకంలో కీర్తి ఒక్కటే నశింపకుండా నిలిచిఉంటుందనీ, తన సైనికులకు నలగామరాజు తమ్ముడు నరసింహరాజు ధైర్యం చెప్పిన సందర్భంలోనిది.

**అర్థం :**

కీర్తి ఒక్కటియే లోకంలో నశింపకుండా ఉంటుంది.

**వ్యాఖ్య :**

యుద్ధం నుండి పారిపోయి, శరీరాలను కాపాడుకుందామన్నా ఆ శరీరాలు అశాశ్వతాలని, యుద్ధంలో జయించి కీర్తి సంపాదిస్తే ఆ కీర్తి శాశ్వతంగా ఉంటుందనీ, నరసింహరాజు తన సేనలకు ధైర్యాన్ని, కర్తవ్యాన్ని తెలిపాడు.

**9. చచ్చిన బ్రతికిన సౌఖ్యముచ్చటనె**

**కవి పరిచయం :**

ఈ వాక్యము శ్రీనాథ మహాకవి రచించిన పలనాటి వీరచరిత్ర అనే ద్విపద కావ్యము నుండి గ్రహింపబడిన "పలనాటి బెబ్బులి" అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

బాలచంద్రుని యుద్ధ తీవ్రతకు, నలగామరాజు సైన్యం భయపడింది. తమ ప్రాణాలు కాపాడుకోవడం కోసం వారు పారిపోవడానికి సిద్ధమయ్యారు. అప్పుడు తన సైనికులకు ధైర్యాన్ని చెపుతూ వీరులయిన వారికి యుద్ధరంగములే విహార వనములనీ, చచ్చినా, బ్రతికినా వీరులకు యుద్ధరంగంలోనే సౌఖ్యమనీ నరసింహరాజు తన సైనికులకు ధైర్యం చెప్పిన సందర్భంలోనిది.

**అర్థం :**

చచ్చినా, బ్రతికినా అక్కడనే సౌఖ్యము కలుగుతుంది.

**వ్యాఖ్య :**

సింహాల వంటి వీరులకు యుద్ధరంగమే విహార వనములనీ, వారు చచ్చినా బ్రతికినా యుద్ధరంగంలోనే వారికి సౌఖ్యము లభిస్తుందనీ నరసింహరాజు తన సైన్యానికి బోధచేశాడు.

**10. నను బాసి పోవుట న్యాయంబుగాదు**

**కవి పరిచయం :**

ఈ వాక్యము శ్రీనాథ మహాకవి రచించిన పలనాటి వీరచరిత్ర అనే ద్విపద కావ్యము నుండి గ్రహింపబడిన "పలనాటి బెబ్బులి" అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

బాలచంద్రుని యుద్ధతీవ్రతకు నలగామరాజు సైన్యం భయపడింది. అందులో కొందరు సైనికులు యుద్ధరంగం నుండి పారిపోవడానికి సిద్ధమయ్యారు. అప్పుడు నరసింహరాజు తన సైనికులకు ధైర్యము చెప్పాడు. యుద్ధం నుండి పారిపోతే భుక్తి, ముక్తి రెండూ పోతాయనీ, సైనికులు తన్ను యుద్ధంలో విడిచి తాము ఒక్కరూ వెళ్ళిపోవడం న్యాయంకాదనీ నరసింహరాజు పారిపోతున్న తన సైనికులకు నచ్చచెబుతున్న సందర్భంలోనిది.

**అర్థం :**

నన్ను విడిచిపోవడం న్యాయము కాదు.

**వ్యాఖ్య :**

నరసింహరాజు తన సైనికులకు ధైర్యాన్ని చెబుతూ, వారు తన్ను విడిచి పారిపోవడం ధర్మంకాదని చెప్పాడు.

**11. వ్రేలిడి ముక్కుపై వెరగంది కుంది**

**కవి పరిచయం :**

ఈ వాక్యము శ్రీనాథ మహాకవి రచించిన పలనాటి వీరచరిత్ర అనే ద్విపద కావ్యము నుండి గ్రహింపబడిన "పలనాటి బెబ్బులి" అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

నరసింహరాజు తన సైనికులకు ధైర్యాన్ని నూరిపోసి, బాలచంద్రుని యుద్ధానికి వారిని ప్రోత్సహించాడు. ఆ యుద్ధం తీవ్రంగా సాగింది. ఆ యుద్ధంలో బాలచంద్రుడు కత్తులతో శత్రువుల తలలు నరికి, ముక్కలు చేశాడు. అప్పుడు వారి శరీరాలు ముక్కలై నేలపై దొర్లాయి. వారి రక్తము భూమిపై నిండుగా ప్రవహించింది. ఈవిధంగా బాలచంద్రునికి, నలగామరాజు సైన్యానికి భయంకర యుద్ధం సాగిందనీ, ఆ యుద్ధాన్ని చూసి నరసింహరాజు భయంతో వణికిపోయాడు అనీ, ఆశ్చర్యంతో తన ముక్కుపై వ్రేలు వేసుకొని దుఃఖించాడనీ కవి చెప్పిన సందర్భంలోనిది.

**అర్థం :**

ఆశ్చర్యము చెంది ముక్కుపై వ్రేలు వేసుకొని దుఃఖించాడు.

**వ్యాఖ్య :**

బాలచంద్రుడు చేసిన యుద్ధంలో తన సైనికులు మరణించగా, భయపడి నరసింహరాజు దుఃఖించాడు.

**12. కొదమసింహం భంగి కుప్పించి ఎగిరి**

**కవి పరిచయం :**

ఈ వాక్యము శ్రీనాథ మహాకవి రచించిన పలనాటి వీరచరిత్ర అనే ద్విపద కావ్యము నుండి గ్రహింపబడిన "పలనాటి బెబ్బులి" అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

బాలచంద్రుడు కార్యముపూడి రణరంగములో నలగామరాజు సైన్యముపై భయంకరమైన యుద్ధాన్ని చేశాడు.

శత్రుసైనికుల మణికట్లను, శిరస్సులను, మోచేతులను, నుదురు భాగాలను, కనుగ్రుడ్లను, దౌడలను, మోకాళ్ళను ఖండించాడు. ఆ తరువాత శత్రువుల ఏనుగుల బలాన్ని చూసి, బాలచంద్రుడు కోపంతో ఆ ఏనుగుల పైకి కొదమసింహమువలె దుమికి, ఎగిరాడని కవి బాలచంద్రుని యుద్ధాన్ని వర్ణిస్తూ చెప్పిన సందర్భంలోనిది.

**అర్థం :**

పడుచు సింహమువలె దుమికి ఎగిరి

**వ్యాఖ్య :**

బాలచంద్రుడు శత్రువుల ఏనుగుల పైకి, సింహపు పిల్లవలె దుమికి, ఎగిరాడని కవి వర్ణించాడు.

**13. "ఆలుబిడ్డల బాసి అన్నంబు కొఱకు
వచ్చితి మీనేల వ్రాసెను మృత్యువు"**

**కవి పరిచయం :**

ఈ వాక్యము శ్రీనాథ మహాకవి రచించిన పలనాటి వీరచరిత్ర అనే ద్విపద కావ్యము నుండి గ్రహింపబడిన "పలనాటి బెబ్బులి" అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

బాలచంద్రుడు భయంకరమైన యుద్ధంచేసి శత్రువుల గజ, తురగ, పదాతి సైన్యాలను ఖండించాడు. అప్పుడు నలగామరాజు సైన్యము కలత పడింది. నలగామరాజు పక్షము వారిలో కొందరు సైనికులు తాము అన్నము కోసము, భార్యనూ, పిల్లలనూ విడిచి యుద్ధానికి వచ్చామనీ, తమకు ఆ నేలపై చావు రాసి పెట్టబడిందనీ, ఏడ్చారని కవి చెప్పిన సందర్భంలోనిది.

**అర్థం :**

అన్నము కోసము భార్యనూ, పిల్లలనూ విడిచివచ్చాము ఈ ప్రదేశంలో మాకు చావు రాసి ఉంది.

**వ్యాఖ్య :**

కేవలమూ అన్నము దొరుకుతుందని, సైన్యంలో తాము చేరి, యుద్ధానికి వచ్చామనీ తమకు మృత్యువు అక్కడ రాసిపెట్టే యుందనీ, శత్రుసైనికులు దుఃఖించారు.

**14. "పణతలు దిట్టిన పడలేక వచ్చి
చచ్చును నుంటిమీ సమరరంగమున"**

**కవి పరిచయం :**

ఈ వాక్యము శ్రీనాథ మహాకవి రచించిన పలనాటి వీరచరిత్ర అనే ద్విపద కావ్యము నుండి గ్రహింపబడిన "పలనాటి బెబ్బులి" అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

బాలచంద్రుడు భయంకరంగా నలగామరాజు సైన్యంపై యుద్ధంచేసి, గజ, తురగ, పదాతి సైన్యాలను ఖండించి, చెల్లాచెదురు చేశాడు. అప్పుడు నలగామరాజు సైన్యమువారు కలత చెందారు. వారిలో కొందరు తమను స్త్రీలు తిట్టారనీ,

ఆ తిట్లు పడలేక యుద్ధానికి నలగామరాజు వెంట తాము వచ్చామనీ, ఇప్పుడు యుద్ధరంగంలో తాము చస్తున్నామనీ ఏడ్చారనీ కవి చెప్పిన సందర్భంలోనిది.

**అర్థము :**

స్త్రీలు నిందిస్తే ఆ తిట్లు భరించలేక యుద్ధానికి వచ్చి యుద్ధరంగంలో చస్తున్నాము.

**వ్యాఖ్య :**

తమకు ఇష్టం లేకపోయినా గ్రామాలలోని ఆడవారు మీకు పౌరుషం లేదా అని తిడితే, ఆ తిట్లను భరించలేక యుద్ధానికి వచ్చామనీ ఇప్పుడు యుద్ధభూమిలో చస్తున్నామనీ సైనికులు ఏడ్చారనీ కవి చెప్పారు.

**15. "బలిమి మీ నరముల పారు రక్తంబు
రాజాన్న వర్ధిత రక్తంబుగాదె ?"**

**కవి పరిచయం :**

ఈ వాక్యము శ్రీనాథ మహాకవి రచించిన పలనాటి వీరచరిత్ర అనే ద్విపద కావ్యము నుండి గ్రహింపబడిన "పలనాటి బెబ్బులి" అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

బాలచంద్రుని యుద్ధ తీవ్రతను తట్టుకోలేక ఆ యుద్ధంలో చావగా మిగిలిన, కొందరు నలగాముని సైనికులు యుద్ధాన్ని విడిచి పారిపోవాలని అనుకున్నారు. అప్పుడు వారికి ధైర్యం చెపుతూ నలగామరాజు తమ్ముడు నరసింహభూపతి వారితో మీ నరాలలో బలంగా ప్రవహిస్తున్న రక్తము మీకు రాజు పెడుతున్న అన్నంతో పెరిగినదే కదా ! అని తన సైనికులను ప్రశ్నించిన సందర్భంలోనిది.

**అర్థం :**

బలంగా మీ నరాలలో ప్రవహించే రక్తము మీకు రాజుగారు పెట్టిన అన్నంతో వృద్ధి పొందినదే కదా !

**వ్యాఖ్య :**

రాజుగారి అన్నం తిని పెరిగిన ఆ సైనికులు, రాజును మోసంచేసి యుద్ధం నుండి పారిపోవడం తగదని, నరసింహ భూపతి తన సైనికులను హెచ్చరించాడు.

**16. నమ్మిన రాజును నట్టేట ముంచి పోవుటయే నీతి పుణ్యాత్ములార !**

**కవి పరిచయం :**

ఈ వాక్యము శ్రీనాథ మహాకవి రచించిన పలనాటి వీరచరిత్ర అనే ద్విపద కావ్యము నుండి గ్రహింపబడిన "పలనాటి బెబ్బులి" అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

బాలచంద్రుని యుద్ధ దాటికి తట్టుకోలేక నలగామరాజు సైనికులు యుద్ధరంగం నుండి పారిపోవాలని ప్రయత్నించారు. అప్పుడు నలగామరాజు తమ్ముడు నరసింహరాజు పారిపోవటానికి సిద్ధమైన తన భటులతో వారి శరీరంలోని

రక్తము రాజుపెట్టిన అన్నం తినే పెరిగిందనీ, తమను నమ్ముకున్న రాజును కష్టస్థితిలో విడిచి తాము పారిపోవటం నీతికాదనీ, నరసింహభూపతి వారికి హితాన్ని ఉపదేశించిన సందర్భంలోనిది.

**అర్థం :**

ఓ పుణ్యాత్ములారా ! నమ్మిన రాజును, ఏటి మధ్యలో ముంచి వెళ్ళటం నీతియేనా ?

**వ్యాఖ్య :**

సైనికులను నమ్మి రాజు యుద్ధానికి వారిని పంపిస్తే యుద్ధం జరుగుతుండగా రాజును పిలిచి, సైనికులు పారిపోవడం నీతికాదని నరసింగు తన సైనికులకు చెప్పాడు.

**17. దేహంబు కొఱకు సత్కీర్తిపోనాడి**
**విరిగిపోయెడు నట్టి వెఱ్ఱులు గలరె ?**

**కవి పరిచయం :**

ఈ వాక్యము శ్రీనాథ మహాకవి రచించిన పలనాటి వీరచరిత్ర అనే ద్విపద కావ్యము నుండి గ్రహింపబడిన "పలనాటి బెబ్బులి" అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

బాలచంద్రుని యుద్ధదాటికి నిలబడలేక నలగామరాజు సైనికులు యుద్ధాన్ని విడిచి పోవడానికి సిద్ధపడ్డారు. పారిపోతున్న తన సైనికులకు, నలగామరాజు తమ్ముడైన నరసింహరాజు తన సైనికులకు, నలగామరాజు తమ్ముడైన నరసింహరాజు ధైర్యం చెబుతున్న సందర్భంలోని వాక్యమిది.

**అర్థం :**

శరీరాన్ని కాపాడుకోవటం కోసం, మంచి కీర్తి పోగొట్టుకొని పారిపోయేటటువంటి వెఱ్ఱివాళ్ళు ఉంటారా ?

**వ్యాఖ్య :**

శరీరము నశించేది, శరీరము మలభాండము. అటువంటి శరీరాన్ని కాపాడుకోవడం కోసం కీర్తిని వదలుకొని పారిపోవడం ఎట్టి వెఱ్ఱితనమని, నరసింహరాజు తన సైనికులకు హితాన్ని ధైర్యాన్ని ప్రబోధించాడు.

**18. భుక్తి ముక్తులు రెండు పోవును దొలగి**

**కవి పరిచయం :**

ఈ వాక్యము శ్రీనాథ మహాకవి రచించిన పలనాటి వీరచరిత్ర అనే ద్విపద కావ్యము నుండి గ్రహింపబడిన "పలనాటి బెబ్బులి" అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

బాలచంద్రునిపై భయంతో నలగామరాజు సైనికులు తమ నాయకుడైన నలగామరాజు తమ్ముడు నరసింహరాజును విడిచి పోవడానికి సిద్ధపడ్డాడు. అప్పుడు పారిపోయే తన సైనికులకు ధైర్యాన్ని చెబుతూ మీరు బుద్ధిహీనులై పారిపోతే మీకు భుక్తి, ముక్తి అనే రెండూ పోతాయి. నన్ను విడిచి వెళ్ళకండి అని నరసింహరాజు తన సైనికులకు హితాన్ని, ధైర్యాన్ని ఉపదేశించిన సందర్భంలోనిది.

**అర్థం :**

తిండి, మోక్షము అనే రెండూ పోతాయి.

**వ్యాఖ్య :**

యుద్ధం నుండి పారిపోతే రాజుగారి కొలువుపోతుంది కాబట్టి వారికి తినడానికి భుక్తి ఉండదు. యుద్ధంలో జయిస్తే ముక్తి వస్తుంది. పారిపోతే మోక్షంరాదు. కాబట్టి తన్ను విడిచి పారిపోవద్దన్న నరసింహభూపతి సైనికులకు కర్తవ్యాన్ని బోధించాడు.

**19. పోవుట నీచత పుట్టదన్నంబు పోవద్ద రాజాన !**

**కవి పరిచయం :**

ఈ వాక్యము శ్రీనాథ మహాకవి రచించిన పలనాటి వీరచరిత్ర అనే ద్విపద కావ్యము నుండి గ్రహింపబడిన "పలనాటి బెబ్బులి" అనే పద్యభాగములోనిది.

**సందర్భం :**

బాలచంద్రుని తీవ్ర యుద్ధానికి భయపడి, నలగామరాజు సైనికులు, యుద్ధం మాని పారిపోవడానికి సిద్ధమయ్యారు. అలా యుద్ధము నుండి పారిపోవడం, నీచకార్యమనీ అలా పారిపోయేవారికి అన్నము దొరకదనీ, రాజుగారిపై ఒట్టు పెడుతున్నాను, వెళ్ళవద్దు అనీ నరసింహరాజు తన సైనికులకు ధైర్యమును చెప్పి యుద్ధనీతులను బోధించిన సందర్భంలోనిది.

**అర్థం :**

పారిపోవడం నీచత్వము. వారికి తినడానికి అన్నము దొరకదు. మీరు వెళ్ళవద్దు. రాజుపై ఒట్టు.

**వ్యాఖ్య :**

యుద్ధరంగము నుండి పారిపోవడం నీచమనీ అటువంటి వారికి తిండి దొరకదనీ, రాజుపై ఒట్టనీ, వెళ్ళవద్దనీ తన సైనికులకు నరసింహరాజు హితవు చెప్పాడు.

**8.3 సంగ్రహ సమాధాన ప్రశ్నలు :**

**1. బాలచంద్రుని చూచి నలగామరాజు సైనికులు భయపడిన విధమెట్టిది ?**

నలగామరాజు సైనికులలో కొందరి కంఠాలు తెగిపడగా, వారు తమ వాహనాల నుండి క్రిందకి ఉరికి, కాళ్ళూచేతులూ కొట్టుకొని చచ్చారు. కొందరి తలలు తెగిపోయాయి. కొందరు కళ్ళు తెరుస్తూ గంతులు వేస్తూ ప్రాణాలు వదిలారు. కొందరు తమ కాళ్ళు విరిగినా, లేచి యుద్ధం చేయాలని పళ్ళు కొరుకుతూ నేలపై కూలిపోయారు. కొందరి చేతులు తెగిపోయాయి. వారు చేతులలోని కత్తులు వదిలి, భయంతో బాలచంద్రుడిని చూశారు. కొందరి ప్రేగులు బయటకు వచ్చినా, ఎడమచేతిలో పట్టుకొని, బల్లెమును పట్టుకొని సాహసంతో ముందుకు వచ్చారు. కొంతమంది ముసలి యోధులు మూల్గుతూ చచ్చారు. కొందరు పిరికి భటులు, బాలచంద్రుని చూసి పారిపోయారు. కొందరు పారిపోలేక బ్రతకాలనే ఆశతో బ్రతిమాలుకున్నారు.

**సైనికుల ఆక్రందనలు :**

ఇలాంటి యుద్ధాలు మేము ఎరుగము. ఇక్కడి నుండి ఎలా పోతాము? అని కొందరు ఏడ్చారు. " పెండ్లాం పిల్లలను విడిచి అన్నంకోసం యుద్ధానికి వచ్చాము. ఇక్కడ, మా మరణం రాసి ఉంది అని కొందరు ఏడ్చారు. మేము పాలేర్లుగా ఉండేవాళ్ళము. ఆడువారు తిట్టారని వచ్చి యుద్ధంలో చస్తున్నాము. పారిపోనిస్తే బ్రతుకుతాము" అని కొందరు నమస్కరిస్తున్నారు. మేము పూర్వము బోయీలము మా భుజాలపై కాయలు చూడండి. శత్రువులు మమ్మల్ని చూసి పారిపోతారు. మీకేమి భయములేదని, నాగమ్మ చెపితే నమ్మి యుద్ధానికి వచ్చాము. మా ప్రాణాలు దక్కితే పిల్లలతో కలిసి బలుసాకు తినియైనా జీవిస్తాము. మీరు పిలిస్తే వస్తాం అని కొందరు నమస్కరించారు.

కొందరు వీలు చిక్కితే తోడి సైనికులను విడిచి, పారిపోయే చెడుబుద్ధికలవారై యున్నారు. కొందరు తాము చచ్చినట్లు నటించారు. కొందరు ఏనుగుల చాటున దాగుకున్నారు. కొందరు పెళ్ళాలను తలచుకొని గట్టిగా ఏడ్చారు. కొందరు గడ్డిలో దూరి కదలకుండా పడియున్నారు. కొందరు వ్రేళ్ళు చప్పరించారు. కొందరు జుట్టు విప్పి విదిలించారు. కొందరు మేము నీ వారమ" అని నిలబడ్డారు. కొందరు ఆయుధాలు పడవేసి భయపడ్డారు. కొందరు చతికిలపడి కూర్చున్నారు. కొందరు ప్రాణాలుపోయినా, కత్తులు విడిచిపెట్టలేదు.

పై విధంగా యుద్ధరంగం భయంకరంగా వుంది.

**2. పారిపోతున్న తన సైన్యమునకు, నరసింహరాజు చెప్పిన ధైర్యవచనములు ఏవి ?**

**నరసింగుని ధైర్యబోధ :**

ఓ పుణ్యాత్ములారా ! పారిపోవడం వీరధర్మము కాదు. చిన్నపిల్లలను చూసి పరుగుపెట్టడం ఎందుకు? మిమ్మల్ని రక్షించిన వారిని విడిచిపెట్టడం, మేలు కాదు. మీ నరాలలో ప్రవహించే రక్తము రాజాన్నముతో వృద్ధి పొందినదే కదా ? మోసగాళ్ళు రాజుకు ద్రోహముచేసి, మిమ్మల్ని నమ్మిన రాజును నట్టేటిలో ముంచి పారిపోవడం నీతికాదు.

శరీరాలు అశాశ్వతాలు. ధనములు కల్ల. కీర్తి ఒక్కటే లోకంలో నశింపకుండా ఉంటుంది. అధైర్యంతో వీరధర్మాన్ని విడిచి, నశించే మలభాండమైన శరీరం కోసం, సత్కీర్తిని వదలి ఓడి పారిపోయే వెఱ్ఱివాళ్ళు ఉండరు. వీరసింహములకు యుద్ధరంగాలే సంచారవనములు. వారికి చచ్చినా, బ్రతికినా అక్కడే సౌఖ్యం ఉంటుంది.

బుద్ధి నశించి, మీరు పారిపోతే భుక్తి, ముక్తి కూడా పోతాయి. నన్ను విడిచివెళ్ళడం న్యాయం కాదు. పారిపోతే మరణము తప్పుతుందా ? మృత్యుదేవత వచ్చి మన శరీరాలపై ఆవహించింది. పారిపోవడం సైనికుల ధర్మం కాదు.

మనం పెళ్ళి కోసం రాలేదు. యుద్ధం కోసం వచ్చాం. వచ్చిన పనిని వరదలో కలిపి, బంధుమిత్రులూ, శత్రువులూ, నవ్వేలా పారిపోవడం, నీచత్వము. పారిపోతే మీకు అన్నం దొరకదు, పోవద్దు. మీరు పోతే రాజుపై ఒట్టు" అని నరసింహరాజు తన సైనికులకు ధైర్యాన్ని నూరిపోశారు.

## వ్యాసరూప ప్రశ్నలు :

**1) పలనాటి బెబ్బులి కథాంశమును వ్రాయండి.**

**బాలచంద్రుని యుద్ధము :**

బాలచంద్రుడు శత్రువుల మణికట్లను, తలలను, మోచేతులను, ముక్కులను, నుదురులను, ప్రక్కఎముకలను, దౌడలను, బాహువులను, కనుగ్రుడ్లను, చెవులను ఖండించాడు. గుండెలను చీల్చి మోకాళ్ళను, పిక్కలను, చీలమండలను నరికాడు. పిల్లసింహమువలె, ఏనుగుల మీద పైకి ఉరికి వాటి కుంభస్థలములను, తొండములను, తోకలను ఖండించి, మావటివాండ్రను చంపి, దౌరలను పడగొట్టి, వాటి దంతాలనూ, చెవులనూ, పిల్లదంతాలనూ, కాళ్ళనూ, కంఠాలనూ నరికాడు. సాహసంతో గుఱ్ఱములను కత్తులతో, ఈటెలతో పొడిచి రౌతులను చంపి వారు ప్రయోగించిన వేటకుక్కలను తుక్కచేసి శృంగ ధనస్సులను ముక్కలుచేసి, బాణములను, అమ్ములను, కత్తులను డాలులను ఖండించి, మెడలు నరికి, శరీరాలు చీల్చి రొమ్ములను ఈటెలతో గ్రుచ్చి, కొంకులు, డెక్కలు చెక్కి యుద్ధం చేశాడు.

**నలగామరాజు సైన్యం కలత :**

నలగాముని సైన్యము పైవిధంగా భగ్నమయ్యింది. వారి కంఠాలు తెగాయి. వాహనాల నుండి వీరులు ఉరికారు. తన్నుకొని చచ్చారు. తలలు తెగాయి. వారు కళ్ళు తెరుస్తూ గంతులు వేస్తూ, ప్రాణాలు వదిలారు. పళ్ళుకొరుకుతూ, కూలబడ్డారు. చేతులు తెగినా, వారు కత్తులు వదలలేదు. ప్రేగులు బయటకు వచ్చినా, వాటిని పట్టుకొని, నేను నేను అంటూ ముందుకు వచ్చారు. ముసలియోధులు చచ్చారు. బాలచంద్రుని చూసి భయపడిపోయారు. కొందరు బ్రతిమిలాడారు. ఇలాంటి యుద్ధం మాకు తెలియదు అని అన్నం కోసం వచ్చామనీ, ఏడుస్తూ ప్రాణాలు వదిలారు. మేము పాలేర్లము, ఆడవారు తిట్టారని యుద్ధానికి వచ్చాము. పారిపోనిస్తే బ్రతుకుతాము అనీ తాము బోయీలమనీ, నాగమ్మ మాటలు నమ్మి యుద్ధానికి వచ్చామనీ, ప్రాణాలు దక్కితే బలుసాకు తిని బ్రతుకుతామనీ చెప్పారు. పౌరుషం విడిచినవారు తోడి వీరులను విడిచి పారిపోయారు. చచ్చినట్లు పడియున్నవారు, ఏనుగుల ప్రక్కన దాగినవారు, పెళ్ళాలను తలచుకొని ఏడ్చినవారు, గడ్డిలో దూరినవారు, జుట్టు విప్పినవారు, చతికిల పడినవారు, చచ్చినా కత్తులు విడవని సైనికులూ ఈవిధంగా యుద్ధరంగం భయంకరంగా వుంది.

**బాలచంద్రుడు శత్రువులను చంపడం :**

బాలచంద్రుడు పరిఘను గుండ్రంగా త్రిప్పుతూ, బాణాలు తనపైకి రాకుండా చేసుకున్నాడు. శత్రువుల ధనస్సులనూ, వింటి నారులను, పారిపోయే వారినీ ఖండించాడు. బాలచంద్రుడు సోదరులతో కలసి, గొడ్డళ్ళతో నరికి, డాలులను, బల్లెములను ఖండించి, గండ్రగొడ్డళ్ళతో శత్రువులను, కణుపులుగా కొట్టాడు. వారి తలలను గదలతో కొట్టాడు. పొట్టలు చీల్చాడు. కత్తులతో కండలుకోసి, యముని వద్దకు పంపాడు. దానితో సైన్యము పారిపోవడానికి సిద్ధమయ్యింది.

**నరసింహభూపతి తన సైనికులకు ధైర్యం చెప్పడం :**

ఓడి పారిపోవడం వీరధర్మం కాదు. పిల్లలను చూసి పరుగుపెట్టడం దేనికి? మిమ్ములను రక్షించిన వారిని, విడిచిపెట్టడం మంచిదికాదు. మీలోని రక్తం రాజుపెట్టిన అన్నంతో పెరిగినదే. నమ్మిన రాజును నట్టేటిలో ముంచి వెళ్ళడం నీతికాదు. శరీరాలు అశాశ్వతాలు. ధనములు కల్ల. కీర్తి ఒక్కటే శాశ్వతము. అధైర్యంతో వీరధర్మం మాని, నశించే మలభాండమైన శరీరం కోసం కీర్తిని పోగొట్టుకొని, పారిపోయే వెఱ్ఱివారు ఉండరు. వీరులకు యుద్ధధర్మమే విహార వనములు. చచ్చినా, బ్రతికినా అక్కడే వారికి సౌఖ్యము. మీరు పారిపోతే భుక్తి, ముక్తి రెండూ పోతాయి. నన్ను విడవడం న్యాయం కాదు. మృత్యువు మన శరీరాలను ఆవహించింది. మనం పెళ్ళికి రాలేదు, యుద్ధానికి వచ్చాము. వచ్చిన పని గంగలో కలిపి, పారిపోవడం నీచము. మీరు వెళ్ళవద్దు. వెడితే రాజుపై ఒట్టు అని నరసింగు తన సైనికులతో అన్నాడు.

**నలగామరాజు సైన్యము బాలచంద్రునితో పోరు :**

నరసింగు మాటలకు కోపం తెచ్చుకొని, మంటపై మిడుతవలె నలగాముని సైనికులు, బాలచంద్రునిపైపడ్డారు. బాలచంద్రుడు సముద్రంలో మందరములా, కాలాగ్ని లోకాల్ని కాల్చినట్లు, దావాగ్ని అడవులపై పడ్డట్లు, శత్రుసైన్యం పైకి ఉరికి, వారి అస్త్రశస్త్రాలను నరికి, హుంకరిస్తూ భటులను పట్టుకొని, బల్లెములతో చీల్చి పడగొట్టాడు. వారి శరీరాలను చీల్చి నేలపై పడవేశాడు. వారి కటి ప్రదేశాలను ఖండించి నేలపై పడవేశాడు. వారి తలలను, కత్తులతో నరికాడు. బల్లెములతో గ్రుచ్చి వారిని కూల్చాడు. రక్తం నేలపై నిండుగా ప్రవహించింది. ఎదురు లేకుండా యుద్ధం ఈవిధంగా సాగింది. నరసింగరాజు యుద్ధాన్ని చూసి, వణికిపోయాడు. ఆయన బాలచంద్రుని పరాక్రమానికి, ఆశ్చర్యపడి ముక్కున వ్రేలు వేసుకున్నాడు.

**2) పలనాటి యుద్ధంలో బాలచంద్రుని యుద్ధకౌశల్యాన్ని వర్ణించండి.**

బాలచంద్రుడు పలనాటి బ్రహ్మనాయుని కుమారుడు బాలచంద్రుడు, మహావీరుడు.

**బాలచంద్రుని యుద్ధము :**

బాలచంద్రుడు శత్రు సైనికుల మణికట్లను ఖండించి, వారి తలలను నరికి, నేలపై పడవేశారు. శత్రుసైనికుల మోచేతులను నరికాడు. వారి ముక్కులను ఖండించాడు. నొసళ్ళను చీల్చాడు. ప్రక్కఎముకలు కోశాడు. చెంపలను రాలగొట్టాడు. బాహువులను ఖండించాడు. వారి కంటిగ్రుడ్లు పగిలేటట్లు, చెవులు తెగి క్రిందపడేటట్లుగా, వారి రొమ్ములను ముక్కలు చేశాడు. వారి తొడలు ముక్కలై ఊగేటట్లు చేశాడు. శత్రువుల మోకాళ్ళు ఊడిపోయేవిధంగా పిక్కలు విరిగేటట్లుగా, చీలమండలు పట్టుతప్పి బాధను కల్గించేటట్లుగా సోదరులతో కలసి బాలచంద్రుడు యుద్ధం చేశాడు.

తరువాత బాలచంద్రుడు కోపంతో సింహపుపిల్లవలె దుమికి ఎగిరి, శత్రువుల ఏనుగుల పైకి ఉరికాడు. ఏనుగుల కుంభస్థలములను పగులగొట్టాడు. ఏనుగుల తొండములనూ, తోకలనూ ముక్కలుచేసి మావటివాండ్రను చంపి, వాటిపైనున్న దొరలను నేలపై పడగొట్టాడు. ఏనుగుల దంతాలు నేలపై రాలిపడేటట్లు, వాటిని పొడిచాడు. ఏనుగుల చెవులను కత్తులతో ఖండించి, ముక్కలు చేశాడు. చిన్న దంతాలను పెల్లగించి, విసరివేశాడు. ఏనుగుల పాదాలను ఖండించి వాటి కంఠాలను నరికాడు.

తరువాత శత్రువుల గుఱ్ఱాలపై పడి, కత్తి, బల్లెము తీసుకొని గుఱ్ఱపు రౌతులను చంపాడు. తమపై శత్రువులు ప్రయోగించిన వేటకుక్కలను తుక్కుచేశాడు. శత్రువుల శృంగ ధనస్సులనూ, బాణాలనూ, అమ్ములపొదులనూ, భగ్నము చేశాడు. వారి కత్తులనూ, డాలులనూ, ముక్కలు చేశాడు. గుఱ్ఱాల మెడలను ఖండించాడు. శత్రువుల శరీరాలను చీల్చాడు. వారి రొమ్ములను ఈటెలతో గ్రుచ్చాడు. జంకు లేకుండా గుఱ్ఱాల కాలిగిట్టలను ఖండించాడు. సైనికుల కంఠాలు తెగిపడ్డాయి. సైనికులు తన్నుకుంటూ పడిచచ్చారు.

ఈవిధంగా బాలచంద్రుడు చాలాసేపు యుద్ధం చేశాడు. శత్రుసైన్యము భగ్నమయ్యింది. నలగామరాజు సైన్యము పారిపోయేందుకు సిద్ధపడింది. పారిపోతున్న సైనికులను నరసింహరాజు ధైర్యం చెప్పగా, తిరిగి బాలచంద్రుని పైకి మంటపై మిడుతలవలే వచ్చిపడ్డారు.

**బాలచంద్రుని శత్రుసంహారము :**

బాలచంద్రుడు తన సోదరులనందరినీ యుద్ధంలో తగిన స్థలాలలో నిలబెట్టాడు. ఒక పరిఘను, తన చేతిలో పట్టుకొని తన శరీరానికి శత్రువుల బాణాలు తగలకుండా బాలచంద్రుడు ఆ పరిఘను త్రిప్పాడు. శత్రువుల బాణాలను చెదరగొడుతూ, తన కత్తిని ఆడిస్తూ, గర్జించాడు.

అట్టహాసము చేస్తూ, ధనుర్ధారులపైపడి, వారి ధనస్సులను విరిచి, వారి వింటినారులను, చిన్న చిన్న ముక్కలుగా చేశాడు. శత్రువుల అమ్ములపొదులనూ, బాణాలనూ పిండి పిండి చేశాడు. పరుగెత్తేవారిని, మహాశౌర్యంతో వండడానికి తరిగినట్లు వారి శరీరాలను ఖండించి, వారిని యముడి దగ్గరకు పంపాడు.

బాలచంద్రుడు చొక్క చువ్వలవారు శౌర్యంతో తన పైకి ఉరికి రావడంచూసి, పెద్దగా కేకవేసి, పకపక నవ్వాడు. వారి పైకి తాను దుమికి, గొడ్డళ్ళతో చెఱుకులు నరికినట్లుగా వారి ఈటెలనూ, ఖడ్గాలనూ ముక్కలు చేశాడు. శూలముతో చిన్న కత్తులతో, వారిని పొడిచాడు. గండ్రగొడ్డళ్ళతో కణుపులుగా వారిని ఖండించాడు. బాకులతో వారి రొమ్ములను చీల్చాడు. గదలతో శత్రువుల తలలను పిండి చేశాడు. వారి పొట్టలను బ్రద్దలుచేసి వారి శరీరాల కండలను, కత్తులతో రాలగొట్టి శత్రుసైన్యాలను యముని వద్దకు పంపాడు. ఈవిధంగా బాలచంద్రుడు మహాభయంకర యుద్ధము చేశాడు.

## 8.4 వ్యాకరణాంశాలు :

### 8.4.1 సంధిగత రూపాలను విడదీసి వ్యాకరణ కార్యాలు తెలపండి.

1) ఫాలంబులంజింపి
ఫాలంబులన్ + చింపి = సరళాదేశ సంధి
సూత్రము : (1) ద్రుత ప్రకృతికము మీద పరుషములకు సరళంబులగు
ఉదా : ఫాలంబులన్ + జింపి
(2) ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషలు విభాషనగు.

2. దౌడలూడగ
దౌడలు + ఊడగ = ఉత్వసంధి
సూత్రము : ఉత్తునకు అచ్చు పరమగునపుడు సంధియగు

3. దండముల్ ద్రుంచి
దండముల్ + త్రుంచి = గసడదవాదేశసంధి
సూత్రము : ప్రథమీ మీది పరుషములకు గసడదవలు బహుళంబుగానగు.

4. తూగాడు
తూగు + ఆడు = ఉత్వసంధి
సూత్రము : ఉత్తునకు అచ్చు పరమగునపుడు సంధియగు.

5. ఇమ్మాడ్కి
ఈ + మాడ్కి = త్రికసంధి
సూత్రము : (1) త్రికము మీది అసంయుక్త హల్లునకు ద్విత్వంబు బహుళంబుగానగు.
ఉదా : ఈ + మ్మాడ్కి
(2) ద్విరుక్తంబగు హల్లు పరమగునపుడు ఐచ్ఛికంబగు దీర్ఘమునకు హ్రస్వంబగు.
ఉదా : ఇమ్మాడ్కి

6. జవనాశ్వము
జవన + అశ్వము = సవర్ణదీర్ఘ సంధి
సూత్రము : అ, ఇ, ఉ, ఋ లకు అవియే అచ్చులుపరమైతే సవర్ణదీర్ఘములు ఏకాదేశంబగు.

7. ఉసురుసురు
ఉసురు + ఉసురు = ఉత్వసంధి
సూత్రము : ఉత్తునకు అచ్చు పరమగునపుడు సంధియగు

8. అంజలియొనర్చి
అంజలి + ఒనర్చి = యడాగమసంధి
సూత్రము : సంధిలేని చోట అచ్చుకంటే పరమైన అచ్చునకు యడాగమంబగు

9. సమరోర్వి
సమర + ఉర్వి = గుణసంధి
సూత్రము : అలంకారమునకు ఇ, ఉ, ఋ లు పరమగునపుడు క్రమంగా ఏ, ఓ, ఆర్ లు ఆదేశంబగు.

10. బిట్టేడ్చు
బిట్టు + ఏడ్చు = ఉత్వసంధి
సూత్రము : ఉత్తునకు అచ్చు పరమైనచో సంధియగు.

11. ఇబ్బంగి
~~ఈ~~ + భంగి
సూత్రము = 1) త్రికము మీది అసంయుక్త హల్లునకు ద్విత్వంబు బహుళంబుగానగు.
ఉదా : ఇబ్బంగి

12. రాజాన్నము
రాజ + అన్నము = సవర్ణదీర్ఘసంధి
సూత్రము : అ, ఇ, ఉ, ఋ లకు అవియే అచ్చులు పరమైతే సవర్ణదీర్ఘములు ఏకాదేశంబగు.

13. నట్టేట
నడు + ఏట = ద్విరుక్తటకారాదేశ సంధి
సూత్రము : కఱు, చిఱు, కడు, నడు, నిడు శబ్దములందలి ఱడలకు అచ్చు పరమగునపుడు ద్విరుక్తటకారంబగు.

14. పుణ్యాత్ములు
పుణ్య + ఆత్ములు = సవర్ణదీర్ఘసంధి
సూత్రము : అ, ఇ, ఉ, ఋ లకు అవియే అచ్చులు పరమైతే సవర్ణదీర్ఘములు ఏకాదేశంబగు.

15. కాలాగ్ని
కాల + అగ్ని = సవర్ణదీర్ఘసంధి
సూత్రము : అ, ఇ, ఉ, ఋ లకు అవియే అచ్చులు పరమైతే సవర్ణదీర్ఘములు ఏకాదేశంబగు.

16. తొడలెల్ల
తొడలు + ఎల్ల = ఉత్వసంధి
సూత్రము : ఉత్తునకు అచ్చు పరమగునప్పుడు సంధియగు.

**8.4.2 సమాసాలు :**

| సమాసపదము | విగ్రహవాక్యము | సమాసనామము |
|---|---|---|
| కొదమ సింహము | కొదమమైన సింహము | విశేషణ పూర్వపద కర్మధారయం |
| సాహసగరిమ | సాహసము యొక్క గరిమ | షష్ఠి తత్పురుష |
| ఖడ్గకుంతలములు | ఖడ్గమును, కుంతలయును | ద్వంద్వ సమాసము |
| బాణతూణీరములు | బాణమును, తూణీరమును | ద్వంద్వ సమాసము |
| ఉగ్రభటులు | ఉగ్రులైన భటులు | విశేషణ పూర్వపద కర్మధారయం |
| భట సమూహము | భటుల యొక్క సమూహము | షష్ఠీ తత్పురుష |
| పుణ్యాత్ములు | పుణ్యమైన ఆత్మలు గలవారు | బహువ్రీహి |
| మలభాండము | మలము యొక్క భాండము | షష్ఠీ తత్పురుష |
| సంచారవనులు | సంచరించుటకు యోగ్యమైన వనులు | విశేషణ పూర్వపద కర్మధారయం |
| బంధుమిత్రులు | బంధువులను, మిత్రులును | ద్వంద్వ సమాసం |
| తీవ్రకోపులు | తీవ్రమైన కోపము కలవారు | బహువ్రీహి సమాసము |
| దవవహ్ని | దవము నందలి వహ్ని | సప్తమీ తత్పురుష |
| శత్రువితతి | శత్రువుల యొక్క వితతి | షష్ఠీ తత్పురుష |
| సత్కీర్తి | మంచిదైన కీర్తి | విశేషణ పూర్వపద కర్మధారయం |

**8.4.3 అలంకారాలు :**

1. **బాలుడు కోపంబు ప్రకటంబు గాగ**
   **కొదమ సింగము భంగి కుప్పించి యెగిరి.**
   ఈ పద్యపాదాల్లో ఉపమాలంకారము కలదు.

**లక్షణము :**

ఉపమాన ఉపమేయాలకు చక్కని పోలికకు చెప్పడాన్ని ఉపమాలంకారము అంటారు. దీనిలో (1) ఉపమానము, (2) ఉపమేయము, (3) ఉపమావాచకము, (4) సమాన ధర్మము అనే నాలుగు ప్రధాన భాగాలు ఉంటాయి.

సమన్వయము : పై పద్య పంక్తులలో
ఉపమానము : కొదమ సింగము
ఉపమేయము : బాలుడు
ఉపమావాచకము : భంగి
సమాన ధర్మము : కుప్పించి ఎగిరి.

2. **మిడుతలు మంటపై మిడిసి పడ్డట్లు**
   **బాలుని దాకిరి భయదూరులగుచు.**
   **ఈ పద్య పంక్తులలో ఉపమాలంకారము కలదు.**

**లక్షణము :**

ఉపమాన ఉపమేయాలకు చక్కని పోలికకు చెప్పడాన్ని ఉపమాలంకారము అంటారు. దీనిలో (1) ఉపమానము, (2) ఉపమేయము, (3) ఉపమావాచకము, (4) సమాన ధర్మము అనే నాలుగు ప్రధాన భాగాలు ఉంటాయి.

సమన్వయము : పై పద్య పంక్తులలో
ఉపమానము : మిడుతలు మంటపై పడటం

ఉపమేయము : భయదూరులైన భటులు బాలుని తాకడం
ఉపమావాచకము : అట్లు
సమాన ధర్మము : మిడిసిపడటం

3. **బాలుడు జలధిలో మందరశైలంబు తిరిగి**
**కలత నొందించిన కైవడి మీరి**

ఈ పద్య పంక్తులలో "ఉపమాలంకారము" కలదు.

**లక్షణము :**

ఉపమాన ఉపమేయాలకు చక్కని పోలికకు చెప్పడాన్ని ఉపమాలంకారము అంటారు. దీనిలో (1) ఉపమానము, (2) ఉపమేయము, (3) ఉపమావాచకము, (4) సమాన ధర్మము అనే నాలుగు ప్రధాన భాగాలు ఉంటాయి.

సమన్వయము : పై పద్య పంక్తులలో
ఉపమానము : జలధిలో మందరశైలము తిరుగుట
ఉపమేయము : బాలుడు శత్రుసైన్యముపై కదియుట
ఉపమావాచకము : కైవడిన్
సమాన ధర్మము : కలత నొందించుట, త్రుంచె.

**8.4.4 చంధస్సు :**

నగ సల త

1. బహుదినం బులుమేము పాలేరు చేసి

I I I U I I U I UUI UI

బహుదినం బులుమేము పాలేరు చేసి

ఈ పద్యపాదంలో వరుసగా మూడు ఇంద్రగణాలపై ఒక సూర్యగణము వుంది కాబట్టి ఇది ద్విపద పద్యపాదము.

**యతి :**

మొదటి గణములోని మొదటి అక్షరమైన 'ఒ'కు మూడవ గణములోని మొదటి అక్షరమైన 'పా'కు యతి.

2. కాలసమేతులై భువన కంపముగా గణనాథుపాలికిన్

భ ర న భ భ ర వ

UII UIU III UII UII UIU IU

కాలస మెతులై భువన కంపము గా గణ నాథపా లికిన్

పై పద్యపాదములో భరనభభరవ అనే గణాలున్నాయి. కాబట్టి ఇది "ఉత్పలమాల" పద్యపాదము.

**యతి :**

మొదటి గణములోని మొదటి అక్షరము 'కా'కును, 10వ అక్షరమైన 'కం' కును యతి.

**డా॥ కె. భానునాయక్**
ఎం.ఏ., పిహెచ్.డి.,
తెలుగు అధ్యాపకులు,
ఎస్.ఎస్.&ఎన్ కళాశాల, నరసరావుపేట.

పాఠం - 9

# సీతారావణ సంవాదం - ఆతుకూరి మొల్ల

## (రామాయణము - సుందరకాండము - 40 నుండి 87 పద్యాల వరకు)

## పాఠ్యభాగ వివరణ - సారాంశం

**విషయసూచిక :**


**9.0** కవి పరిచయం

**9.1** ఉద్దేశ్యం

**9.2** పాఠ్యభాగ సందర్భం

**9.3** పాఠ్యభాగ వివరణ

**9.4** ముఖ్యమైన పదాలకు అర్థాలు


**9.0 కవి పరిచయం :**

ఆతుకూరి మొల్ల (1440-1530) 16వ శతాబ్దానికి చెందింది. మొల్ల జీవితకాలాన్ని గురించి పరిశోధకుల్లో భిన్నాభిప్రాయాలున్నాయి. తన రచనా ప్రస్థానంలో "సన్నుత సుజ్ఞాన సవివేక వాల్మీకి" దగ్గర నుండి "తిక్కన కవిరాజు భోజు" వరకు మొల్ల కొనియాడారు. అలాగే శ్రీకృష్ణదేవరాయలు ఆస్థానకవులలో ఒకరిని తన పద్యంలో పేర్కొన్న కారణంగా మొల్ల ఆకాలానికి చెందినదిగా కొందరు భావించారు. 16వ శతాబ్దానికి చెందిన ఏకామ్రనాథుడనే చరిత్రకారుడు తన ప్రతాపచరిత్రలో ప్రస్థావించిన సాంఘిక పరిస్థితుల్లో మొల్ల క్రీ. 1581కి ముందుగానే జీవించినట్లు పేర్కొన్నారు. మొత్తం మీద చరిత్ర పరిశోధకులు మొల్ల క్రీ.శ. 16వ శతాబ్దానికి చెందిందిగా నిర్ధారించారు.

**స్వస్థలం :**

కడప జిల్లా పట్టణానికి 56 కి.మీ. దూరంలోనూ బద్వేలుకు 5 కిలోమీటర్ల దూరంలో వున్న "గోపవరం" గ్రామం వీరి స్వస్థలం. చిన్నతనంలోనే తల్లిని కోల్పోయింది. తండ్రి కేసనశెట్టి మొల్లను గారాబంగా పెంచాడు. తండ్రి అంటే తనకు అమిత ఇష్టం. చివరికి తండ్రి ఇంటి పేరు కోసం పెళ్ళి కూడా చేసుకోలేదు. తెలుగులో రామాయణం రచించిన తొలి కవియిత్రిగా పేరు పొందింది. మొల్ల రామాయణము ఆరు కాండాలతో 870 పద్యాలతో (పీఠికతో కలిపి) కూడుకొని వుంది. మొల్ల ఏవిధమైన సంప్రదాయ విద్యను అభ్యసించలేదు. తన సహజ పాండిత్యానికి భగవంతుడే కారణమని చెప్పుకున్నది.

ధనాన్ని, కీర్తిని ఆశించక ఏరాజుకి అంకితం ఇవ్వలేదు. ఈ రామాయణంలో కంద పద్యాలు ఎక్కువగా ఉన్నందువల్ల "కంద రామాయణం" అనడం కూడా పిలుస్తారు.

"మొల్ల" అంటే "మల్లె పువ్వు" అని అర్థం. రామాయణాన్ని తలచుకోగానే మనసుకు ఒక కమ్మని పూతావి సోకినట్లుంటుంది. ఆమె తన భక్తిని, కవితా శక్తినీ కలబోసి క్లుప్తంగా ఓ మనోహరమైన రామాయణాన్ని తెలుగు భాషకు అందించింది.

తెలుగు భాష ఉన్నంతవరకు మొల్ల, ఆమె రామాయణం చిరంజీవులుగా ఉంటారు.

మొల్ల సాహిత్య సేవకుగాను 1980 దశకంలో అప్పటి ముఖ్యమంత్రి హైదరాబాదు ట్యాంక్‌బండ్‌పై ఆమె విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

కథానాయిక మొల్ల పేరుతో సినిమాను కూడా తీశారు. ఇందులో కథానాయిక ప్రఖ్యాత నటి వాణిశ్రీ.

## 9.1 ఉద్దేశ్యం :

ఈ భాగాన్ని చదవడం వల్ల క్రింది విషయాలను అర్థం చేసుకోగలుగుతారు.

(1) ప్రతి తరంలోనూ ఎవరో ఒకరు తెలుగుభాషలో రామాయణాన్ని రాస్తూనే ఉంటారు. వాటిలో యుగానికి ఒకటి ప్రసిద్ధమవుతూ ఉంటుంది. కవిత్రయంలో ఒకరైన ఎర్రయ్య రాసిన "రామాయణము" కాలగర్భంలో కలసిపోయింది.

(2) సంస్కృతం రాజ్యమేలుతున్న కాలంలో స్త్రీలు సాహసం చేసి కవిత్వం రాయడం మామూలు విషయం కాదు. అలాంటి పరిస్థితులలో మొల్ల అచ్చ తెలుగులో రామాయణాన్ని రాసి తెలుగు కవయిత్రులలో రెండవ రచయితగా సారస్వత లోకంలో ప్రసిద్ధికెక్కింది.

అందువల్ల నేటి తరానికి మొల్ల రాసిన రామాయణం గురించి అధ్యయనం చెయ్యడం అదృష్టమనే చెప్పాలి.

## 9.2 పాఠ్యభాగ సందర్భం :

మొల్ల రామాయణం - సుందరకాండ నుండి "సీతారావణ సంవాదం" గ్రహించబడింది. ఈ భాగంలో రావణుడు తనను వరించమని సీతను కోరడం, ఆమె నిరాకరిస్తూ రాముని స్తుతించడం, రావణుడామెను బెదిరించడం ఇందలి ఇతివృత్తం.

సుగ్రీవుని మాటననుసరించి సీత ఆచూకిని తెలుసుకోవడానికి వానరులు నలుదిక్కులకు వెళ్ళారు. ఈ క్రమంలో హనుమంతుడు, జాంబవంతుడు "అంగదుడు" నాయకత్వాన దక్షిణ దిక్కుకు వెళ్ళారు. ఎంత వెతికినా సీత జాడ తెలియదు. అందరూ "మహేంద్ర శైలానికి" చేరి సీత జాడ తెలియనందుకు ఎంతగానో దుఃఖిస్తారు. ఇంతలో "సంపాతి" అనే పక్షిరాజు సీతను రావణుడు తీసుకెళ్ళి లంకలో దాచాడని, అక్కడికి ఎలా వెళ్ళాలో కూడా వానరులకు చెబుతాడు.

తక్షణమే వానరులు మహేంద్రశైలాన్ని ఎక్కి దాని ప్రక్కనున్న సముద్రాన్ని చూడగానే దీనిని దాటటం కష్టమనుకుంటారు. దీనికి సమర్థులు వాయుపుత్రుడైన హనుమంతుడేనని అతనిని కోరతారు. పక్షిరాజు "సంపతి" చెప్పిన వివరాలను తెలియజేసి ఎలాగైనా సీతను రక్షించమని కోరతాడు. హనుమంతుడు సముద్రాన్ని దాటి వెళ్ళి సీతను చూచి వస్తాననీ, ఒకవేళ సాధ్యంకాని పక్షాన లంకను త్రవ్వి రావణుని బంధించి రాముని వద్దకు తెస్తానని ప్రతిజ్ఞ చేస్తాడు.

హనుమంతుడు మహేంద్ర పర్వతాన్నుండి ఆకాశానికెగిరి సముద్రం మీదుగా లంకకు బయలుదేరాడు. మార్గమధ్యంలో తనకి మానవరూపంలో ఉన్న మైనాక పర్వతం, "సురస" అనే నాగమాత, ఛాయా గ్రాహిణియైన "సింహిక" కనపడ్డారు. వారిని తప్పించుకొని లంకలోని సువేల పర్వతానికి చేరి అక్కడ కొంతసేపు విశ్రాంతి తీసుకున్నాడు.

హనుమంతునికి లంకలో భయంకరమైన శబ్దాలు వినబడ్డాయి. లంకా నగరపు కోటను పరిశీలనగా చూశాడు. సీతను ఎలా కలుసుకోవాలో ఆలోచించాడు. కాపలా ఉన్న రాక్షసులను ఎలా తప్పించుకోవాలో ప్రణాళిక వేసుకున్నాడు. ఇంతలో సూర్యుడు అస్తమించాడు. రాత్రైనందువల్ల హనుమంతుడు పెద్దదైన తన శరీరాన్ని చిన్నదిగా మార్చుకొని సువేలాద్రి నుండి లంకాపుర ద్వారానికి వెళ్లాడు. అక్కడ ఎంత వెదికినా సీత ఆచూకి తెలియలేదు. చివరకు అక్కడుండే ఒక గోపురాన్ని ఎక్కి చూడగా "సీత" ఉన్న ప్రదేశం కనపడింది. దీని తరువాత నుండి మన పాఠ్యభాగం ఆరంభమవుతుంది.

## 9.3 పాఠ్యభాగ వివరణ :

లంకా నగరాన్ని శోధించిన పిదప హనుమంతునికి ఒక స్త్రీ కనబడింది. ఆమె 'సీత'ని గుర్తుపట్టాడు. గోపురాన్ని దిగి సూక్ష్మరూపాన్ని ధరించి "శింశుపా" వృక్షాన్ని ఎక్కి కూర్చున్నాడు. రాముడినే తలచుకుంటూ రామనామాన్ని జపిస్తూ ఏడుస్తూ కనపడ్డ సీతను చూసిన హనుమంతుడు మనసులో పొంగిపోతాడు.

అదే సమయంలో సీతను లోబరచుకోవడానికి సిద్ధపడి దివ్యవస్త్రాలతో అందంగా అలంకరించుకున్నాడు. రావణునికి ఇరువైపులా కిన్నెర కింపురుషాది స్త్రీలు ఆలపట్టలు ధరించి వచ్చారు. మరికొందరు వేలకొద్ది కాగడాలతో రావణునికి ముందు నడిచారు. వారందరితో కలసి సీత వున్న ప్రదేశానికి వచ్చాడు. రావణాసుని చూడగానే భయంతో వణికిపోయింది. తన శరీరాన్ని అతని కంటపడకుండా వస్త్రంతో కప్పుకుంది.

**సీతతో రావణుడు మాట్లాడిన మాటలు :**

రావణుడు 'సీత' సౌందర్యాన్ని చూడగానే మన్మధ వికారానికి లోనయ్యాడు. ఓ సీతా నన్ను మన్మధ బాణానికి గురిచేశావు ? చంద్రుడు వెన్నలను ఎలా కురిపిస్తున్నాడో ! కోయిలలు ఎలా కూస్తున్నాయో ! కానీ నీకు నా మీద దయ లేకుండా పోయింది ? ఇంత అవివేకంగా ఆలోచిస్తూ నాకు దూరంగా ఉండొద్దు. ఇది నీకు న్యాయం కాదు" అన్నాడు.

**రావణుడు సీతకు కానుకలివ్వడం :**

ఓ సీతా ! మా ఇంట్లో కుబేరుడు పంపిన చీనిచీనాంబరాలు, దేవేంద్రుడు పంపిన పారిజాతాలు, యముడు పంపిన సుగంధద్రవ్యాలున్నాయి. అదేవిధంగా ఆదిశేషుడు పంపిన నగలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. వీటినన్నింటినీ అలంకరించుకో. నాతో స్వేచ్ఛగా మన్మధ క్రీడను అనుభవించు. నీ ప్రాణనాథుడైన రాముడు వస్తాడనే ఆశను విడిచి పెట్టని అంటాడు.

**రావణుని మహా వైభవం :**

రావణుడు బహుపరాక్రమాలు గలవాడు. తానుంటున్న లంకా నగరానికి సప్తసముద్రాలు పెట్టని కోటలు. రావణున్ని ఇంద్రాది దేవతలు పూజిస్తారు. గంధర్వ దేవ కాంతలు రావణుని చెరసాలల్లో ఖైదీలైనారు. తన భాండాగారంలో నవ నిధులున్నాయి. రావణుడు పుష్పకాన్ని ఎక్కి లోకాలన్నింటినీ తిరిగిరాగలడు. అతని భుజశక్తి అద్భుతమైంది. ఎల్లప్పుడూ అష్టదిక్పాలకులు రావణుని సేవిస్తారు. బృహస్పతి పంచాంగం చెపుతాడు. కైలాస పర్వతాన్ని బంతిలాగా ఎత్తాడు. దిక్కృతుల గర్వాన్ని అణచాడు. యుద్ధాలలో శత్రురాజులను జయించాడు. ఆదిశేషుని తలలు అణగిపోయేలా భూమిని ఎత్తాడు.

సీతా ! రాముడు మునులు మాదిరిగానే జడలు ధరించాడు. కాయకూరలు తింటూ జీవిస్తున్నాడు. నాలాగా సముద్రాలను దాటిరాలేడు. మానవులు రాక్షసులను జయించటం సాధ్యంకాని పని. రాముడు నాకు పోటీ అంటే ప్రజలు హేళన చేస్తారు. నీ సౌందర్యం దేవతాస్త్రీలైన అప్సరసలకు కూడా లేదు. నీ లాంటి సౌందర్యకాంతలు లోకంలో ఎక్కడా ఉండరు. చెప్పాలంటే సీతా ! నీకు నీ సిగ్గే గొప్ప భూషణం (అలంకారం). అందువల్ల భయాన్ని వీడి నాతో స్వేచ్ఛగా కూడి మాట్లాడు. చేప కనురెప్పల మాదిరిగా ఉండే నీ కనురెప్పలను ఎత్తి నా వైపు చూడు" అని రావణుడు సీతపై గల అవ్యాజమైన ప్రేమను కనపరుస్తాడు.

**సీత రావణుని తిరస్కరించి, బెదిరించిన తీరు :**

రావణుని మాటలను తిరస్కరించిన సీత గడ్డిపరకను చేతితో పట్టుకొని సమాధానం చెపుతూ ... "ఓ రావణా! భర్తనే దైవంగా భావించే స్త్రీలను మానభంగం చేయాలని ప్రతిజ్ఞ చెయ్యాలనుకునే నీలాంటి వారితో మాట్లాడటం మహాపాపం. ఇతరుల భార్యలను కోరుకునే నీలాంటి వారికి ఆయువు పుణ్యాము నశిస్తాయి. చివరకు వారు నరక కూపంలో పడతారు. తన సామర్థ్యాన్ని గొప్పతనాన్ని కాపాడుకునేవారు బుద్ధిహీనులు. నీలాంటి గుణహీనుని మాటలు వినడమే మహాపాపం. నా రాముడ్ని ఎదుర్కొనే సాహసం చెయ్యలేక నన్ను దొంగిలించి తెచ్చావు. ఇలాంటి నీచమైన మాటలు మాట్లాడటం నీకు తగింది కాదు.

**రాముని పరాక్రమము :**

నా రాముడు బాల్యంలోనే తాటకను మట్టి కరిపించాడు. విశ్వామిత్రుడి యజ్ఞానికి అడ్డుగా ఉంటే రాక్షసులను చంపాడు. రాజులకే అసాధ్యమైన శివధనస్సును చిటికిన వేలితో విరిచాడు. ఖరదూషణాది రాక్షసులను చంపాడు. తన పాద ధూళి తగలగానే రాయి స్త్రీగా ప్రాణం పోసుకుంది. మాయలేడిని లేకుండా చేశాడు. రాముడు ఆదినారాయణుడు. రాముడికి ఈ సముద్రం నీ రాక్షస సమూహం నువ్వు చెప్పుకునే శక్తిసామర్థ్యాలు లెక్కలోకేరావు. నీతోమాటలు అనవసరం. చూస్తూ ఉండు, నీకు రక్షణగా ఉన్న సముద్రానికే వారధిని కట్టి తన అస్త్రాలతో కిరీటాలతో ఉన్న నీ తలలను ఖండించి భూతాలకు బలిగా ఇస్తాడు. నిన్ను ఎలాగైనా మట్టి కరిపించడానికి రాముడు ఎలాగైనా సముద్రాన్ని దాటి వస్తాడు. రెండు రోజులు ఓపిక పట్టమని అంటుంది.

**రావణుడు ఆగ్రహంతో కాలత్రాచులా లేవడం :**

సీత మాటలకు రావణుడు కోపంతో నల్లత్రాచులా లేచాడు. ఆడదానివని అభిమానం చూపిస్తే నన్నే బెదిరిస్తావా? నువ్వు మాట్లాడకుండా నీ నాలుకను చిల్లులు చేస్తాను. లేకపోతే నాకు దోషం పడుతుంది. నేను అభిమానంతో కోరుకుంటూ ఉంటే నువ్వు యుద్ధానికి కాలు దువ్వుతావా? నిన్ను నరికి భూతాలకు బలిస్తాను. లేకపోతే బలత్కారంగానైనా నిన్ను చెరపడతాను. లేకపోతే నన్ను లెక్క చేసేలా లేదు అంటాడు. అందుకు ఏమాత్రం భయపడకుండా గర్వంతో నవ్వుతుంది.

**రావణుని సాహసకృత్యాలు :**

అద్భుతమైన నా భుజశక్తితో కైలాస పర్వతాన్ని సునాయాసంగా ఎత్తాను. అష్టదిక్పాలకులైన దేవేంద్రాదులను ఓడించాను. అటువంటి బలవంతుడనైన నా ముందు రాముడి పేరు చెబితే నవ్వుతారు. నేను పుష్పకాన్ని ఎక్కి సర్వలోకాలను తిరిగి నా ఆజ్ఞను నిలబెట్టాను. దేవతల సైన్యాలతో వెట్టిచాకిరీ చేయించాను. ప్రమథగణ సహితంగా కైలాసపర్వతాన్ని ఎత్తాను. తపస్సు చేత బ్రహ్మ నుండి వరాలను పొందాను. గంధర్వాది సిద్ధుల భార్యలను బందీ చేశాను. ఇలాంటి సమర్థత లోకంలో మరెవ్వరికీ లేదు. ఒక పేదనరుడ్ని నాకు ప్రతివీరునిగా చేసి దుర్భాషలాడుతావా ? నీ నాలుకను ఛేదించి నేలపై పడేస్తాను అని చంద్రహాసాన్ని తీసుకొని రావణుడు పైకి లేస్తాడు.

**ప్రియసుందరులు అడ్డుపడటం :**

ఆగ్రహంతో ఊగిపోతున్న రావణునికి ప్రియసుందరులు అడ్డుగా నిలుస్తారు. "ఈమెపైనీ ప్రతాపాన్ని చూపడానికి ఏ పాటిది?" అష్టదిక్పాలకులలోనిది కాదు. ఈమెపై దారుణ కృత్యాలు చెయ్యాలనుకోవడం సరికాదు. గట్టిగా బెదిరిస్తే సరి. కత్తి దుయ్యనవసరం లేదు. ఈ సారికి మమ్మల్ని క్షమించి ఈమెను మన్నించు" అని శాంతి వచనాలతో వేడుకొని శాంతింప చేశారు.

రావణుడు వారి శాంతి మాటలను మన్నించాడు. సీతకు రక్షణగా ఉన్న రాక్షసస్త్రీలను చూసి "ఈమెకు రెండు నెలలు గడువు ఇచ్చాను. నన్ను అంగీకరించినట్లు చెయ్యండి లేదా ముక్కలుగా కోసుకొని తినండి" అని రావణుడు అన్నాడు.

**సీత విచారము :**

సీత ప్రేమతో కూడిన మాటలు ఎన్ని చెప్పినా వినకుండా రాముడ్ని నిందించినందుకు, తనను చంపమన్నందుకు సీత శోకించింది. చివరకు రాక్షస స్త్రీలు కూడా దుఃఖించారు. ఇదంతా చెట్టుపై నుండి చూస్తున్న హనుమంతుడు రావణునిపై ఆగ్రహాన్ని కలిగివున్నాడు. తనకు రావణుడు లొంగితే సరే. ఒకవేళ తనే రావణునికి లొంగితే తన పనికి భంగం కలుగుతుందేమోనని హనుమంతుడే సంశయించాడు.

ఏది ఏమైనా ముందు సీతకు రాముని క్షేమ సమాచారాన్ని తెలపాలి. అలాగే రామునికి సీత క్షేమ వార్త తెలపాలని భావించి హనుమంతుడు ఆగాడు. రావణుడు ఇంటికి వెళ్ళాడు. సీతను ఒప్పించలేక రాక్షసస్త్రీలు అలసి నిద్రపోయారు.

**త్రిజట స్వప్నం :**

రాక్షసస్త్రీలు నిద్రిస్తుండగా త్రిజట అనే రాక్షస స్త్రీ లేచి తోటివారితో తన కలలో జరిగిన సంగతి చెపుతుంది. "నా కలలో లంకా ద్వీపము, ఈ సముద్రంలో వాలిపోయింది. రావణుని రత్నకిరీటాలు యుద్ధంలో కూలిపడ్డాయి. రాముడు మదగజాన్ని ఎక్కి సీతను తీసుకపోవడానికి వస్తాడు. రాముడు అంతఃపురపు పట్టపురాణి సీతను చూసి శుభ సూచనలు కనపడుతున్నాయి. ఈ నా మాట వేదం. అందువల్ల సీతతో కఠినంగా మాట్లాడొద్దు. ఆ తరువాత మనల్ని రక్షించే దిక్కు కూడా ఈమే అవుతుంది అని కలలో జరిగిన విషయాన్నంతా తోటిరాక్షస స్త్రీలతో చెపుతుంది.

## 9.4 ముఖ్యమైన పదాలకు అర్థాలు :

| | | | |
|---|---|---|---|
| 40. | ఆ రామన్ + చూచి | = | హనుమంతుడు సీతను చూసి |
| | దేవినిగాన్ | = | పట్టపురాణిగా |
| | తలంపుచున్ | = | ఆలోచిస్తూ |
| | ఆ + గోపురంబు | = | అశోకవన ముఖద్వారం నుండి |
| | డిగ్గి | = | దిగి |
| | సూక్ష్మరూపంబునన్ | = | చిన్న రూపంలో |
| | కైకొని | = | ధరించి |
| | శింశుపా వృక్షంబు + ఆరోహించి | = | శింశుపా చెట్టుని ఎక్కి |
| 41. | వేగివేగి | = | సంతాపాన్ని పొంది పొంది |
| | దిక్కులేమికై | = | ఆధారం లేకపోవడానికై |
| | లోగిలోగి | = | క్రుంగిపోయి లేదా పరితపించి |
| | తోగి, తోగి | = | తడిసి |
| | రమణి | = | సీత |
| | కపివరండుసూచి | = | వానరులలో శ్రేష్ఠుడైన హనుమంతుడు |
| | కామినేనీ రత్నంబున్ | = | రత్నం వంటి సీత |
| | చిత్తమందున్ | = | తన మనస్సులో |
| 42. | సీతా + అపహృత | = | సీత చేత దొంగిలించబడిన |
| | మజ్జనంబు + ఆడి | = | స్నానం చేసి |
| | దివ్య + అంబరాలు | = | ఇంపయిన వస్త్రాలు |
| | శ్రీగంధంబున్ | = | మంచి గంధాన్ని |
| | వెఱపూత పూసి | = | శరీరానికి పూసుకొని |
| | మవ్వంపుదావి (మవ్వము+తావి) | = | చక్కనైన సువాసన |
| | నివ్వటిల్లెడు | = | అతిశయించు |
| | దశశిరంబులయందునూ | = | పదితలలందు |
| | రత్నముకుటంబులు | = | రత్నాలతో చెక్కి కిరీటాలు |

| | | | |
|---|---|---|---|
| | కుండలంబులు | = | చెవులకు ఆభరణములు |
| | భానుప్రభా | = | సూర్యకాంతిచే |
| | పతకంబులును | = | కంఠాభరణములను |
| | ముక్తాహారంబులును | = | ముత్యాలహారములను |
| | భుజకీర్తులును | = | భుజాలకు ధరించే ఆభరణాలు |
| | బాహుపురులును | = | కేయూరాలు |
| | అంగుళీయకంబులు | = | ఉంగరాలు |
| | చంద్రహాస హస్తుంకు + ఐ | = | కత్తిచేతిలో కలవాడై |
| | కందర్ప | = | మన్మధునియొక్క |
| | ఆలవట్టంబులు | = | రాజులకు ఎండ తగలకుండా వీచే విసనకర్ర |
| | మౌక్తిక, ఛత్రంబులును | = | ముత్యాల గొడుగులను |
| | తాలవృత్తంబులును | = | విసనకఱ్ఱలను |
| 43. | నయవాక్య | = | ఇంపయిన మాటలు |
| | అతికుతుకమునన్ | = | సీతను అనుభవించాలనే కోరికతో |
| | చేతోభవ | = | మనసులో పుట్టిన మన్మధుడు |
| | పాతంబులన్ | = | దెబ్బలతో |
| 44. | తోయజ దళ + అక్షి | = | పద్మపు రేకుల వంటి కన్నులు గల సీతా |
| | వలరాయడు | = | మన్మధుడు |
| | ఏయగన్ | = | కొట్టడానికి |
| | తోయద పథంబునన్ | = | మేఘ మార్గంలో |
| | ఉడురాయడును | = | చంద్రుడునూ |
| | మంచివడన్ | = | ఎక్కువ తాపంతో |
| | కీరములు | = | చిలుకలు |
| | అళివ్రజములు | = | తుమ్మెదల సమూహము |
| 45. | అలకా + ఈశ్వరుండు | = | కుబేరుడు |
| | దివిజాధినాధుండు | = | దేవేంద్రుడు |
| | దక్షిణాధీశుండు | = | యముడు |
| | ఫణి సార్వభౌముడు | = | ఆదిశేషుడు |
| | కడిమిలేక | = | ఏవిధమైన లోటు లేకుండా. |
| 46. | ఏడు వారాసులు | = | సప్త సముద్రాలు |
| | నవ విధానంబులన్ | = | నవ నిధులలో |
| | మత్ + భుజశక్తి | = | నా భుజబల శక్తి |
| 48. | శ్వాసనుండు | = | వాయుదేవుడు |
| | సమ్మార్జనమున్ | = | తుడుచుట |
| | అబ్ధినాధుడు | = | సముద్రాలకు అధిపతియైన వరుణుడు |

| | | |
|---|---|---|
| శమనుండు | = | యముడు |
| పాకారి (పాక + అరి) | = | పాకుడు అనే రాక్షసునికి శత్రువైన ఇంద్రుడు |
| దనుజేశ్వరుండు (దనుజ+ఈశ్వరుడు) | = | నైదృతి అనే దిక్పాలకుడు |
| గురుడు | = | దేవగురువు బృహస్పతి |
| చెలువొందువాడిన్ | = | వెలుగుతున్నాను. |
| 49. శంకరాచలము (శంకర + ఆచలము) | = | ఈశ్వరుని పర్వతమైన కైలాసాన్ని |
| భోగి కంఠములు | = | ఆదిశేషుని పడగలను |
| 50. తపముల చందమునను | = | మునులు మాదిరిగా |
| కుడుచునట్టి | = | తినేటట్టు |
| 51. జలధిన్ | = | సముద్రాన్ని |
| 52. దానవులు | = | రాక్షసులు |
| మానవ భక్షకులు + ఐ | = | మానవులను తినేవారై |
| 53. జగదీశుడు (జగతీ + ఈశుడు) | = | భూమికి ప్రభువైన శ్రీరాముడు |
| నగధరుడో (నగధరుడు + ఓ) | = | మంథర పర్వతాన్ని తన వీపుపై ధరించిన విష్ణుమూర్తియో |
| నగభేరి | = | ఇంద్రుడు |
| 55. నీకుచములు | = | స్తనాలు |
| 56. మత్తేభ | = | మదించిన ఏనుగు |
| సురకాంతల్ | = | దేవకాంతలు |
| లోలాక్షులున్ (లోల + అక్షులున్) | = | చంచలమైన కన్నులు గల స్త్రీలు |
| తరుణుల్ | = | స్త్రీలు |
| 57. సుదతీ | = | చక్కని పలువరుసగల సీతా ! |
| బేడిసలన్ | = | బేడిస చేపలను |
| 58. తృణంబు చేపట్టి | = | గడ్డి పరకను చేతిలో పట్టుకొని |
| జనక, భూపాల నందన | = | జనక మహారాజు కూతురు సీత |
| 59. ప్రతివచనములు | = | మారుమాటలు |
| 60. పరదారా | = | ఇతరుల భార్యలు |
| 62. నీతి విరహిత భాషల్ | = | నీతిలేని మాటలు |
| 63. సంగర రంగమందున్ | = | యుద్ధరంగము |
| మాతంగ | = | ఏనుగుల యొక్క |
| తురంగ | = | గుర్రాల యొక్క |
| శరాంగ | = | రథాల యొక్క |
| విరాధ | = | విరాధుడనే రాక్షసుని యొక్క |

| | | | |
|---|---|---|---|
| 64. | కూకటి ముడికినై | = | పిల్లజుట్టును ముడివేయడానికై |
| | తాటక | = | తాటక అనే యక్షణిని |
| | క్రతువు | = | యజ్ఞము |
| | గాంధేయుడు | = | గాధి కుమారుడైన విశ్వామిత్రుడు |
| | దైత్యులన్ | = | రాక్షసులను |
| | ఖరదూషణాది రాక్షసులన్ | = | ఖరుడు, దూషణుడు మొదలైన రాక్షసులు |
| | ఆదినారాయణుడు | = | శ్రీ మహావిష్ణువు |
| 66. | పారావారమున్ | = | సముద్రాన్ని |
| | కోటిద యుక్తంబుగాన్ | = | కిరిటాలతో కూడిన |
| | మస్తముల్ | = | తలలు (నీ పదితలలు) |
| | భుక్తుల్ | = | భోజనాలు |
| 67. | తెగడన్ | = | నిందించుట |
| | అజిలోన్ | = | యుద్ధంలో |
| 68. | చీరికింగొనక | = | లెక్కచేయక |
| | కాలాహి | = | కాలసర్పము |
| 69. | తూటులుగాన్ | = | చిల్లులుపడే విధంగా |
| 70. | వ్రయ్యలుగాన్ | = | ముక్కలుగా |
| 71. | భావజకేళిన్ | = | మన్మథ క్రీడతో |
| 72. | భీమాచలంబున్ | = | శివుని పర్వతమైన కైలాసగిరి |
| | సుత్రామ | = | దేవేంద్రుడు |
| | ఉద్దామప్రౌఢిన్ | = | భయంకరమైన ఉత్సాహంతో |
| | కళాధాముండన్ | = | కళా నిలయుడును. |
| 73. | మంజువాణి | = | విన సొంపుగా మాట్లాడటం |
| | ఏకహేలను | = | ఒక క్రీడగా |
| | దితివంశ వల్లభుల్ | = | దితి అనే రాక్షసమాత వంశపు ప్రభువులు |
| | వనజ గర్భుని | = | బ్రహ్మచేత |
| 74. | వెఱవక | = | భయపడక, |
| | ఈ నిశిత కఠార ధారన్ | = | వాడియైన కత్తితో |
| | తునుమాడి | = | త్రుంచి |
| 75. | చంద్రహాసంబున్ | = | కత్తిని |
| | ప్రియసుందరులు | = | ఇష్టమైన అందగత్తెలు |
| 76. | ధనుంజయుడు | = | అగ్ని |
| | శరధివిభుండో | = | వాయుదేవుడు |

| | | | |
|---|---|---|---|
| | గాడ్పు | = | వాయుదేవుడు |
| | భోగిభూషుడో | = | శివుడు |
| 77. | ఇత్తురుణి పయిన్ | = | ఈ యువతి |
| 78. | ఈ యాటది - ఈ + ఆటది | = | ఈ స్త్రీ |
| | కరువాలుకున్ | = | కత్తికి |
| 79. | వైదేహి | = | సీత |
| | దైత్యకామినుల | = | రాక్షస స్త్రీల |
| 79. | కడికండలుగాన్ | = | ముక్కలు ముక్కలుగా |
| | ఇంతి పలలంబు | = | ఈ స్త్రీ యొక్క మాంసము |
| 80. | అరుణిత | = | ఎర్రబడ్డ |
| 81. | ఇనకుల వల్లభుని దేవి | = | సూర్యవంశ ప్రభువైన రాముని భార్య సీత |
| 82. | గంధవహ పుత్రుడు | = | వాయుపుత్రుడైన హనుమంతుడు, |
| | లంఘించి | = | దాటి |
| 83. | పరవాత్మజుండు | = | హనుమంతుడు |
| | వసుధావరు | = | భూకాంతుడైన రాముడు |
| | దనుజ విభుండు | = | రావణుడు |
| | నిజధామమున్ | = | తన గృహాన్ని |
| 84. | త్రిజట | = | త్రిజట అనే పేరుగల రాక్షసి, |
| | నిశాచరి | = | రాక్షసి |
| 85. | అబ్ధి | = | సముద్రము |
| | కోటీరముల్ | = | కిరీటాలు |
| 86. | శుద్ధాంతపు దేవిన్ | = | సీత |
| | అంతఃపురి | = | పట్టపురాణి |
| 87. | కఠినోక్తులు | = | కఠినమైన మాటలు |
| | అడకుడు | = | మాట్లాడవదు |

**డా॥ చదలవాడ విజయకుమార్**
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,
తెలుగు శాఖాధ్యక్షులు,
సి.ఆర్. కళాశాల,
చిలకలూరిపేట.

పాఠం - 10

# సీతారావణ సంవాదం - ఆతుకూరి మొల్ల

## (రామాయణము - సుందరకాండము - 40 నుండి 87 పద్యాల వరకు)

### సందర్భసహిత వ్యాఖ్యలు, ప్రశ్నలు - జవాబులు

**విషయసూచిక :**

10.1 సందర్భసహిత వ్యాఖ్యలు
10.2 పద్యాలు - అర్థతాత్పర్యాలు
10.3 ప్రశ్నలు - సమాధానాలు
10.4 వ్యాకరణాంశాలు

**10.1 సందర్భసహిత వ్యాఖ్యలు :**

**1. ఉంటుటిది న్యాయమె లతాంగీ !**

**కవి పరిచయం :**

ఈ వాక్యము మొల్లచే రచించబడ్డ 'రామాయణము'లోని సుందరకాండ నుండి గ్రహింపబడింది.

**సందర్భం :**

రావణాసురుడు సీతను అపహరించి అశోకవనంలో దాచాడు. ఆమెకు కాపలాగా రాక్షసస్త్రీలను ఉంచాడు. తన సమూహంతో వచ్చిన రావణుడు సీతను లోబరచుకోవడానికి చేసే ప్రయత్నములోనిది.

**అర్థం :**

ఓ సౌందర్యరాశి ఇలా ఉండటం నీకు తగునా ?

**వివరణ :**

రావణుడు సీతను చూడగానే మన్మధ బాధకు గురైనాడు. సీతతో ఆకాశంలో చంద్రుడు ప్రకాశిస్తున్నాడు. కోయిలలు కూస్తున్నాయి. నాపై ఏమాత్రం దయ లేకుండా దూరంగా ఉంటున్నావు. నాపై మనసును ఉంచు అని రావణుడు మాట్లాడాడని భావం.

**2. విడువ మడియాన రామభూ విభునిమీద**

**కవి పరిచయం :**

ఈ వాక్యము మొల్లచే రచించబడ్డ 'రామాయణము'లోని సుందరకాండ నుండి గ్రహింపబడింది.

**సందర్భం :**

సీత పొందు కోసం రావణాసురుడు తన గొప్పతనాన్ని చెప్పుకునే సందర్భంలోనిది.

**అర్థం :**

నేను ఐశ్వర్యంలోను శక్తిసామర్థ్యాలలోను రాముని కంటే శక్తివంతుడను. రామునిపై ఆశ పెట్టుకోవద్దని రావణాసురుడు మాట్లాడుతున్నాడు.

**వివరణ :**

ఓ సీతా ! నువ్వు అలంకరించుకోవడానికి నావద్ద కుబేరుడు, దేవేంద్రుడు, యముడు, ఆదిశేషుడు పంపిన చీనిచీనాంబరాలు, నగలు, పుష్పాలు ఉన్నాయి. వీటిని అలంకరించుకొని మన్మథసుమాలను కోరుకో. నీ రాముడు వస్తాడన్న ఆశను వదలుకో అని రావణుడు సీతకు హితవు పలికాడని భావం.

**3. వైభవంబునఁ జెలు వొందువాడ**

**కవి పరిచయం :**

ఈ వాక్యము మొల్లచే రచించబడ్డ 'రామాయణము'లోని సుందరకాండ నుండి గ్రహింపబడింది.

**సందర్భం :**

సీతతోటి సుఖానికి రావణుడు తన భోగభాగ్యాలను తనుగా చెప్పుగా సందర్భంలోనిది.

**అర్థం :**

రావణుడు సంపదతో తులతూగుతున్నాడు.

**వివరణ :**

రాముడు తిరిగి వస్తాడనే ఆశను వదులుకో. నాకు అష్టదిక్పాలకులు సేవలు చేస్తారు. బృహస్పతి నాకు పంచాంగం చెపుతాడు. కిన్నరాది కింపురుషస్త్రీలు నన్ను చేరి సేవలు చేస్తారు అని రావణుడు తన వైభవాన్ని సీతతో పలికాడని అర్థం.

**4. రాముడే రీతి లంకకు రాగలడు !**

**కవి పరిచయం :**

ఈ వాక్యము మొల్లచే రచించబడ్డ 'రామాయణము'లోని సుందరకాండ నుండి గ్రహింపబడింది.

**సందర్భం :**

రావణుడు తన శక్తిసామర్థ్యాలను గురించి, తన భోగాన్ని గురించి చెప్పడంతోపాటు రాముడిని అవహేళనగా మాట్లాడే సందర్భంలోనిది.

**అర్థం :**

రాముడు లంకా నగరానికి ఎలా రాగలడు.

**వివరణ :**

రాముడు సాధారణమైన మునుల్లాగా జడలు పెంచుకొని కాయగూరలు తింటూ జీవించేవాడు. నాలాంటి శక్తిమంతుడ్ని చుట్టూ పెట్టని కోటల మధ్య నివసించేవాడిని అలాంటి ఈ లంకానగరానికి నీ రాముడు ఎలా వస్తాడని రావణుడు సీతతో పలికాడని అర్థం.

**5. దానవులను గెలువ నరుల తరమే జగతిన్.**

**కవి పరిచయం :**

ఈ వాక్యము మొల్లచే రచించబడ్డ 'రామాయణము'లోని సుందరకాండ నుండి గ్రహింపబడింది.

**సందర్భం :**

మానవులకు లంకా నగరానికి చేరుకోరని సీతతో తెలియజేసే సందర్భంలోనిది.

**అర్థం :**

లోకంలో రాక్షసులను జయించటం మానవులకు సాధ్యంకాని పని.

**వివరణ :**

సాధారణంగా మానవులు రాక్షసులను గెలవడం అసాధ్యం. ఎందుకంటే రాక్షసులు మానవులను చంపి తింటారు. అలాంటిది మానవుడైన రాముడు ఈ లంకా నగరానికి వచ్చి నన్ను జయించడం కాని పని అని రావణుడు సీతతో పలికాడని భావం.

**6. చూడుము కనురెప్పలెత్తి సుదతీ నన్నున్ !**

**కవి పరిచయం :**

ఈ వాక్యము మొల్లచే రచించబడ్డ 'రామాయణము'లోని సుందరకాండ నుండి గ్రహింపబడింది.

**సందర్భం :**

రావణుడు సీతతో సౌందర్యంలో నీకెవ్వరూ సాటిరారు. సిగ్గును విడిచి తనతో గడపమని మాట్లాడే సందర్భంలోనిది.

**అర్థం :**

సుందరమైన దంతాలు గల సీత నీ కనురెప్పలెత్తి ప్రేమగా చూడు.

**వివరణ :**

ఓ భూ పుత్రికా ! దేవ, యక్ష, కిన్నెర, సిద్ధ, గరుడ, గంధర్వ కాంతలు నీకు సాటిరారు. నీకు సిగే భూషణం. భయాన్ని వదలి ప్రేమగా నాతో మాట్లాడు. బేడిసి చేపలాంటి నీ కనురెప్పలను పైకెత్తి నన్ను చూడు అని రావణుడు సీతతో మాట్లాడాడని భావం.

**7. తుచ్ఛపుఁబల్కులు పల్కఁబాడియే**

**కవి పరిచయం :**

ఈ వాక్యము మొల్లచే రచించబడ్డ 'రామాయణము'లోని సుందరకాండ నుండి గ్రహింపబడింది.

**సందర్భం :**

అశోకవనంలో ఉన్న సీతతో రావణుడి సీతను, రాముడిని అవహేళనగా మాట్లాడే సందర్భంలోనిది.

**అర్థం :**

అహంకారంతో తుచ్ఛపు మాటలు మాట్లాడాడు.

**వివరణ :**

ఓ రావణా ! రాముడితో యుద్ధం చెయ్యలేకనే నన్ను దొంగతనంగా తెచ్చావు. నీ తుచ్ఛమైన కోర్కెలతో నన్ను లోబరచుకోవాలనుకోవడం నీ అవివేకం అని రావణుడు సీత మందలించినది భావం.

**8. చెప్ప నేటికి నీవు చూచెదవుగాక !**

**కవి పరిచయం :**

ఈ వాక్యము మొల్లచే రచించబడ్డ 'రామాయణము'లోని సుందరకాండ నుండి గ్రహింపబడింది.

**సందర్భం :**

సీత రావణునికి రాముని గుణగణాలను, శౌర్యాన్ని గురించి తెలియజేసే సందర్భంలోనిది.

**అర్థం :**

రాముని గురించి చెప్పడం కంటే ప్రత్యక్షంగా చూస్తావు.

**వివరణ :**

రాముడు బాల్యంలోనే తాటకిని చంపిన ధీరుడు. విశ్వామిత్రుని యజ్ఞానికి ఆటంకం కలిగించే రాక్షసులను తుదముట్టించాడు. అలాంటి శక్తి కలిగిన రాముడు నీలాంటి వారిని అంతం చెయ్యడం ప్రత్యక్షంగానే చూస్తావని రావణునితో పలికిందని భావం.

**9. దారుణాకృత్యము సేయగూడున్**

**కవి పరిచయం :**

ఈ వాక్యము మొల్లచే రచించబడ్డ 'రామాయణము'లోని సుందరకాండ నుండి గ్రహింపబడింది.

**సందర్భం :**

రావణుడు తన సామర్థ్యాన్ని సాహసాలను సీతకు తెలియజేసే సందర్భంలోనిది.

**అర్థం :**

భయంకరమైన పని చెయ్యడం తగదు.

**వివరణ :**

రావణుడు సీతతో అష్టదిక్పాలకులను సహితం బందీలుగా చేసే సామర్థ్యం గలవాడిని. అలాంటి నాతో రాముడు ప్రతివీరునిగా నిలబెట్టడం చూసి లోకం నవ్వుతుంది. ఇంతసేపు దుర్భాషలాడిన నీ నాలుకను చిల్లులుగా చేస్తాను అని కత్తిదూయపోతాడు. సీత లాంటి మహాసాధ్విని చంపాలనుకోవడం పాపమని రావణుని ప్రియసుందరులు ఆ రాక్షసునికి అడ్డుపడ్డారని భావం.

## 10. సిద్ధం బీమాట వేద సిద్ధాంతముగాన్ !

**కవి పరిచయం :**

ఈ వాక్యము మొల్లచే రచించబడ్డ 'రామాయణము'లోని సుందరకాండ నుండి గ్రహింపబడింది.

**సందర్భం :**

రావణుడు సీతను ఎలాగైనా ఒప్పించమని ప్రియసుందరులను కాపలా ఉంచే సందర్భంలోనిది.

**అర్థం :**

నా కల వేద సిద్ధాంతము లాగా సిద్ధిస్తుంది.

**వివరణ :**

రావణుడు ప్రియసుందరీలతో ఎలాగైనా సీతను ఒప్పించమని కాపలా ఉంచి వెళతాడు. రాత్రి కావడంతో అందరూ నిద్రలోకి జారుకుంటారు. ఇంతలో రాక్షస స్త్రీలలో 'త్రిజట' అనే రాక్షసి కల కంటుంది. ఆ కలలో రాముడు రావణుని చంపి లంక సముద్రంలో పడేసి, సీతను కొనిపోతాడనే విషయాన్ని తోటి స్త్రీలతో చెపుతుంది. తన మాట తప్పక జరుగుతుందని త్రిజట పలికిందని భావం.

వీటితోపాటుగా అదనంగా ఈ క్రింది సందర్భ వాక్యాలను కూడా సాధన చెయ్యండి.

1. మద్భుజా శక్తి ప్రతిపోల్పనద్భుతంబు
2. నాకస్త్రీలందు లేవు నాకుం జూడన్
3. ప్రతి వచనములాడు కంటె పాపముకలదె ?
4. తుది నరకంబునఁ బడుదు రనెడి న్యాయము వినవే
5. నీడెల్లి శాంతింపుమా
6. నాలుక తూటులుగా, జేయకున్న దోసము గాదె ?
7. రామున్ గీమున్ఁజెప్ప గిప్ప నగరా ?
8. ఈ మాటికి మన్నించి కావ్యమా యికఁజూలున్ ?
9. అట్లైన కార్యంబు తెలుగుఁదప్పు
10. మస్తముల్ దునిమి భక్తుల్ పెట్టు భూతాళికిన్

## 10.2 పద్యాలు - అర్థతాత్పర్యాలు

1. ఎత్తితి శంకరాచల మహీనబలంబున బంతిలాగునన్
మొత్తితి సర్వదిక్పతుల మూఁగిన గర్వమువిచ్చి పాఱఁగా
నొత్తితి శత్రుభూపతుల నుగ్రరణంబున భూమిఁ ద్రెళ్ళగా
మొత్తితి భోగికంఠము లమోఘజవంబున మేటికీర్తులన్.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| శంకరాచలము = శంకర + ఆచలము | = | శివునికి నిలయమైన కైలాస పర్వతము |
| అహీనబలంబున్ | = | అధికమైన బలంలో |
| బంతిలాగునన్ | = | బంతివలె |

| | | |
|---|---|---|
| ఎత్తి తిన్ | = | పెకిలించాను |
| మూగిన్, గర్వము | = | అమితమైన గర్వంతో |
| విచ్చిపారగన్ | = | విరిగిపారే తీరున |
| సర్వదిక్పతులన్ | = | దిక్పాలకులందరినీ |
| మొత్తితిన్ | = | కొట్టాను |
| ఉగ్రరణంబునన్ | = | భయంకరమైన యుద్ధంలో |
| శత్రుభూపతులన్ | = | శత్రురాజులను |
| బత్తితిన్ | = | నాశక్తితో వశం చేసుకున్నాను |
| అమోఘ, జపంబునన్ | = | అధికమైన వాయు వేగంతో |
| భోగి కంఠములు పాము మెడలు | = | సర్పం మెడలు విరిచి (ఆదిశేషుని పడగలు) |
| త్రెళ్ళగాన్ | = | విరిగే విధంగా |
| భూమిన్ మొత్తితిన్ | = | భూమండలాన్ని కూడా కొట్టాను. |

**తాత్పర్యం :**

అధికమైన బలంలో కైలాస పర్వతాన్ని బంతిలాగా ఎత్తాను. సర్వదిక్పాలకులైన ఇంద్రుడు, అగ్ని, యముడు, నిర్వతి, వరణుడు, వాయుదేవుడు, కుబేరుడు, ఈశానుడు ల గర్వాన్ని అణగద్రొక్కాను. భయంకరమైన యుద్ధంలో శత్రురాజులను వశం చేసుకున్నాను. చివరికి భూమిని మోసే ఆదిశేషుని పడగలను వాయువేగంతో విరగొట్టాను.

2. సురకాంతుల్ సరిరారు యక్షసతులున్ సూటింపఁగారు కి
న్నరభామల్ ప్రతిరాదు సిద్ధవనితల్ న్యాయంబుగాఁబోలరా
గరుణాబ్జక్షులు సాటిరారు, తలపన్ గంధర్వలోలాక్షులున్
మఱియేరీనినుఁజెప్పి చెప్పఁదరుణుల్ మత్తేభకుంభస్తనీ

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| మత్తేభ | = | మదించిన ఏనుగు యొక్క |
| కంభస్తనీ | = | కుంభస్తలం వంటి స్తనాలు గల |
| సురకాంతలు సరిరారు | = | దేవతాస్త్రీలు నీకు సమానం కారు |
| యక్షసతులున్ సూటింపగాన్ | = | యక్షస్త్రీలు కూడా నీకు పోటీరారు |
| కిన్నరభామల్ ప్రతిరాదు | = | కిన్నెరస్త్రీలు నిన్ను పోలినవారుకారు |
| సిద్ధవనితల్ | = | సిద్ధకాంతలు |
| న్యాయంబుగాన్ పోలరు | = | నిజముగా సరితూగరు |
| గడుడస్త్రీలు అసమానలు | = | గరుడ స్త్రీలను కూడ నీతో పోల్చలేము |
| గంధర్వ | = | గంధర్వుల యొక్క |
| లోలాక్షులున్ (లోల + అక్షులున్) | = | చంచలమైన కన్నులు గల స్త్రీలు |
| ఎంతో చవుకల్ | = | ఎంతగానో తక్కువైనవారు |
| నినుఁచెప్పి | = | నీ గురించి చెప్పి |

| | | |
|---|---|---|
| చెడ్డన్ తరుణుల్ | = | నీ గురించి చెప్పడానికి ఉండే స్త్రీలు |
| మఱియేరే | = | ఎవరూ లేరు |

**తాత్పర్యం :**

మధించిన కుంభస్థలము వంటి స్తనాలు గల ఓ సీతా ! యక్ష, కిన్నెర, సిద్ధ, గరుడ, గంధర్వ స్త్రీలు నీతో సమానమైన వారు కారు. నీ సౌందర్యాన్ని పొగిడిన పిదప మరెవ్వరినీ ఊహించడానికి వీలులేదు. ఎవరూ లేరని భావం.

3. సంగరరంగమందు నతిశౌర్యమునన్ రఘురామతోడ మా
తంగతురంగసద్భట శతాంగబలంబులఁ గూడి నీవు పో
రంగను నోప కిప్పుడు విరాధఖరాదులపాటుఁజూచియున్
దొంగిలి నన్నుఁదెచ్చితివి తుచ్ఛపుఁబల్కులు పల్కఁబాడియే

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| సంగరరంగమందున్ | = | యుద్ధరంగంలో |
| అతిశౌర్యమునన్ | = | మిక్కిలి శౌర్యంతో |
| మాతంగ | = | ఏనుగుల యొక్క |
| తురంగ | = | గుర్రాల యొక్క |
| సద్భట శతాంగ | = | మంచి సైనికుల రథాల యొక్క |
| బలంబులన్ కూడి | = | సైన్యాలతో కలసి |
| నీవు పోరంగను | = | నువ్వు యుద్ధం చెయ్యడానికి |
| విరాధ | = | వినాధుడు అనే రాక్షసుని యొక్క |
| ఖరాదుల (ఖర + ఆదుల) | = | ఖరుడు మొదలగు వారి యొక్క |
| పాటున్ చూచియున్ | = | చావును చూచి కూడా |
| ఇప్పుడు నన్నున్ | = | ఇప్పుడు నన్ను |
| దొంగిలి తెచ్చితివి | = | దొంగిలించి తెచ్చావు |
| తుచ్ఛపు పల్కులు (తుచ్ఛము + పల్కులు) | = | నీచమైన మాటలు |
| పల్కన్ పాడియే | = | మాట్లాడటం ధర్మమేనా ? |

**తాత్పర్యం :**

యుద్ధరంగంలో అతిబలపరాక్రమము గల రాముని సైన్యమైన ఏనుగుల, గుఱ్ఱాల, పదాతుల, రథాలు గల సైన్యాలతో యుద్ధం చేయడానికి నీకు శక్తి చాలదు. విరాధుడు, ఖరుడు మొదలైన రాక్షసుల మరణాన్ని చూచి కూడా నీవు నన్ను ఇప్పుడు అపహరించి తెచ్చావు. అంతేకాక ఇంత నీచమైన మాటలు మాట్లాడటం నీకు సరికాదు.

4. వీరాలపము లాడనేల వినుమీ విశ్వప్రకాశంబుగాఁ
బారావారముఁగట్టి రాఘవుడు కోపస్ఫూర్తి దీపింపగా
ఘోరాజిన్ నినుదాసి లావుకలిమిన్ గోటీరయుక్తంబుగాఁ
గ్రూరాస్త్రంబుల మస్తముల్ దునిమి భుక్తుల్ పెట్టుభూతాళికిన్.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| వీరాలాపములు (వీర + ఆలాపములు) | = | వీరుని వలే మాట్లాడటం |
| ఆడనేల (ఆడన్ + ఏల) | = | మాట్లాడటం ఎందుకు ? |
| వినుమా | = | నీ చెప్పిన మాటలు విను |
| రాఘువుడు | = | రాముడు |
| విశ్వ, ప్రకాశంబుగాన్ | = | లోకానికి తెలిసే విధంగా |
| పారావాదమున్ కట్టి | = | సముద్రాన్ని బంధించి, కోపస్ఫూర్తి |
| దీపింగాన్ | = | తన కోపము అధికంకాగా |
| ఘోరాజిన్ | = | భయంకరమైన యుద్ధంలో |
| నినున్డాసి | = | నిన్ను తాకి |
| లావు కలిమెన్ | = | అధికమైన బలముతో |
| కూరాస్త్రంబుల్ (క్రూర + అస్త్రంబుల్) | = | క్రూరమైన అస్త్రాలతో |
| కోటీర, యక్తుంబుగాన్ | = | కిరీటాలతో వున్న తలలను |
| మస్తముల్ తునిమి | = | నీ పదితలలు ఛేదించి |
| భూతాళికిన్ (భూత + ఆళికిన్) | = | పిశాచాల గుంపుకి |
| భుక్తుల్ పెట్టన్ | = | భోజనాలు పెడతాడు |

**తాత్పర్యం :**

బాధను కలిగించే మాటలు ఎందుకు రావణా ? వినుము. లోకానికి తెలిసేలా రాముడు సముద్రాన్ని బంధించి అమితమైన కోపంతో నిన్ను యుద్ధంలో ఎదుర్కొంటాడు. ఆ సమయాన నీ పదితలలకు ఉండే కిరీటాలను తెగనరికి పిశాచాల గుంపుకి భోజనం పెడతాడు.

5. **ఆరూఢా ప్రతిమాన విక్రమకళాహంకార తేజోనిధిన్**
**శ్రీరామున్ సుగుణాభిరాముఁ దెగడన్ జేకొన్న నిన్నజిలో**
**దారన్ దొంగిలి తంచు నిష్ఠురగతిన్ దండించి ఖండింప ము**
**న్నే రెట్లైనను దాటివచ్చు నలుకన్ నేడెల్లి శాంతింపుమా !**

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| ఆరూఢ | = | ఉచ్ఛదశ నందిన |
| అప్రతిమాన | = | సాటిలేని |
| విక్రమ కళా | = | పరాక్రమ శోభ కలిగిన |
| అహంకార తేజోనిధిన్ | = | గర్వంతో కూడిన తేజస్సుకు నిలయమైన |
| సుగుణాభిరామున్ (సుగుణ+అభిరామున్) | = | మంచి గుణాలచే మనోహరుడైన |
| శ్రీరామున్ | = | శ్రీరాముని |
| తెగడన్ చేకొన్న | = | నిందించడానికి సిద్ధపడి |
| నిన్నున్ ఆజిలోన్ | = | నిన్ను యుద్ధంలో |

| | | |
|---|---|---|
| దారన్ దొంగిలితంచున్ | | |
| (దొంగిలిం + అంచున్) | = | తన భార్యను దొంగిలించినందుకు |
| అలుకన్ | = | కోపంతో |
| నిష్ఠుర, గతిన్ | = | కోపంగా |
| దండించి | = | దండించడానికి |
| ఖండింపన్ | = | ఖండఖండములుగా చెయ్యడానికి (ముక్కలు ముక్కలుగా) |
| మున్నీరు | = | సముద్రాన్ని |
| ఎట్లు + ఐనను | = | ఏవిధంగానైనను |
| దాటివచ్చున్ | = | దాటివస్తాడు |
| నేడు = | = | ఈరోజు |
| ఎల్లి | = | రేపునూ |
| శాంతింపుమా | = | శాంతించు |

**తాత్పర్యం :**

ఉచ్ఛస్థితిని పొందిన, సాటిలేని పరాక్రమ గర్వంతో కూడిన తేజస్సుకి నిలయమైనవాడు. సద్గుణాలకు మనోహరమైన వాడు అలాంటి రాముడిని నిందించడానికి సిద్ధపడ్డావు. అలాంటి నిన్ను యుద్ధంలో ఎదుర్కొంటాడు. అపహరించి తన భార్యను తెచ్చావు. వీటన్నింటికి నేను అనే పై ప్రతీకారం తీసుకోవడానికి సముద్రాన్ని దాటి ఎలాగైనా వస్తాడు. ఈరోజు రేపు ఓపిక పట్టు.

6. కలగంటిన్ వినుఁడింతలార మనలంకాద్వీప మీయబ్ధిలో
పల వ్రాలన్ మన రావణేశ్వరుని శుంభద్రత్న కోటిరముల్
కలనన్ గూల రఘూద్వ హుండెలమితో గంధద్విపంబెక్కి యు
జ్వలకాంతిన్ విలసిల్లుసీతఁ గొనిపోవన్ మిన్నకే నిప్పుడే

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| ఇంతులార | = | ఓ రాక్షస పడతులారా ! |
| ఏన్ ఇప్పుడే | = | నేను ఇంతకు ముందుగానే |
| కలగంటిన్ | = | నాకు ఒక కల వచ్చింది |
| మిన్నక వినుడు | = | మారు మాట్లాడక వినండి |
| మన లంకాద్వీపము | = | మన లంకా నగరము |
| ఈ + అబ్దిలోపలన్ | = | ఈ సముద్రంలో |
| వ్రాలన్ | = | కలసిపోతాడు |
| మన రావణేశ్వరుని (మనరావణ+ఈశ్వరుని) | = | మన ప్రభువైన రావణునియొక్క |
| శుంభత్‌రత్న | = | ప్రకాశించే రత్నాలతో కూడిన |
| కోటీదముల్ | = | కిరీటాలు |
| కలనన్ కూలన్ | = | యుద్ధం వలన సముద్రంలో పడతాయి |

| | | |
|---|---|---|
| సీతన్ కొనిపోన్ | = | సీతను తీసుకొని వెళ్ళడానికి |
| రఘు + ఉద్వహుండు | = | రఘు వంశాభివృద్ధికి కారకుడైన శ్రీరాముడు |
| ఎలిమిలోన్ | = | సంతోషంతో |
| గంధ, ద్వీపంబు + ఎక్కి = గంధద్వీపంఎక్కి | = | మదించిన ఏనుగునెక్కి |
| ఉజ్జ్వల కాంతిన్ | = | ప్రకాశవంతమైన కాంతితో |
| విలసిల్లున్ | = | ప్రకాశిస్తాడు |

**తాత్పర్యం :**

ఓ రాక్షస స్త్రీలారా ! నాకిప్పుడే కల వచ్చింది. మన లంకాద్వీపము ఈ సముద్రము లోపల కూలిపోగా మన ప్రభువు యొక్క ప్రకాశమానమైన కిరీటాలు యుద్ధంలో కూలిపోతున్నాయి. రఘువంశోద్ధారకుడు రాముడు సంతోషంతో సీతను తీసికెళ్ళడానికి దేదీప్యమైన కాంతితో ప్రకాశిస్తాడు.

ఇలాంటివే మరొకొన్ని పద్యాలను అభ్యాసం చేయండి.

**10.3 ప్రశ్నలు - సమాధానాలు**

**1. సీతారావణ సంవాదాన్ని సంగ్రహంగా తెలపండి.**

రావణుడు సీతపై మనసుపడ్డాడు. ఆమెను లోచబరచుకోవడానికి సిద్ధపడి దివ్యమైన వస్త్రాలను అందంగా అలంకరించుకొని కిన్నర కింపురుషాధి స్త్రీలు తోడుగా రాగా సీత ఉన్న అశోకవనానికి వచ్చాడు. రావణుని చూడగానే సీత భయంతో వణికిపోయింది. తన శరీరాన్ని అతని కంటపడకుండా తన చీరతో కప్పుకుంది.

**రావణుడు సీతతో మాట్లాడిన మాటలు :**

సీతను చూడగానే మన్మథబాధకు లోనయ్యాడు. ఓ సీతా నీ మీద మోహ పడియున్నాను. నా బాధను గ్రహించు. నాకు దూరంగా ఉండటం నీకు న్యాయం కాదు. నాపై దయ చూపించు. మా ఇంట్లో కుబేరుడు పంపిన చినీచీనాంబరాలున్నాయి. దేవేంద్రుడు పంపిన పారిజాతాలున్నాయి. యముడు పంపిన పరిమళద్రవ్యాలున్నాయి. వీటిన్నింటినీ అలంకరించుకొని నాతో మన్మథ క్రీడను అనుభవించు. రాముడొస్తాడనే ఆశను వదిలిపెట్టు.

ఓ సీతా ! సప్తసముద్రాలూ, నా నగరానికి పెట్టని బలమైన కోటలు. నన్ను ఇంద్రుడు మొదలైన దేవతలు సేవిస్తారు. దేవకాంతలు నా చెరసాలలో బందీలుగా ఉన్నారు. నా భాండాగారంలో నవనిధులున్నాయి. నేను పుష్పక విమానాన్ని ఎక్కి తిరుగుతాను. నా భుజశక్తి శక్తివంతమైనది. కైలాస పర్వతాన్ని బంతిలాగా ఎత్తాను. దిక్పాలకుల గర్వాన్ని అణచడంతో పాటు శత్రురాజులను కూడా జయించాను.

ఓ భూ పుత్రికా ! రాముడు మునులు మాదిరిగా జడలు ధరించి కాయకూరలు తింటున్నాడు. మానవులు సముద్రాలు దాటటం వీలుకాని పని. రాక్షసులను జయించటం అసాధ్యం. అలాంటిది రాముడు ప్రతినాయకుడిగా నిలబడటం అంటే ప్రజలు నవ్వుతారు. నీ సౌందర్యం ముందు అప్సరసలు కూడా సాటిరారు. నీలాంటి సౌందర్యవంతులు లోకంలోనే లేరు. భయపడక అందమైన నీ కనురెప్పలతో నా వైపు చూసి నన్ను కామించమని రావణుడు సీతపై తనకు గల ప్రేమను వ్యక్తం చేశాడు.

**సీత రావణుని తిరస్కరిస్తూ బెదిరించి మాట్లాడటం :**

సీత రావణుని పోకడలను అసహ్యించుకుంది. గడ్డిపరకను చేత్తో పట్టుకొని విరక్తితో ఇలా అన్నది - భర్తనే దైవంగా భావించే స్త్రీలపట్ల అనుచితంగా మాట్లాడుతూ చెరచాలనుకోవడం ఉత్తముల లక్షణం కాదు. అలాంటి వారికి ఆయువుతోపాటు పుణ్యం కూడా దక్కదు. తన గురించి తానే గొప్పగా చెప్పుకోవడం గుణంలేని వారు చేసే పని. విలువ లేకుండా మాట్లాడటం తగదు. నువ్వు రామునితో యుద్ధం చెయ్యలేకనే నన్ను అపహరించి ఇక్కడికి తెచ్చావు. ఇది నీకు ధర్మం కాదు.

**రాముని పరాక్రమము :**

రాముడు బాల్యంలోనే తాటకిని సంహరించాడు. విశ్వామిత్రుడు యజ్ఞాన్ని సజావు చేసుకోవడానికి అనేకమంది రాక్షసులను చంపాడు. రాముని పాదధూళి తగలగానే శిలలాంటి రాయి కూడా ప్రాణం పోసుకుంది. రాజులు ఎత్తలేని శివధనస్సును చిటికిన వేలితో ఎత్తాడు. మాయలేడిని కూలగొట్టాడు. రాముడు సాక్షాత్తు ఆదినారాయణుడు. రాముని ముందు నీ బలపరాక్రమాలు గాలిమూటలే. త్వరలోనే రాముని శక్తిసామర్థ్యాలను చూస్తావు. సముద్రానికి వారధి కట్టి త్వరలో ఇక్కడికి వస్తాడు. తన అస్త్రాలతో నీ తలలను ఖండించి భూతాలకు బలివేస్తాడు. ఈ రెండు రోజులు సహనం కలిగివుండు అని సీత రావణుని బెదిరిస్తుంది.

**రావణుడు సీతపై కోపంతో మాట్లాడటం :**

సీత మాటలకు రావణుడు త్రాచుపాములా ఎగిరిపడ్డాడు. ఆడదానివని ఇంతసేపు సహనం వహించాను. నన్నే బెదిరిస్తావా ? మాట్లాడే నీ నాలుకను చిల్లులు చేయకపోవడం నా తప్పు. యుద్ధానికి రెచ్చగొడుతున్న నిన్ను నరికి దయ్యాలకు బలి చేస్తాను లేదా బలత్కారంగా నీపైపడి అనుభవిస్తానని అంటాడు.

నా బలపరాక్రమాలను ఇంతకుముందే చెప్పాను. అందువల్ల నావంటి శక్తిసామర్థ్యాలు కలవారు లోకంలో ఎవ్వరూ లేరు. రాముడులాంటి పేద మానవుణ్ణి నా పోటీగా పెట్టి మాట్లాడుతున్నావు. నీ నాలుకను ఖండిస్తాను అంటూ రావణుడు కత్తి తీసుకొని లేచాడు.

**2. రావణుడు మదనాతురడై సీతతో పలికిన మాటలేవి ?**

రావణుడు అందంగా అలంకరించుకొని సీత వద్దకు వచ్చాడు. విరహబాధను తెలిపాడు. కూడి రమ్మని ప్రాధేయపడ్డాడు. ప్రకృతి కూడా మనకు ఒంత పలుకుతుంది. అందమైన వెన్నల కోయిలల కూతలు కోర్కెలను ప్రేరేపిస్తున్నాయి. ఆలస్యం చెయ్యకుండా మూర్ఖంగా ఆలోచించకుండా పొందుకోసం రమ్మంటాడు.
రావణుడు తన వైభవాన్ని గురించి చెప్పుకోవడం :

ఓ సీతా ! నీ కోసం కుబేరుడు బహుమతిగా ఇచ్చిన చీనిచీనాంబరాలున్నాయి. దేవేంద్రుడు నిత్యం పంపించే పారిజాత పుష్పాలున్నాయి. యముడు పంపిన కర్పూరాది పరిమళ ద్రవ్యాలున్నాయి. పాతాళలోకం నుండి ఆదిశేషుడు పంపిన భూషణాలు (నగలు)న్నాయి. వీటన్నింటినీ అందంగా అలంకరించుకో. వచ్చి నాతోటి పొందు కోరుకోమని అంటాడు.

సీతా నేను సమస్త ఐశ్వర్యాలకూ చెందినవాడిని. నా లంకా నగరానికి నలుదిక్కులున్న సముద్రాల రక్షణగా ఉండే కోటలు నన్ను ఇంద్రుడు మొదలగువారు తమ అనుచరులతో కలసి ఎల్లప్పుడూ సేవిస్తుంటారు. గంధర్వకాంతలు నా వద్ద ఖైదీలుగా ఉన్నారు. నా కోశాగారంలో నవ నిధులున్నాయి. నేను విహారం కోసం పుష్పకవిమానాన్ని ఎక్కి లోకాలను చుట్టి వస్తాను. నీకు తెలుసా నా భుజశక్తి బలమైంది అని రావణుడు తన గొప్పతనాన్ని గురించి సీతతో చెప్పుకుంటాడు.

**రావణుడి వైభవము :**

గాలి నా ఇంటిని శుభ్రం చేస్తుంది. వరుణుడు ఇంటి ముందు కళ్లాప చల్లుతాడు. అగ్నిదేవుడు వంటలు వండుతాడు. ఇంద్రుడు కల్పక పుష్పాలను అర్పిస్తాడు. నైరుతి కైదండ ఇస్తాడు. బృహస్పతి పంచాంగం చెబుతాడు. దేవ, కిన్నెర, గంధర్వ, యక్ష, నాగ, సిద్ధకాంతలు నాకు సేవలు చేస్తారు. అటువంటి భోగాన్ని అనుభవిస్తున్నాను.

**రావణుడి శక్తిసామర్థ్యాలు :**

నా భుజశక్తితో కైలాస పర్వతాన్ని బంతిలాగా ఎత్తాను. దిక్పాలకుల అహంకారాన్ని దండించాను. శత్రురాజులను జయించాను. ఆదిశేషుని తలలు భూమిలోకి అణగత్రొక్కాను అని అంటాడు.

**రావణుడు రాముడిని హేళనగా మాట్లాడటం :**

నీ రాముడు మునుల మాదిరిగా జడలు కలిగి తమ్మునితో కలిసి కాయకూరలు తినేవాడు. అలాంటి వాడు లంకను ఎలా చేరుకుంటాడు. సముద్రాన్ని దాటటం మానవులకు సాధ్యపడేదికాదు. రాక్షసులు మనుషులను తింటారు. మనుషులు రాక్షసులను జయించడం అసాధ్యం. రాముడు నాకు ప్రత్యర్థి అంటే లోకం నవ్వుతుంది. విష్ణువు, శివుడు, ఇంద్రుడు అయితే నాతో పోటీ పడవచ్చునేమో !

**రావణుడు సీత సౌందర్యాన్ని కీర్తించడం :**

ఓ సీతా ! నీ శరీర సౌందర్యం, అవయవసౌష్టం లోకంలో ఎవ్వరికీ లేదు. అప్సరసలు కూడా నీకు సాటిరారు. అందువల్ల సిగ్గును, భయాన్ని వీడి అందమైన నీ కనురెప్పలను తెరచి నన్ను చూసి ఆవహించుకోమని రావణుడు అంటాడు.

**3. సీత రావణుని నిందిస్తూ రాముని కీర్తించిన విధానాన్ని వివరించండి.**

**రావణునిని మందలించిన మాట్లాడిన సీత :**

భర్తతోటిదే జీవితంగా భావించే మాలాంటి స్త్రీలను చెరచాలని ప్రతిజ్ఞ చెయ్యడం మహాపాపం. అలాంటి వారికి పుణ్యఫలాలు సిద్దించవు. రాముడులాంటి సత్పురుషులను తూలనాడితే నరకంలో పడతారు. తన గొప్పతనాన్ని తనే పొగుడుకోవడం బుద్ధిలేనితనం. నీ గొప్పతనాన్ని నువ్వు చెప్పుకొనే నీలాంటి వారితో మాట్లాడకూడదు. యుద్ధంలో రామునితో పోటీపడలేక నన్ను దొంగిలించి తెచ్చావు. విరాధ, ఖరాదుల పతనాన్ని చూసి కూడా నువ్విలా నీచంగా మాట్లాడటం సరియైంది కాదు.

**రాముడి శౌర్యాన్ని రావణునికి తెలపడం :**

నా రాముడు కులగురువు వశిష్టుని వద్ద సకల విద్యలు అభ్యసించాడు. విశ్వామిత్ర మహర్షికి యాగసంరక్షకుడిగా ఉన్నాడు. బాల్యంలోనే తాటకి అనే రాక్షసిని సంహరించాడు. రాజులకే సాధ్యం కాని శివధనస్సుని రాముడు చిటికిన వేలుతో విరిచాడు. అరణ్యాలల్లో సంచరించే ఖర, ధూషణాది రాక్షసులను చంపాడు. తన పాదధూళితో రాతిని స్త్రీగా చేశాడు. మాయలేడిని సునాయాసంగా చంపాడు. రాముడు మానవమాత్రుడైన రాజు కాదు. ఆదినారాయణుడు.

అలాంటి రాముడికి ఈ సముద్రము ఏపాటిది ? లంకానగరము ఏపాటిది ? రాముని యొక్క శౌర్యాన్ని త్వరలో చూస్తావుగా ? నేను చెప్పేది విను. రాముడు లోకానికి తెలిసేలా సముద్రానికి వారధికట్టి యుద్ధంలో నిన్ను ఎదుర్కోనున్నాడు. తన క్రూరమైన అస్త్రాలతో కిరీటాలు కలిగివున్న నీ తలల్ని ఖండించి భూతాలకు ఆహారంగా వేస్తాడు.

అంతేకాదు రాముడు అసమానమైన పరాక్రమానికి, అహంకారానికి, తేజస్సుకు నిధి వంటివాడు. ఇంతసేపు అవమానంగా మాట్లాడిన నిన్ను శిక్షించడానికి ఏ రూపంలోనైనా వస్తాడు. తన భార్యను దొంగిలించిన నిన్ను కఠినంగా శిక్షించే కాలం ఆసన్నమైంది. నేడు, రేపు కాస్త శాంతించు అని సీత రావణునిపై రోషాన్ని వెల్లడి చేసింది.

**చిన్న ప్రశ్నలు - అభ్యాసం చేయండి.**

పెద్ద ప్రశ్నల నుండి చిన్న ప్రశ్నలకు జవాబులు రాయడం అభ్యాసం చేయండి.

1) "సీతా రావణ సంవాదం" పాఠం ఆధారంగా రావణాసురుని వైభవ పరాక్రమాలను గూర్చి వ్రాయండి.
2) తనను నిందించిన సీతను రావణుడు బెదిరించిన విధానాన్ని రాయండి.
3) రావణుడు సీతను బెదిరించగా హనుమంతుడు ఎలా ఆలోచించాడు.
4) త్రిజట తన స్వప్నాన్ని గురించి తోటి కావలికత్తెలతో ఏమని చెప్పింది.
5) సీత రావణుని మందలించి ఏవిధంగా మాట్లాడింది.
6) రాముని పరాక్రమాన్ని గూర్చి సీత రావణునికి ఏవిధంగా వివరించింది.

**10.4 ముఖ్యమైన వ్యాకరణాంశాలు :**

1. నాయెడ = నా + ఎడ = యడాగమసంధి

   సూత్రము = సంధిలేని చోట స్వరంబు కంటెంబరంబయిన స్వరంబునకు యడాగమంబగు.

2. లతాంగి = లతా + అంగి - సవర్ణదీర్ఘసంధి

   సూత్రము = అ, ఇ, ఉ, ఋ లకు సవర్ణములైన అచ్చులు పరమైతే వాని దీర్ఘము ఏకాదేశం అవుతుంది.

3. ఎవ్వాడు = ఏ + వాడు = త్రికసంధి

   సూత్రము = (1) త్రికము మీద అసంయుక్త హల్లునకు ద్విత్వంబు బహుళంబుగానగు. దీని ప్రకారం ఏ+వాడు= త్రికసంధి.

   (2) ద్విరుక్తంబగు హల్లు పరమగునప్పుడు ఆచ్చి కంబగు దీర్ఘంబగు అన్న సూత్రం ప్రకారం ఎవ్వాడు అయింది.

ఇలాంటివే మరికొన్ని సాధన చెయ్యండి.

దనుజేశ్వరుడు = దనుజ + ఈశ్వరుడు = గుణసంధి

కూరగాయలు = కూర + కాయలు = గసడదవాదేశ సంధి

తుచ్ఛపుఁబల్కులు = తుచ్ఛము + పల్కులు = పుంప్వాదేశ సంధి

అత్యుగ్రము = అతి + ఉగ్రము = యడాదేశ సంధి

**సమాసములు :**

1. దానవకోటి = దానవుల యొక్క కోటి - షష్ఠీ తత్పురుష సమాసం
2. తోయజదళాక్షి = తోయజ దళముల వంటి అక్షులు కలది - బహుర్వీహి సమాసం
3. కూరగాయలు = కూరయు, కాయలు - ద్వంద్వ సమాసము
4. భీషణాకారము = భీషణమైన ఆకారము - విశేషణ పూర్వపద కర్మధారయము

వీటిని కూడా పరిశీలించండి.

(1) తోయదపథము, (2) శాంతవచనములు, (3) భోగిభూషణము.

**అలంకారాలు :**

క్రింది పద్యంలోని అలంకారాన్ని గుర్తించి లక్ష్య లక్షణ సమన్వయము చేయండి.

**1. జడలు ధరియించి తపసుల చందమునను**
**దమ్ముడును దాను ఘోర దుర్గమ్ములందుఁ**
**గూరగాయలు కూడుగా గుడుచునట్టి**
**రాముఁడేరేతి లంకకు రాగలండు ?**

ఈ పద్యంలో ఉపమాలంకారము కలదు.

**లక్షణము :**

ఉపమాన ఉపమేయాలకు సరైన పోలికను చెప్పడాన్ని ఉపమాలంకారమని అంటారు.

**సమన్వయం :**

ఇందులో నాలుగు ధర్మాలుంటాయి. అవి (1) ఉపమానము, (2) ఉపమేయము, (3) ఉపమావాచకము, (4) సమానధర్మము.

ఉపమానము - జడలు ధరించిన తపసులు
ఉపమేయము - జడలు ధరించిన రాముడు, తమ్ముడు
ఉపమావాచకము - చందము
సమానధర్మము - కూరగాయలు కూడుగా తినడం వెరసి ఉపమాలంకారమైంది.

2. వివిధ మాయలచేత వేగి వేగి
కనుగొని చిత్తంబు క్రాగి క్రాగి
లోపలమిక్కిలి లోగిలోగి
తొరగడి కన్నీటదోగి, తోగి

అంత్యానుప్రాస అలంకారము. పైదానివలే సమన్వయం చేయండి.

**ఛందస్సు :**

| న | జ | భ | జ | జ | జ | ర |
|---|---|---|---|---|---|---|
| III | IUI | UII | IUI | IUI | IUI | IUI |

దనుజ విభుండు వోయె ని జధామ ముఁజేర సతీస మేతుడై

ఈ పాదం చంపకమాలకు చెందింది.

మొత్తం అక్షరాలు 21.

యతిస్థానం - 11వ అక్షరం. ద - ధా కు యతి.

ఇలాంటివే మరికొన్నింటిని సాధన చెయ్యండి.

**డా॥ చదలవాడ విజయకుమార్**
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,
తెలుగు శాఖాధ్యక్షులు,
సి.ఆర్. కళాశాల,
చిలకలూరిపేట.